# స్వేచ్ఛా కవిత్వం

ఆరో సంపుటం (2019-2020)



మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

**ఆరో సంపుటం**

**రచనా కాలం 2019 - 2020**


**మాదిరాజు రంగారావు**


**నాన్నగారి జ్ఞాపకార్థం**

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం ఆరో సంపుటం **(Volume VI)** పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**


**రసధుని**

**సాహితీ పరిషత్తు**

**శాంతినగర్, హైదరాబాద్–28.**

**SWECCHAA KAVITHVAMU**
**Volume VI (2019- 2020)**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2020
Second Edition 2026

ISBN : 978-93-5655-556-3

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# స్వేచ్ఛా కవిత్వం

## ఆరో సంపుటం

## రచనా కాలం 2019 - 2020

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఏది కవిత (98) | 1 |
| 2. | వర్తమానం ముందుకే (99) | 33 |
| 3. | మార్పుకు సిగ్నల్ (100) | 65 |
| 4. | కవితకు ప్రభుతతో (101) | 97 |
| 5. | హృదయ దర్పణం (102) | 129 |
| 6. | నేను నేనే (103) | 165 |
| 7. | స్వేచ్ఛలో స్వతంత్రం (104) | 197 |
| 8. | భవితకు సంకేతం (105) | 229 |
| 9. | అక్షరంలో స్వేచ్ఛ (106 –ఎ) | 261 |
| 10. | సమాజ యానం (106 –బి) | 301 |
| 11. | స్వేచ్ఛలో బంధనం (107) | 317 |
| 12. | కాక్‌టేల్ (108) | 349 |

# పీఠిక

ఈ సంపుటం 'ఏది కవిత' శీర్షికతో మొదలయింది. ఈ ప్రశ్నకు సమాధానం అనంతం. స్వేచ్ఛా కవిత్వం వేదికపై ఇది తలెత్తడం సహజం. వర్తమాన కాలంలో ఆధునిక పరిస్థితుల్లో అనేక సమస్యలు ఎన్నో విషయాలు పలు మజిలీలు – గమ్యస్థానాలు – వాద వివాదాలు– దార్శనికాలు కవితా లోకాన్ని ఆవహించాయి. ఈ సంపుటిలోని స్వేచ్ఛా కవిత్వం మనిషిలో మానవీయాన్ని ప్రకాశింప జేస్తుంది. సమాజంలో అవసరమయిన మానవీయ కోణాల్ని దర్శింప జేస్తుంది. ఉత్తమమయిన సాంస్కృతిక వికాసాన్ని అర్థవంతం చేస్తూ, భౌతిక మానస స్థాయిల్లో మార్పును సూచిస్తుంది. 'ఏది కవిత' స్వేచ్ఛా కవిత్వంలో ఆధునికమైన భావజాలంతో మానవీయమైన విలువలతో సంపన్నం చేసేదిగా భావిస్తాను. అశాంతి నుండి శాంతి వైపు పయనం. ఇది నా స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు.

ఈనాడు నెలకొన్న పరిస్థితులలో వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయిలో ముఖ్యంగా రాజకీయ – నైతిక – దార్శనిక – నిబద్ధత చాలా అవసరంగా ఉంది. ఈ దృష్టిలో స్వేచ్ఛా కవిత్వం 'స్వతంత్ర'మైన ప్రతిపత్తితో సాహిత్య చరిత్రలో కొత్త పుటలకు అవకాశం కల్పిస్తుంది. ఇది అవసరమూ, వాస్తవం కూడా. ఆధునిక కవిత్వంలో వ్యక్తి జీవితం సమాజ స్థితి మానవ హక్కుల వినియోగంతో కూడిన స్వరం వినిపిస్తుంది. మరీ ముఖ్యంగా నైతిక క్షేత్రంలో కర్తవ్యాన్ని భావింప చేస్తుంది. అటు నుండి రాజకీయం ఇటు నుండి సాంస్కృతికం రెండిటి సమ్మేళనంతో వికాస చరిత్రకు దోహదం చేస్తుంది. నిరంతర చైతన్య శీలమైన సమాజంలో ప్రగతి దిశగా పయనించే ఆలోచన ముఖ్యం అవుతుంది.

మరొక కృతి 'భవితకు సంకేతం'. వర్తమాన స్థితిలో భవిష్యత్తు సూచిక! స్పందించే కవి హృదయం కంటికి కనిపించే దానితో కనిపించనిది దర్శిస్తుంది. అది రూపం కాలం వస్తువు స్థితి అనుభవమేదైనా కావచ్చు. ఇదొక ప్రపంచం. కనిపించే దానికి సమాంతరం. కవిలో సృజన రూపం సమాజంలో విషయ గ్రహణం చేత, విశాలత సిద్ధిస్తుంది, వైవిధ్యం గోచరిస్తుంది. ప్రస్తుత స్థితిలో అనివార్యమైంది.

'స్వేచ్ఛలో బంధనం' అనే కృతి పేరులో రెండు పదాలు స్వేచ్ఛ – బంధనం, విరుద్ధమైన భావరూపాలు. ఈనాటి పరిస్థితులకు సందర్భోచితంగా ఉంది. ఈ రెండిటి మేళనం జీవితం. ఇదే విచిత్రం. ఈ బంధనం వర్తమాన జీవితంలో ఎదురయ్యే అనేకమైన సమస్యలతో సంబంధం కలిగింది. కొన్ని 'స' కారాత్మకంగానూ, కొన్ని 'న' కారాత్మకంగానూ

ఉన్నాయి. భావన అనుభూతి వాస్తవికత దార్శనికతతో సంపూర్ణమవుతూన్న స్వేచ్ఛా కవిత్వంలో ఈ విషయం ప్రమేయం అనివార్యం. సహభావన, సహవర్తనం, సహగమనం సహలక్ష్యంతో సమాజంలో సమరసతను కోరుతుంది. కవిత్వంలో దీని ప్రతిఫలనం సహజమే కాదు అవసరం కూడా. స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్యం కేంద్రంగా, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య ఛాయాలతో దార్శనికత ప్రధానమైన పాత్రను నిర్వహిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు సామాజిక రాజకీయ ఆర్థిక నైతిక మనస్తత్వ తాత్విక కోణాల్లో విషయ దర్శనాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఇది దీని ప్రత్యేకత.

కళాత్మకంగా ఈ సంపుటి, భావరూపాలు ప్రతీకలు మనస్తత్వ ప్రకాశనంతో ప్రగతిశీలమైన ఆధునికతకు ప్రజాస్వామ్య దార్శనికతకు ప్రాధాన్యం కలిగింది. కొత్త ఆలోచనలో విషయ సమాకలనం విమర్శకుల విశ్లేషణ కందుతుంది. ఇది కవిత్వానికి దర్శన రూపంలో విస్తృతినీ ఉన్నతినీ ఉదాత్తతనూ గభీరతను కలిగింపజేస్తుందనడంలో సందేహం లేదు. ఈ అక్షర నిలయంలోకి సాహిత్య సహృదయులకు స్వాగతం.

మండే లిప్తలపై
మబ్బు కరుణ సరిస్తుంది
అవని సృజన కళతో
కృతజ్ఞతను చూపుతుంది

**– మాదిరాజు రంగారావు**

98. స్వేచ్ఛా కవిత్వం

# ఏది కవిత

## భాగం - I

మాదిరాజు రంగారావు

**2019**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

**98 SVECCHA KAVITHVAM**

Free- Verse

**EDI KAVITHA**

Long Poem

Part **I**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

***Presented***
***to***
***Dr. M. Santhosh Kumar***
***on his Birthday***
***with blessings***

# పీఠిక

ఈ కృతి 'ఏది కవిత' శీర్షికతో వెలువడింది. ఇది మొదటి భాగం. ఈ ప్రశ్నకు సమాధానం అనంతం. ఎప్పటినుండో ఎన్నో! సమాధానాలు ఇంకా అసంపూర్ణంగానే ఉన్నాయి. స్వేచ్ఛా కవిత్వం వేదికపై ఇది తలెత్తడం సహజం వర్తమాన కాలంలో ఆధునిక పరిస్థితుల్లో అనేక సమస్యలు ఎన్నో విషయాలు పలు మజిలీలు – గమ్యస్థానాలు – వాద వివాదాలు – దార్శనికాలు కవితా లోకాన్ని ఆవహించాయి. ఈనాటి సమాజంలో తప్పనివీ, తప్పించుకోలేనివీ వ్యక్తి వికాసానికీ సమాజ ప్రయోజనానికీ ఎంతో తోడ్పడే మాట వాస్తవం. మొదట్లో ఉండే వేగం తీవ్రత కొన్నిటి విషయంలో తగ్గినప్పటికీ, ఇంకా కొనసాగుతున్నాయి, కొత్తవి ప్రవేశిస్తున్నాయి. ఇదీ ఇందులోని సామాజికమైన వస్తు విశేషం.

ఇందులో (1) గతంలో మిగిలినవి, అవసరమైనవీ (2) వర్తమానంలో తప్పనివీ, కావలసినవి (3) భవితకయి సాధింపదగినవీ, యోజనలో తోచేవీ, కనిపిస్తాయి. మంచు గడ్డలు నీరుగా మారే పరివర్తన గుణంతో flux (ఫ్లక్స్)ను తలపింపజేసే ప్రవాహకతను కలిగింది. నిరంతరం సాగేదీ, కొత్తదనాన్ని కోరేదీ. ఇవి బహుముఖీన విషయ రూపాన్ని కలిగింది. అనేకమైన అంశాల చేత సంశ్లిష్టమయింది. ఈ ప్లాన్ (యోజన)తో ఈ కృతి కొన్ని భాగాలుగా వెలువడే అవకాశం కలిగింది. ఇది స్వేచ్ఛా కవిత్వానికి విశాలతను వైవిధ్యాన్ని కలిగిస్తూంది.

వర్తమాన జీవన నేపథ్యంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక ప్రకాశంతో దారి చూపుతుంది. కవి సహజంగా కోరే స్వతంత్రమైన నిర్మాణ రూపాన్ని కలిగింది. ఈ విషయం 1) భావరూపాలు, 2) ప్రతీకలు, 3) మనోరూప భూమికలు కవిత్వానికి సాంద్రతను కలిగించే అంశాలతో సమీకృత మయింది. సాహిత్య విమర్శలో సహేతుక మయిన చర్చకు అవకాశమిస్తుంది. ఈ మాటలు స్వేచ్ఛా కవిత్వానికి face lift గా పనిచేస్తాయి.

ఇంతవరకు కవిత్వ విషయంలో వేదిక లేవయినా వాదాలేవయినా సహృదయుల ప్రమేయంతోనే గౌరవ మర్యాదల్ని పొందడం జరిగింది.

ఈ కవిత్వం ఆశావాదాన్ని కలిగింది. మనిషిలో మానవీయాన్ని ప్రకాశింప జేస్తుంది. సమాజంలో అవసరమయిన మానవీయ కోణాల్ని తెలియ పరుస్తూంది. ఉత్తమ మయిన సాంస్కృతిక వికాసాన్ని అర్థవంతం చేస్తూంది. భౌతిక మానస స్థాయిల్లో మార్పును సూచిస్తుంది. సామాజిక రాజకీయ నైతిన తాత్విక మనస్తత్వ ప్రగతి శీలమైన భావనలో విశేష రూపాన్ని పొందింది. వీటితో పాటు కవిత్వానికి అనివార్యమయిన కళాత్మకతను నిలబెడుతుంది. స్వేచ్ఛా కవిత్వానికి విరిసన వికాస రూప మిస్తుంది.

**– మాదిరాజు రంగారావు**

# 1. ఏది కవిత

ఏది కవిత? ఎక్కడ ? కవిత ఏది?
అగ్ని జలం కుసుమ భావ ఛాయలలోనా?
మాటలో పాటలో మనోజ్ఞత లోనా?
సత్క్రియలో శ్రమ సంకేతంగానా?

పచ్చని పైరు పంట ముఖంలోనా?
ఎండిన గడ్డి పోచ వాలకంలోనా?
కలిమిలో లేమిలో వర్తన లోనా?
ఆగని జీవన చక్ర భ్రమణంలోనా?

బూది ఎగసి మెరసే ఉద్యమ కణంలోనా?
పేలిన బాంబు విలయ దృశ్యంలోనా?
విసరిన రాయి శక్తి ప్రసారంలోనా?
బాష్ప బిందువులో దాగిన విద్యుదగ్నిలోనా?

ప్రతి రోజూ తెల్లని పద్మంలా
లిప్తల రేకులు విప్పారవు
ప్రతి సమయం కిరణంలా మనిషి నడవలేడు
పలు రంగులలో చీకటి ప్రభుతను చూపుతుంది

చలికి పనికి వచ్చే బ్లాంకెట్ వలె
వేదన నెవరు వహిస్తారు, ఇష్టంగా
ఎంత దూర మయినా ప్రక్కన మైలు రాళ్ళు
ఎదురు చూస్తూ పథికులకు సూచన లిస్తాయి

ఎదకు హత్తుకొనే భూమిపై
చేయి నందించే నింగితో
నఖ శిఖ పర్యంతం చేతనలో
జన సమూహ హృదయ స్పందనం
కవిత! మనోమయం నవం నవం
ప్రతి వస్తువులో అంశతో అనుబంధం

పనిలో రెండు చేతుల వలె
గతిలో రెండు అడుగుల వలె
కవితలో అర్థ భావ ప్రకాశం
అందరికీ చెందిందీ స్వేచ్ఛా జగం!

# 2.

ఎవరి కయిన ఎచటనయిన భోగభూమి చేరాలనీ
సంపద తన వశమై ఊయెలపై ఊగాలనీ
ప్రవాసం నివాసం దేశాంతర వాసం ఏదయినా
ఒక సమూహం నుండి మరో సమూహం లోకి

భయం నుండి ముక్తమయిన స్వేచ్ఛలో
స్టేషన్ నుండి స్టేషన్‌కు ఊరునుండి ఊరుకు
మధ్య మధ్య ప్రకృతిలోని ప్రభావ దృశ్యాలతో
జన జీవన శ్రేణుల సంపుటం సమాజం

జంక్షన్‌లో చీలిన దారులతో దిశ మారుతుంది
ప్లాట్ ఫార్మ్‌పై ఒక పక్కన
పరచిన రంగుల బొమ్మలపై
చూపులతో ప్రయాణికు లొకరొకరూ

మనసుకు నచ్చిన బొమ్మను ఎన్నిక చేసేరు
పయనంలో జ్ఞాపక చిహ్నంగా ఇంట్లో చేరేను
ఇది గదికి అలంకార శోభ నీయవచ్చు
ఇది మనసులో విశేష స్థానాన్ని పొందవచ్చు

ఏ దేవతో దూతో నేతో కళాకృతియో ఒకరొకరికి
పిల్లల కయి ఆటలో వస్తువయి ఎంత సంతోషమో
మట్టి కట్టె రాయి ప్లాస్టిక్ ఏదయినా కానీ
లోపలి గాయాల్ని పూలరేకులా తాకుతుంది

మనసులో మార్పుకు ప్రేరణ రూపమవుతుంది
భేదం వాదం లేకుండా ప్రభావాన్ని నెరపుతుంది
బొమ్మల విషయంలో అందరికీ చెందినవీ అలరించేవీ
మనుషుల సంగతిలో చీలిక లెన్నో! పలు స్థాయిల్లో

బయట స్టేషన్‌లో ఉన్నపుడు స్వేచ్ఛకు సీమలు పెరిగేను
ఇంటికి చేరగనే హద్దులలో నిబంధనలెన్నో
రంగుల బొమ్మలు! దేనికది విశేషం! జీవన చిహ్నంగా
వర్తమాన సమాజ గమనంలో అనుభవాలు అనార్తవాలు.

# 3.

కంటి కొస నుండి అశ్రువు
దీప కళికలా క్షణం నిలిచింది
సాంత్వనానికి పరుగెత్తిస్తుంది
సానుభూతికి ఎగిరి రావాలనిపిస్తుంది

అనుమానం అవరోధంతో వర్తమానం
సందేహం నిరీక్షణలో భవిష్యత్తు
వేదనలో ఊరట అశాంతిలో శమనం
కష్టంలో తోడును కోరుతుంది హృదయం

వ్యక్తిలో అంతరంగం
నింగికి నేలకు మధ్య తేజోరూపం
సూక్ష్మమైన అనుభవంతో మోదంలో
నిశితమైన అనుభవంతో ఖేదంలో
కవితకు చిక్కదనం కలుగుతుంది
మనిషికి తోడుగా వ్యవహరిస్తుంది

రాగ రంజిత మయిన అభిజ్ఞానంతో
శకుంతల కనుల నుండి సంతోషాశ్రువు
వెలుగు జాడను మెరపిస్తుంది
నిండు సభలో పతిచే నిరాకరణంలో
అవే! కనుల నుండి విషాదాశ్రువు
చీకటి పడవను కదలిస్తుంది.

వింతలేదు! మానవ మనో గుణ సహజం
వెనక నున్న హేతువు తెలియని విపరీత స్థితిలో

సమస్య ముందు ప్రశ్న దీపమై వెలుగుతుంది
విషయంలో రహస్య వివేచనకు పురికొల్పుతుంది

మౌన శిఖరం నుండి జలపాతం దూకుతుంది
గతం భవిత హద్దుల్ని ఒరుసుకొని వర్తమానం!
శుష్కత నార్ద్ర పరుస్తూ శూన్యాన్ని తొలగిస్తుంది
అశ్రువులో ఇంద్ర ధనుసు! ప్రతిబింబిస్తుంది.

## 4.

ఉషస్సు కిరణంతో పాటు రాత్రి చీకటికీ
చోటు దొరకుతుంది కవితలో సమదృష్టితో
శత్రు శిబిరం నుండి అయినా పావురం
స్వచ్ఛమయిన తెలుపులోనే ఉంటుంది
శాంతి బీజం వదలుతుంది మనసులో
సృజన కుసుమం విప్పుతుంది కవితలో.

చరిత్రలో ఘటనలతో సమాజంలో మార్పు
కవితకు ప్రేరణయై కొత్త బాట పట్టిస్తుంది
వాస్తవానుభవంలో బ్రతుకును సుగమం చేసే
మార్పు ననుసరించేందుకు సాహస మవసరం.

ఒక సందర్భంలో మనిషిలో అగ్నికీ
బయట ఆయుధానికీ భేదం లేదనిపిస్తుంది
ఆయుధ మవసరం లేకుండా విజయాలకు
ప్రజాస్వామ్య దార్శనిక పథం లేకపోలేదు.

బ్రతుకులో బాధలు మనసుకు వేలాడుతూ
కిందికి దిగలేని పైకి వెళ్లలేని స్థితులలో
ఎవరి నుండయినా సహాయం లభించేనని ఆశ
పదరాని పాట్లతో కాలం గడుస్తుంది, ఆగదు!

వినిపించని కోకిల కుహూ స్వరానికి బదులుగ
ఉగాది ఉదయం! పరుగెత్తే వాహనాల ధ్వని ప్రసారం
వినే యోగంలో పయనం! ఆరాటంలో భాగం!
ఇంటి ముందు భిక్షువు ప్రత్యక్షం, పాత దృశ్యమే!

ఇది సమాజ సంస్కృతిలో భాగమయి నిలిచింది
పేదరికం సమస్యకు పరిష్కారం పోస్ట్‌పోన్ అవుతూంది

ఆధారం భూమిపై కొన్ని మెట్లపై నుండి
నింగిని అందుకునే ఆలోచనలో మనిషి
లోన మనసు పూవులా విప్పారే కన్నా
బయట పూల అలంకరణతో తృప్తిని పొందేను

వర్తమాన మొక కఠోర వాస్తవమై ఎదురుగా
ప్రవహించే కాలం గడ్డ కట్టి, వంతెన తలపించేను

# 5.

దారిన పరచిన బొగ్గు కణాలకు
నిప్పు రవ్వ సోకి తీవ్రరూప మెత్తుతుంది
నాశనకర చర్యల సంప్రేరణలో సమాజం
పథికుల గమ్యానికి సూచిక, మారేనా?

కష్టంలో తనువు ఎంత రాటు తేలినా
బాధలో మనసు ఎంత వాడి పొందినా
సృజన విలయ హేతువులను ఇముడ్చుకొని
వెలుతురు చీకటి భేదాల కతీత మవుతుంది కవిత!

చేతులు చాచి చీకటి కౌగిలింప చూస్తుంది
హృదయం విప్పి వెలుతురు హత్తుకుంటుంది

దారిలో ఇష్టమైన చెట్టుకున్న పూవు తెంచి
జేబులో భద్రంగా నిలుపుకొని,
సుగంధ ప్రబావంతో ప్రసన్నత పొందేను
హింసను హంసగా మార్చే ఆలోచన జరిగేను

వ్యవసాయం వాణిజ్యం ఉద్యోగం వ్యవహారం
తిరిగే చక్రంపైనే బ్రతుకు గడుస్తుంది

అక్షర సహ భావనతో కవిత వెడలుతుంది
ఎదురుగ ఎర్రని మంటలు పావురాళ్ళుగ మారేను
కథలో పాత్రల్ని బట్టి వేషం మారేను
నిజ జీవితంలో ఎవరి ఇష్టం రివాజు వారిది

శాంతి రణం నదికి రెండు తీరాల వలె
మనిషి మనసు! ఇరువైపుల పదును బ్లేడులా

బ్రతికి ఉన్నంత వరకు తనతో నీడ అయి
ఆపై యశోరూపం! వెనకనే నిలవాలనీ కోరిక

ఎవరు విన్నా వినక పోయినా! కవిత!
అందరికీ సమాజ కథ వినిపించాలనీ
తహతహలాడుతుంది! శబ్ద ప్రపంచం
జన చేతనతో ఒకటయి కవి హృదయం

# 6.

ఎక్కడి కక్కడ ముక్కలుగా విడిపోయే కాలం
ప్రతి ముక్కలో మనిషి చిత్రం కనిపిస్తుంది
వ్యక్తుల జీవన సందర్భం ఆగి నట్లయినా
సమాజ కథలో మనిషి స్వరం రణిస్తుంది

ప్రతి బ్రతుకులోను అంతో ఇంతో అమర చిహ్నం
మరణాన్ని జయించే యశో రూపమయి
ఇది మిగులుతుంది సంస్కృతిలో జీవ కణం
వికాస రూపానికి కారణ గుణ మవుతుంది

బ్రతుకులు కనీస స్థాయిలో గడచేందుకు
ప్రతి మనిషిలో తనదయిన ఆశా నిలయం
తోడుగ ఏ దేవత ప్రసక్తి లేదు
హృదయ మున్న మనిషి ఉంటే చాలు

కాలం తనంతన ఏ దిశను చూపదు
పోయే దారిని ఆ మనిషి! చూచుకోవలసిందే!

ఎక్కడెక్కడి నుండో గాలి సందేశం తెస్తుంది
వార్తలు వినిపిస్తుంది సూచన చేస్తుంది
ఏ ఒకరికీ కాదు అందరికీ బోధలు
వినగలిగిన వారికి వర్తించే వెన్నో!

దిశలలో తళుక్కున మెరపు
మనసును విశ్వమయం చేస్తుంది
వాలి పోయే మనిషిని నిలబెడుతుంది
నేలపై జాడను గుర్తుకు తెస్తుంది

దారిన మనిషి చూపులో పూవు
విప్పారిన రేకులతో కదలుతుంది
జారే కన్నీటిని తుడవాలనీ
మనిషికి ఊరటగా ఊగుతుంది

కొమ్మకు కుసుమంలా ముఖాన నవ్వుతో
దిశలో ఇంద్రధనుసులా నుదుట ఆశతో
మనిషి క్రియా శక్తికి సుందర రూపం
మృత్యువు సీమలు తెలియని అమర తేజం

# 7.

ఎంతటి రహస్యమయినా కవితలో దొరుకుతుంది
గిరి శిఖరం పాకిన తీగెకు పూచిన
సుమ పరిమళ సంస్కృతితో
భావ జగం దింపుతుంది, మనసులో.

గ్రీష్మ ఖండం నుండి వర్ష సర్గకు
శిశిర బాధ నుండి వసంత హేలకు
సృజన ప్రపంచం! మారే జీవన పథాలతో
శత్రుత తొలగిన మిత్రత పరచిన అవకాశంతో

నిప్పంటిన చీకటి కుటి దహన వార్త కన్నా
ఆలోచనలో వెలుతురు నిలయ పదం ముఖ్యం

విషాద ముద్రల ఛాయ లెవరికీ
ఆమోదం కాని మాట నిజం
అర్థంలో ఎవరి దారి వారిది
నేరం నుండి ఉదాసీనం దాకా!

భూమిపై ఆహారం కొరత ప్రశ్నతో
స్వంత సంచయంతో ఎవరికి వారు
ఉన్న వీలును సంకుచితం చేసేరు
వేలాడే దరిద్రాన్ని జోల పాటతో ఊపేరు

చెట్టు కొమ్మపైనొ! దాని నీడలోనొ
పురి విప్పిన నెమలి దృశ్యం
ఎద తెరచిన జలద చలనం
కల్పన కాదు, వాస్తవ రూపం

రాత్రు లెన్నొ వస్తాయి పోతాయి
అందులో సగం సగం వెన్నెల చీకట్లతో
ఏ మార్పు కయినా సిద్ధంగా మనిషి
రేపటి ఉషస్సుపై చెదరని నమ్మకంతో

అక్షర పంక్తుల బోను నుండి కవితలో
ఏ పులియొ సింహమొ హరిణమొ కనిపించవచ్చు
కవిత! అన్నిటికీ సుందర వికాస నిలయం
కవి మనస్సు! స్వతంత్ర మయిన విహరణ వనం!

## 8.

పంజరంలో చిలక వలెనో
బోనులో ఏ జంతువు వలెనో
నేతల వెనక స్వతంత్ర మతులు
మాటి మాటికీ కండువా మారేరు

స్థిరత లేని రాజకీయం, చంచల గతులతో
దార్శనికం వదలి ప్రదర్శనకు సిద్ధమవుతూంది
మాయ మయిన "నిజం" అంతలో
సరసిలో శశి బింబాన్ని తలపిస్తుంది
నీటిలోకి దిగితే
ఇది చేతికి అందేనా?

వ్యక్తిలో నిజం తెర వెనక చరిస్తుంది
పెట్టెలో వజ్రంలా సమాజంలో నిలుస్తుంది
ఇపుడున్న సమాజ స్థితి
అతరంగ స్ఫురణ మరచి, ఎంత కాలమయిందో?

స్వార్థంలో తళుకు రేఖలతో విలువలు మెరసేను
వెన్నెల ఊహలతో ఆ సమయం గడచేను

వర్తమాన సమాజ వీధులలో కవిత
తెలుపు నలుపు గళ్లలో అడుగులువేస్తూ
మధ్య మధ్య రంగులు మారే దుస్తులతో
ఫిల్మ్‌లో కట్ అయిన ముక్కల్ని తలపించేను

చేయి చేయి అందుకొనే స్నేహం అంచులలో
అనుకోకుండా సర్పం మెలికలు తిరుగుతూ పోయేను
హఠాత్తుగా పక్షి! క్రాస్ చేసి ఎగురుతుంది
క్షణంలో గతమై వర్తమాన దృశ్యం! మురిపిస్తుంది.

అడుగు ముందుకు సాగడమే కర్తవ్యం
గతం పునర్భవంతో అలంకరించేది లేదు
ఉగాదు లెన్ని! పచ్చని వాగ్దానాలతో రాలేదు?
స్వేచ్ఛలో "నిజం" సమాజ చేతనతో సాగాలనే!

# 9.

ఆకృతి కనిపించక పోయినా నీడ కనిపిస్తుంది
ఇది వీడేది కాదు, దాగదు, భయపెట్టదు
పిసరంత అనుమానానికి ఆస్కారం ఉన్నా
తోడుగ ఉంటుంది, ప్రతీకగా నిలుస్తుంది.

మనుషుల మధ్య నిలువెత్తున నిశ్శబ్దం
మాటలతో కదలుతుంది, క్రియలో నిండుతుంది
మనుషులలో ఉన్న కిరణ స్పర్శ
అంతరంగం ఉనికిని జ్ఞాపకం చేస్తుంది

సాయం సంధ్యాగతికి భయ పడే దెవరు?
నిశిలో చీకటి వెన్నెల రెండూ తెలిసినవే
ఎవరూ కోరక పోయినా కలలు వస్తాయి
మైదానం క్షేత్రం ఎడారి తోటలలో తిప్పుతాయి
జీవన చరిత్ర వెనుక నున్న ముడులు విప్పుతాయి
వాస్తవానుభవంలో రహస్యాలు తెలుపుతాయి
ఇల్లు దగ్ధమయితే కొత్తది రావచ్చు
తనువు బూది అయితే వచ్చేది శూన్యం

అదృష్టం కలిసి వస్తే
దూసిన తూటా గురి తప్పవచ్చు
విసరిన బాంబు పేలక పోవచ్చు
గోడలు మంచులా తొలగిపోవచ్చు

చీకటిలో కొరకంచుతో అక్షరాలు దిద్దేను
నిరాశనుండి ఆశను వేరు చేసేను
నేల పటంపై నుండి మాయమైనవి
మనో వేదిపై ఒకటొకటి! కనిపించేను

చెవులు ఉన్నందుకు మనిషి గళం వినిపిస్తుంది
మనసులోని తన మాట కావచ్చు
గళం నుండి తన పాట కావచ్చు
నిజం పలికేందుకు వెనకాడదు కవిత
రాలే బాష్పంలో కనుల నుండి
పూవునో నిప్పునో గమనించవచ్చు.

# 10.

కాల మహా పరిణామంలో ఏడాది తొలిరోజు
జీవన చరిత్రలో మౌలిక వికాస దృశ్యం
భౌతిక మానస సుందరతల మేళనం
జన హిత భాగ్య పథంలో ఉగాది
జీవన గమన సూచి పంచాంగం
ప్రకటనలో ఉత్సవ సందర్భం కలిసీ

ఉదయం మొదటి కిరణ ప్రసారంతో
సంఘానికి ఉపదేశం మొదలవుతుంది
మనిషికి తగిన సూచనలు! లభిస్తాయి
మనిషి ముఖం వసంత భావ స్పర్శతో
కుసుమ గుచ్ఛమయి ఈ క్షణం నుండి
ఎప్పటిదో! మనోరూపం! మారుతుంది

లోనున్న మధు వ్రతం ఝుంకృతితో బయటపడి
కాటేస్తుందని భయం! కొందరికి ఉండవచ్చు
అది భ్రమ కావచ్చు! యదార్థమయినా కావచ్చు
ఇది వెలుగు నీడల సమీకరణ మిశ్రమం
గుణాల దోషాల ప్రభావాల సంకలనం

ఈ రోజు ఆశా విమానంలో యానం
బయటి పచ్చదనం బ్రతుక్కి గ్రీన్ సిగ్నల్
హృది స్పందనతో సర్వం కిర్మీరితమవుతుంది
సరసిలో దిగిన సూర్యబింబంలా
అంతరంగ ప్రభావంతో తనలో శక్తి ప్రకాశం

జేబులో చేయి పెడితే అపూర్వం తాకినట్లయి
కర్చు చేయలేని బంగరు నాణెంలా! ఉగాది

స్వర్గం మూతబడీ ఇంటి తలుపు తెరవబడీ
కొత్తదనంతో బ్రతుకుల కాహ్వానం పలుకుతుంది
ఉగాది పచ్చడిలో చాక్లెట్ ఐస్క్రీం రుచి
బ్రతుకులో ఈ ఉగాది పాత కొత్త సంగమం

## 11.

అర్థాన్ని గమ్యాన్ని ఏర్పరచలేని మాటలు
చీకటి కమ్మిన గుహలను తలపిస్తాయి
నూనెలేని అనుభవాల దివ్వెల్ని సూచిస్తాయి
చెదరిన కలల ముక్కల్ని చేర్చినట్లు ఉంటుంది

వర్తమాన ముద్రలతో శుభ్రంగా బయటపడే
వేదనతో రాగంతో అప్తమైన హృదయం
వెచ్చని చల్లని స్పర్శతో కవితకు సన్నిహితం
అర్థంతో గమ్యంలో సార్థకత పొందుతుంది.

ఆకు రాలి ఎండిన చెట్టు కొమ్మలతో
జీవాణువులు పునర్వికసిత మవుతాయి
కోరిక యత్నం ప్రేరణ యోజనతో
పేదరికం తొలగాలనే సమాజంలో

సంగీతం సాహిత్యం తత్త్వం సౌందర్యంతో
కష్టాల నష్టాల లెక్కల బ్రతుకులో
విరామంతో హ్లాద మనోజ్ఞతల నిస్తాయి
అందని వాటిని చేరువ చేస్తాయి, నిలుపుతాయి

తనకు లేని దాని నడిగేరు, ఏడ్చేరు
మరొకరికి మొర పెట్టుకొనేరు, తిరుగబడేరు
బ్రతుకులో ఉండరాని దానిని గురించి
వీరిలో ఆలోచన కవకాశం ఉండదు, చిత్రం

చిహ్నమెత్తు తమలో ఉన్న మంచిని కొండగ తలచేరు
కొండ ఎత్తులో ఉన్న చెడును అద్దంలో చిన్నగ చూచేరు

నల్లులు దోమలు పెట్టే బాధలతో
సుఖ నిద్రకు రాత్రి వీలు ఎక్కడిది?

ఆశల కొండల్ని తొలిచి దారి చేసుకొనీ
ముందుకు పోవడమొక మానవ శక్తికే సాధ్యం
సూర్యుడు ఎర్రని గులాబి గుచ్ఛాన్ని తలపించేను
మండే కొలిమినో రక్త సిక్త ఖడ్గాన్నో చూపవచ్చు.

## 12.

ఎవరి అవసరాలెన్ని ఉన్నా
నదిపై వంతెన కొన్నిచోట్ల మాత్రమే
దాటేందుకు మరో సాధనం పొందాలిసిందే
ఎవరెంతటి వారయినా జరిగేది ఇదే

తప్పని కష్టాలకు బాధలకు మధ్య ఖాళీలో
దైవ భావ ప్రవేశం జరుగుతుంది
కవిత్వమూ కళలూ చోటు చేసుకుంటాయి
సుగమ సుందరం చేసే పని జరుగుతుంది

విరామ సమయాలను సార్థక శక్తులతో నింపుతుంది
మనిషిని సంస్కృతి చక్రాలపై పయనింప చేస్తుంది
గళంలో స్వరం ఆగదు, కదలుతుంది
కళ్ళ నుండి బాష్ప బిందువు జారుతుంది

విలువలతో కాలం కళామయ మవుతుంది
ఆశయ చలనంతో గతిలో లక్ష్యం ఏర్పడుతుంది

స్పందన వెనుకనుండి కవితలో
హేతువు వివేక పాత్రను వహిస్తుంది
దార్శనికం లేని కవిత పాక్షికం, అసమగ్రం
సమాజ కారణాలన్నిటినీ చూపులు చుడతాయి

పర్వత మెంత గొప్పదయినా తనపై
పగుళ్ళు ఏర్పడితేనే, చీలిక కనిపిస్తేనే
వాన చినుకులతో సందులలోనుండి
సృజన చేతన కవకాశం దొరుకుతుంది

మాట పెకలితేనే మరో మాట వెడలుతుంది
కోరిక ఉంటేనే క్రియాశక్తి ప్రకటితమవుతుంది

కవిత ప్రభావం జ్వాలా రూపంగానో
చల్లదనం ఇచ్చే జలపాతం గానో

దహనకాండలో చల్లారిన బూదిపై చినుకులు
సమాజ రూపానికి కొత్త సృజన రూపమిచ్చేను

పుష్పం కవితయై కదలుతుంది
కవిత పుష్పమై బ్రతుకుతుంది.

## 13.

సంగీతానికి పగలు రాత్రి భేదం లేదు
వినేశక్తి చక్కగ ఉంటే చాలు సూక్ష్మస్థాయిలో
పగలు ప్రమోద స్వరం దగ్గర అని కాదు
రాత్రి విషాద స్వరం దగ్గర అనీ కాదు

ఇంట్లో వ్యక్తి ఉనికి కుండీలో పూల మొక్కలా
బయట మనిషి అస్తిత భూమి రుహంలా
ప్రకృతితో పాటు మనుషుల అనుబంధం
ఎప్పటికపుడు మార్పులతో కొత్త ప్రపంచం

హృదయ భాష మాట్లాడేను కవిత మనిషితో
వాన భాష మాట్లాడేను మబ్బు ప్రకృతితో

హాలికుని బాష్పకణంలో కదలే నిప్పు పడవ
ఒక్క మెరపుతో పూల పడవగ మారవచ్చు

సూర్యునికి లేదు వృద్ధత, ఎప్పటికీ యౌవనమే
కవి మనసుకు లేదు పాత, ఎప్పటికీ నవనవమే
సృజనలోను ఇదే విధం! అభినవ రూపం
పరిణతి పొందే కొద్దీ, మూలం బలపడుతుంది.

చుక్కలలో ఆశలు చీకటిలో దీపాల వలె
వెన్నెలలో వెలుగు! కష్టంలో ఊరటగా

ఏడ్పును మరపిస్తుంది జీవన ధునిలో ఆర్ద్రత
పునరంకితం చేస్తుంది తనలో పశ్చాత్తాపం

రోజు చివరి క్షణం వెలిగించిన కర్పూరం వలె
హ్లాదంగా కవితను అర్థవంతం చేసేను

సర్పం లాంటి శత్రుతను మరిపిస్తుంది
పుష్పం లాంటి మిత్రతను తలపిస్తుంది

చిత్రమేమంటే మనిషి మనసు ఏ క్షణాన
ఎవరిపైన ఏ రూప మెత్తేదీ తెలియదు

ఏ వార్తతో పని లేకుండా ఏది పై బడినా
ఎదుర్కొనే మనో రూపం! మనిషిలో మేల్కొనీ!

## 14.

పోవలసిన గమ్యాన్ని చేరేందుకు
ప్రయనంలో ఆలస్యం మితి మీరితే
నిరాశ! మనసును చుట్టేస్తుంది
సమయం కలిసి రాలేదని మండుతుంది

అప్పటి వరకు తెలియని బాధ
సులభంగా పరిచయమయి పోతుంది
వెనక్కి వెళ్ళే వీలు లేని స్థితిలో
మనిషిలో స్తబ్ధత సందిగ్ధత
చీకటి వేళ వెలుగు తప్పనిదీ
పగలు అలంకారానికో! విశ్వాసం పెరిగేందుకో

అవసరానికి ప్రతిదీ కొన్ని హద్దులలో
అది దాటాక! మరొకటి! విశ్వమయంగా

కవితను నడిపిస్తుంది ప్రతిభ
ఇది జీవ ప్రకాశ రూపం
వీరానికి అవకాశ మిస్తుంది
శాంతికి సోపానం తీరుస్తుంది

ఒకరి ఊహకూ మరొకరి బాటకూ
మధ్య! హద్దులతో సహవాసం తప్పదు
హద్దులతో స్వతంత్ర మయిన రూపమేర్పడుతుంది
భిన్నతలో తనదయిన ప్రత్యేకత సిద్ధిస్తుంది

హద్దుల మధ్య ఎడం మానసికంగా
లోయ ఏర్పడవచ్చు, ప్రవాహం తరలవచ్చు
గాలికి అలల వలె ఆకుల వలె
చిన్నపాటి అలజడులు! క్రందనలు!

ఒత్తిడుల నుండి బయట పడిన హేతువు
గోడను కూలుస్తుంది, చీకట్లను తొలగిస్తుంది
మానవ ప్రస్థానంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది
వికాస చరిత్రకు సూచియై పథం చూపుతుంది.

## 15.

అవనిపై మట్టిలో అణువణువున సృజన ముఖం
లోపల దాగిన రహస్యాన్ని బయట పెడుతుంది

ఎగిరే పక్షుల బారుల వలె పద పంక్తులు
కవితలో సమాజ దిశలను చూపేను
కవులతో శ్రోతలు పాఠకులు అంతలో
మరో లోకంలోకి ప్రవేశించేరు.

నివురు తొలగిన నిప్పులాగ సంకల్పం
సాహస మతిలో కణకణలాడుతుంది

గగనంలో సూర్యుని ఉదయం ఒకమారే
ఆ రోజున సగం మాత్రం రవి అధీనంలో
మిగతా సగం కాలం రాత్రి వశంలో
చంద్రుడు రావచ్చు, సగం రాత్రులు శూన్యంగా

కవి ముందుకు వచ్చే పాత్ర లెన్ని విధాలో
కవితలో చోటు కయి క్యూలో నిరీక్షణలో
ఏదో కారణంగా సృజనలో జారిపోతే
వీటి తరఫున వాదించేరు కొందరు విమర్శకులు

ఎపుడెక్కడ? ఎంత వాన కురవాలో
మబ్బును శాసించే దెవరు? భూమిపై

చెట్టు మౌనంగా ఉంటుంది తల ఆడించవచ్చు
చేతులు కదలించవచ్చు, మనిషికి నిలకడ లేదు
పాతిన శిలలా కట్టు కొయ్యలా బ్రతకలేదు
స్వేచ్ఛలో మనిషికి ఆదర్శ సూచి పవమానం

మరో దృష్టి మరో పథం ప్రజాస్వామ్యంలో హక్కు
ఇది ఎప్పటికపుడు దిద్దబడే సమాజ పరివర్తనం

రక్షణలో ప్రధాన పాత్ర వహించిన కోట
నేడు! శిథిల స్థితిలో జాలి గొలిపేను
చరిత్రలో వీరానికి చిహ్నంగా మిగిలింది
మానవ తేజోరూపానికి సెమ్మెలా నిలిచేను.

## 16.

ప్రేమిస్తూ ద్వేషిస్తూ ఆరాటం పోరాటం
బ్రతుకులో మళ్ళీ మొదటికి, తంతులా

ప్రతి సమస్యలో హేతువు! అదృశ్యంగా
కేంద్ర స్థానంలో మనిషిని పరీక్షకు నిలుపుతుంది

వెనకనుండి పరంపరలో భాగమై ఒక రూపం
పక్కనుండి మార్పులతో ఆగనిదొక రూపం
రెండిటి కలయికలో మార్పులెన్నో! ప్రస్థానంలో
విభేదాలెన్నో! ఎదుర్కొనే వాస్తవ గతులలో.

ఎంత ఉదార చరిత కలిగిన దయినా
మేఘం! నేలపైన దిగదు, నడవదు
కష్టంలో ఆర్ద్రతను కోరుతుంది హృదయం
అనుభవంలో అమృత బిందువు జారాలనీ

కొన్ని కళ్ళు శిలా శకలాలను తలపిస్తాయి
ఆర్ద్ర స్పర్శ లేని హృదయ మొక ఫలకం

మనుషుల్ని వదలినా గుర్తులు మిగులుతాయి
సంఘంలో యశో విశాల శాలలోకి చేరతాయి

కవి అయితే మరీ సుకరం
కవితయై బయటికి వస్తుంది

క్రియా సిద్ధితో మిన్నంటే యశోరూపం
దీనికి నిచ్చెనతో పనిలేదు, రెక్కలపైనే

పరీక్ష వ్రాసాక ఫలితం పయి ఆరాటం
పాత బరువు పోయి కొత్త బరువు చేరేను

ఎవరి కోసం వేచి చూడని సూర్యుని వలె
అంతరంగం! లొంగని కవితా రూపంలో
ఇది అతిథిగా నేతగా రావచ్చు
ఎవరి అదుపులోకి రాని స్వేచ్ఛాపథంలో

వెలుతురులో చీకటిలో మనిషి స్వరం ఒకటే
కళ్ళు మూసినా తెరచినా పొందే స్పందన మొకటే

# 17.

జీవితాన వివిధ స్థితులకు ప్రతీకలుగా
ప్రకృతిలో పరివర్తన గుణ రూపాలు

పేరును బట్టి కాక మంచి చెడు నిర్ణయం
మనుషుల గుణ చర్యల్ని బట్టి జరుగుతుంది

తాము కోరే దిశలో గమ్యాన్ని బట్టి
ఎవరి దారి వారిది, పయనం వేరు వేరు
బ్రతుకులో భాగ్యరాశి చేరాలని
సంఘంలో శాంతి పదం పొందాలని

ఏ రోజూ ఒకే విధంగా ఉండని మాట వాస్తవం
అనుభవ రూపాల్ని బట్టి కొత్త జగం!

నిరాశకు గుడ్ బై చెప్పే రోజు నుండి
తృప్తికి వేదికయై యశోమయం కావాలని

ప్రకృతి సంపదతో సమంగా
మనిషిలో భావ జగం కొత్తగా
ఆర్ద్రతతో పరిమళ సుందరతలను
కోరుతుంది! మనిషిలో అంతరంగం.

ఉద్యమ సంరంభానికి తెరపడేంతవరకు
ఏ పాలన అయినా వ్యక్తికి సంకెల కారాదు

ఆరు రుచులతో పాటు ఏడవదీ ఉంది
అది యశో రుచి! దీన్ని ఇష్టపడని వారు లేరు
అనుభవ పథంలో వసంత శోభ
మనసుకు తృప్తిగ అన్వర్థం కావాలనీ

మోదం పాల పిట్ట పిట్టలా ముంజేయిపై
ఖేదం ఎండుటాకులా రాలి పోవాలనీ

చుట్టు ప్రశ్నలు వేలాడుతూ ఒకటొకటీ
తన వయిన జవాబులతో కాలం గడవాలనీ

ఈ సమయంలో వినిపించే పంచాంగం
నాంది తోనే భరత వాక్యం ధ్వనిస్తుంది
రాసులలో గ్రహ సంచారం జరుగుతుంది
నాటకంలో పాత్రలవలె! ముగ్గులోకి దింపేను

## 18.

ఈ ప్రపంచం కవితకు మూల వస్తువు
ఇది అందరికీ నివాసనీయ నిలయం

జీవమున్న చెట్టు ఆకులు రాలిన దయినా
మళ్ళీ పచ్చదనం కయి బెంగపడదు, వస్తుంది

చరిత్ర నిశ్శబ్దంగా ఉండదు, ఉండలేదు
పూర్వపు అట్టహాసం స్మృతిలో సందడి చేస్తుంది
కవితలో గాథకు మూల శక్తి నందిస్తుంది
ఒరలో కరవాలం తీసి, పదును పెడుతుంది

ఎప్పటిదో గాయం ఎర్రని పూవులా ఆకర్షణతో
శత్రుత కన్న మిత్రత వైపు మొగ్గ చూపుతంది
కల్పనలో చరిత్రపై అభిమానం పెంచుతుంది
మనిషి రూపానికి అమర కళ ప్రసాదిస్తుంది

పశ్చాత్తాపంలో శుభ్రమయిన మనస్సు
సహకారం కోరుతుంది, ప్రేమకు పాదు అవుతుంది

మూసిన హక్కుపై తలుపుల్ని తెరచే యత్నంలో
నిరసన ప్రతిఘటనలు వర్తమానంలో తప్పనివీ

దిశ దిశలో ఎగసే జ్వాలా ధూమ శిఖలు
పరివర్తనలో అవి జలద పంక్తులు కావాలనీ

వ్యక్తి అంతరంగంలో రవి బింబం కనిపించాలనీ
మంచుచే మబ్బుచే చీకటిచే కప్పబడీ
నమ్మకాన్ని వమ్ము చేయ కూడదనే
అనుమానం సందేహం నడకను నిలిపేస్తాయి

లోని అమరమైన చేతన ముందుకు నడిపిస్తుంది
వికార భావన తొలగిన ఆ సుందర క్షేత్రం
జీవన భాగ్యానికి సంస్కృతి రూపమిస్తుంది
వర్తమాన మెప్పటికీ ఆగని ప్రవాహం

క్షణ క్షణం అణువణువు స్వచ్ఛమైన కవిత
కొత్త తీరాల్ని స్పృశిస్తూ కొత్త జీవితం కోరేను.

## 19.

అది బజారు! ఎందరెందరో రోజంతా
మనుషులు వస్తూ పోతూ ఉంటారు
తమ తమ ప్రత్యేకతలతో నడచేరు
వారిలో నేనొకణ్ణి! ముఖంలో పతాకగా కవిత

ఎవరినీ కన్నెత్తి పరికించకుండా
దారినే చూస్తూ పోయేరు కొందరు
ఎవరెవరినో గుర్తుపడుతూ పరిచయాలతో
జ్ఞాపకాల మెరపులతో వెళ్ళేవారు
చుట్టలుగా నేర చరిత్ర దాగినవారు
నిశ్చల సరస్సులా అమాయక ముఖాల వారు
మండే అనల శిఖల మతులు
పారే ఉదార గుణ హృదయులు

వెలుతురులో రంగుల ముగ్గుల్ని తలపించేరు
చీకటిలో వెలుతురు దివ్వెల్ని మరపించేరు

దోసిలిలో చెరువును బంధించాలనీ
దిక్కుల్ని బాహువుల్లో హత్తుకోవాలనీ
ఎదిగిన మస్తిష్కంలో ఆకాశాన్ని పరచాలనీ
పరచిన ఆలోచనలో వసుధను నిలపాలనీ

కొమ్మ నుండి కొమ్మకు చేరి మరుక్షణంలో
మనిషి తలను స్పృశిస్తూ పక్షి ఎగిరి పోతుంది
మనసుకు గగన విహారాన్ని గుర్తుకు తెస్తుంది
మనిషికి లేని రెక్కల ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది

దారిన భూమిపై ఎద్దు బండితో పాటు
ఆటో రిక్షా వరకు యాన సాధనాలు
మనిషికి తన చరిత్రకు అద్దం పట్టేను
ఇది స్వప్నంలో దృశ్యం కాదు, వాస్తవం.

జీవన గతిలో వికాస క్రమంలో సమాజం
అన్నిటికీ అవకావంతో ఆయువు గడుస్తుంది.

# 20.

ఎవరి ప్రేమ హృదయం వారికి అమూల్యం
వసంత ఖండం వలె అనుభవ రమణీయం

ఇతరుల కది ఆచి తూచి చూచే వస్తువు
ఇది ఎప్పటికీ స్వేచ్ఛా సంచరణ రూపం

ఏ సమయం ఏ వర్ణం నిలకడగా ఉండదు
జీవన గమనంలోను రేఖలు మారతాయి
విరిగి కొమ్మ చివురు వేయడం చేతన సహజం
పగిలిన హృదయం కలవడమొక! విచిత్ర పరిణామం

మనిషి, మనసు పొరలతో పుట్టుకతోనే మొదలు
ఏడుపు నవ్వు కోపం స్నేహం ఇష్టం వ్యతిరేకంతో

సమస్యకు పరిష్కారం కత్తి వేటుతో లభించదు
దీనితో ఉన్న కాస్త దారి మూత పడే వీలు ఎక్కువ
నిరాశ నిస్పృహతో నాశన విషాదాలతో
కొట్టు మిట్టాడే వ్యక్తి ప్రేమ పునర్నిర్మితికి ఉపకరిస్తుంది

దిగులులో సెగల మధ్య క్రుంగిన మనసుకు
కరుణకు దొరికే స్థానం అపూర్వం, అమూల్యం.

మండే సూర్యుడు తనలోకి దిగితే! గుండె భరించేనా?
ఏ సరస్సులోనో అద్దంలోనో ప్రతిబింబంతోనే ఆనందం
చంద్ర మండలంపై ప్రతిఫలన బింబంతోనే సంతోషం
వ్యధ అయినా యుద్ధమయినా! కవితలోను ఇదే మోస్తరు

ప్రశ్నలో కిరణంతో విషయం బయటికి వస్తుంది
పరిష్కార దిశలో హేతువు తోడ్పడుతుంది
అనవసరం నుండి అవసరాన్ని పైకి తీసి చూపుతుంది
పాత నుండి కొత్తకు మరోదారి పడుతుంది

కిటికీ అద్దంపై రాయి విసిరి పగిలిన ముక్కల్లో
తన ముఖం చూసుకొని మురిసే మనిషిలో
వికార రూపం తోచేనా? వినాశన మతి తెలిసేనా?
ఇది గడ్డ కట్టిన ప్రవాహ జీవితం! తిరిగి సరించవచ్చు

సుందర స్వప్నంతో నిద్రాస్థితిని వదలి
వాస్తవ రూపంతో జీవన గమనం శ్రేయం.

## 21.

గతం నుండి వర్తామానానికి
వర్తమానం నుండి భవిష్యత్తుకు
జీవన వాస్తవ శిఖరాలు స్పృశిస్తూ
ఆలోచన! సృజనలో కవితా మయమై

కోరిక లెన్నో? కొన్ని మాత్రం ఎన్నబడీ
పెట్టెలో భద్రంగా దాచిన పట్టు వస్త్రాల్లా
ఏదో ఒక విశేష స్థితిలో అలరిస్తాయి
బయటికి వస్తాయి! కాసేపు అమూల్యాలవుతాయి.

దారిలో ఎదురు పడిన శిలల్ని వదలి
ముందుకు కదలుతుంది ప్రవాహం, ఆగదు
కవితకు మొదటి శ్రోత పవమానం
తోడుగ మనసులో ఒక అంతరంగం!

ఆవలి దృశ్యం కనబడకుండా మధ్యలో
అడ్డుగ గోడో! తెరో! చెట్లో! ఇండ్లో మరొకటో
అది తొలగితేనే, దానిని దాటి పోతేనే
మరో క్షేత్రంలోకి ప్రవేశం! అంతా ఇదే మోస్తరు

ఎప్పటికీ ఏవో హద్దులతో ఆటంకాలతో
అస్తిత కదలిపోతుంది విశాలతలోకి!
సృజనకు చిహ్నమయిన వసంత స్పృహ
అందరిలో ఒకే స్థాయిలో ఉండదు, వర్తించదు.

జీవ కణ నిర్మాణ విశేషతలతో
మానవ సమాజం! వివిధ సమీకరణాలతో

కవితలో శబ్దం! అలంకార శోభ కన్న
స్పందన హృదయంతో ధ్వని చిత్రం అపూర్వం.

కాలం కవితను ఆహ్వానిస్తుంది
అభినవ సృజనకు వేదిక అవుతుంది
మాటలో రాతలో మనోహరమవుతుంది
ఇది జలధునిలా సమాజ పరమవుతుంది

వ్యధను బాధను పంచు కొనేదెవరు?
కలలతో స్మృతులతో వర్తమాన చేతనతో కవియే!

## 22.

శబ్దం మనిషి మనిషిని స్పృశిస్తూ పోతుంది
చెప్ప వలసింది అందరి చెవిని వేస్తూ
గాలి వాహనంపై తరలుతుంది, ఆగదు
ఎద తలుపును తడుతుంది, కవితయై

ఏది నిజం! తెలియని స్థితులెన్నో
తెలిసేందుకు సాగుతుంది అన్వేషణ
ఎవరి కల వారి స్వంత వ్యవహారం
ఎవరి నిజం వారి రహస్య బంధం!

అవసరానికి స్వర్ణ సీత! పీటపై
అసలు సీతను మరిపించేను మెరపుతో
అనలానికి పచ్చదనం లభించేనా?
బూదికి శాంతి వేది దొరకేనా?

అవసరానికి ఛాయా సీత!
మాటకు బదులుగ, తోడుగ నయి
రాకూడని స్థితిలో నిలిచిన కోరికలో
మానస తృప్తికి మార్గాలు! అనేకం
ఉపాయంతోనో ఉపజ్ఞతోనో
ఊరట కలిగించడం అప్పటి కర్తవ్యం

దేనికీ చివరిమాట అంటూ లేదు, ఉండదు.
ఇదొక మహాకృతి సందర్భంలో భాగం మాత్రమే
మధ్య మధ్య కామాలతో విరామ చిహ్నాలతో
కవిత మాటలాడుతుంది! సామాజిక బాధ్యతతో

కాస్త విరామంలో చల్లని నీడ కయి వెదుకుతూంటే
చెట్ల క్రింద! అడవిలో జ్వాలా నవరూపాలు

పైన కొమ్మను హత్తుకొని ఉన్న ఆయుధం
ఎపుడు ఎవరి పయి గురి నిలిపేదీ తెలియదు
మనుషుల కదలిక ఏమో కానీ,
చెట్ల కొమ్మల సందుల నుండి నిప్పులు రాలేను

సంఘంలో హత్యలతో పాటు ఆత్మ హత్యలు
శూన్య మనుకున్న చోట! మారణ ధ్వని సంగీతం.

## 23.

ప్రతి ఒకరిలో తాము పైకి ఎగిరే ముందుగనే
వాలే చోట! ఎవరో వల పన్నిన అనుమానం
ఒకరికి మరొకరిపై సరి అయిన కారణం లేని
రహస్య శత్రుత! కనిపించని ఆలోచనలో

సంశయాల ముళ్ళ కంచెలు దాటుతూ
దారి తప్పు జేసే భ్రమతో సూచనలు ఊహిస్తూ
ఎవరెవరో విడిచిన ప్రశ్నలకు
జవాబులు సిద్ధం చేసే ప్రక్రియలో మనుషులు

నిన్నటి రణ సామగ్రి! రేపు కూడ అవసరమవుతుంది
ఉపయోగానికి రిజర్వులో! రక్షణకు వీలుగా ఉంటుంది

దూరమయినా దగ్గరయినా నడకలో అనుభవ స్మృతి
ఎప్పటిదో పురా సూచనతో బ్రతుకును నడిపిస్తుంది
ఇంకా నడవాలిసిన దూరం మిగిలి
ఎప్పటికీ ఇంకా పోవలసే ఉంటుంది, సశేషంగా.

భూమితో చెట్టుతో కొండతో నదితో అనుబంధం
విశ్వ సూత్రమయం! ఎప్పటికీ ప్రాణితమయింది
ఏ మజిలీ తోనూ కవి పయనం ఆగదు
వీలయిన వాహనం లోనూ తప్పని కాలిబాట లోనూ

ఎండిపోయి రాలనున్న ఆకును
తెంపి నలిపి విసరేసే అవసరం లేదు
కోపంతో దగ్ధం చేసే శ్రమ అక్కరలేదు
ఎవరు కసి చూపినా, కొత్త సృజన ఆగదు

వేదనలో వెన్నెల చల్లదనం కలిగిస్తుంది
నిరాశలో కిరణం ఉత్సాహం నింపుతుంది

మట్టి గడ్డ నుండి మొక్క ఉద్గమనం
మనసు ఇష్ట పడుతుంది, శుష్క స్థితిలో
మట్టిలోని జీవ శక్తి ప్రకృతియై
ప్రతిభలోని సృజన శక్తి కవితయై

## 24.

బయటికి కనిపంచేది కాక లోన ఉన్న తలలెన్నో
మనిషికి మస్తిష్కంలో! ఇది ఎందరికి తెలుసు
ఆ చేసే ఆలోచన ఒకటే ఎన్ని తలలున్నా
ప్రాణం కాపాడేందుకు మిగతావి సహకరిస్తాయి

సీత అగ్ని ప్రవేశం! గొప్ప ఆదర్శ భావ ప్రయోగం
బ్రతుకు స్వప్న కథ కాదు, కటు వాస్తవ సంధ్యా రూపం

దుఃఖాన్ని పిలవ నవసరం లేదు, ప్రాణం తిరిగి రాలేదు
బాధ వచ్చి పై బడుతుంది ఎలాగో సందు చేసుకొనీ
దుఃఖంలో జన బంధుత ఎప్పటిదో బలంగా

ఇప్పటికీ పుట్టినప్పటినుండి, ఎప్పటికీ!
చివరి ఘడియ దాక! అదొక పరాకాష్ఠ
వెలుతురు గీతలతో, చీకటి మచ్చలతో
జన జీవిత వాస్తవ చిత్రమయం కవిత!

స్నిగ్ధమయిన పూల మాల అంచుతో
భయదమయిన నిశిత ఖడ్గ ధారతో
అక్షర విస్ఫోటానికి అవకాశం, కవితలో

ఎదురు పడిన ఆయుధం! తొలగి పోవాలని
ఎత్తిన తన ఆయుధంతో పని కానీయాలని!
ఉగ్రవాద ప్రయోగంలో కోపం ద్వేషం హింసతో
విలయ భాష ఒకటే! విధ్వంస పథం ఒకటే

ఇంత వరకు సమాజంలో కనిపించేది మాత్రం
ఎర్రని మంటలతో నల్లని పొగలతో సమయ సమయ చిత్రాలు
పగలు చెల్లని నాణెంలా అడవిలో
రాత్రి వెండి నాణెంలా ఊరులో

పేదరికం శిలలకు ప్రతిమల రూపం వచ్చేనా?
ప్రతిమలలో జీవన సుందరత కనిపించేనా?
చిక్కు ముడులతో సతమత మయ్యే వారితో
చిక్కు ముడులతో బ్రతుకు సాగించేవారూ

# 25.

ఆధారం ఏదయినా భ్రమణ శీలమయినా
మానవ ప్రస్థానం దశనుండి దశకు ముందుకే
ప్రతి దశలో పూర్వ శిథిల పంక్తులలో
గతం పుటలు తిరగేసేరు? అందరూ
దొరికిన ప్రతి వస్తువులో మనిషి పనిని చూచేరు
జరిగిన ప్రతి విషయంలో మనిషి హృదిని వెదికేరు!

భూమిని తవ్వేవారు తవ్వుతూనే
ఉద్దేశం నెరవేరే దాకా శ్రమలో
పునాది కోసం చెరువు కోసం ఖనిజం కోసం
దేనికోస మయినా అది మనిషికి చెందేదే!

సూర్యుడు ఎప్పటివాడో! ఇప్పటికీ సవ్యంగా
కాల గమన మదే! ఆతప భేదాలు అవే!

ఎండిన కొమ్మలో కఠినత పెరుగుతంది
గాలికి కదలలేదు, చివురు చూపలేదు

జన్మ నుండి సమాప్తి దాక క్రమం తప్పక
పగలు రాత్రులు ఆగమనం నిష్క్రమణంలో
అంతా కొత్తగా! ఏ బ్రతుకున కది ప్రత్యేకం
తర తమ స్థాయి భేదాలలో మానవ స్థితులవే

ఉన్న కాస్త వెసులుబాటులో దీనహీన కర్షక శ్రామిక ప్రజ!
చెదరిన కాలం శకలాల బరువులతో బాధలలో కదలుతూ

జన హిత సమ దార్శనిక పథంతో
శిలల వలె మౌన బందంలో గడిపేరా?
ఆకర్షణీయ రూపం ఇచ్చే
శిల్పి కయి ఎదురు చూచేరా?

మట్టి నుండి జీవన భాగ్యంతో
సగం నుండి మానుష పూర్ణతతో
పైన తరణి తేజంతో కింద మనిషి చరిత్రతో
బింబ ప్రతిబింబాలుగ కదలుతూంది కాలం

శూన్యంలో చేతులు చాచడం కర్తవ్యం కాదు
ప్రజాస్వామ్య చేతనతో క్రమించడ మవసరం

# 26.

ఏ సమయం ఏమి జరిగేదీ తెలియని
ప్రస్తుత రాజకీయ సంక్షుబ్ధ స్థితిలా
అనుకోని వడగండ్ల వాన
క్షణాలలో బీభత్స ముద్ర వదలిపోతుంది

హఠాత్తుగా జోరు గాలులతో
విసరే పిడుగులతో, ఆయుధ శబ్దంతో
కురిసే వడగండ్లతో మంచు గడ్డలతో
బీభత్స దృశ్యం, ఎట్టెదురుగ

కవితకు విరామం లేదు
మనసుకు విశ్రాంతి లేదు
అక్షర నిలయం కవిత
ఎన్నిటికో సాక్షిగ వర్తిస్తుంది

సస్య శ్యామల భవితకు
ఆప్త హస్త మందిస్తుంది
ఆకృతిలో వికారికి అనుకోకుండా
సుందర హృదయం ప్రసాదిస్తుంది

అగ్ని కణ మెంతటి కాల్చే దయినా
చీకటిని తొలగించలేదు, ప్రభావం చూపలేదు

ఈ ఉగాది రోజు ప్రియంగా
ఒకచోట మనుషులు కలిస్తే
కాలం అందించే పుష్ప గుచ్ఛాన్ని తలపిస్తుంది
జన స్పందన హృదయంతో కవిత పలుకుతుంది

గడప దాటితే అలల వలె మనుషుల అడుగులు
తీరం చేరే పోటీలో! పాల్గొనేదిగా ఉంటుంది
కింది నుండి పైకి ఎదిగిన మనిషిని బింబిస్తుంది
మనిషిలో వెలుగుకు సృజన రూప మిస్తుంది

ఉదయం స్నేహ వల్లిని ప్రకాశింప జేస్తుంది
పగలు నరాలలో ఉత్సాహం నింపుతుంది
సాయంవేళ శ్రమ ఫలాల్ని అందిస్తుంది
రాత్రి నీటిలో ముంచి తీస్తుంది శుభ్రంగా

# 27.

హృదయ వశం సందర్భం, కవితలో
స్వతంత్రమయిన చేతన స్పందన గుణ కలనం
ఆవిష్కరణ ప్రసారమొక మనోజ్ఞ విశేషం
ఇది దేనికీ అనురూపం కాదు, ప్రతిబింబం కాదు

ఏ లిప్త అయినా  కవితకు పనికి వస్తుంది
శశి కిరణం హ్లాద కరంగా
రవి కిరణం చండ మయంగా
మోదం ఖేదం జీవన పార్శ్వాలతో
ప్రవాహ గమనం పొందుతుంది
హృదయానికి ఆర్ద్రంగా మేధకు వెలుతురుగా

కవితకు సందర్భం ఇది అది అని లేదు
ఏ దృశ్యం ఏ శబ్దం ఏ ధ్వని తోనో
ఏ ఎద కదలికతోనో, ఏ భావ స్పర్శతోనో
సృజన కళ పొందుతుంది, కవిత వెడలుతుంది

రవి కిరణంలా వెలుతురు స్వాగత ముఖంతో
శశి కిరణంలా రాతిరి భయం పోగొడుతూ
ఏ మూల నుండో బాధా స్వరాన్ని వినిపిస్తుంది
ఏ పీడిత లోకంపైనొ అనుభూతి స్వనిస్తుంది

ఎడారిలో వేదనా ఝురులు నదించేనా?
మనిషికి తోడుగ మనిషే ఒక ఆలంబనం!

ఎగసే జ్వాలా తంత్రులు మీటిన అనల స్వరం వినిపిస్తుంది
వర్షధారల తీగెలు మ్రోగే జల తరంగం ధ్వనిస్తుంది

జీవన గమనంలో స్థితులన్ని ప్రేరణ స్థానాలే
అనుభవ పటుతను బట్టి సూక్ష్మీకృత మవుతుంది

ఉచితంగా లభించే భోజనం ప్రకటనతో
గుమిగూడిన జన సమూహ సమ్మర్దంలో
ముందుకు కదలే మనిషి శ్వాస ఆగిన క్షణం
కవితకు కారణమవుతూంది మానవ బంధంతో

అల్లసాని పెద్దన మాటలలో సుఖం సంతోషం భోగం భాగ్యంలో
సౌందర్య ప్రవహంతో సృజనావిర్భావమొక ప్రతిభాజనితం
సంక్షుబ్ధ సమాజ గతిలో సంక్లిష్ట మనో విధంలో
కవి ఎదుర్కొనే సమస్య వేరు, పరిష్కార పథం వేరు

గ్రీష్మంలో ఎండిన చెరువు హృదయం
పగులు వాసి రస కళ కోల్పోతుంది ప్రకృతిలో

పైనుండి వచ్చిపడే వరదకు కొట్టుకపోయే మనిషిపై
సానుభూతి ఆరాటం, రక్షణలో కర్తవ్యం బోధిస్తుంది కవిత!

ఎదురెదురుగ వేగంలో రెండు వాహనాల మధ్య
అహంకార శిఖరం అడ్డు వచ్చి ఢీ కొని
ఘోర ప్రమాదం! వార్తతో కవి మతిలో దృశ్యం!
కరుణ జలం సుడిగుండంలో తిప్పుతుంది

సిగరెట్ చివరి దమ్ములో రింగులుగా పొగ వదలుతూ
అలవోకగా విసరిన చివరి ముక్కలో నిప్పు
పేద సాద అని లేకుండా! బూదిగ మార్చే విపరీతం
తన సమస్యకు పరిష్కారం నిరాశలో ముంచేస్తే
ఏ ఉరియో ఏ రైలు చక్రాలో! ఆశ్రయాలయి
కవి హృదయం అగ్ని గుండమవుతుంది విషాదంలో

ప్రమోద కరమయినా విషాద భర మయినా కవిత
ముఖం చాటు వేయదు; హృదయం ముందుకు వస్తుంది
దారుణ మారణ క్రియలో స్పందనతో! వెడలుతుంది
సృజనలో అక్షర ప్రయోజనాన్ని విశాల పరుస్తుంది

సూర్య చంద్ర బింబాలు ధర్మం న్యాయం ప్రతీకలు
రాత్రులు చీకటి వదలని సందర్భాలెన్నో! సమాజంలో
చౌరస్తాలో గాంధీజీ విగ్రహం చూపులో
ఎవరూ చూపునుండి తొలగలేని కూడలిలో
పట్టపగలు హత్య, ప్రజాస్వామ్యం ఎదపై కత్తి పోటు
వర్తమాన పరిణామాలలో కవితకు ప్రేరణ సందర్భాలెన్నో
చేతిలో ప్రియమిత్రం! టీ / కాఫీ కప్పు
ఉత్సాహానికి చిహ్నం! కాస్త సహకరించవచ్చు.

స్వేచ్ఛా కవిత్వం - 99

# ఏది కవిత

## భాగం (2)

## వర్తమానం ముందుకే

మాదిరాజు రంగారావు

2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**99 SVECCHA KAVITHVAM**

Free- Verse

**EDI KAVITHA** Part **II**

Varthamanam Munduke

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

***Presented***
***to my son***
***Dr. M. Santhosh Kumar***
***with blessings***
***on his Birthday***

## పీఠిక

ఇది స్వేచ్ఛా కవిత్వం పేరుతో ప్రకటితమైన కృతుల్లో తొంబయి తొమ్మిదవది. “ఏది కవిత” రచనలో రెండో భాగం “వర్తమానం ముందుకే” పేరుతో వెలువడుతూంది.

పూర్వం కన్నా ఇప్పుడు తెలుగులో కవిత్వం ఎన్నో ముఖాలుగా ఆవిష్కారాన్ని పొందుతూంది. ఈ మంచి స్థితిని బట్టి ఎప్పటికప్పుడు కవిత్వం నిర్వచనం మారడం సహజం. లేకపోతే దేని దారి దానిది అవుతుంది. సాహిత్య విమర్శ దారి దానిదే, సృజన రూపం కవిత దారి దానిదే అవుతుంది. ఈ రెండిటి సమన్వయంతోనే సాహిత్య విమర్శ ఎంతో మేలు చేస్తుంది. సాహిత్య కళా సంస్కృతికి ఉన్నతిని విశాలతను వివిధతను చేకూరుస్తుంది. మానవ బంధుతను పెంచుతుంది.

ఈ కవిత్వం వర్తమాన స్థితిగతుల చిత్రణం. ప్రజాస్వామ్య వ్యవస్థలో, మానవీయ సంస్కృతిలో జరుగుతూన్న చింతనీయమైన విషాద పరిణామాల్ని దృష్టిలో పెట్టుకొని అవతరించింది. అందువల్ల ఇందులో సామాజిక రాజకీయ నైతిక సాంస్కృతిక కోణాల్లో భావజాలం చోటు చేసుకోవడం సహజం. ఇది అనివార్యమయింది. దీనివల్ల వస్తువులో విశాలత ఏర్పడుతుంది. విషయంలో వైవిధ్యం సిద్ధిస్తుంది. సామాజిక తత్పరతను పొందుతుంది. దార్శనిక నిబద్ధత చేకూరుతుంది.

ఇక కవిత్వ కళా జగత్తుకు వస్తే దీని ప్రాధాన్యం ఉండనే ఉంది, కోల్పోలేదు. సృజనలో స్పందన గుణంతో భావ జగత్తు ఆవిష్కారంలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఆధునిక సంవిధాన పద్ధతులలో రూపొందిన అభివ్యక్తి స్థితిని కూడా ప్రతీకలు భావరూపాలలో గమనించవచ్చు. రచన 1952-53 నుండి (కిర్మీరం మొదటి కవితా సంపుటం) ఇప్పటివరకూ అచంచలమైన “ప్రజాస్వామ్య సామ్యవాద” దార్శనికంతో అవిచ్ఛిన్నంగా వెలువడుతూన్న స్వేచ్ఛా కవిత్వం, ఎవరూ విస్మరించడానికి వీలులేనిది. ఈనాడు నెలకొన్న పరిస్థితులలో వ్యక్తిస్థాయి నుండి సమాజ స్థాయిలో ముఖ్యంగా రాజకీయ నైతికత దార్శనిక నిబద్ధత చాలా అవసరంగా ఉంది. ఈ దృష్టితో స్వేచ్ఛా కవిత్వం, స్వతంత్రమైన ప్రతిపత్తితో, సాహిత్య చరిత్రలో కొత్త పుటలకు అవకాశం కల్పిస్తూంది. ఇది అవసరమూ, వాస్తవం కూడా.

మండే లిప్తలపై
మబ్బు కరుణ సరిస్తుంది.
అవని సృజన కళతో
కృతజ్ఞతను చూపుతుంది.

**మాదిరాజు రంగారావు**

# 1. ఈస్టర్ విషాదం

ఈస్టర్ ఆదివారం పవిత్రమయిన రోజు
ఉదయం ప్రార్థనా సమయం హ్లాద మయం
హఠాత్తుగా పేలిన బాంబు ధ్వనితో
మృత్యువు ఛాయలు అలము కునేను ఘోరంగా
సూర్యుని కిరణాలను బ్రతుకు నుండి దూరంగా
చీకటి లోకి నెట్టేసే పొగలు అలముకునేను

ఒక చోటున సంస్కృతిని మంటగలిపే అమానుషం
శాంత జలధి అలలపై కదలే
పడవ! తల క్రిందులయిన దృశ్యం
మనిషిలో వికృత శక్తి నాశన పథ మవలంబిస్తూంది

వికలమయిన శరీర శకలాలు చెల్లాచెదరయి
హాహాకారాల శబ్దం దిశలను ముంచేస్తూంది
కళ్ళముందు విధ్వంసం చీకట్లను చిమ్ముతూంది
జన సమూహ పంక్తుల్ని మరణ చక్రంపై తిప్పుతూంది

ప్రార్థనా స్వరంతో పునీత మయిన వేళను
ముక్కలు చేసి వికార రూప మిస్తోంది కిరాతకం
మతమో వాదమో ఉన్మాదమో ఉగ్ర చర్య ముఖంతో
పేల్చే స్థితి అంటే మానవాన్ని దగ్ధం చేయడమే!

విరిసిన పూల చెండుకు బదులు విషమ సమయం
కసితో అగ్ని శిఖలతో మసికి గురి చేస్తూంది
అంటించేందుకు గీసిన అగ్గిపుల్ల వలె
తీవ్రవాది జల్పనం! దేని కయిన సిద్ధంగా

చీకటి గుహలను తలపించే మతులతో
శ్మశాన ఘట్టానికి ప్రవేశాన్ని చూపుతూంది
దుశ్చర్యల దృశ్యంతో పక్షి ! వాలుగా దిగి
సానుభూతి చూపుతో తిరిగిపోతూంది.
తీవ్రమయిన గాలికి ఆకుల వలె
మనుషులు! నేలపై వాలిపోయేరు

కల్లోలంలో బ్రతుకులు సంక్షోభంలో సమాజం
వికాస చరిత్రలో దారిన పరచిన బొగ్గుగ మారుతూంది

# 2. లోక బంధువై

ఆక్రోశంలో ఆగని దుఃఖం పొరలే ముఖాలలో
తెలుపును కమ్మిన ఎరుపు నీలి రంగుల చిత్రాలు
కాలిన బూడిదతో పన్నిన చీకటి వ్యూహం
పగటి వేళ ప్రకాశాన్ని మటు మాయం చేస్తూంది

ఒకరి చేయి పోయి ఒకరి కాలు విరిగి
విసరిన శిలా శకలాలవలె కదలలేని కొందరు

భద్రంగా తిరిగే జీవన చక్రం పట్ల
సహనం ప్రేమ శాంతి పై మితిమీరిన విశ్వాసం
ఒకరి దృష్టిలో ఉపేక్ష! అలజడికి అవకాశం
నిపుణతతో సంఘం రక్షణ కవచం కోరుతుంది

దిగ్భ్రమలో నిష్క్రియతను పొందిన సామాన్యులు
అక్కడక్కడ స్తంభాల వలె నిలచి పోయేరు
ఆగిపోయి గడ్డ కట్టిన కాలం
కెరటమై కదలి సరించవలసి ఉంది.

కాలి నడక కెన్ని దారులో అడవిలో
జటిలమైన స్థితిలో అన్ని ఎత్తులు మనసులో
అనుకోని కష్ట పరంపరలో సాగడమంటే
గెలుపు అంచున కాస్త ఎడంలో నడవడమే!

ఎంతటి ప్రమాదంలోను బ్రతుకులు శూన్యం కాకూడదు
దిగులు నుండి వ్యధ నుండి ఉద్గమన మవసరం
కిరణ స్పర్శ కోల్పోయిన చీకటితో మస్తిష్కం
విపరీత స్థితిలో ఆత్మహత్యకు ఉంకించేను

ఎవరికీ అనుకున్న క్షణం కౌసుమ స్పర్శతో గడవదు
ఏ క్షణాన ఏ బాణం తగిలేదీ తెలియదు
ఒకరిబాధ ఎగిరి వచ్చి తాకే నిప్పు కాదు
మరొకరిని కరగించే కోష్ణ స్ఫూర్తి విసరుతుంది,
తెరచిన ఉదయం కిటికీ నుండి వెలుగు
కవితకు ప్రేరణయై ఆశను మేల్కొల్పుతుంది
అనుభవాన్ని సత్వరం పదంలో పలికిస్తుంది
ఇది కవిత! లోక బంధువై సీమలలో తిప్పుతుంది.

## 3. అద్దంలో దృశ్యం

కాలం రవి కిరణంతో విస్ఫారుతుంది
మనిషి చరిత్ర తోనే కాలానికి అస్తిత
మనుషుల మంచి చెడు పనులు సహిస్తుంది

కదలే పడవలతో జలధి వలె
ఒక సుందర వాస్తవం! సమాజం
గమనంలో ముందుగ మజిలీ తీరం
తెలియదు ! అదే విచిత్రం! బ్రతుకులో

మనిషికి మనిషి తోడు! విలువకు విలువ చేరుతుంది
మనుషుల విలువలతో సమాజమొక వివిధ వస్తు నిలయం

మహా విపణి శాలా రూపంలోకి ప్రవేశం!
ఎవరి కిష్టమయినా కాకపోయినా తప్పనిదీ
ఎప్పటికప్పుడు బరువు దించి మరో బరువుతో పయనం
ఏదీ తెలియని శూన్యంతో మొదలవుతుంది జీవితం
అప్పటికప్పుడు కొత్తదనంతో, రూపం! ఏర్పడుతూ

దారి పొడవునా ఇరు వైపుల తత్త్వ సౌందర్యం
మనిషిని ఆకర్షిస్తూ, చింతనలో కొత్త ప్రపంచం!
నిజ చేతనతో వాస్తవ భూమికలో కవిత!
బ్రతుకును మాయం చేసే మర్మానికి దూరంగా
వెనక నుండి కల్పన కవకాశ మీయవచ్చు
అతీతానికి చింతనలో సాంద్రత నీయవచ్చు

మనసు చుట్టు కరుణ శాంతి తేజో వలయాలు
తెలియడ మొక అదృష్టం, అనుభవ మొక విశేషం

పంటలో ఎన్నిటికో పనికి వచ్చే కొడవలి
శత్రుతలో మెడపై వేటుకు! సిద్ధంగా ఉంటుంది

కిటికి తెరచి నపుడే! దిశా ముఖం కనిపిస్తుంది
వెలుతురు లోనికి వచ్చినపుడే స్తిమితం చేకూరుతుంది

వికృత కర్మలో కాలం మారినట్లు అనిపిస్తుంది
ఇది! మనస్సు వ్యవహారమనీ! అద్దంలా కవిత చూపుతుంది

## 4. ఎవరి పనిలో వారు

మౌన సీమకు చెందిన ప్రతి కవిత
శబ్ద మయం కావలసిందే, అంతలో
ప్రసార ధునియై మన వలసిందే
అర్థం విప్పారుతుంది! పూవు రేకుల్లా

మీటిన హృది తంత్రులు స్వనించాలిసిందే
ఇది కవిత అని అంతరంగం ఆలపిస్తుంది

తమకు పట్టీపట్టనట్లు తమ పనులలో కొందరు
మన కెందుకులే! యని మౌనాకృతిలో కొందరు
సుడిగాలిని తలపించే ఆసక్తితో కొందరు
అనాసక్తిలోను తెగని బంధంతో వర్తించేవారూ

ఎందరు కదలినా కదలక పోయినా
ఎందరు పలికినా పలకక పోయినా
అందరినీ స్పృశిస్తుంది తరంగ చలనంతో
చెవిలో ఊదుతుంది, మతిని మేల్కొల్పుతుంది

ఇప్పుడయితే, దయాభావ శీలం నుండి
క్రూర కర్మ వేది పైకి అంతలోనె!
కాలం మారినట్లు అనిపిస్తుంది
కానీ ! మారింది మనిషి మనసు మాత్రమే!

పొంద లేనివి చేతి కందాలని చూస్తుంది
చేయ రానివి అవలీలగా చేయిస్తుంది
హృదయంలో వేదనతో కరుణ జలం
ఆవిరి అయి ఎగసి పైకి సన్నగా
జారి! పాయగ మారేనా బ్రతుకులో!

"ఏది కవిత?" అన్న ప్రశ్నను చుట్టుకొనీ
ఎవరు నీవు? అన్న ప్రశ్నకు జవాబులో

చెట్టు నుండి రాలిన ఆకుల లెక్కలలో ఒకరు
కొమ్మకు పూసిన పూల లెక్కలలో ఒకరు
పచ్చదనం అందం పరిమళాల ఆస్వాదంలో ఒకరు
చెట్టు నుండి నీడ వరకు విలువల పరిగణనంలో ఒకరు

# 5. ప్రగతికి మార్గం

పేరు ఊరు కులం మతం వర్ణం వర్గం సంఘం
ఒక దాని తరువాత ఒకటి వాటి వాటి సీమలతో
విశ్వమయం కవితలో పూర్ణత కవకాశంతో
వీటి మధ్య ఖాళీలలో కఠోర వాస్తవాలు

స్నేహంలో పూల తోట అయింది
శత్రుతలో అగ్ని మయం కావచ్చు
వీటిని కలుపుక పోయే చేతనతో
మానవ జీవన సౌందర్య కళలతో కవిత!

భద్రత రక్షణలో ఇరువైపుల నుండి
ఆయుధ మొక అనివార్యమైంది ఎప్పటినుండో
వ్యక్తిలో విపరీత మతితో, మనుషులపై ప్రేలేను
సంఘ యశోరూపం! గాయాలపాలయ్యేను

ఏది నిజం కాదో! ఏది నిజం అవునో!
సూటిగ తెలిసేదెందరికి? తెలుసుకునేదెందరు?
హత్య చేసిందెవరో తెలియనంత వరకు
అనుమానం చుట్టేసే ప్రమాద మెందరిలోనో!

భయపడని మనో రూపం! ఒక కవి లోనే
అది కవితయై ముందుకు రావడం! మనోజ్ఞ విషయం
వినడానికి అన్నీ బాగానే ఉంటాయి వచ్చే వార్తలలో
సామాన్యం కాని పనికి విశేష స్పందన మవసరం

శిశువు అవతరించగనే యాత్ర మొదలవుతుంది
అమాయకం నుండి అన్ని! తెలుసుననేంతవరకూ!

దశదశలో వేరు వేరు జ్ఞాపకాల పేటికలు
అపుడపుడూ జీవన ప్రదర్శనలో భాగమై

కోట గోడలతో చుట్టూ ఎన్ని హంగులు ఉన్నా
స్పందన లేనంతవరకు శబ్దం స్ఫటికసమం
దార్శనికం లోపిస్తే లక్ష్యం శూన్య దిశా మయం
కవితకు పూర్ణతలేదు, ప్రగతికి మార్గమనంతం

# 6. అమూల్యసంపదగా

ఎక్కడో బీరువాలో ఉంచిన తేనె వాసన
పసికడుతుంది చీమ! ఆ వైపు సాగుతుంది
సూక్ష్మమైన సున్నితమైన గ్రహణ పటుత
సందర్భానికి తగిన స్పందనతో కవిత అవుతుంది

ప్రేమ కరుణ హ్లాదం మానవ స్పృహలతో
పదం, సమాంతర మనోజగం చూపుతుంది
శబ్ద లహరులపై మరో తీరం చేరుస్తుంది
శిశిర ముఖంలో వసంత శోభను మెరపిస్తుంది

మంచు బిళ్ళలవలె అక్షరాలు వరసగా
అర్థంలో కోష్ణతతో ప్రవాహ రూపమొందేను
కవితకు రసమయ పథం లభిస్తుంది
ఎవరి అవసరం వారిది, అది తీరే తీరులు వేరు వేరు!

వస్తువు మితమై అవసరాలు విస్తృతమయి
లాభసాటి వ్యాపార విధనాలు మరీ ఎక్కువై
మనుషులలో విలువలు పరికుంచితమై
విషయంలో నైతిక రూపం క్షతమై, హతమై

ఒక కిరణం చాలు
చీకటి బరువును తొలగించేందుకు
మనసును తేలిక పరుస్తుంది
కష్టంలో ధైర్యగుణం ప్రసాదిస్తుంది

ఈ పయనం తీర్థయాత్ర కాదు
పర్యాటక విలాస యానం కాదు
కూడికలో చేరేవి అన్ని అనుభవాలు
తీసివేత పొందేవి ఏన్నో లేవు వీటిలో

అనుభవ రమణీయంతో కవిత
మిత్రం కావచ్చు, శత్రువు మాత్రం కాదు
మనసు అడుగులోని జ్ఞాపకాల్ని వ్యాఖ్యానంతో
రికార్డు చేస్తుంది, తరాల కందిస్తుంది అమూల్యంగా

# 7. శక్తికి సంకేతం

ప్రేమ కరుణ ఉత్సాహం ప్రశమనం
నాలుగు చక్రాలతో జీవన రూపం
ఖేదం వైరంలో జిగీష! జిజీవిషలతో
పయనంలో కవితకు వాహనమవుతుంది

గమనానికి ఆరంభంలో అశ్వాన్ని నిమిరేరు
సందేశం పంపే ముందుగ పావురాన్ని దువ్వేరు
రెండిటికీ మనిషి హృదయ భాష తెలుస్తుంది
కవితలో ఇది పరివర్తన మవడం సహజం

తన ముఖం చూడలేని మనిషికి
అద్దం సహాయ పడుతుంది బాగా
తన హృదయం ఎరగలేని మనిషికి
కవిత ఉపకరిస్తుంది అనూహ్యంగా

దొరకని చోట దారి చూపిస్తుంది
దారి లేని చోట కొత్తది వేస్తుంది

నిజం అక్షరంలో ప్రకాశించినపుడే కవిత
దార్శనికంతో శబ్దం, తేజోమయమవుతుంది
సూర్యుని అస్తమయంతో ఆ స్థానంలో
ఉండే అర్హత ఒక కవితకు మాత్రమే!

ఏడ్పు బాధ తాపం నిరాశతో హృదయం
ఎరుపెక్కుతుంది, కాని చీకటిగా మారదు

చెట్టు అంతరించి మరొకటి రావచ్చు
విత్తుతో వచ్చే గుణగణ రూపం! ఒకటే
కోరికలూ వేదనలూ బ్రతుకులో వలెనే
వాస్తవమూ కల్పనలూ కవితలో కలిసీ!

కణ కణ లాడే కుంపటి హృదయంలో
మొలిచిన తీగె సాగి పచ్చదనం కనిపించేనా?
ఇది సాధ్యం! ఒక కవితలోనే రమ్యంగా
ఇది శబ్దంలో జీవన శక్తికి సంకేతం

# 8. రెండూ కలిసిన కార్నర్

ఇది వీధి, అందునా చౌరస్తా
ఇల్లు కాదు ఆఫీసు కాదు
ఏకాంత స్థల మసలే కాదు
ఎందరో వచ్చి పోయే మనుషుల దృష్టి పడే చోటు

కవితకు ఉత్ప్రేరణ సమాజ స్థానం
ప్రజలతో బంధుత నిలపే సంగమం

కవి వినిపించే కవిత ఒక వైపు నుండి
ప్రజ వినిపించే మాట ఒక వైపు నుండి
ఇరు వైపుల నుండి మధ్యలో ఏదైనా ఉండొచ్చు
ప్రవాహమో పూల మొక్కల వరసో! డివైడరో

గాలిలో మాటలు ఎదురెదురయి కలుస్తాయి
ప్రశ్నలకు జవాబులో వివరణలో సూచనలో
ఇంట్లో ఆఫీసులో ఏకాంతంలో ఎవరి పనిలో వారు
నిమగ్నులయి మరొకటి పట్టక పోవచ్చు

ఇది జనతకు దగ్గరగా వచ్చే స్థలంలో
జన హృదయం స్పందించే అక్షర రూపంతో
ఆలోచన స్వేచ్ఛగా దూర దూరం పయనిస్తుంది
బయటి నుండి నాలోకి, నా నుండి బయటకి

ఆదాన ప్రదాన మొక సుందరమైన
స్పందన భావనతో సామాజిక మవుతూంది

కాసేపటి ఎవరి దారి వారిది
కవిలో ప్రజకు వినిపించాలనీ విన్నారింతే చాలుననీ

కొందరికి కవిని చూడాలనిపించవచ్చు
కొందరికి కవిత వినాలనిపించవచ్చు
ఇదొక ప్లస్‌పాయింట్! బయటనయితే
ప్రజను కవిని దాటినదవుతుంది సృజన

ఈ లిప్తలు అమృత బిందువులతో సమానం
హృదయం మస్తిష్కం రెండూ కలిసిన కార్నర్!

# 9. నిజ కర్తవ్యం

సమాజ సందర్భంలో కవిత పాత్ర
ప్రజాస్వామ్య పథంలో ఒక అవసర వాస్తవం
బోనులో బంధించిన హరిణానికి మోచనం
వెలుగును బాధించే అనలాన్ని ఆర్పడం

పంజరంలో ఉంచిన చిలుకను విడువడం
కట్టి వేసిన చేతులకు స్వేచ్ఛను ఇవ్వడం
ఒడ్డున భయపడే మనిషిని ఈద జేయడం
మారిన దశలో కొత్త దిశపై చూపు నిలపడం

రాత్రి రాకపోతే ఇది అసలే లేకపోతే
చల్లని విరామానికవకాశం ఎక్కడుంది?
అవసర సమయంలో సూర్యుని కప్పేసే
ఉపాయమెదో! ఎవరో కని పెట్టేవారా?
రాత్రి భయదమై మృత్యుఛాయ కాకూడదు
వెన్నెల ఊరట హ్లాదం బ్రతుక్కి అవసరం

రాత్రి ఆకుపై రాలి నిల్చిన మంచు
ఉదయం కరగి జారుతుంది బాష్ప కణంలా
ఇది ప్రమోదానిదా? విషాదానిదా?
ఏదయినా కావచ్చు! కవితలో కవి భావనలో

నిన్న నిప్పు రేకులు విప్పారితే
నేడు ఇనుప రేకులు విప్పవచ్చు
మేల్కొన్న చేతనతో కవిత! అన్నిట నిలుస్తుంది
దీప స్తంభంలా కాదు; మానవ బింబం అవుతుంది

కవిత! దేనిని ప్రతిఫలిస్తుంది
దేనికి ప్రతినిధిగా వరిస్తుంది
ఆకలితో దరిద్రంపై అలజడిలో హింసతో
బ్రతుకులో తృప్తి రేఖపై సఫలయాత్రకూ

తన వికాస చరిత్రను బుజాన మోస్తూ
మానవ నిజ కర్తవ్యానికి ఎదురుగ సిగ్నల్‌గా

# 10. మరో సమస్యతో రాజు

గగనంలో కదలే మబ్బులు! మారే ఆకారాలతో
అవనిపై గిరి నది తరు జంతు మృగ రూపాలలో
ఎన్నో వస్తువుల్ని పోలినవై, కవితలోను
జ్ఞాపకాలు! ఆలోచనా శీలనుండి చేరేను

సమాజ విషయంలో నయితే! మనిషికి
లోన మరో మనిషి కదిలితేనే! ఉత్సాహం

అది జనపదం! ఊరు నిండ కవితయే
ఇది పట్టణం! వీథులన్ని కవితయే
అటు నుండి ఇటు రావడమే జాస్తీ
ఇటు నుండి అటు పోవడం ఎపుడో!

పొగడ్తల కయితే ఒక కవిలా సిద్ధంగా
నివురు గప్పిన నిప్పులా అమాయకంగా
లోతు లేని బ్రతుకులపై సానుభూతి జల్లులతో
నిశ్శబ్ద పరిసరాలలో పనులకై ఎదురు చూస్తూ

ప్రకృతి ఒడిలోని గుడిసె నుండి మేడల ఆసరాకు
ఆకలిలో ఆకాశం వైపు చూడడమే
రాత్రివేళ చుక్కలు కాస్త ఊరట కలిగించేను
చంద్రునితో స్నేహం! శిశు దశ నాటిది

ఉదయం కిరణంతో నగరానికి పయనం
ఆ పూట కయినాసరె పని దొరకే ఆశతో

నగరం ఎవరినీ నిరాకరించదు; కానీ ధూళితో
స్వాగతం చెబుతుంది, అలంకరిస్తుంది కూడా!

ఊరులో పండిన పంట! కొందరికే పరిమితం
మిగతాది తరలుతుంది మరోచోటికి వర్తకంలో
కాలం కలిసి వస్తే పంట! లేనప్పుడు? సున్నాముఖమే!
ఆహారం అవసరాలు పోస్ట్‌పోన్ చేసే వీలులేదు

ఈ మధ్య ఊళ్ళలో మృత్యువు! నెత్తురు చిందకుండా
ఏ రోజూ మరునాడు మరో కొత్త సమస్యతో నిశ్శబ్దంగా!

## 11. అక్షరాక్షరంలో

నాలుగు గోడలతో ఉనికికి గుర్తు ఇల్లు
గడప దాటి బయటికి రావడంతో మనిషిని
ఎదురు చూచే వీధి అందుకుంటుంది
సమాజం తనలో కలుపుకుంటుంది

ఏదో ఒక రూపంలో తిరిగే శ్రమ చక్రంలో
బయటి బ్రతుకు తనకు ముఖ్య భాగ మవుతూంది

ఎదురుగా నివాసాలతో చెట్లతో క్షితిజం!
ఎత్తుపై అభిలాష కలిగిన దిదృక్షను పెంచుతూంది
ఊరు దాటితే పొలాలతో క్షితిజం మనసును మురిపిస్తుంది
ఉత్సుకతను పెంచుతుంది, దార్శనికత వెలుగుతుంది

పైనుండి నేలకు దిగిన చూపుతో
దూరాన ప్రవహించే నది దగ్గరగా
ఆగని కాలంతో పోటీ పడుతూ!
వాస్తవ జీవన గమనానికి సంకేతం

గాలి కదలితేనే ఊపిరి
కాలు కదలితేనే పయనం
మనిషి చేరి తేనే సమాజం
గుండె మ్రోగితేనే జీవితం

దేనికదే అయినా అన్నిటినీ కలుపుతుంది
జీవ భావ సూత్రం! సంబంధం జీవితంలో
స్వేచ్ఛలో ఎదురుగ దారులెన్నో పయనంలో
దిశ దిశలో వివిధ గమ్య స్థానాలతో

సూటిగ తాకినా స్పర్శ ఎరగని స్థితిలో
వక్రోక్తులు వ్యంగ్యోక్తులు ప్రతీకలు
భద్రంగా! ఇంట్లో చిలుక కొయ్యకు తగిలించి
కవిత వెడలుతుంది! మబ్బులు వీడిన గగనంలా

మెరుపు లేని గర్జ లేని ఇంద్రధనుసు జాడలేని
అనుభవ సౌందర్యం! వచన కవితలోనే సాధ్యం!
దప్పిక తీరడం నుండి పంట వచ్చే వరకూ
నీటి చుక్క జారుతూ అక్షరాక్షరంలో ! ఒకటొకటీ

## 12. నది బ్రతుకు ఆర్ద్రతయే

కవిత మాట్లాడుతుంది ప్రతి హృదయంతో
ఉన్న స్థాయిలో తగిన కళా స్పృహను బట్టి
సమాచార కేంద్రం కాదు విచారణ స్థానం కాదు
తీర్పులు చెప్పే వేదికకాదు వెలుగు దారి చూపేను అక్షర బింబం
ప్రతిభా సూర్యుని ముందు నీడలు వింజామరలవుతాయి
చేతనలో నవతను భవితను చెరొక వైపు చూపుతుంది

అనుభూతి రూపంతో ఆలోచన శీలంతో
మనసుకు సంస్కార పరిమళ మందిస్తుంది
తరతమ భేదం లేకుండా వెలుగులు ప్రసరిస్తుంది
ఆనంద లహరులతో పరవశతను కలిగిస్తుంది
ప్రవహించే నది గట్టున పచ్చదనంలా
జీవితాన్ని అర్థవంతం చేస్తుంది ప్రభావంతో

దిగులులో నిరాశలో ఆత్మ హత్య నుండి
తొలగే దారిని పరచి చూపుతుంది
ఉత్సాహం నిలుపుతుంది అభిలాషను పెంచుతుంది
బాధను అధిగమించి గుణాలంకృతం చేస్తుంది

అరణ్యాన్ని ఉత్తరించి ఊరును పొందిన మనిషి
అమాయకం నుండి నాగరకత కెదిగిన మనసు
అల్పత నుండి ఉత్తమతకు చేరే మనిషిలో
రెండింటి మేళనంతో పరిణత స్థితి చేరాలనీ

మస్తిష్కంలో మేధతో, హృదిలో స్పందనతో
మనిషి వెనకునున్న సమాజ బలాన్ని మరచి
మనసు లోని తన ఉపాయగుణాన్ని విడిచి
బలవన్మరణం "ఆత్మహత్య" ఆమోదం కానేకాదు

ఎగిరే విహగాన్ని చూచి తాను ఎగరలేననీ
కృంగిపోయి మృత్యువును తలచడం దారుణం
ఆకురాలుతుంది అంతమాత్రాన
చెట్టు బ్రతుకు వ్యర్థం కాదు
నీరు తగ్గుతుంది, అంతమాత్రాన
నది బ్రతుకు ఎడారి కాదు

## 13. హ్లాదంతో కవిత

కవిత వెడలుతుంది వశంలోని పదసేనతో
తనకు చేతనయిన వినిర్మాణ విధంలో
నచ్చిన డ్రెస్‌లో తన అవసర గమ్యం వైపు
దృష్టి భేదం భావలోకం తోనే సృజన విశేషం

సందర్భం ఏదయినా కావచ్చు
అభిలాష ఏదయినా కావచ్చు
జీవన గమనంలో వ్యక్తి స్థితియో ? సంఘ పథమో
అనుభవ దశలో! ఉద్యమాలో! విప్లవాలో!

సమయం తగిందీ, వస్తువు వలసిందీ, ప్రయోజనంతో
శుభ్రమయిన మనోరూపం! అవసరం దేనికైన
సుఖాల విధాలలో భేదాలుండవచ్చు
దుఃఖంలో అనుభవ భేదాలేవీ ఉండవు

కుసుమ శోభయే కాదు, అనల రేఖ కూడా
అక్షర సహయోగంతో జీవవంతమవుతుంది
పావురంలా వచ్చి ప్రేమతో వాలవచ్చు
పయోదంలా కదలి కరుణతో తరలవచ్చు
ప్రగతిలో పతాకలా కవితలో దార్ఢ్యనికం
ఇది సమాజ యోజనలో విశేష సంకేతం

ప్రత్యర్థికై తావులేని ఒకే ఒక విజేతగా
మానవ కథ కొంక సుందర హృదయమిస్తుంది
ఇది విజయంలో ఆరోహణతో సాగుతుంది
నిజాన్ని దాచదు; కమ్మిన పొరలను విప్పుతుంది

దుఃఖ మనగానే సెలయేరు కదలుతుంది
కళ్ళు చెమ్మగిల్లుతాయి, ఆర్ద్రతతో
మోదమనగానే జలపాతం దూకుతుంది
గుండె గంతులేస్తుంది, హ్లాదంతో
అంతరంగ మూలాన్ని స్పృశిస్తుంది కవిత
సమస్యకు కారణ బీజం కనుగొంటుంది!

# 14. గ్రీన్ సిగ్నల్

వానకో పిడుగుకో ముందస్తు మెరుపులా
కవితకు సూచనగా కవిలో సంస్పందనం

సాధారణ పౌరుల పయి ఆయుధ ప్రయోగం
వీరం కానేకాదు, మానుష మసలు కాదు
ఇది భయం నుండి క్రమించే క్రూర కర్మ
శూన్యమయిన మానవతా హృదయంలో శిలామౌఢ్యం

అద్దంలో తన వెనక నుండి కనిపించే
వేరొకరి ముఖంపై గురితో
తూటాను వదలి, సంతోషం పొందేరు,
పగిలిన ప్రతి అద్దం ముక్కలో
తన ముఖం చూచుకొని మురిసేరు
వేరొకరి ముఖం తొలగినట్లు తలచేరు!

వస్తువుల అడుగు పొరలలో ఉన్న
వాస్తవాన్ని బయటికి తీస్తుంది ! కవిత
తెలిసిన నిజాన్ని దాచదు, దాచలేదు
పైన చేరిన పొరలను తొలగిస్తుంది

లోనికి వచ్చే తలుపులు మూయబడీ
బయట ఆహ్వాన పత్రం! తగిలిస్తే? సరియా?
కిటికీ నుండి గాలిలా రావాలనా?
తన మాటను చక్కగ దక్కించుకోవాలనా?

నిశ్శబ్దాన్ని శబ్ద మయం చేస్తుంది కవిత
శూన్యంగా ఉన్న వేళను అర్థవంతం చేస్తుంది
మండే కుంపటి గుండెలో
పచ్చని తీగె లేచి ఎదిగేనా?
శబ్ద కవచంతో విపద నుండి కవిత!
బయటపడి బ్రతుకుతుందనే ! విశ్వాసం!

కోపం ద్వేషం శత్రుత పీడనల మధ్య
నలుగుతూ మండుతూ రోజులు ఈడ్చే
మనిషిలో అందంగా స్వేచ్ఛగా రూపుదిద్దుకొనే
జీవన గమ్యానికి గ్రీన్ సిగ్నెల్ కవిత!

# 15. పయనం ఆగదు

గ్రీష్మంలో తీవ్ర తాపానికి విముఖం చూపొచ్చు
శిశిర శీతానికి నిరాకరణ భావన కలగొచ్చు
వర్షంపై అభిలాష ఆశాపూర్ణం కావచ్చు
వసంతంపై రాగానికి సుముఖంగా ఉండొచ్చు

ప్రకృతిలో దశలకూ బ్రతుకులో స్థితులకూ
బింబ ప్రతిబింబ భావం! కవితలో కమనీయంగా

అతిశయోక్తి అనేది ఆజన్మ మిత్రం
అబద్ధం అనేది ఆమరణ శత్రువు
నిజం కప్పబడీ పొరలతో తెరలతో
ఇది విప్పే బాధ్యత కవిది కవితలో

మెడలో పూలదండ పడవచ్చు
చేతికి ఆయుధం చేరవచ్చు
సృజనకు వ్యతిరేకం నిస్పృహ
విపదకు మూలం నిరాశ

అభివృద్ధి వికాసం మార్పు విప్లవం సమాజంలో
చక్ర నేమి క్రమణంలో వివిధ దశలలో
అలజడి ఉద్యమం! ఎవరు కాదన్నా తప్పనివీ
వ్యక్తి నుండి సంఘానికి శూన్యంపూరించే విషయాలలో

గాలి నిలిచిపోదు, కదలుతూ పోవలసిందే
కవిత తటస్థం కాదు, శబ్దిస్తూ ఉండాలిసిందే

తేటతెల్లంగా నవ్యంగా భూమిపైకి వచ్చిన శిశువు
కాలం గడచే కొద్దీ పలు రంగులతో తీర్చబడేను
ఒకరికి నచ్చిన రంగులో కవిత అవతరించదు
ఎవరికో నచ్చని పథంలో పయనం ఆగిపోదు

బ్రతుకులో నిష్క్రమణం గుర్తించి ఆలోచన
నిరాశలో దిగులుతో విషమతకు వేగమందించడం
పైబడే ఆపదల తరంగాల్ని సరిదిద్దుకోలేని దారుణం
సంఘంలో శూన్యతను, నింపుతూంది అమానవంతో

## 16. కొన్ని బొమ్మలు

జీవం లేని బొమ్మలు! విగ్రహాలు! చిత్రాలు
మనిషి అంతరంగంతో మాట్లాడతాయి
జీవం లేనివని తెలిసే! ఎంతో శ్రద్ధను చూపేరు
నమ్మకం తీగెలా చుట్టుకొని పూలను విరిసేను

ఒంటరిగా ఉన్నప్పుడు చెట్టు పక్షితో
సంభాషణ సాగుతుంది! లోన తృప్తిగా
అటు నుండి ఇటు, ఇటు నుండి అటు
ప్రశ్నలు సమాధానాలు సాగుతాయి! నిశ్శబ్దంగా

మనిషితో మనిషి ప్రత్యక్షంగా కన్నా
పరోక్షంగా సాగేవే ఎక్కువ! సంగతులు

ప్రతి జీవన వాస్తవానికి ప్రతీకగా
ప్రయోజన పాత్రను నిర్వహిస్తుంది
ఇది బ్రతుకులో నింపాలిసిన ఖాళీలను
గురించి అవసర యత్నంలో భాగమవుతుంది

మనసుకు ఊరట తృప్తిని కలిగిస్తుంది
భవితలో ప్రణాళికకు ఆసరా అవుతుంది

మొన్న గండశిల పురాతన చరిత్రతో
నిన్న శిలా ఖండం దాని కది ప్రత్యేకతతో
నేడు శిల్ప శాలలో మానవ సంబంధంతో
మనిషిలో ఆదర్శానికి ప్రతినిధి కావచ్చు

మనిషిని వదలడం ఇల్లును వదలడం
ఊరును వదలడం అంత తేలిక పనికాదు
చిన్నతనం నుండి ఇప్పటిదాకా! ఎన్ని బాగ్‌లో
జ్ఞాపకాల బరువుతో మనసు మినీ ప్రపంచం!
పేకాటలో జాకీ జోకర్ తురుఫ్ లా బయటికి రావచ్చు
కవితలో అక్షరాల భుజాలపైకి సులభంగా
కొన్ని బరువు బొమ్మలు బదిలీ అవుతాయి
జీవవంతమయిన పాత్ర వహించడం విచిత్రం

# 17. కర్తవ్యం

మనిషి బొమ్మకాదు, విగ్రహం కాదు
మస్తిష్కంలో మేధతో, హృది స్పందనతో
హేతు కిరణంతో అనుభవ లహరితో
ప్రాణులతో సృష్టిలో, మానవ చరిత్రతో మనిషి

జీవన వాస్తవ వేదికపై అనూహ్యంగా
బొమ్మలాగ ప్రవర్తించేను సుందరంగా
విగ్రహంలా స్తంభాకృతి పొందేను
ఎవరి సూచిపైనో! కదలిక చూపేను

భూమిపై అడుగుతో మొదలైన స్వయం జీవితం
మధ్యలో వెనక్కు తిరిగి వెళ్ళడం జరగదు
వెలుతురు చీకటి వెన్నెల భేదం లేదు మనసుకు
అనుభవ చిత్రం మాత్రం మనో దర్శకంతోనే

వర్తమానం ఎప్పటికీ ముందుకే భవితలోకి
ఇది ఆగని పరిణామ క్రియా పరివర్తనం

ఏ ఆట అయినా ఎంత పెద్ద దయినా
కొన్ని పరిమితులకు కట్టుపడే జరుగుతుంది
కొన్ని నియమ నిబంధనలకు లోనయి
విశేష సందర్భాలలో ప్రత్యేకత లుండవచ్చు

రాత్రి గట్టి పడిన మంచులా కఠిన సమస్య
కిరణ వివేకంతో ప్రవాహకత పొందవచ్చు
చెలమ నుండి నది దాక దేనిని తలపించినా
కావలసిన సమయంలో దాహం తీర్చేను కవిత

అక్షర జన జగత్తులో మానవీయ ప్రవాహం
ఏ కొందరిదో కాదు అందరికీ చెందింది

స్తిమిత పదంలో పురా రూపంతో
చలన పదంలో సరికొత్త అలలతో
మనసును లాగుతుంది నిజతత్త్వం ఆకర్షణ
కటుతలో మృదుతలో కర్తవ్యం బోధిస్తుంది

# 18. స్మృతి చిత్రం

వర్తమానం నడుస్తుంది ముందుకే భవితలోకి
మనిషిని నడిపిస్తుంది పరివర్తన పథంలో
కల్పనలో భాగమైన మృత్యువు వెనక్కి తోసివేయబడి
మనిషికి నిజ రూపాన్ని బయటికి చూపించేను

జనన మెంత దృశ్యమాన మయినా వాస్తవమై
తెలియని రహస్యమపుడపుడు బయట పడేను

శిశువు గురించి కలలు! తల్లి మదిలో
ఎదిగే కొద్దీ వాస్తవ మావహిస్తుంది

కట్టే మేడకు చెట్టు అడ్డు కావచ్చు
వేసే దారికి కొండ అడ్డుకావచ్చు
విద్యుత్ తంత్రులకు కొమ్మ అడ్డు ఉండొచ్చు
ఆటంకంతో సమాజ కార్యక్రమాలేవీ ఆగవు!

భౌతిక మానస స్థాయిలలో ఇవి ఎన్ని విధాలో
అన్ని విధాలుగా మనిషి శక్తి ప్రకటితమవుతుంది

సహనం ప్రేమ కరుణ ఉదారత మానవతలు
వ్యక్తుల అస్మిత కమలానికి దళాలుగా
సమాజ పరిణామంలో భాగాలయ్యేను
ఉండి ఉండి మనసు సంస్కృతి గంధం వహించేను

రాత్రి వెన్నెలలో గగనం ఇచ్చే సంతోషం
కలలో విమాన యానంలోకి మారవచ్చు
పగలు మండే ఎండల్ని సహించలేని మనసు
కలలో ఎ.సి. గదిలో ఈద జేయవచ్చు

కష్టాలు లెక్కచేయని కంకళాలకు భయపడని
మనసులో కవిత! కొత్త ప్రపంచం దింపుతుంది

దాహంలో మనిషి మంచి నీరును కోరేను
శత్రువు నుండి నెత్తురు కోరేనా?
మిత్రుల నుండి మధువును కోరేనా?
నిన్నటి గాయం పుష్పం కాలేదు, స్మృతి చిత్రం కావచ్చు!

## 19. శ్రమ హృదయంలో

ప్రాణం ఉన్నంతవరకు బ్రతుకులు భూమిని వదలవు
వాస్తవ జీవన రుచి ఎట్లా మారినా! ఇదే ఆవాసం
అపుడపుడు తలపైకెత్తి గగనం వైపు చూచేను
కల్పనలో దివి సుందరతను తలచేను, ఆశపడేను

చినుకు కయి చూచే మట్టి కణంలా
చివురు కయి చూచే చెట్టు కొమ్మలా
సృజన కయి చూచేను కవిలో పద పదం
అలయై కలయై కవితకు నవతను తెచ్చేను

గుహ నుండి బయటికి అడుగువేస్తే
సింహంలా విప్లవ పద గతిలో,
పొదనుండి వెలుపల కదుగువేసే
పులిలా, ఉద్యమ పద గతిలో
అందబోయి దాటుతూ దూకుతూ పోయే
హరిణంలా, ఆశానవ పథంలో
చీకటి జలాలను చీలుస్తూ పోయే
వెలుతురు నావలా, జీవన గమనం!

మనసును భ్రమలో తిప్పుతుంది
వాస్తవ రేఖపైకి చేరేందుకు దారులలో
వశం తప్పినపుడు సమయం పట్టవచ్చు
ఇది సమాజ కథలో, ఉప కథ అవుతుంది

చేసిన తప్పుకు శిక్ష నుండి తప్పించుకొనే
మరో తప్పుతో సమస్య అనల రాగం వినిపిస్తూంది
బాధలో వేదనతో పశ్చాత్తాపానికి బదులుగా
ప్రతీకారం అగ్ని చిత్రం చూపిస్తుంది ప్రదర్శనలో

శిశిర మస్తకంపై వసంత ముఖం చూదాలనీ
గ్రీష్మ హృదయంలో జలపాతం స్పృశించాలనీ
మేఘ గర్జనలో సృజన రాగం వినిపించాలనీ
శ్రమ హృదయంలో సృజన బంధుత చూడాలనీ

## 20. అవకాశం

రివ్వున దూసిన బాణం ఎవ్వరి ఆనతిపైన
వెనక్కి మరలదు, కవిత కూడ అదే మోస్తరు
దశ దశలో దిశ దిశలో రణ విజయంలో
ఆ వెనకన కోల్పోయిన విభవ సంపద ఎంతో?

గెలిచిన స్థితిలో కొత్త మలుపు తప్పదు
గతంలోని అనుభవ దీపం, విషాద దృశ్యం చూపిస్తుంది
సమన్యాయం సమజీవన స్థితి సాధించే ప్రతిపాదనలో
ఎంతో కొంత విజయం పొందిన తృప్తితో సమాజం!

బావిలో నీరులా, ధర్మం, చేదలో బొక్కెన కందినంత
వారి వారి అవసరాల్ని బట్టి తోడే రొకరొకరూ

ఏ వాదానికావాదం రెండూ ఎదురు పడితే
ఏ పక్షానికాపక్షం రెండూ తీర పార్శ్వాలయితే
రెండు కత్తులు చెరొక వైపు చేరి
శత్రు శిబిర స్థానాలను తలపించేను
రెండు వత్తులు చెరొక వైపు నిలిచి
వెలుతురు తోరణ స్తంభాలను తలపించవచ్చు

ఈ యుగ చేతన పథం, భువిలో దిశదిశలో
జీవన వాస్తవాల అన్వేషణ, దార్శనిక ప్రయోజనంతో
సమస్య మూలం! ఎప్పటిదో! ఉన్న చోటునే ఉంది
పరిష్కృతిలో మాత్రం ఆకులు కొత్తవి! పూలు ఇప్పటివీ

భూమిపైకి రాగానే దాహం ఆకలి ఆశలు ఆవేగం
భౌతికం నుండి మానసం పెరిగే కొద్దీ సమస్యలు
అసమత విషమతలు సంఘాన్ని ముక్కలు చేసేను
ప్రేమ కరుణ అందరినీ ఒక చోటన చేర్చేను

దేహ బలం ధన బలం బద్ధి బలం ప్రభుత బలం
దేని పాత్ర దానిదే! దేని కదే! మారే సమాజస్థితిలో

కవితలో స్పందన కనుగుణ లయతో
నవతతో సుందర ప్రకటన గతిలో
వచనమన్న మాట అవకాశాలను సంకుచితం చేస్తుంది
స్వేచ్ఛ అన్న మాట అవకాశాలను విప్పారగ చేస్తుంది

# 21. కవితలో నిజం

వర్తమానం ముందుకే నడుస్తుంది నడిపిస్తుంది
వ్యక్తిలో బింబమయిన కవిత జన చేతనతో
సమాజ చలనానికి ఉత్తేజకరం అవుతుంది
సంకల్పానికి సాధనం అక్షరం, వైరుధ్యాలను చుడుతుంది

కళకూ నీతికి మధ్య వంతెన వంటిది కవిత
కళ్ళలో కారం చల్లి ఝుటితిగ బయట పడేది కాదు
ముఖాన దుమ్ము చిమ్మి తోసుక పోయేది కాదు
సొంత లాభాలకు పనికి వచ్చే విపణి వీథి కాదు

వివిధ మనో విధాలతో కొత్త యుగం ప్రస్తుతం
మనిషిని ఆటంకం దాటించే వేరు వేరు సాధనాలు
జీవితానికి చెరొక వైపు నుండి వేరు వేరుగా
"నిజం" "కవిత" రెండూ హృదయం వీడని పార్శ్వాలు

అందమయిన ముఖంలో వెలుగు ఎదురుగా
పూవులా విరిసి ఆంతర సౌందర్యం సూచిస్తుంది
నిందితులు పీడితులు కవుల ముందు వరసగా
సమాజ బంధంతో సమస్యలు వేలాడుతూ

గుండె వినిపించే శబ్దం, లయను పరిచయం చేస్తుంది
ఊపిరిలో ప్రాణావసరం జీవన లక్ష్యం చూపిస్తుంది

ఎదురయిన అందమైన మనసును దాటి
అలవలె సాగుతుంది మాట! కవితగా
రాత్రి ఆగమనంతో మనసులో "నిజం"
మొగలి రేకుల పరిమళంతో అంతటా
పగలు సూర్య ప్రకాశంతో "వజ్రం"లా
తెలియని స్థితిలో అన్వేషణ సాగుతూనే

ఆపదలో "అబద్ధం" ఆయుధమై వెడలవచ్చు
కవితలో "నిజం" గ్లాస్ పేటిలో రహస్యం
ఎవరి చేతిలోకి రాని అమూల్యం
పరిశోధనలో ఎవరి ఫలితం వారికి ప్రియం

## 22. జీవించే హక్కు

చేతిలో పూల గుత్తితో ఎదురుపడే మనిషినీ
బాగ్‌లో బాంబు దాచి నడచే మనిషినీ
సృజన విలయ ప్రసారాల మనో రూపాలతో
ఇరువురికీ వేదికపై ఏర్పాటు! కవితకే సాధ్యం

రచన పట్ల అభిప్రాయ భేదాలు సహజం
ఒంటరి స్థితి నుండి సమాజ రూపంలోకి
ఉన్నవి సరే! లేని గుణాలను లెక్కపెడుతూ
వాద వివాదాలతో దార్శనిక పథాలలో సమస్య!

స్మృతిలో గతం, గతిలో వర్తమానం
కల్పనలో భవిత ముందుగ తెలియనివీ

కాల మహా పరిణామంలో సంధ్యా దృశ్యం
ఒకరికి జ్వాలారుణ చిత్రమయం కావచ్చు
ఒకరికి ఎర్ర గులాబి వని కనిపించవచ్చు
ఉన్నది మన్నిస్తూనే, లేనిది దృష్టికి తేవచ్చు

ప్రకృతిలో చేతనాచేతన లెన్ని విధాలో
కవితలో భావనా రూపాలన్ని తీరులు!
అంతరంగ దర్శన ప్రతిభతో కవిత
మోసం లేని మలినం కాని నిజ రూపం

నేల రాలిన పూలు చూచి కరుణ ఒలుకుతుంది
అగ్ని నార్పే జలాలతో ఉదారత సరిస్తుంది

ఎంత ఇష్టమైనా మండే రవిని చూచేదెవరు? తదేకంగా
ఎంతో హ్లాదమైన చంద్రుని అందరూ చూచేరు ప్రియంగా
పనికి రాని వస్తువును వదిలేసి నట్లుగా
ఇష్ట పడని కవిత తిరస్కృతం కాదు!

మనిషి నడచే దారి! ప్రజ నడచిందే కావచ్చు
కవిత కదలే దారి ! స్వతంత్రమైనదే అవుతుంది

పరివారంలో ఒకటై, సమాజంలో భాగమై
జీవించే హక్కు! ప్రజాస్వామ్య హృదయంతోనే సఫలం!

# 23. ఈ లోకం వరకే

ఇంటికి బయట పక్కగా చెట్టు! పచ్చని ప్రేరణం
చిన్న నాటి నుండి తోడుగ నిలిచింది
తన చుట్టూ జరిగే వాటికి సాక్షిగ ఉంది
ఆకులు రాలే దశలో, దైన్యంలో ధైర్యంగా

విచారంతో క్రుంగదు, మౌనం వహిస్తుంది
మబ్బుల రాకతో పైనుండి మెరుపు
అణువణువున సంతోషం చెంగ లింపచేస్తుంది
దీనికి జతగా శ్రవణ ప్రియంగా గర్జ!
కదలిక లేని కొమ్మల్ని పులకితం చేస్తుంది
నమ్మకాన్ని నిలబెట్టే చెట్టు! నిరీక్షణలో మనిషికై

చినుకుతో నిన్నటి శుష్కతను వదలి
కణకణం సృజన పుటలో అక్షరమవుతూంది
తెల్లని దుస్తులతో ఉదయ మవతరిస్తుంది
మిగిలిన రాత్రి చీకటి ముక్కలు, అందంలో భాగమై

మనిషి చుట్టూ వస్తువు లెన్నో ! బ్రతుకులో
అవసరాన్ని బట్టి సందర్భం అనుసరించి
కవితలో నిలుస్తాయి మిత్ర గుణమయి!
స్థితిని బట్టి విలువలు మారడం ఉన్న విషయమే

ఉద్రేకంలో ఆలోచన సూటిగ తిన్నగ సాగదు
మలుపులు తిరగవచ్చు, పాయలుగా చీలవచ్చు
తెలివికి పని కల్పిస్తుంది; ఉన్న కాస్త అవకాశంలో,
జన హిత మొకటే లక్ష్యం కవితకు ప్రజాస్వామ్యంలో

ఇంటి చుట్టూ సమాజ నిర్మాణ ప్రపంచం
శ్రమ జీవన రూపం! కవితకు ప్రేరణయై
ఒక విశేష వాతావరణం!
నిలిచిన చెట్టుతో! నడచే మనుషులతో
మట్టి నుండి మొక్క వరకు
మొక్క నుండి మనిషి దాక
జీవిత మొక సుందర ప్రస్థానం
కష్టంలో నష్టంలో ఈ లోకం వరకే మితం!

## 24. అభాగ్యం

కాలం ఆగదు, జీవితం నిలవదు
కవిత! ఉన్న స్థితిలో, సుందర మనోమయం
వాస్తవ జీవన రుచి పొందుతుంది
కాలాన్ని మరపిస్తుంది అక్షర ప్రపంచం

ఉత్సాహం నింపుతుంది అణువణువున తనువులో
వివేకం పండిస్తుంది ప్రతి మనిషి మస్తిష్కంలో

కొత్త డైరి పుటలలో అనుభవ దృశ్యాలు
తనదయిన వస్తువుతో విలువలతో కవిత
వర్తమాన స్థితిలో సాధారణ వ్యక్తి మనసు
సంక్షుబ్ధ సమాజంలో సంశ్లిష్ట భావ జగతి
మారే రాజకీయ సాంఘిక నైతిక కోణాలతో
పిడుగుల బాంబుల కత్తుల నిలువలతో మానసికం

నిశ్శబ్దంలో సుఖ స్వరం వినాలని ఉంటుంది
శూన్యంలో నృత్య విశేషం చూడాలని ఉంటుంది
కోరిక నెరవేరేనా? ఏ స్థాయిలో ? ఎంతగా
తిరిగే సమాజ చక్రం నలువైపుల కఠోరాలు
హింసలో బాధా రుణ ముఖాలు
విపదలో తపనలో దీన శోక స్వరాలు

కాలం ఆగదు, ఎవరి అధీనం కాదు
అద్దం వలె మనిషికి తన ముఖం చూపిస్తుంది
దీర్ఘమైన గోడ వలె సాగే ఆలోచనకు
మధ్యమధ్య దారులు తలుపులు అవసరం ఎప్పటికీ
ఇది స్వేచ్ఛా సంకల్ప రూపానికి సంకేతం
ఇది ప్రజాస్వామ్య భావనలో మౌలిక సూత్రం

సుదీర్ఘ చరిత్రలో సువిశాల సంస్కృతిలో
గోడ దాటి బయట పడిన మనిషి అవసరాలలో
ఏ బోనులోనో పంజరంలోనో బంధనలోనో
తెలిసో తెలియకో చిక్కడ మొక అభాగ్య కళంకం

# 25. అడుగు నుండి

వెలుపల లోపల అతీత స్థాయి భేదాలలో
కవిత ప్రవృత్తమవుతుంది కళామయంగా
సృజన ప్రతిభతో చేతన వశమవుతుంది

నేలపై మనిషిని ఆవహించి నడిపిస్తుంది
నింగి లోన ఊహను ఎగురగ చేస్తుంది
జలధి లోన అనుభవాన్ని ఈదగ చేస్తుంది

కవితలో సమాజ బంధం ఎప్పటికీ
మానవం ఆర్థికం వర్తక విశేషం
సమాజ చరిత్ర నిర్మితికి ఆకరమైంది
మానస హ్లాదానికి అక్షర సుందరమైంది

మనిషి కోసం మనిషిలో ఆరాటం స్నేహమయం
మనిషి నుండి మనిషిలో భేదంలో ఉద్వేజం
ఇరు వైపుల రాక పోకలతో జీవితం
అందరికీ తెలిసిదే, తెలియనట్లు జరుగుతుంది

నీతి నిజం సమత న్యాయం మంచి చెడు
చేతిలో అలలవలె పిడికిలిలో నీరులా జారేను
ఎప్పటివో ఈ మాటలు! ఎన్ని మార్పులలోనో
ఇప్పటికీ పెదవులపై ఆడుతూ బ్రతుకును ఆడించేను

ఇంటిముందు దారి పక్కన చెట్టు
అందరినీ అడుగుతుంది మౌన భాషలో
తన కెవరు నీరు పోసి పెంచి పెద్దగ చేసారని
తానో! ఎండలో ప్రజలకు చల్లని నీడను ప్రసాదిస్తుంది

తన తలపై ఎండకు గొడుగు ఎవరు పట్టేరనీ
తనకెవ్వరి కరుణ ఉదారతతో తల ఎత్తగ చేస్తుందని

భూమితో నింగితో కవితకు సంబంధం ఎంతో
శబ్దం అర్థం మధ్యలో క్షితిజం పలు రంగులలో
అడుగు నుండి శిరసు దాక మానవం
తిప్పుతుంది పరిచయాలతో వివిధ స్థితులలో

# 26. కొత్త సమయం కొత్త దృశ్యం

సమయ సమయం జీవన దృశ్యాలతో కవిత
ఇది నవ యుగం, మానవ వాద మనో మయం
ప్రతి కవి తన స్వతంత్రమైన అన్వేషణలో
జన జీవన భాగ్యం కోరే అభిలాషతో

వాస్తవంతో కొంత కల్పన
చేరిన మిశ్రమ మనోజ్ఞ రూపం
దార్శనికం పని ! ఒక అపూర్వ లక్ష్యంతో
సమాజ గమనానికి దారి చూపడమే

సమాజ ప్రవాహ తీరాన నిలబడి
తానొక అలయై కదలే ఆలోచనతో,
పైన కదలే మబ్బులతో కలిసి
భూమిపై చూపుతో నడచే కోరికతో,
ఎవరి అవసర సందర్భాన్ని బట్టి
వారికి అక్షర మొక వాహన సాధనం

ప్రకృతిలో దేని స్థానంలో రూపంలో అది
గిరి నది తరు స్థాయిలలో వస్తువులు
పూవు నేల రాలుతుంది
అదే రూపం రంగు పరిమళంతో
కొత్త పూవు చేరుతుంది
అనుభవ సూక్ష్మతల్ని బట్టి ప్రయోజనం

మనిషి మనిషికీ సమాజ స్థానం మారుతుంది
బ్రతుకు బ్రతుకులో సమయ సమయం కొత్త దృశ్యం!

అడవిలో హఠాత్తుగా ఎదురయిన ఘర్షణలో
జారిన నెత్తురు చుక్కలో
రవి కిరణ శకలం ఉదయిస్తుంది
వేడిగా వాడిగా ప్రతీకార చర్యకు
సిద్ధమయిన మరో ముఖం! ప్రతిఫలిస్తుంది

తెలియని సందర్భాల పరిచయాలతో కవిత
సమాజ స్థితి చింతనను విశాలతరం చేస్తుంది
కొత్త సమయం కొత్త దృశ్యంతో కవిత
స్వేచ్ఛలో సృజన రూపం! నవయుగ హృదయంతో

# 27. అగ్నిలో కరుణ

ఆటలో చేతి కందే ప్లేయింగ్ కార్డులతో
ఆలోచన చేసే మనుషుల ముఖాలలో
గెలుపు ఓటమి రంగులు దోబూచులాడేను
సమయ సమయం ఒక దాని నొకటి అతిక్రమించేను

పల్లె నుండి పట్టణానికి చేరే సరికి
ముఖాలలో కొత్త బొమ్మలు ప్రవేశిస్తాయి
నడిచే దారిలో వరసగా వీధిలో
ఇంటి ముంగిలి ఆవరణాలు సయితం
విపణి శాలలుగా మారేను
లాభసాటి దృష్టిని పెంచేను

ప్రతి కవిలో కవిత! పొరలలో
లౌకికం మనోమయం దార్శనికం అతీతం
ఎపుడేది చోటు చేసుకునేది తెలియదు
సాధారణం నుండి విశేషం వరకు వ్యాప్తమై

వేరు వేరు బహుపాత్రల సహకారంతో కవిత
ఎవరి అనుభవ ప్రపంచం వారిది ప్రత్యేకం

నీతి న్యాయం సత్యం ధర్మం దూది మూటల్లా
భుజాలపై! బరువుగ అనిపించని స్థితులలో
గాలి వీచి ఎగిరి తేలిపోవడం జరుగుతుంది
కళా రూపాలతో అలంకృత మయిన చరిత్ర
హింసతో రక్త చిత్రాలతో నిండడం! విచిత్రం
బ్రతుక్కి కావలసిన అవసరాలెన్నో, అన్ని ఉపయోగాలతో

గాలి వీస్తుంది సెమ్మెపై వెలిగే అవసర దీపంలో
తట్టుకునే శక్తిని పరీక్షకు నిలిపినట్లు ఉంటుంది

కవితలో అనుభవ సాంద్రతలో భేదాలెన్నో
సముద్రజలం చెలియలి కట్టను దాటేనా? అనిపించేను
చంద్ర బింబం అమ్మ ఒడిలో జారిపడేనా? అనిపించేను
అగ్నిలో కరుణ, బూది పొరలుగా మారేనా? అనిపించేను

# 28. మనిషిలో మానవం

రాత్రి చీకట్లను వెలుతురు ముక్కలు చేస్తే
ఉదయమయ్యే సరికి అన్నీ కలిసి మాయమవుతాయి
సమాచార పంక్తులు కవిత కాదు
విస్తరణ రూపాలు కవిత కాదు

సంగీతాన్ని పల్లకిలా వహించిన పవనం
ఉద్యమ నినాదాన్ని బుజాలపై మోస్తుంది

శబ్దం చకిత సుందరంగా ఎగిరితే
నదిలో అలలుగ ముందుకు వెళితే
అరచేయిలో ఆకాశం దిగినట్లు అనిపిస్తే
నిండిన చెరువులో తబకలాడే నీరులా
ఉత్సాహం ఊగి ఊగి దాట చూస్తే
కవితలో వికసించిన వాస్తవ పద్మం
ఆయుధాన్ని పక్కకు పెడుతుంది
శత్రుతలోను పరిమళాన్ని కోల్పోదు

మూసిన గది తలుపులు తెరవడమే కాదు
తెరచిన కిటికీ కర్టన్ ప్రక్కకు జరపడమే కాదు
లోనుండి మనిషి! స్వేచ్ఛగా బయటికి రావాలి
సమాజ వీధులలో స్వతంత్రాన్ని అనుభవించాలి

తూటా గాయం స్థానంలో గులాబి పుష్పం చేరేనా?
పేదరికం ఆకలి అలజడి నినాదాలు ఇప్పటికీ
ఎప్పటివో? వేళ్ళు పాతుకొనీ నిలిచే ఉన్నాయి
ప్రాచీన బంధుతను తెర పైకి తెచ్చేను

ప్రజాస్వామ్య దార్శనికం! వికసించే పద్మం రేకులు
శీర్ణమై క్షతమై పౌరులలో ఆందోళన కలిగించేను
మనిషిలో మానవం! అడుగంటి మాయమయ్యేను
ఇది మళ్ళీ తప్పకుండ కనిపిస్తుందనే విశ్వాసం

శబ్దంలో వినిపిస్తుంది, మనిషి స్వరం
అర్థంలో ధ్వనిస్తుంది, జనత ఘోష
హాహా కారాలతో చరిత్ర పుటల శబ్దం
భావనలో కవితయై సమాజ హితమవుతూంది

స్వేచ్ఛా కవిత్వం - 100

# ఏది కవిత

(3)

మూడో భాగం

# మార్పుకు సిగ్నల్

మాదిరాజు రంగారావు



2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**SVECCHA KAVITHVAM 100**

**EDI KAVITHA**

**Part III**

Maarpuku Signal

Free Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

***Presented to***
***Dr. M. Santhosh Kumar***
***on his Birthday***
***with blessings***

# పీఠిక

"ఏది కవిత" దీర్ఘ కవితలో మూడో భాగం స్వేచ్ఛా కవిత్వంలో నూరవది. ఈ సాహిత్యయానంలో 1952లో "స్వతంత్ర" పత్రికలో గోరాశాస్త్రి సంపాదకత్వంలో ప్రచురితమయిన "విషాద ప్రవంతి" తో మొదలైంది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక పథంలో సాగింది.

ఇందులో కవిత్వ విషయం కేంద్రంగా ఉంది. రచన అనుభవ శీలతను కలిగింది. భావ రూపాలు వర్తమాన స్థితిగతుల సూచనతో కళాత్మకతను పొందాయి (1) సమాజం (2) ప్రకృతి (3) మనో రూపం మూడు స్థాయిల్లో నిర్వహణం దృష్టికి వస్తుంది.

ఇక విషయానికి వస్తే మనం దైనందిన వార్తల్లో వినేవే చూచేవే. ఇందులో వస్తువు అంటే వర్తమాన కాలంలోని జీవితం అన్నమాట. ఇది కవిత్వ పరంగా ఆలోచన అనుభూతితో యోజిత మయింది. ఈ విధంగా ప్రత్యేకతతో "ఏది కవిత" భేదిస్తూంది. ఈ విధానం కొంచెం క్లిష్టమయిందే. కాని కళాత్మకంగా అవసరమైంది. అక్కడక్కడా ఇది సూచితమయింది. స్పష్టంగా కనిపిస్తుంది. స్వేచ్ఛా కవిత్వం విషయంలో అనుసరించిన పద్ధతి వస్తు నిర్వహణంలో అవలంబించడం జరిగింది. వర్తమాన కాలంలోని సామాజిక రాజకీయ ఆర్థిక మనస్తత్వపరమయిన కోణాల్ని స్పృశిస్తూ విషయం సూత్రాకృతి పొందింది. ఆకృతి అన్నమాట మూర్తమైన గుణాన్ని భావింప చేస్తుంది. విషయాన్ని కవిత్వంగా రూపొందించడంలో భావ రూపాలు (Images) ప్రతీకలు (Symbols) మనస్తత్వ విశ్లేషణం అంతరంగ స్ఫూర్తి సహాయపడినాయి.

దీనికిది ప్రత్యేకంగా ఉండాలనే దృష్టితో ఇప్పుడు వస్తూన్న కవిత్వానికి భిన్నమైన అస్తిత్వాన్ని అపేక్షించి అనుసరించడం జరిగింది. అసలు ఈ శీర్షిక 1) సైద్ధాంతికం (Theoritical) 2) అనుభవాత్మకం (Self experience) రెండు దిశల్లో కలిపి సమాలోచనానికి తగింది. సాహిత్య విమర్శలో బాగా ఉపకరించే మూలం. ఈ భావజాలాన్ని కవిత్వంగా పరిణమింప చేయడం ఒక సత్ప్రయత్నం.

సృజన చేతనలో ఏ కవియైనా సాహిత్య చరిత్రలో నిలిచేది ఏదో ఒక ప్రత్యేకతతోనే, విశిష్టమైన అస్తిత తోనే. విశేషమైన భావజగంతోనే. కవితా ప్రియులకు అనుభవ సుందరతను ఆలోచనా ప్రకాశాన్ని మనసుకు తలపింప చేసేదిగానే. ఇక సమాజ ప్రయోజనంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత లక్ష్యంగా రూపొందింది. ఈ ఆప్త వాక్యం "ఏదీ కవిత" అన్న కృతికి తలుపులు తెరచి స్వాగతం పలుకుతూంది. ఇది "సంక్షుబ్ధ స్థితి" చిత్రణంతో పాటు ఆశాపూర్ణమైన నిర్మాణ స్థితి సూచన కలిగింది. దీనికి మార్పు అనివార్యం. ఇదే కవిత ఉద్దేశం

**మాదిరాజు రంగారావు**

## 1.

బయట శబ్ద ప్రపంచంతో సంరంభం
లోన భావ జగంతో కవి రూపం
బాష్ప కణంలో నిప్పు కణం మెరిస్తే
ఉద్యమ గాథలో భాగమవుతుంది

బాష్ప లవంలో మంచు మొగ్గ విరిస్తే
చేతనలో సృజన ముఖం చూపుతుంది
గభీరమైన నిశ్శబ్ద స్థితుల నుండి కవిత
మొలకెత్త వచ్చు, ధునియై సరించ వచ్చు

శూన్య మనిపించినా ఆశా స్పందనలో ఆలోచన
ఎగుడు దిగుడు బ్రతుకులో నిలబడ చేస్తుంది
కొమ్మ నుండి రాలిన ఆకు స్థానంలో
కొత్త చివురు జీవ శక్తిని ప్రకటిస్తుంది

ఏదో ఒక ఉనికి పరిధి పరిమితిలో ఉన్న
కవిత! వాస్తవ పథాన విశ్వమయమవుతుంది
దశలు దశలుగా నిరతం పరీక్షలకు గురి అయి
కాలాన్ని జయించే అమర శక్తి పొందుతుంది

ఆశల అల్లికలో వ్యూహ రచనతో అక్షరం
పల్లె నుండి పట్టణం బ్రతుకుల్ని స్పృశిస్తుంది
ముఖాన చిరునవ్వు చీకటిని వెలిగిస్తుంది
ఎదలో ప్రేమ! వెలుగులో నడిపిస్తుంది

గిరి శిఖం పై నిలిచిన శిల కన్నా
పైన మబ్బు తోనే జనతకు ఉపయోగం
చెరువు చెట్టు ప్రాణి మధ్య మనిషిలో
ఆశా చక్రం! తిరుగుతుంది తిప్పుతుంది

పయనంలో సిగ్నెల్ పాత్ర వహిస్తుంది కవిత
అక్షర ప్రియులతో కవిత మాటలాడుతుంది
ఏ క్షణానికాక్షణం సృజనలో చేతన
గమ్యానికి చేర్చేందుకు సిద్ధంగా ఉంటుంది

## 2.

కవిత ప్రభావం ఉల్లాసమొ! వేదనయొ
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసర మైన అనుభవ సుందర రూపం

అడవి ఊరు వ్యక్తి సమాజాల ప్రమేయంతో
ఇది మృత్యువు నెరగని సృజన భావ కళాకృతి ।
ఉండేందుకు ఎంత కావాలి? బ్రతికేందుకు ఏమి కావాలి?
తలకు మించిన ఆలోచనతో క్రియా పథంలో మనిషి

ఏలేందుకు విశాల భూమిపై దృష్టి
ఎదిగేందుకు మహదవకాశంపై కోరిక ।
ఏ మనిషి ఏ స్థితిలోను బొమ్మ కాదు
సజీవ మయిన రూపంతో ఆశా బింబం

ఎవరికి వారు తమ వెనక సూక్ష్మమైన భూమికతో
ఎప్పటికప్పుడు మారే వర్తమాన జీవన గమనంలో

సాయం వేళ వాలి పోయే కిరణంలో దిగులు
నిశా విరామంలో చుక్కలలో మెరసే కలలు
ప్రభాత సమయంలో దూకే కిరణంలో ఉత్సాహం
తెల్లని మెలకువలో చుట్టు పచ్చదనం వాస్తవం

ప్రకృతితో విడదీయ రాని అనుబంధంతో
జలధి నుండి భూమికి చేరినట్లు ఉంటుంది
జీవన గమనంలో ఏ దిశ మితం కాదు
భ్రమలకు తావులేని సమాజ దర్శనం కవిత

గుహ నుండి బయటికి వచ్చిన సింహంలా
ఆకలితో మనస్సు, ఎంతటి అవసరంలోను
హింసకు తలపడే అవకాశం పొందరాదు
తృప్తికి మేరలు జన హిత మానవ సంస్కృతితో

మనిషిలో అమేయ శక్తిని గుర్తించడంతో
సంఘానికి పనికొచ్చే వర్తన కూడా ముఖ్యం

# 3.

కవిత సమాహితం కావడ మంటే కళాకృతి పొందడం
ముందుగ బంధనల నుండి ముక్తం కావడం
చుట్టూ తీర్చిన గోడల నుండి కంచెల నుండి
బయటికి దారు లేర్పడితేనే సాధ్యం

దార్శనికంలో వెలుగు రవి ప్రభుతను పొందుతుంది
సమాజ బంధుత విశ్వమయాకృతి పొందుతుంది
మొక్కతో ప్రాణితో ఆపై జన పరిచయ గంధంతో
వ్యక్తిలో వికాస మతికి విపులత చేకూరుతుంది

మట్టిలో చల్లిన విత్తుల వలె ఈహలు
నీరు గాలి వెలుగు స్పర్శతో
ఆకుల కదలికలతో కవిత వాస్తవం
పూవు ఫలం పచ్చదనంతోనే పరితృప్తి!

అర్థమవని మాటలతో శిశువు హ్లాదాన్ని నింపుతుంది
తన భవిత గురించి విత్తు
మట్టితో మాట్లాడు తుంది!
కవి తనలో మరో మనిషితో మాట్లాడేను.

పొలం కర్షకునితో మాటలాడుతుంది
యంత్రం కార్మికునితో మాటలాడుతుంది
జలదం మొక్కతో మనిషితో ముచ్చటిస్తుంది
కవిత! మాటలాడుతుంది జన హృదయంతో

సమయం కదలుతుంది ప్రశ్నల్ని వదలుతూ పోతుంది
జవాబు రావలసింది మనుషుల ఆచరణం నుండే।
కోరిక చివురిస్తేనే । పూవు ఫలం నీడ ।
శ్రమ చక్రం తిరిగితేనే । జీవన గమనం

ఊరటతో ఉపేక్షతో బాధలు తొలగవు
మాటలతో పాటలతో గాయం మానదు
బాష్ప బిందు రూపాలన్ని ఒకే మోస్తరు
ఖేదమొ ! మోదమొ! తెలిసేది వాలకంతోనే

# 4.

కవిత వెడలు తుంది మానస సంస్పందనతో
నదిలో తేలే రవి బింబంలా వెలుగుతుంది
పలు రంగుల కలయికతో కిర్మీర రూపం
అంత వరకు ఎరగని సృజన దృశ్యం చూపేను

తలచి తలచి వేచి వేచి ఉన్నప్పుడు హఠాత్తుగా
కనిపించే ఇంద్ర ధనుసు అందని స్వర్గ ద్వారం
దాహంలో జలదం ఎవరికి అందని చలి వేంద్రం
రెండూ మనిషిలో చాచిన ఆశాకరాలుగా నిలిచేను

ఏ రోజూ ప్రాణాని కవసర మయిన ఆహారం
లేమిలో ఒకరు క్రుంగి కృశించడం బాధావాహం
ప్రతి వ్యక్తికి సాధారణ జీవన స్థాయిని
కలగ జేయడం । పాలకుల కనీస కర్తవ్యం
ఇది ఉత్తమ శ్రేణిలోని సమాజ సంస్కృతి చిహ్నం
దీని నందుకునే ఆలోచన ఎప్పటిదో? ఇప్పటికీ సాగుతూంది

రాత్రివేళ నింగిలో లెక్కలేని చుక్కలు
బాధితుల అశ్రు బిందువులను తలపించేను
ఎందరికో చేరిన చీకటి ఉనికిని చూపేను
కొందరికి చీకటి వదలిన వెలుగును చూపేను

సమాజ సందర్భంలో ఇరువైపుల నుండి కవిత
ఉదగ్ర చర్యలా భయదమయిన పిడుగులతో
హ్లాద భావ క్రియలా చకితమైన మెరుపులతో
ప్రాణదాత మేఘంలా రెండిటికీ నిలయమైంది

దార్శనికంలో హృదయాన్ని వదలి స్వేచ్ఛ పేరుతో
ఆయుధాల ప్రయోగం అనైతికం, అమానుషం
ఎంతటి అవసరంలోను పరిష్కార సూచి కాదు
వాద వివాద మేదయినా ! పోయిన ప్రాణం తిరిగిరాదు
రేఖ కవతల ఉన్న వారిని తుడిచేసే చర్యలు
వ్యక్తిలో కనీస స్థాయిలో మానవతకు గొడ్డలి పెట్టు.

# 5.

మూసిన పిడికిలి నుండి దూకేందుకు సిద్ధంగా ఉన్న
హక్కులతో యువ గణం కదులుతూంది వీధులలో
దీనికి సమాధానం! లాఠీకాదు। ఆయుధం కాదు
ఈ మాత్రం తెలియని వారు లేరు అయినా జరుగుతుంది

నిప్పులు చెరగుతూ కొందరు కోర్కెలు నినదించేరు
బకెట్‌లో నీరుతో కొందరు వెనకనే వచ్చేరు
ఈ సమస్య నెవరు పరిష్కరించగలరు
మానవతా జలద మనోమయులకే సాధ్యం!

సమకాలీనావరణంలో కవిత సమాజంలో
సమస్య లెన్ని విధాలో! అన్ని తీరులలో
ఆలోచన కొన్ని అంగుళాల ఎత్తులో
మట్టి పాత్రలో అవకాశ విశాలతలతో

భగ్న మయిన స్థితి నుండి భాగ్యం పై కల్పనతో
దగ్ధ మయిన దృశ్యంలో పచ్చదనంపై ఆశతో
కోల్పోయిన విలువల స్థానంలో కొత్తవి
రావడ మనేది! నిర్మాణ భావ బలంతోనే

వర్తమాన గాథలో తెల్లని శాంతి కపోతం
తప్పిన ప్రాణంతో తగిలిన గాయంతో ఎగురుతూంది
వెళ్ళే దారిన భూమిపై ఎర్రని చుక్కల్ని వదలుతూ
నేలపై ఎగసే దుమ్ములో కనుమరుగవుతూ
పొగ చూరిన రెక్కలతో ! ఆశను నిలుపుతూంది.

కవితలో దార్శనికం ! జన హిత లక్ష్యంగా
కాలానికతతమైన కళాత్మక బంధంతో
పయనంలో మనుషుల జీవన పరిచయాలతో
ముక్కలైన కాలాన్ని ఒక చోట చేర్చి చూపేను!

చలిలో దేహం కోష్ణ స్పర్శ కోరుతుంది
తాపంలో మనస్సు శీత వీచి కోరుతుంది
కవితలో ప్రవేశించని ఆలోచన లేదు
సృజన చేతన కందని సమాజ స్థితి లేదు.

# 6.

పయనంలో రైలో బస్ విమానమో
పక్క సీటులోనో ఎదురు సీటులోనో
ఎవరు ఎపుడు కూర్చొనేదీ తెలియదు
ఇది తత్కాలంలో విశేషమైన అనుభవం
నీతి వంతులు ఉదారులు హంతకులు నేరస్థులు
వివిధ శ్రేణులలో పలు స్థాయిలలో! మనుషులు!
నివురు కప్పిన నిప్పు కణికలు కావచ్చు
మంచు ముసుగులో ఆకో పూవో కావచ్చు

తాము దిగే చోటు రాగానే
ఎవరికి వారు వెళ్ళి పోవడం తప్పదు
ఆ పరిమిత సమయంలో మానవం
అనుభవంలో స్మృతి చిత్రమై నిలవచ్చు

మనిషిలో ఇరు పాత్రలు
బయటి కొకటి లోన మరొకటి
ఒకటి భూమిపై దృష్టితో బ్రతుకుకై
మరొకటి నింగిపై ఊహతో ఆశతో

ధన బలంతో కొన్ని సాధించవచ్చు
అధికారం అండతో కొన్ని పొందవచ్చు
నిపుణతతో కొన్ని వశం కావచ్చు
తగిన పాత్ర లభించడం సులభం కాదు
ఎన్ని కలిసి వస్తేనో ప్రదర్శనలో విజయం
అన్ని కలిసిన మిశ్రమ సంచయం జీవితం!

శూన్యమైన గగనంలో మబ్బుల ఆగమనం
కొత్త కాదు, అప్పటి అవసరం నవ్యత నిస్తుంది
చినుకుల కయి తాపంతో దీనంగా
చూచే భూమిపై సమన్యాయం జరిగేనా?

పెట్టెలో పట్టు దుస్తుల మధ్య మొగలి రేకులవలె
అనుభవ సుందరమై పరిమళ సంకేతంతో కవిత!

# 7.

ఒడ్డు నుండి ఆవలి ఒడ్డుకు పయనంలో
ఇరు వైపులను కలుపుతుంది కవిత ప్రియంగా
వంతెన వలె ఉపకరిస్తుంది స్నేహ సుందరంగా
ఒక దిశ నుండి పలు దిశలకు ప్రసరించే
వెలుతురు! మనిషికి సన్మిత్రంలా తోడ్పడేను
ఒక పాత్రతో మరో పాత్రను కలుపుతుంది
అవసరానికో ఆనందానికో దృశ్యం చూపిస్తుంది
"సత్యం వద" నుండి "జీసెస్ వెప్ట్" దాక దార్శనిక ప్రభతో

భూమి నీరు గాలి తేజం తో ప్రపంచం వలె
శబ్దం అర్థం భావం దార్శనికంతో పూర్ణమైంది
కవిత! వివిధ విషయ సహరూపం!
సమాజాన్ని బింబించే అక్షర దర్పణం

తన చుట్టు లేనివి ఉన్నవి అనుకోవడం
ఒక కల్పనలో స్వప్నంలోనే సాధ్యం
తన చుట్టు ఉన్నవి లేవని అనుకోవడం
తన అస్తితను మరచిపోవడమే.

స్మృతి నిలయం చేరిన అనుభవ రూపాలను
తొలగించడమసంభవం, ఖాళీ చేయడమశక్యం

తనకెవరూ లేరను కోవడం నిరాశలో కల్పనయే
ఈ భ్రమావరణం నుండి బయటపడ చేస్తుంది కవిత!

సహనంలో అశ్రువు పచ్చదనానికి కారణమవుతుంది
కోపంలో అశ్రువు! దహనానికి హేతువు అవుతుంది
కవితకు మూల వస్తువు వాస్తవ జీవితం
కవిలో స్వేచ్ఛ కొత్తదనానికి దారి తీస్తుంది

అద్దంలో సూర్యుని బింబంలా లోన అంతరంగం
కొత్త సృజన ప్రపంచానికి అవకాశం కల్పిస్తుంది
నాగలి భూమిపై పంటకు తొలి కృషి సాధనం
కవిత! జీవితంలో పరిణత స్థితికి కారణం

## 8.

ప్రతి పతాక భిన్నమైన ఆదర్శానికి చిహ్నం
ప్రతి వాదం కొత్తదైన దృక్ కోణానికి సూచన
సంఘంలో జన సంస్కృతి వికసించే కొద్దీ
నిరంకుశం శిథిల దృశ్య మయ మవుతుంది.

ఆయుధాన్ని ఆశ్రయించని రాజ్య మెక్కడుంది
దీని అవసరం లేని స్థితి! శాంతికి ప్రియ పీఠం
మనిషికి భద్రతలో రక్షణలో తప్పని సాధనం
ప్రజా స్వామ్య దశలో విలువలు కాపాడే అభయం

పిడుగు భయదమైంది, ధ్వంసం చేస్తుంది
కత్తి గాయ పరుస్తుంది, ముక్కలు చేస్తుంది
తుపాను బీభత్స దృశ్యాలను ప్రదర్శిస్తుంది
వరద ఉన్నదాన్ని మలిన పరుస్తుంది ముంచుతుంది

రణరంగంలో కవిత శ్రేయో పాత్ర వహిస్తుంది
ఖడ్గం అయ్యే కన్నా ఇది ప్రజలకు
సుమ గుచ్ఛం కావడమే, ఇష్టం!
మంచితో చెడుతో కాలానికి సంబంధంలేదు

వ్యక్తి పరిధిలో తన వరకు మితమయింది
సంఘ పరిధిలో మనసు విశ్వమవుతుంది

ఆకు రాలితే చెట్టు చింతించదు
క్రుంగి పోదు, వాలిపోదు,
నీడను పూర్తిగ దూరం చేయదు
కొత్త దానికై నిరీక్షణలో గడుపుతుంది
వాన జల్లుతో పూర్వ విభవానికి చేరుతుంది
కవితతో మనిషి మనసు పునర్జవం పొందుతుంది

చీకటి ఏకాంతానికి ఆశ్రయమవుతుంది
వెలుతురు వ్యక్తులను సమాజపరం చేస్తుంది
సరసిలో పడవలా పొలంలో పంటలా
అక్షరంలో కవిత! బ్రతుకులో అమూల్య నిధియై

## 9.

ప్రపంచ ద్వారం తలుపులు తెరచినపుడే
కవితకు విశాలావకాశం బయటి ప్రపంచంతో
లక్ష్యంలో తదేకం తల్లీనం తన్మయం తోనే
సృజనకు గభీరత విశాలతతో ప్రవాహకత సిద్ధించేను

మట్టి నుండి మొక్కలా
మబ్బు నుండి వానలా
లోక సాక్షి నుండి కిరణంలా
కవిత! సమాజ దర్శనంతో

జీవ శక్తిలో ఆర్ద్రత తేజంతో
విరాణ్మయమవుతుంది ఆశయం
మనిషి కృతికి తగిన గౌరవంతో
చరిత్రలో యశోరూపం! మిగులుతుంది

అడవి అయినా ఊరు అయినా నగరమయినా
చినుకుతో మట్టి నుండి సృజన గంధం!
మనిషికి తనలో గుణ సంపదను గుర్తు చేస్తుంది
వేరు నుండి ప్రాణి ఆపై మనిషి దాక
దేని మూల గుణం దానిదే! వేరు వేరుగ
వైవిధ్యానికి కారణమైంది స్వతంత్ర రూపం

ముఖ ద్వారం తలుపులు తెరవబడీ
పెదవి గడప దాటి మాట! వినిపిస్తుంది

చెట్టు నీడ నెవరూ! వెదక నక్కరలేదు
మనిషి నీడ నెవరూ! తుడిచి వేయలేరు
గుండెపై రాయిలా ఉన్న సమస్య
నైతిక స్పర్శతో దూదిలా పైకెగురుతుంది

కాలం కలిసి రావడమంటూ ఉండదు
కాలంలో ఇమిడి మనిషి గడపడ మొకటే!
వ్యక్తిలో వివేకం పరిణతిలో గొప్పగ కనిపిస్తుంది
యశో గ్రంథంలో పుటలు శూన్యం కావు; కవితామయాలు

## 10.

ఉద్యమంలో ఆదర్శం ఆచరణను కోరుతుంది
ఆ పనిలో సాహసానికి పదును పెడుతుంది
ఇష్టమైన అభిలాషకు మెరుపులు కూరుస్తుంది
దిశా భేదం లేకుండా జనతను నడిపిస్తుంది

లోతు తెలియని జలధి వలె కవిత
ఆశా బంధం అగాధంలోకి లాగుతుంది

మార్పును కోరే గళం నుండి నినాదాలు
వేదన నిరసన రెక్కలపై పక్షిలా! మనస్సు

అన్యాయం అణచివేతకు అనల పథం చూపిస్తుంది
అక్షర వాహనంపై కవిత! దూర దూరం పయనిస్తుంది
ఉదయం క్షణాల్ని లేగ దూడల్లా గంతులేయిస్తుంది
మనిషిపై మనిషి నమ్మకంతో నవ సమాజం మొదలవుతుంది

సాయం క్షణాలలో విషాద చాయ నిండుతుంది
ఉభయ సంధ్యలకు కవిత! వేదిక అవుతుంది
సమాజంలో శ్రమచే కృషి ఫలం కొందరిదై
ఇంటి ముందు భిక్షువును నిలువ జేస్తుంది

గుడిసె నుండి మేడ వరకు
సగటు అవసరా లొకటే
ఏ కవి అయినా ఎత్తుతో లోతుతో ఆలోచన
అనుభవ రేఖలతో కవితకు ఆకృతి నిస్తుంది
జీవన రంగంలో వాస్తవ తలంపై
ప్రేమను పంచుతుంది! క్రోధాన్ని మరపిస్తుంది

అభిమానం అవమానం ఉపకారం అపకారం
అవే సంపదగా! సంచిలో సర్దుకునేరు
స్పందమాన హృదయంతో పయనించే కవి నుండి
లభించేది! అక్షర నిలయంలో జీవితం
నెత్తురు చుక్కలు జారితే
అనల కణాలను చల్లితే
సమస్య తీరేననుకోవడం భ్రమయే
దేశం పట్ల భక్తితో జనత పట్ల రక్తితో కవిత!

## 11.

నిశా ముఖం వెన్నెల కయి ఎదురు చూస్తుంది
మనిషి కళ్ళు దీపం కయి తపన చెందేను
క్రమ్మిన చీకటి పొందే బాధను తెలుపుతుంది
వెలిగే దీపంతో పొందే శమనం ఎంతో!

గడ్డ కట్టిన భయ రాసుల్ని నిలువునా
ఛిన్నం చేసి దూర దూరం విసరుతుంది
రాత్రిలోను ఉదయం దాక పయనం
కాలంతో సాగుతుంది ఆగదు మానసికంగా

ఆగని కాలంతో మనిషి జీవితం
ఆగని శబ్దంతో కవిత ప్రయాణం

ప్రవాహం ముందు చూపును పొడిగిస్తుంది
కాలం వెనక్కి తిరిగి చూడదు, చూడలేదు
సమస్యను చేయిపట్టి తనవైపు లాగుతుంది
మనిషిలో ఆసక్తికి అభిలాషకు ప్రాధాన్యం

మట్టికుండ సులభంగా పగిలే అవకాశం
అందరికీ తెలిసిన వాస్తవమయినా
దాహంలో తాపంలో కుండవైపు దృష్టి పడుతుంది
ఫ్రిజ్ వైపు చేరడానికి దాటాలిసిన దశలెన్నో

అలజడి నుండి హింసదాక మూలమొకటే
చివరి కోరిక ఏది? అంటే మనిషి మనిషికీ భిన్నం
మంచి చెడు రెండిటికి దారులు తెరవబడే
అభ్యర్ధనతో పాటు కృతజ్ఞతకూ చోటు ఉంది
గాయపడితే ప్రాణం మిగిలినందుకు సంతోషం
ఓడితే గుణపాఠం దొరికినందుకు తృప్తి
అల ఆగదు, కిరణం మసి పట్టదు

క్షణాలు ఆగవు, మనిషినీ ఆగనీయవు
గడ్డ కట్టి మంచులో నీరులా "నిజం"
తానై కనిపించదు, కిరణ స్పర్శతో బయటికి వస్తుంది

## 12.

అనుభవం ఆలోచన కలయికతో స్పందనలో
స్మృతి బింబం కవిత! విశేష కళా మయం
వ్యక్తి ఉనికి నుండి సమాజ వర్తనం వరకు
ఆవహించే అక్షర సుందర భావ మయం

మంచు తెరలు తొలగితే, వెలుగులో
ఆ స్థానంలో ఇనుప తెరలు రావడం! విచిత్రం
కదలి పోయే మనిషిలో మరో మనిషి గుప్తంగా
పట్ట పగలు వెలుతురులో నేలపై నెత్తురు చిత్రాలు!

మనసును దిగ్భ్రాంతికి గురి చేసే ! వ్యూహాలు
లోన ఊగే కోపంతో వికృత దృశ్యాలు!
సమయానికి ఖడ్గమో! జ్వాలనో ఆశ్రయించి
తన పని జరిగే శక్తియుక్తులతో సమాజం
కళ్ళనుండి జలజల నీరు రాలడమే కాదు
మాటలలో నిప్పు రవ్వలు చిమ్మడమే కాదు
ముఖంలో మృత్యు లహరి కదలడమే కాదు
చర్యకు ప్రతిచర్యతో ఆయుధాల ప్రయోగాలు

జీవన చక్ర భ్రమణంలో కల్లోలం సంక్షోభం
కవితకు వస్తువులో పూర్ణత లభించేను
చిన్న చిన్న సమస్యలు । తమ శక్తిని మ్రింగేవై
వికాస చరిత్రలో మనిషి వికార పాత్ర చూపేను.

ప్రాణదాత పవమానం వాహనంగా
అక్షర నిలయం నుండి కవిత సాగేను
సమాజాన్ని సావధాన పరచేను
కవితకు విశ్వ విభుత కూర్చేను

నిశ్శబ్దంలో ఆర్త రవం సూటిగ తాకేను
సమస్య జటిలమై ఉరిత్రాడుగ మారేను
చెదరిని జీవితం సరిచేసే అవకాశం
దొరకడం పొందడం జరుగుతుంది కవితలో

# 13.

కవి మనస్సు చలన శీల జలదం
అందని ఎత్తులో ఉన్నదీ
భూమిపై కరుణ దృష్టి కలిగిందీ
దశ దశలో సమాజ విజయం కోరేదీ

తెల్లదనంలో తేలే కుసుమ శోభతో
నలుపు దనంతో చిందే రస సేచనతో
శూన్యమైన క్షితిజాన్ని ఆవహిస్తూ
ఎంత దూరమయినా, వాస్తవ దృశ్యం వీడనిదీ

కవిలో సృజన మూలం నిర్మాణ రూపం వహిస్తుంది
సమాజ శ్రేయంలో కర్తవ్యం ప్రతిధ్వనిస్తుంది
సేనలా సాగే అక్షర పంక్తులతో
ఆలోచనల్ని దాటి ఆచరణం ముందుకు వస్తుంది

ఉద్యమ చేతనతో బ్రతుకులు గడచేప్పుడు
స్వార్థం తిష్ఠవేయదు, మరణ భయం ఉండదు
అంకిత భావమయమై మనసు సధైర్యంగా
స్వేచ్ఛలో కవితకు వస్తువు పుష్కలంగా

కత్తిదూసి ప్రాణాన్ని హరించడం గొప్ప కాదు
కత్తి ఎత్తి ప్రాణాన్ని కాపాడడం ధర్మం
స్వేచ్ఛా వేదికపై బొమ్మల ప్రదర్శనం కాదు కవిత
ఎవరో వెనక చేరి తాడు లాగితే వినోదం కాదు కవిత

రవి బింబాన్ని చూస్తే పండు జ్ఞాపకం వస్తుంది
శశి బింబాన్ని చూస్తే మల్లె చెండు మెదలుతుంది
విపణిలో ఎన్ని రకాల ఫలాలో పూలో
అన్ని విధాల రూపాలతో కవిత! దేని కది స్వతంత్రంగా
నేలకూ నింగికీ మధ్య క్షితిజంలా ఎదిగి కవిత! ఏ రోజూ
రవికీ శశికీ స్వాగతం పలుకుతుంది వీడ్కోలు చెబుతుంది

# 14.

మనిషిలో స్మృతి సంకలనం! పుటలతో
ఏది ఎపుడు తెరవ బడేది తెలియదు
ఆలోచనల్ని పాత ప్రపంచంలో తిప్పుతుంది
ఎప్పటివో శిలా శకలాలను శిల్పాలుగ తీర్చేను

ఒకరి కవిత విధం మరొకరికి అజేయం
సమయం సందర్భం స్పందన చేతనలు కలిసి
ఒకరికి సేద్యంలా కష్టంతో పొందే భాగ్యం
ఒకరికి అలవోకగా అందే తన ఇష్ట ఫలం

ప్రవాహంలో మునక వేసి తలపైకి ఎత్తే సరికి
పయనంలో దూరం గురించి తీరంపై ధ్యాస! సహజం
దేహాన్ని లాగే భూమిలో ఆకర్షణ! ఆప్తంగా
చేయి అందుకొని పైకి లాగే మరొకరి చేయిలా

కవితలో అక్షర పంక్తులు!
భద్రతలో రక్షణ కవాతులా
చీకటిలో వరసగ పేర్చిన దీపాల్లా
భయం కలగనీయనివై ఆపద రానీయనిదై

బ్రతుకు పై అభిలాషతో
కూడబెట్టిన వస్తువులెన్నో! కవితో మాట్లాడతాయి
వెలిగే దీప భాష! చీకట్లకు తెలుస్తుంది
తగిలిన గాయాల భాష! హృదయానికి తెలుస్తుంది

ఈ నేల మనిషి నివాసానికి ఆధారం
ఈ మట్టి క్షుధ తీర్చే సంపద నిలయం
జలధిని దాటిస్తుంది పడవ
తానొక జడమయినా మనిషిలో ఉపజ్ఞతో
నిశ్శబ్దంలో కవిత నుండి శబ్దం
మనిషిని మేల్కొలుపుతుంది, నిలబెడుతుంది
మనిషి శాశ్వత చిరునామ! అమర యశో రూపం
బ్రతుకంతా దాగిన "నిజం" బయట పడే అవకాశంతో

## 15.

మంచు గడ్డ క్షణాల్ని స్రవింపచేస్తుంది కవిత
మందమైన ప్రవాహాన్ని ఉద్వేగ పరుస్తుంది
నియంతల దుశ్చర్య వలన సామాన్యుల ఘోషను
వినిపిస్తుంది! మానవ హృదయానికి అందిస్తుంది
ప్రతి దార్శనిక పథం, సమాజాన్ని మార్చాలని
సరికొత్త విలువలతో చరిత్ర నిర్మించాలని

కాలం ఎవరినీ వదలదు, నేరంలో దోషంలో
అక్షర పంక్తుల బోనులో నిలబడాలిసి వస్తుంది
కావడిలో ఇరువైపుల బరువులతో కవిత
నిరంకుశం విధ్వంసంలో పీడిత జన శ్రేయం కోరేను

ఇది పాత బడడ మంటూ లేదు
ఇది మాసి పోవడ మంటూ లేదు
కాలం గడచే కొద్దీ పరీక్షలో మెరుగుతో
ఆకర్షణ కోల్పోని సృజన విజయ రూపం!

బయటి పోరలో కనిపిస్తుంది చరిత్ర
లోలోని పోరలలో తలపిస్తుంది సంస్కృతి
ఇది నిరంతర పరిణామ దశా ప్రతినిధి
విలువలతో చెల్లే నాణెంలా సమాజంలో

రాత్రి మాయ కాదు, పగలు కొలిమి కాదు
మనిషి మనోవర్తనంతో ఏదయినా అవుతుంది
బ్రతుకులో వాలిపోవడం సులభం, సుఖదం
నిలిచి వెలుగు రూపమవడం కష్టం హితకరం
నెత్తురు గుర్తులు లేని పథంలో
పచ్చని దృశ్యాలతో కవిత! అపూర్వమై
అభినవమై స్వతంత్రమై స్వేచ్ఛగా
అగ్నులు దాటుతూ! జన సమూహశక్తితో
గాయాల్ని స్పృశిస్తుంది! గులాబి రేకుల్లా
శిలల మధ్య జల సేచన కవకాశం కలిగేను
ఊరు నుండి దేశం ప్రపంచంలోకి కవిత
దరిద్ర దృశ్యాలకు “గుడ్‌బై” హృదయంతో

# 16.

భూమి అంతటా ఒకే విధంగా ఉండదు
గుట్టలు లోయలు గోతులతో జీవిత మంతే

బాధను ఆర్తిని మరపిస్తుంది కవిత
మనసుపై పూల రెక్కల పొర ఏర్పడుతుంది
కళ్ళు తెరచే సరికి ఎదురుగ చరిత్ర
తన కోసం సిద్ధంగా ఉన్నట్లు ఉంటుంది

చంద్రుని చేతిలో తీసుకొని బంతిలా
ఆడుకోవాలని శిశువులో కోరిక! అమ్మతో
సూర్యుని కనులెత్తి చూచే వీలులేదు
వచ్చే వెలుగుతో అనుభవాన్ని పొందడమే
క్షణాలు పూలుగా అలంకారానికో పూజకో
క్షణాలు శిలలుగా పునాదికో ప్రతిమకో

ఎదురయ్యే ప్రశ్నలకు నిశ్శబ్దంగా ఉన్న వేళ
గాలి సశబ్దంగా సమాధానం చెబుతుంది
ఉదయం బయటికి సాయం వేళ లోనికి కలరవాలతో
వీడ్కోలు స్వాగతం క్షణాలతో చెట్టు నిలచే ఉంటుంది

ఆగమన నిష్క్రమణ క్షణాలతో కవిత
చెట్టులో సమాజ శక్తిని ప్రదర్శిస్తుంది

స్పందన వశమయిన హృదయ భాష మాట్లాడుతుంది
పద పదం విప్పారిన పూలను తలపిస్తుంది
మంచి చెడు మెట్లపై అడుగులు పడుతూ
సాగే పయనంలో సారభూతమైంది కవిత
లో నుండి పూల పరిమళ స్పర్శతో కొత్త రూపం
తేజో రేఖలతో తీర్చబడే ఉత్సాహ శక్తి నిస్తుంది

పగలు రాత్రి విశ్రాంతి లేని సృజన చేతన
ఉద్యమం ఆదర్శం పరివర్తన నవోదయం
నాలుగు చక్రాలపై నడిపిస్తుంది! జీవితాన్ని భూమిపై
మాటలతో ఊహలతో సాగే క్రియాశక్తికి సంకేతం

# 17.

సమాజ పరిణామంలో భేదాలెన్ని విధాలో
మనిషిలో ఆలోచనా రీతులన్ని! యత్నాలన్ని
సుఖమయినా సంపద అయినా చివరి శిఖర మెక్కడుంది?
ఎక్కడికక్కడ ముక్కలుగా అనుభవ దృశ్యాలు! నిరంతరం

ఎవరికి వారు తమ తమ మతి సీమలలో
దేని కది తన గుణ వికాస పరిమితిలో
కవిత! వీటి కతీతం కాదు, ఆయా పరిధులలోనే
నలు వైపుల రంగులతో దిశాచక్రం! కమనీయంగా

ఎవరికి వారు తమ శక్తి కొలది ముందుకు పోవాలనే
ఉపజ్ఞలో స్నేహంతో కలహంతో పోటీ! సహజం
అక్షర పంక్తులలో రికార్డు అవుతుంది సమాజం
ఇందులో చోటు కయి ప్రయత్నాలెన్నో! జరిగేను

ఊరు నుండి ఊరుకు దేశం నుండి దేశానికి వెళ్ళినా
మనిషి హృదయ స్పందనతో సృజన వేదన ఒకటే!
కవిలో మానవ నిజాన్ని బింబించే కవిత తప్ప।
మిగతావన్నీ మానస కల్పనలో చేరినవే।

పురి విప్పిన నెమలి పింఛమయిన ఉదయం
శుభ్రమయిన సమయం! కవితకు వాహనమవుతుంది
పూవుల వలె అమరిన చుక్కలతో రాత్రి
కవితకు నైట్ డ్రెస్ వలె నప్పుతూంది

వెనక నున్న చిత్రాలు శిల్పాలు కళాకృతులు
నేపథ్యంలో శ్రవణపేయమైన స్వరలహరి
మనిషి ఎత్తు పెంచేను, సంస్కృతి రుచి పెరిగేను
అన్నిటిని మించి అక్షర హృదయంతో అంతరంగం
విశేష పాత్రలో, తెలియని రహస్యాల్ని స్పందించేను
కనిపించని వినిపించని అనుభవ స్థాయిలో కవిత!

లోపల చీకటి బావిలో చిక్కుకున్న మనసును
బయటికి తీస్తుంది, కవిత వెలుగులోకి
సరికొత్త ప్రపంచంలోకి దింపుతుంది నవత
ప్రేమించే మనిషికీ ద్వేషించే మనిషికీ సమ న్యాయంగా

# 18.

లేచింది మొదలు నిదురించే వరకు కవిత
ప్రతి పనిలో సమాజ బంధంతో భాగ స్వామ్యంతో
మాటలో చేతలో ఊహలో విశాలతను పొందుతుంది
మనిషి మనో రూపానికి సుందరతను ఇస్తుంది

తెలవారినా కార్నర్‌లో చీకటి అచలంగా
భద్రంగా, పోయిన రాజ్యంలో మిగిలిన ముక్కలా
చీకటితో పరిచయం ఎప్పటిదో పుట్టుక ముందు నుండి
ఆ తరువాతనే వెలుగుతో పరిచయం స్నేహం ఇష్టం

మనిషిలోని బయటికి కనిపించని మూలలో వస్తువు
కవితలో బయట పడుతుంది! కొత్త కోణంలో
వ్యక్తి ఆవరణం దాటి సమాజ క్షేత్రంలోకి జరిగి
వ్యక్తిలో దాగిన రహస్య పేటి తెరవబడుతుంది

విపణిలో అంతటా కలయ తిరిగే చూపులో
ఉన్న వస్తువులన్నీ తనకే అవసర మనిపిస్తుంది
ఏ లిప్త వ్యర్థంగా శూన్యంగా గడవదు
గీసిన అగ్గిపుల్ల వెలుగు అవసరంతో కొన్ని కొన్ని!

మనిషితో మనిషి అనివార్యంగా బ్రతుకులో
జీవన గతిలో భిన్నమైన లౌకికానుభవంతో
నీడను గుర్తించేందుకు దీప మవసరం లేదు
వెలుగుతో వెన్నెలలో అండగ ఉన్నట్లు ఉంటుంది

వీడని బంధువులా ముందుగ కనబడుతుంది
ఇది వీడని భూతమనీ తలచే వారు ఉన్నారు
ఒంటరితనం పోగొట్టే మనుషు లెందరో చుట్టూ
కవితకు శ్రోతలు పాఠకులు వీడని తప్పని నీడలు

సూర్యుడు వెలిగి పోతాడు చంద్రుడు కరగిపోతాడు
కాలం! సరేసరి! ఆగని ఉత్సాహ లహరిలో తేలిపోతుంది.

వాటి స్థానంలో అనలం మొలకెత్తవచ్చు
వాటికి బదులుగా మేఘం దయచేయవచ్చు

కదలే వేళ్ళతో గాలిలో మీటుతూ
తనదైన స్వర చక్రంపై ! తిరుగుతుంది కవిత!

## 19.

ప్రకృతిలో ప్రతిదీ తమ విధులను నిర్వర్తిస్తుంది
నిదాఘ తాపంలో జలధి నుండి ఆవిరులై ఎగసిన
నీలిమబ్బు నీడలలో క్షేత్రం!
ఆర్ద్ర కళను పొందుతుంది

కాస్తో కూస్తో అంతో ఇంతో ఏమయినా
మాట తప్పని పెద్ద మనిషి తరహాలా
కవిలో సృజన రూపం! అవతరిస్తుంది
అక్షరం పద పంక్తులతో సార్ధకమవుతుంది

చుట్టు శిశు దశ నుండి పరిచయ రూపాలు
అనుకోని కొత్త దనంతో, ఎవరి బ్రతుకు వారిదై
అవసర స్థితిలో ఎవరూ ఆపలేని పరివర్తనం
ఏ రోజు కారోజు వచ్చే ప్రశ్నలకు జవాబులతో

వీచే వేడి గాలి సుడులు తిరిగి
ప్రశ్నా పత్రంవలె కదలవచ్చు
స్వేచ్ఛలో మార్పుతో చల్లని గాలి నుండి
జవాబు రావచ్చు, జనానంద కరంగా

నడుస్తున్న కొద్ది పయనంలో కొత్త అనుబంధాలు
అంతవరకు తెలియనివి ఆత్మీయమవుతాయి
మస్తిష్కశాలలో ఆలోచనల ప్రయోగం మారుతుంది
విధ్వంసం నుండి నిర్మాణానికి ప్రగతి పథంలో

మంచి చెడు మధ్య విభజన రేఖను గుర్తించడం
రెండు తలలు కలిసిన కవలలను విడదీయడం

గీసిన అగ్గిపుల్ల దేనికయిన వాడబడవచ్చు
చీకటిలో దారి చూపవచ్చు దీపం వెలిగించవచ్చు
రెండూ మంచి పనులే! మనిషి చేయవలసినవీ
చేయకూడనివీ జరుగుతాయి, క్షోభకు గురి చేస్తాయి

తిండి బట్ట ఇల్లు ఈ మూడిటితోనే! బ్రతుకులు ఎప్పటికీ
మరొకటి అవసరం లేనట్లుగ, మనో జగత్తుతో పనిలేదు
ఆయువును వాడేది వివిధ స్థాయిలలో వీటి కోసమే
ఎంత కాలమైనా, పొడిగింపును కోరేదీ వీటి కోసమే

# 20.

లోన కదలే జలద పంక్తి స్పృహతో
మానవీయ శిఖరాలపై కవిత కదలుతుంది
తొలి తొలకరి చినుకుల మిత్ర గణంతో
బయట చిందులేసే పిల్లలవలె అక్షరాలు

నిర్దయ క్రౌర్యం హింస అశాంతితో మండే స్థితులలో
సహన కరుణ ప్రేమ శాంతి కోరుతుంది హృదయం
ప్రవాహాన్ని చీలుస్తూ పోయే నావలా
కదలికలో దారి చేసుకొని పోయే ఈతలా
జన హిత కరాలతో నైపుణి చరణాలతో కవిత
గట్టు నుండి గట్టుకు చేర్చేను మనో బలం సాక్షిగా

శ్రమ చక్రంపై కదలే కాలాన్ని
పరుగెత్తించగలరు కాని నిలపలేరెవరూ
అలజడి ఘర్షణ రణ సమాన స్థితులలో
కర్తవ్యం గురించి శబ్దిస్తుంది అంతరంగం

అప్పటి దాక ఇంటి ఆవరణంలో ఒక పక్కన
ఉన్న నాగలి! కదలింపబడి ఆశా పతాక అవుతుంది
మెరపు మెరుస్తుంది, పిడుగు భయపెడుతుంది
అణవణువున పచ్చని కళ పొందాలని ఉంటుంది

కల్పనకు సమయం ఉండదు, శ్రమ జగత్తులో
ప్రియమయినా కటువయినా సహించే వాస్తవంతో
చూపు మేరలో కదలే జలదం! ఆప్తంగా
ఆర్తిని హరించేను, బాధను నిమిరేను

ఉన్నచోటు మారినా పరిచయాలు కొత్తవైనా
ముంగిలిలో తల ఎత్తిన మొక్కలో సృజన దర్శనం
మనసులో జ్ఞాపకాల మబ్బులు తేలుతూ
సృజనలో సరికొత్త కవితకు వీలవుతుంది

పగలు వెలుగులో పైకి విసరిన రాళ్ళు
రాత్రి గగనంలో చుక్కలుగ కనిపించేను
అధికార శిఖరాలపై మానుష రూపాలు
పైన! రవి చంద్రుల స్థానం పొందాలనీ!

## 21.

భూమి పొరలలో అడుగున జలాల వలె
మనిషి మనసు తెరల మాటున మానవత
అవసరమయిన వేళలో మానుష యత్నంతో
దారి చేసుకొనీ! బయటికి వస్తుంది, ఉపాయంగా

కరువులో సందర్భం ఆర్ద్ర మయ మవుతుంది
అది కరుణతో కావచ్చు వాత్సల్యంతో కావచ్చు
మానవ రూపానికి సార్ధకత చేకూరుతుంది
వ్యక్తిలో వికాస శిఖరాలను చూపుతుంది

సృజన భావ ప్రసార రేఖల కళతో
అక్షర రచన కవిత అవుతుంది! అనన్యంగా
ఊపిరాడని స్థితిలో గాలిని నింపుతుంది
దప్పివేసే గతిలో జలాంజలి అవుతుంది
భూమిపై బ్రతుకుల్ని రసమయం చేస్తుంది
ఊహలో కొత్త దనం దిశలను మారుస్తుంది
అమరమయిన విమల పథంలో నడుపుతుంది
నడతలో సరికొత్త అర్ధాన్ని ఆవిష్కరిస్తుంది
శ్రమ జీవన బలాల ప్రమేయంతో కవిత
సమాజ చలనాన్ని వేగవంతం చేస్తుంది
గమనంలో రణ సమానంగా కదలే
వాస్తవికతలను ముందుకు తెస్తుంది, చూపుతుంది
ఉదార హృదయంతో మానవం బయట పడొచ్చు
జీవన కథలో సుందరమైన ఘట్టమవుతుంది

మాటలలో కవి, ప్రజలలో నేత
చేతనలో సమాజ పరివర్తన చూపేరు

గ్రీష్మ భాష జలదానికి బాగా తెలుస్తుంది
రాత్రి భాష చంద్రునికి చక్కగ తెలుస్తుంది
ప్రకృతి భాష కవి హృదయానికి తెలుస్తుంది
గాయం భాష! తెలియని మనిషి లేదు
స్పందనలో వ్యత్యాసం, భేదాలకు కారణమై
జీవన వైవిధ్యంతో సమాజ వైరుధ్యం! పొందేను

# 22.

ఊరుకూ అడవికీ మధ్య ఎడం తగ్గుతూంది
స్నేహ వల్లి పెరుగుతూంది గిరిజన సమూహాలతో
కరువు హింస బాధ క్షోభతో అతలాకుతలమై
అడకత్తెరలో పోక చెక్కలా బ్రతుకులు।
జారే నెత్తురు చుక్క భయం కలిగించవచ్చు
అదే గుండెలో ధైర్యాన్ని వెలిగించవచ్చు
మదిలో ఉత్సాహ లహరి ఒకటే చాలదు
ముందుకు నడిపించే గాలి కూడ అవసరం
దూర దూరం తీసుక వెళుతుంది ధ్వని గతితో
మోదం ఖేదం స్వర చిత్రాలన్నిటినీ వహిస్తుంది
గిరులు నదులు గోడలు సులువుగా దాటుతుంది
వేసే ప్రశ్నలకు తీర్చే జవాబులతో తరలుతుంది

చేతిలో బిస్కెట్‌లా చంద్రుడు నిలవాలనీ
గుండెలో చేతనతో సూర్యుడు కదలాలనీ
బాల్యం నుండి చివరి దాక! మనిషిలో కోరిక
నడకకు చాలీ చాలని విశాల భూమిలా కవిత

ఎందరివో! గొప్ప పనుల యశో చిహ్నాలు
తరాల పైబడి విలువల్ని జ్ఞాపకం చేసేను
వీటిలో కవిత ఒకటి! అక్షర కళతో
భువి నుండి మనో భూమికలో జీవన రూపం

అర్ధరాత్రి అరుణోదయం, స్వాతంత్ర్యం
పొందిన దేశమిపుడు! ప్రజాస్వామ్య పదంతో
మాడిన ముఖాలతో వేడెక్కిన బ్రతుకులతో
బూది పొరలు చీల్చుకొని! నడచేరు వ్యక్తులు

నిశ్శబ్ద ప్రపంచం కిటికి తెరచి చూస్తే
దహన కాండ దృశ్యాలతో విపరీత సమాజం
కవి ఊహల రేఖలు పలు రంగులలో
దేని కది! కొత్త భావజగంతో కాలాన్ని నింపేను
తలుపు తెరిస్తే వీధిలో కదలే పాత్రల ప్రదర్శనం
అడవిలో తాటిచెట్టు! నిలబెట్టిన తుపాకి వలె

# 23.

ఆ వచ్చే మనిషి ఒక చీకటి బొమ్మ అయి
భయంలో ఆయుధ మవసరమవుతుంది
మధ్య మధ్య మేల్కొన్న ప్రశ్నలకు జవాబులు
వర్తమాన స్పందనతో కవితలోనే సాధ్యం

ఎదురు పడిన మౌనంలో ప్రకాశ బింబం
ప్రేమ నింపుకొనీ మరో హృదయంతో మాట్లాడుతుంది
రవి కిరణం మనోజ్ఞమై ఎంత ఇష్టమయినా
రాత్రి వేళ పనికి వచ్చేనని దాచుకునే వీలులేదు

మనిషి వేరు మృగం వేరు
ఇరువురి స్నేహం! రాజకీయంలో
మరో ప్రాణి కూడా చేరవచ్చు
వ్యక్తిలో దోషంతో నేరం! మనసుతో
తెలియని సమాజాన్ని అల్లుకునేను
బ్రతుకులో ప్రతిక్షణం అలవోకగా
తన ఉనికికి మనోజ్ఞత సిద్ధించాలని
పుష్పమై కిరణమై అలంకరించాలని

ప్రతి కవిత ఏదో ఒక స్థాయిలో వెడలేను
ఆ స్థాయిలోని మరొకరికి ప్రియమవుతుంది
కాలమొక వాద్య విశేషం! కవితను పలికించేను
అగ్ని శిఖలతో సుడిగుండాలను చూపించేను

సింహాసనంపై తిష్ఠవేసిన మనిషి।
తానొక సింహమై హింసకు దిగితేనే ప్రమాదం
కవిలో మనిషి ఒకటి ఆలోచన చేస్తే
మనిషిలో కవి మరొకటి యోచన చేసేను

ఎప్పటికప్పుడు కొత్త నీరుతో
సాగే ప్రవాహ స్థానంలో కవిత!
సమాజ స్పృహ లేని ఆధునికం లేదు
జన భావన లేకుండా దార్శనికం లేదు
ఏది కవిత? అంటే "ఏది కాద"ని సమాధానం
ఒక చేతిలో కుసుమంతో మరొక చేతిలో ఖడ్గంతో

## 24.

కాలం కాటు నుండి మృత్యువు వేటు నుండి
తప్పుకునే బయటపడే అమృతమయం కవిత
అసలే రాత్రి! పని దొరకని కఠిన సమయం
క్షుధకు తలుపు తెరవబడీ
లోన ఆరని ఆకలి కుంపటి విధం
ఈ వేళ చంద్ర కళ ఒకటే! చల్లదనమిస్తుంది
ఆశను పొడిగిస్తుంది! శాంతిని ఒలికిస్తుంది

పగలంతా వీధులలో తిరిగి తిరిగి
మస్తిష్కం నిండి జారే కలల కళ్ళతో
విషయం కవితకు చక్కగా ఉపకరిస్తుంది
మనిషికి మనిషిని మోసం చేయాలని ఉండదు
మనిషికి మనిషిని హింసించాలని ఉండదు
ఆ క్షణం ఉద్వేగంలో చకితంగా జరిగిపోతుంది

దారిలో కనిపించిన ఇష్టమైన వస్తువుల్ని ఏరి మనిషి
జేబులోనో బ్యాగ్‌లోనో వేసుకొని ముందుకు నడచేను
నిశా నిలయంలో రాత్రి! భద్రంగా గడుస్తుంది
ఉదయం మార్పుకు సిద్ధంగా కవిలో నిశ్శబ్దంగా
సృజన చేతన! ఉత్సాహ పరుస్తుంది శబ్ద కళతో

ఎండిన ముళ్ళ కంచెల వలె బ్రతుకులు! ఎదురుగా
దేనికి పనికొస్తాయి! ఒక ఆటంకానికి తప్ప ।
వంటకో! చలికాచుకోడానికో! విరోధంలోనో!
సమాజ జలధి నుండి వచ్చే తుఫాను నెవరు ఆపగలరు?

కాల సముద్రంపై నావయై
జ్ఞాన గగనంలో విమానమై
భూమి తలంపై వాహనమై
మనిషి మనసు పయనింప చేస్తుంది

స్వేచ్ఛలో పొందే అవకాశంతో కవిత
మార్పుకు సంకేతంతో బ్రతుకును కదలిస్తుంది
ఏదీ యథా తథంగా ఉండదు, ఉండలేదు
అన్నిటినీ విచలితం చేస్తూ వస్తుంది మార్పు

# 25.

నిశ్శబ్దంలో కవిత శబ్ద కళా మయమై
సరిస్తుంది వెలుగుతుంది స్వనిస్తుంది చివురిస్తుంది
మౌఖికమో రాత ప్రతో సందర్భాన్ని బట్టి
మనిషి రూపం తెలుపుతుంది మనసు చిత్రమయమౌతుంది

వర్తమాన దృశ్యం వెనక నుండి మనిషిలో
గొప్ప కట్టడమో ఆలయమో కోటో చరిత్ర చిహ్నాలు
వీటిని గాలి పలకరిస్తూ పోతుంది
వెలుతురు స్పృశిస్తూ ప్రశంసిస్తుంది

మనిషి మనిషే! దేనితో పోలిక లేని అమూల్యం!
మంచు తెర చాటు చేయవచ్చు కాలి బాట తప్పవచ్చు
ఊరు మారవచ్చు, పరిచయాలు వేరు కావచ్చు
పయనంలో దిశతో తన గమ్యం మారుతుంది

తెలివి విరిసినప్పటినుండి అనుభవాలు స్మృతిలో
మనసులో బొమ్మలుగా నిలిచేను మాయని రేఖలతో

ఇవి సత్వరం తుడిచి వేయ బడేవి కావు
కవితలో సరికొత్త వాలకంతో దుస్తులతో కనిపించేను
ప్రతీకలో దర్శనానికి మనో నయన మవసరం
వ్యక్తి ఇష్టాన్ని బట్టి దృష్టి కోణం మారుతుంది

చెట్టు పై గూడు నుండి పక్షి ఈక తలపై
పడిందని, నీడ నెవరు విడుస్తారు?
ఉదయ దర్పణం పై నీలి మబ్బు కదలేనని
దోషారోపణ కెవరు సిద్ధమవుతారు

చీకటి కడలిలో ధైర్యంగా
కదలుతుంది! ఒకరి వెలుగు పడవ
వెలుతురు కడలిలో సుగమంగా
కదలుతుంది! ఒకరి చీకటి పడవ

జలధి తీవ్రచలనంలో హోరును
అడ్డుకొనే దెవరు? ఆపగలిగేదెవరు?
ప్రకృతిలో ఉన్నవే జీవన స్థితులలో
కవితకు వాస్తవ మూలాలను సమకూర్చేను

## 26.

కవితలో సామాజిక రాజకీయ ఆర్థిక తాత్త్వికతలు
విశాలమైన అక్షర నిలయానికి పాయలుగా నాల్గు దిశలు
రెండు కాళ్ళపై ఇరు చేతులతో మానవ విగ్రహం
దార్శనిక మేదయినా, స్వేచ్ఛలో సంస్కృతితోనే ఆకర్షణ

సంఘంలో వీచే తుఫాను బీభత్స దృశ్యాలే చరిత్ర
శాంతం కోరే స్థితిలో ఎద అనుభవ బింబం కవిత!

పరివర్తనలో ప్రభావాన్ని నెరపుతుంది అక్షర కళ
తేట పడిన ప్రవాహం స్నిగ్ధతతో సరిస్తుంది
బుజాలపై వెచ్చని శాలువలా సూర్యరశ్మి
ఆప్తంగా కోరికలకు కదలిక కూరుస్తోంది

కవిలో అక్షరం మంచు గడ్డలా నిలిచిపోదు
భావనతో కరగి నడుస్తుంది జన చేతనతో
లోనుండి భయం వీడి బయటి కొచ్చిన
మనిషి హృదిని ఉత్తేజ పరుస్తుంది కిరణం

నిటారుగా నిలిచిన మౌన స్తంభం కన్నా
చినుకుతో చిగిర్చే మొక్క నయం!
ఇది సృజన ప్రపంచంలో భాగమయింది కవితలా
మనసుకు కొత్తదనం నెరపుతుంది అక్షర స్పందనం

గిరి శిఖరంపై ఏకాంత ప్రశాంతత కాదు కావలసింది
కోలాహల సమాజంలో సౌభాగ్యం ఆనందమయం
మనసులో మొక్కల్లా పెరిగి ఎదిగే ఆశలు
ఎండిపోయి పరిదీన మయం కాకూడదు

కావలసింది చివురుతో పెరిగి తరువై
సంపద ఉపయోగంలో । భాగం కావడమే!
నిప్పంటిన మానవత ఎగసి పడేప్పుడు
క్షోభలో మార్పు తప్పనిసరి అవుతుంది!

దహనానికి మూడో కన్ను అవసరం లేదు
రెండు కళ్ళు చాలు! కోపంలో విధ్వంస గుణంతో
ఏ సమయం, ఇష్టమైన ఏ వాద్య విశేషమయినా కానీ
కవిలో స్వర లయ స్పృహతో కళా హృదయ మవసరం

## 27.

గాలి కెగిరి పై బడే బూది వెనక
తేజో రూపం కవిత! కవిలో
కోష్ణ రశ్మి మనసును ఉత్సాహ పరుస్తుంది
మాటలో వెలుతురు ఆత్మీయ మవుతుంది
శిలను ముక్కలు చేస్తే! కఠినత తప్పేనా?
రాళ్ళ నిరోధంతో ప్రవాహ గమనం ఆగేనా?
చీకటి ఏ గొడ్డలి తోనో! నరకబడదు
వెలుతురు ఏ పదును కత్తికీ అంతం కాదు

మనిషికి సాటికాదు ఏదీ
దేనితోనూ పోలిక నప్పదు
హృదయం అగ్ని కావచ్చు, మేఘం కావచ్చు
ఎవరి ప్రమేయం లేకనే కాలం కవిత అవుతుంది
ఎంత ఎదిగినా ఆరోహణలో శిఖరం చేరాలనే
వివిధ మనో భూమికలతో భూమి నుండి మనిషిలో

కవితకు వస్తువును వెదక నక్కరలేదు
ఎదురుగ ఉన్న సమాజం నుండి లభిస్తుంది
స్పందన ఎరగని మాట ! ప్రకటన మవుతుంది
సుడిగాలికి ఎత్తుక పోబడి ఎక్కడో! చేరుతుంది

ప్రతి విషయం మనిషి అస్తితలో భాగమయి
మానవ శక్తిని తేట తెల్లం చేస్తుంది! కవిత
సహన గుణంతో ఎన్నిటినో తనలో కలుపుకొని
నవత అనుక్షణం శుభ్రతకై ఆరాటపడుతుంది

మేఘం గాలిలో తరలివస్తుంది
మాట! దూర దూరం పయనిస్తుంది
రాత్రి చీకటిలో కనిపించని వస్తువులు!
ఉదయం వాటంతట అవే! కనిపిస్తాయి
కాగితంపై మార్జన్ స్థలం పెరిగిపోతూంది
మాటల మధ్య ఖాళీ అధికమయి పోతూంది
తెలుపు నలుపు గడులు మనిషిలో ఎప్పటికీ
మబ్బులోని నలుపు, నీరులోని తెలుపు జీవన స్థితి సంకేతాలు

# 28.

స్వేచ్ఛకు దారి చూపుతుంది. హద్దులు గీస్తుంది
కవిత! గమ్యాన్ని గుర్తులతో నిర్దేశిస్తుంది.
సృజన క్రియలో మనో రూపం! భావ మయమై
కవిలో నవ చేతన కదలుతుంది ప్రవాహగతిలో

శబ్దం బయటికి వచ్చే లోపల సరిస్తుంది మెల్లగా
కంటికి కనిపించని బింబం! సుందర ప్రకటన రూపం!

ఏ లిప్త కాలుతూన్న కొరకంచు కాదు.
ఏ బ్రతుకులోను వేదన నిరాశ దుఃఖం చిరం కావు
అనుభవ ముద్రలు సృజనకు కళాకృతి నిచ్చేను
ఇది మానవ వికాసంలో జనతకు ప్రేరణమయ్యేను

కవికీ సమాజానికీ మధ్య రేఖ సన్నగా
పూల దారిగనో, నిప్పుల కార్పెట్ గనో!
నిరసన ఘర్షణ ఉద్యమ విప్లవ రణ చరణాలతో
వ్యక్తి జీవన రేఖచే వేరు చేయబడుతుంది

దీపానికి చీకటి భయపడదు పక్కకు జరుగుతుంది
దూకేందుకు దగ్గరలో పొంచి పొంచి ఉంటుంది
ఉద్యమ ప్రకాశ వేగం ఆగదు, అనుకున్నది పొందే దాకా
నినాద మాగదు, కోరిక వెలిగే దాకా
ఆశయ పథంలో మార్పుకు అడుగు జాడలతో

రాత్రిని పగలుగ మార్చ వచ్చు కవిత
పగలును రాత్రిగ చూపవచ్చు చర్యలు
కవి మాటతో జరిగే దాని కన్న హెచ్చుగ
సమస్య తీరేది మనిషి క్రియా శక్తితోనే

కవి సమాజం చెరొక వైపు నుండి వేదికపైకి
వేదిక దిగగానే ఎవరి దారి వారిది, ఇష్టమైంది.

ప్రవాహానికి ఇరు తీరాలవలె కవి - సమాజం
రెండిటినీ కలుపుతుంది మానవతా జలం
సాగే అడుగు ఎడంతో లోయతోనో కొండతోనో
వంతెన అవుతుంది కవిత! సమాజానికి ప్రియంగా

స్వేచ్ఛా కవిత్వం - 101

# ఏది కవిత

## (4)

## నాలుగో భాగం

# కవిత! ప్రభుతతో


మాదిరాజు రంగారావు





2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**EDI KAVITHA**

**Part IV**

(101) Free Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

*Presented to*
*Dr. M. Santhosh Kumar*
*on his Birthday*
*with blessings*

# పీఠిక

"ఏది కవిత" దీర్ఘ కావ్యంలో ఇది నాలుగో (IV) భాగం. చివరిది. ఇందులో కవిత్వానికి ప్రేరణ భూమికలు, స్పందన స్థానాలు పేర్కొబడినాయి, అభివ్యక్తి విశేషతలు దృష్టికి వస్తాయి. ప్రయోజన రూపాలను గమనించవచ్చు.

ప్రకృతికి సమాంతరంగా సమాజం, వాతావరణంతో జీవన స్థితులు ఆలోచనకందుతాయి. అనుభవాలు కనిపిస్తాయి. మానవం ప్రజాస్వామ్య దార్శనికం–నిర్వహణంలో గమనించవచ్చు. ఈ ప్రణాళికలో వస్తువు వర్తమాన జీవితంతో విషయం ఉన్మీలితమయింది. ఈ విధంగా కృతి స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకతను పొందింది. దార్శనికం రచనకు వెన్నెముక లాంటిది. మొత్తం మీద వివిధాంశాలను సంఘటితం చేసిన శిల్పం దృష్టికి వస్తుంది.

విషయ భావనలో సామాజిక రాజకీయ చారిత్రక మనస్తత్వ రేఖలతో చిత్రరూపం వివిధ కోణాల్లో రూపొందింది. ఈ కారణంగా కవిత్వం స్వరూపం మారడం సహజం. ఈ పద్ధతిలో శ్రీశ్రీ "దేశ చరిత్రలు", దాశరథి "మస్తిష్కంలో లేబొరేటరీ" ఖండికలు గుర్తుకు వస్తాయి. ఈ ప్రాతిపదికపై సాహిత్య విమర్శ రావలసి ఉంది. ఇదొక సత్ప్రయత్నం. సృజన చేతన కేంద్ర స్థానాన్ని వహిస్తూంది.

కవిత్వంలో రూపం విశేషమయిన అనుభవ పరంపరను పొందుతూంది.

కావ్య జగత్తులో ఎవరి అభిప్రాయం వర్తనం వారిది. ఈ భిన్నతల చేతనే వైవిధ్యం ఏర్పడుతూంది. కవిత్వ కళకు చెందిన అంశాలు ప్రతీకల (Symbols) లో భావ రూపాల (Images) లో కనిపిస్తాయి. స్వేచ్ఛా కవిత్వ విషయంలో స్వానుభవం ప్రధాన పాత్రను వహిస్తూంది. పల్లె నుండి పట్టణం వరకు సాగే జీవన దృశ్యాలు కవితలలో ప్రయోజనకరమయినవిగా పరిణమించాయి. ఏరోజు అనుభవం ఆ రోజు వరకే పరిమితమైనా కాలాంతరాన విశ్వమయం కావడం సహజం.

"ఏది కవిత", అన్న మాట నిర్వచనాలకు లొంగని విశాలతనూ సూక్ష్మతలనూ ఉన్నతినీ సూచిస్తూంది. నిర్వచనాలకు అతీతమైన లక్షణాని భావింపజేస్తూంది. మనిషి బ్రతుకులెన్ని భేదాలో! జీవన మనోరూపాలతో కవిత్వాలన్ని విధాలు.

**మాదిరాజు రంగారావు**

# 1. నిశీథికి అంతం

మనిషిలో స్వతంత్ర భావన
చిన్నదో పెద్దదో పాత్రలో నీరులా
గ్లాసులో నీరు దాహానికి పనికి వస్తుంది
సేద్యానికి పనికి వచ్చేది చెరువా! నదియొ!

ప్రకృతిని ఉత్సాహ పరచే
భూమిని ఉల్లాస పరచే
వర్షం! అన్నిటిదీ అందరిదీ
ఉదార చరిత మేఘం ! ఉండనే ఉంది
పూర్వజుల అమూల్యమైన ఖజానలా
అది తన దయిన సమయమే వస్తుంది

ఈ దేశానికి అర్ధరాత్రి స్వతంత్రం వచ్చింది
ఇంకా సగం రాత్రి సమయం మిగిలే ఉంది
ఇది గడిస్తేనే, ఉదయం కనిపిస్తుంది
దేని నయిన పొందేది! పగటి వెలుగులోనే!

నిదురలో స్వప్నం మానసికం
అణగిన వాంఛా రూపం లేచి
మెలకువతో అదృశ్యమవుతుంది
శూన్య పటం మిగులుతుంది! మదిలో

బ్రతుకు బడిలో ఆరోజు సిరియొ చుక్కో
అరచేతిలో రాగ రేఖ చెబుతుంది సూటిగా
ఈ నిశ ఎప్పుడు ముగిసేదీ తెలియదు
ప్రకృతి గతం సమాజ మయం వేరు వేరు
ప్రతీకతో వర్తమాన జీవన రూపం కవితలో
ప్రజాస్వామ్య విజయంతోనే ఈ నిశీథికి అంతం
ఇది తెలియని వ్యక్తి ఉండదు సంఘంలో
తెలిసిన వారికి తెలవారని సమయమే

ఇంకా స్వతంత్రం వచ్చిందని సౌభాగ్యం పొందేమని
మనసులో ఉబలాటం! ఏడాది పండుగ సంరంభం

నిరుపేద ముఖంలో ఉదయరేఖ కనిపిస్తేనే ! విభాతం
బ్రతుకులో ఆ క్షణం విప్పారిన పూవయితేనే ! వాస్తవం

# 2. విరామ స్థితిలో

కవిత వస్తుంది మనో వాహనంపై
తన ఇష్టమయిన దేదయినా కావచ్చు
హంస నెమలి హరి హరీంద్ర దంతి మరొకటి
ఏ సమయంలో నయినా ఏ దిశ నుండి అయినా

గుండె లయ ననుసరించి సృజన స్పందనం
మనసు నుండి గళంలో దిగుతుంది
పెదవులపై తరలుతుంది మాట
గాలిలో అక్షర రచన కదలుతుంది

అడ్డుగ వచ్చి నిలిచిన నీలి మబ్బును చూస్తే
సూర్యుడు సెలవుపై వెళ్ళినట్లు అనిపిస్తుంది
తన బాధ్యత నెవరి కప్పజెప్పేను
పచ్చని చెట్టుకా? సమున్నత గిరికా?
మనుషు లెవరు? వహించేందుకు సిద్ధంగా
ఎవరి తలను స్వర్ణ కిరీటమలంకరించేను

వాస్తవ రేఖ దాటితేనే కల్పన సాధ్యం
ఇది కవితలో అవకాశ మహాద్వారంతో,
లేంది! దార్శనికానికి పూర్ణత లేదు
పురా కథలు చెప్పబడవలసిందే

మళ్ళీ మళ్ళీ అందరు వినవలసిందే
ఇవి నిగ్గు తేలి విలువలు కాపాడేను

జీవన గమనంలో కొత్త కథలు
మార్పుకు వీలుగా దోహదపడేను
సృజన మూలం అడవిలో కాలి జాడలు
నిప్పు గుర్తులు వహించడం విచిత్రం

గుండె లయ దారి తప్పిన స్థితిలో
వర్తమానంలో ప్రమాదం! తెలిసిందే

అయినా మనిషి మనిషిని సులభంగా మరచేను
మనిషిలో మానవతను వెదకాలిసి వస్తూంది
లౌకిక శ్రేణుల్ని దాటిన సుందరమైన అతీతం
మనిషిలో విరామ స్థితిలో విశ్రాంతిలో

## 3. వ్యక్తి హక్కు

ఆసుపత్రిలో మృత్యు రాగం సన్నగ వినిపిస్తుంది
ఎవరికీ పట్టినట్లు ఉండదు! ఎవరికి కావాలి?
అభయం ఆకాశంలో ఒదిగింది
భయ పెట్టే చేయి ముందుకు లాగుతూంది
దీనికి తోడుగ బాధా స్వరం మంద్రంగా
ఎవరికి వినిపించేను? ఎవరు వినేరు?

అన్నీ యథాతథంగా జరగడమే కావలసింది
ఆటంకం లేకుండా ఉంటే చాలు! 'సబ్ ఠీక్‌హై
తమ పనులలో పూర్తిగ సతమతమవుతూ
ఎవరి విషయంలో ఎవరు కలగ చేసుకుంటారు

ఆవరణంలో గడ్డి మొలకెత్తు తుంది ఆగదు
ఆకు రాలుతుంది ఆగదు, ఉదయం రాకమానదు
వేదనలో శూన్యం వైపు చూపులు ప్రసరించేను
జాలి తలచి క్షితిజం గాలిని పంపిస్తుంది
అది మనిషి ఎదను స్పృశించి వెళ్ళిపోతుంది
నీడను తోడుగ నమ్ముకుంటే
అది ఎప్పుడు అదృశ్య మయ్యేది తెలియదు
మనిషిని నమ్ముకుంటే, ఎవరో ఒకరు
ఎప్పుడయినా, చూపు విసరవచ్చు
చేయి చాచవచ్చు, ఎద కరగ వచ్చు

రాత్రి జారే కన్నీరును తుడిచే దెవరు?
వచ్చేది గాలి కాక మరెవరు? వస్తారు
ప్రతి రోజు అదే చివరిదిగా తోస్తుంది
సాయం సంధ్యలో సంశయ ఘట్టంలో

అంతా సిద్ధమై రాత్రి ఆగమనానికి
చివరి క్షణంలో, నిద్రా విహగం
ఎగిరి వచ్చి హైజాక్ చేస్తుంది
కళ్ళు తెరిచి చూస్తే మరో ఉదయం

అనుమానం సందేహం రెక్కలతో ప్రశ్న నేరం కాదు
వ్యక్తి హక్కు, సహజం ఇది ఎందరి త్యాగఫలమొ!

# 4. మనసుకు ప్రియం

శబ్ద ప్రపంచానికి కవి గుండె లయ
దీని ననుసరించి కాలం కదలుతుంది
విరామ మెరగదు, దూకుతుంది పరుగిడుతుంది
ప్రాణాన్ని నిలుపుతుంది జీవితాన్ని నడుపుతుంది

పొద్దు పొడుపులో మొదలయ్యే రోజు
వెలుతురుతో మనిషి అడుగుల్ని స్వాగతిస్తుంది
చలనంలో జీవితం అనుభవ సుందరతను పొందుతుంది
గమనంలో సమాజం వేగ మందుకుంటుంది

బరువయిన కాలం కర్తవ్యంలో తేలికయ్యై
బ్రతుకుల్ని అలంకరిస్తుంది! ప్రయోజనంతో
పయనంతో పాటు లగేజి వలె బాధ్యత
పయనం ముగింపుతో బరువుకు గుడ్ బై

ఉరి తాడును తలపించే చీకటి పేలిక
ప్రభాత స్పర్శతో పూల మాల అవుతుంది
ఒక సందర్భంలో ఎదుటి వ్యక్తి ఆగ్రహం
భవితకు కొరకంచు వెలుగు నీయవచ్చు

అడవి నుండి ఊరుకు తరలిన పాట
కవితకు తొలి అడుగుల సంపుటి
తొట్రుపాటుతో నడచే పాపల వలె
అలరిస్తుంది, మనసుకు ప్రియ మవుతుంది
ఇవి స్మృతిలో బరువనిపించని అమూల్యాలు
ఎప్పటికీ వదలనివి చెప్పుకొనేవి ఆకర్షణలు

బయట బరువు మూట ఎంతదయినా
ఇల్లు చేరగనే! ఏ మూలనో ఏ కొయ్యకో చేరేను

ఎవరూ మరచి పోలేని ప్రభావ శక్తితో
గుండె లయకు సమతను చేకూర్చేను కవిత

వానలో దుస్తులు తడి అవుతాయి
బాధలో దస్తీ తడి అవుతుంది

బయటి లోకం లోని / లోకం వేరు వేరు
కాకపోతే! రెండిటి మధ్య తలుపు అవసరం

# 5. అన్నిటికీ చోటు

అంతరిక్ష శోధనలో మనిషి అదృష్టాన్ని కనుగొనేను
అంతరంగ వీక్షణతో కవిత జీవితాన్ని స్వనించేను
మేధకు గిరి శిఖర మహా పీఠం పయి కోరిక
హృదయానికి జల తల యానం బహు ఇష్టం

విశాల సమాజ వ్యూహంలో పుట్టుకతో ప్రవేశం
జీవిత మున్నంత వరకు తప్పని వ్యవహార మయం
ఏదో ఒక దారిన పయనం
మనిషి మనిషికీ భిన్న భిన్నం

ఏ దేని కవితలో వాస్తవ దుస్తులు ధరించి
అక్షర దృశ్యంలో కనిపిస్తుంది కళయై

ప్రతి చెట్టుకు తన నీడన ప్రాణులు చేరాలని
ప్రతి శిలకూ అందరు తనతో గడపాలని
శిల్ప మయి అర్థవంతంగా బ్రతకాలని
పూజకు అవకాశం వస్తే! మరీ మంచిది

ఎన్నిసార్లు అనుభవమో అన్నిసార్లు కవిత
దూర దూరం పయనింప చేస్తేంది
భావనా జగత్తులో అర్థ పథంలో
మనసుపైన శబ్ద చిత్ర ముద్రలతో

కాల మెంత గడచినా ఇంకా ఇంకా
ఆకర్షణ క్షేత్రం మిగలే ఉంటుంది
సృజన భూమిక! కవులలో పలు వ్యక్తిత్వాలతో
అక్షర వేదికపై బయటికి వస్తుంది

జీవితాన మలుపు లెన్నొ అన్ని స్థితులు కవితలో
అన్నిటికీ చోటుతో ప్రజాస్వామ్య నిలయం

ఇది కన్నీరును తుడిచే కిరణ మయం
ఇది మిన్నేరును దించే యత్నఫలం

కనబడేది ఒకటి కనబడనిది ఒకటి
ఇది మరచే స్థితిలో! ఉంది రహస్యం

# 6. అన్ని విధాలుగా

వెన్నెలలో చంద్ర బింబం అభయ సుందరంగా
చుట్టూ మెరసే చుక్కలు జన తతి బింబాలవలె
కొన్ని రాత్రి వేళలు నిర్భయంగా గడుస్తాయి

చంద్ర బింబం మాయమై వెన్నెల అదృశ్యమై
కొన్ని రాత్రి వేళలు భయదాకృతి వహిస్తాయి
నిద్రలో భయం పోయి ఇవి గడచిపోతాయి

కొన్ని వేళల ప్రకృతి ప్రభావంతో జీవితం
మంచి చెడు మిశ్రమ స్థితులతో కాలం గడుస్తుంది
చుట్టూ చీకటి కడలి! మధ్య పడవ వలె కవిత్వం!
చెలియలి కట్టను చేరడ మొక సాహస క్రియయే

చీకటి అనగానే మనసులో ఆలోచనా ఫలకం
కష్టం వేదన బాధలు దుఃఖం చిత్రాలతో!
గాలి పయనిస్తుంది! చీకటిలోను నిరాఘాటిగా
తలుపులు వేసినా కిటికీలు మూసినా, సందు చేసుకోనేను
ఎవరు కోరినా కోరక పోయినా కవిత అదే మోస్తరు
ప్రాణాలను నిలుపుతుంది జీవన రుచితో; ఏ భేదం లేకుండా

వెలుతురులో చీకటిలోను వాహనం దూసుకపోతుంది
దుమ్ముతో పాటు హఠాత్తుగా భయాన్ని వదలుతుంది
దుమ్ము నుండి తేరుకొని స్తిమిత పడే లోపల
ఏదయినా జరగవచ్చు అపాయమో! ప్రమాదమో

ఇతిహాసానికి మనుషులెందరో అన్ని ముఖాలు
ఎన్ని మారులు చదివితే అన్ని కోణాలేర్పడతాయి!
సరికొత్త కోణంలో అనుభవం విస్తృతమవుతుంది
ఉన్న దానిలో మార్పు! సమాజ వికాస సహజం!

పూవు కనబడితే కవిత వచ్చి వాలుతుంది
నిప్పు కనబడితే కవిత ఎగిరి దూకుతుంది
బ్రతుకులో స్థితులెన్నొ అన్ని విధాలుగా కవితలు
అందం గంధంతో తేజో రూపం వశమవుతుంది

# 7. మరవ లేదు దాచలేదు

జీవితం అనంతం కాదు! అతీతం కాదు
ఎక్కడి కక్కడ బహు పరిమితులు కలిగింది
ఏ బిందువు వద్ద ఏది ఆగేదీ సాగేదీ తెలియదు
మనిషికి కోరిక లెన్నో! కవితకు ప్రయోజనాలన్ని!

చరిత్ర నేపత్యంలో వ్యక్తి జీవితం
వర్తమాన వికాసం జాడలలో రూపొందుతుంది
ప్రతి కవిలో ఏదో పరివర్తన కోణంలో
ఆలోచన! జన హిత చింతనతో సిద్ధంగా

తనదయిన అస్తిత కొత్తగ రూపొందుతుంది
తన ఉనికిని వేరు చేసి చూపిస్తుంది
ఒక స్థితిలో తరు మూలం కనిపించదు
బోదె నుండి పై రూపం మాత్రం కనబడుతుంది

బికారి వికారి ఉద్రేకి ఉన్మాది మనిషిని
సమాజం భరిస్తుంది, చలనంలో భాగంగా
ఎన్ని ఆగడాలనయినా సహిస్తుంది క్షమిస్తుంది
కొత్త దారి చూపుతుంది, అవసరమయితే!

కవితలో శబ్దం ప్రవాహంలో అలవలె
పరంపరలో భాగమయింది! నడక ముందుకే!
చిన్నదో పెద్దదో బ్రతుకుల ప్రయోజనం
విశాల సమాజ చరిత్రలో విస్మరించరానిది

వానకాలం వస్తుంది, వర్షాలు కురుస్తాయి
వరదలు చెలరేగుతాయి; తెలిసిన విషయం!
ప్రమాదమయినా నది అంచున ఆవాసం
మానేరా? ఆపదల్ని ఎదుర్కొని నిలిచేరా?

భూమిపైన కవి అస్మిత
నింగి నుండి రవి ప్రకాశం
రెండూ ఒకటే సమాజ సందర్భంలో
ప్రగతి పథంలో వికాస హేతువులు!

ఎవరి భయం లేని కవి హృదయం
నిజం మరవ లేదు, దాచలేదు ప్రకటిస్తుంది

## 8. ఆకర్షణ

ఆశా మరీచికల ఆకర్షణ, పరి తాపంలో
దాహంతో ముందుకు వెళ్ళే కొద్దీ నడిపిస్తుంది
మూలలలో అణగిన దీన హీన స్వర పంక్తులు
కవిలో సుళ్ళు తిరిగి కవితలో నినదిస్తాయి!

కోరిక అన్వేషణ పరిశీలనలో ప్రయోజనం
బరువు కన్న మనిషిలో విలువలకే ప్రాధాన్యం
మాట కన్న మౌనం మహదలంకారం కావచ్చు
మాటతో మనుషుల లౌకిక స్థాయి పెరుగుతుంది

ఉన్నత స్థలం నుండి కవిత విశ్వమయమవుతుంది
అక్షర జగత్తుతో హృదయ వశమవుతుంది

ఏ దార్శనిక పథం కాలి బాటను మూయలేదు
పోవలసిన చోటును బట్టి, ఎవరి దారి వారిది!
కవితకు క్యాలెండరు తేదీలతో పనిలేదు
పంచాంగంలో గ్రహ సంచారంతో పనిలేదు

బ్రతకడ మొక అనుభవ విద్యానిలయం
తెలిసిన దానికన్న తెలియని స్థితులెన్నో!
భూమిపైన నడచినంత సులభం కాదు
నింగిలోకి నిచ్చెనపై ముందుకు సాగడం

మనిషి మనిషిలో తన సుందర నిలయం
నాల్గు దిశలలో తలుపులు తెరవబడీ

కవితలో శబ్దం వాస్తవాన్ని ధ్వనిస్తుంది
అనుమానం లేని వజ్రం తళతళ లాడుతుంది
ఏదో సూచన హెచ్చరిక గళంతో
మాటలో భావ జనం చూపిస్తుంది

నేలపై నడచే మనిషి నింగిలో ఎగరలేదు
యంత్ర విహంగంపై వెళ్ళినా! అది కొంతసేపే!

సృజనకు మూలమయిన స్పందన వేదన కళతో
అక్షర సహయోగంతో భావ జగం స్వతంత్రం

# 9. ఎవరైనా కానీ

అర చేతులు నిశా ఫలకాలు కావడ మొక విచిత్రం
అవి హింసకు హత్యకు పరికర మవడం దారుణం

వ్యక్తి శక్తి బయటి కొస్తుంది అవసర మేర్పడినపుడు
సంఘ బలం పాత్ర వహిస్తుంది! పరివర్తన గతిలో
ఒకరికి రుచించింది మరొకరికి ఇష్టం కాకపోవచ్చు
ఎందరో ఎన్ని సమూహాలో! కలిసిన నిలయం సమాజం!
పలు విజయాలతో ఆగని ఘన చరిత్ర కలదీ
వ్యక్తి తలంపై సమాజ భావనతో త్యాగమయం

సౌభాగ్య సమాజాన్ని వాస్తవం చేసేందుకు
ఛేదించే ఆలోచనలొకచోట సమాధాన పడతాయి
సమాజ శ్రేయం దృష్ట్యా విశాల దర్శనమతితో
మనోజ్ఞమయిన వాస్తవం అనుభవానికి రావాలని!

సంక్లిష్టమైన సమస్యలో దారి దొరకని మనస్సు
అంతరంగ నిలయం తలుపును తడుతుంది
ఇది తెరవ బడడ మొక అదృష్ట విశేషం
సందేహం లేని నిర్ణయ మవసరమవుతుంది

ఇంద్రధనుసు పలు రంగుల్ని ప్రకటిస్తుంది
దివిపై దృష్టిని ప్రసరింపగ చేస్తుంది

పొగలు వదలుతూ సిగరెట్ ఆయువును గుర్తుకు తెస్తుంది
మండుతూన్న పొయి ఆకలి తాపాన్ని తలపిస్తాయి
విధ్వంస చర్యలో ప్రతికూల గుణం బయటపడుతుంది
సృజన జీవన భాగ్యంలో తోట పొలం జ్ఞప్తికి వస్తుంది

ప్రజా స్వామ్య సామ్య వాద దార్శనిక వ్యవస్థలో
ఎండిన బ్రతుకుల తరువులు చివురులు వేస్తాయనే!
బాధలో ఉపశమనం, కష్టానికి పరిసమాప్తి
శ్రమ జీవన చలనంలో కవిత! అమర హృదయంతో

ఎన్ని శిలల మధ్య నుండి అయినా! నడవాలిసిందే
జల బిందువు దొరకేనని ఆశ ! మనిషిలో!
గిరి శిఖరం నుండి జలధార వలె కవిత అమోఘంగా
ఎవరైనా కానీ అలల పద పంక్తిని చేరాలిసిందే!

# 10. కవి దృష్టిలో

మనిషి కన్న ఉనికిలో పూర్వానిది తరువు
వచ్చే తరానికీ అందుతుంది, ప్రియంగా
వర్తమాన భాగ్యంలో ముఖ్యమైన భాగం
మనిషికి నరకే శక్తి ఉంది, హక్కు లేదు

గాలిలో తేలే మాటలతో కవిత
బ్రతుకు మూట విప్పి, పంచుతుంది చెట్టులా
శబ్దానికి లయ లహరులు చేరుతాయి
లయ కలనానికి రాగ ప్రసారం చేరుతుంది

సమస్య లొకటొకటీ బ్రతుకులో! తెలిసినవే
అక్షర సహభావంతో కవితలో! బింబించేను

విత్తు చివురు ఆకు ఫలం రూపం రంగులు వేరు
జీవి తాన ప్రతి దశలో మారే స్థితులు వేరు
పక్క నున్న వస్తువు ప్రభావం, అనివార్యంగా
తోడు ఉన్న శబ్దం ప్రయోజన గుణ మెంతగనో

ఒడిలో ఆడుకునే పాపతో అమ్మవలె
నీలి రంగు చిత్రంతో! చంద్ర బింబం!
వెన్నెల రాత్రికి కవిత! స్వాగతం పలుకుతుంది
చీకటి దశ పట్ల సానుభూతి చూపుతుంది

ఎంత ఇష్టపడి ఎవరెస్టు శిఖరం చేరినా
అక్కడ నిలిచేది కొంత సమయం మాత్రమే!
ప్రకృతి నేపథ్యంలో భూమిపైకి తప్పనిసరిగా
దిగి రావలసిందే, రమ్యమైన అనుభవ సంపదతో

నేలపై వసించే మనిషి నింగిలో నడచేనా?
యంత్ర విహగం పైన అయినా! అవసరం తీరే వరకే!

కవితలో ఊహకు తోడుగ పదాలెన్నో!
బారులుగా! మనసుకు చెప్పరాని అందంతో

మనిషి మనిషి కలిస్తే సమాజ శక్తి అనంతం
ప్రకృతితో సమంగా జీవితాన్ని నడిపించేను
కల్పనలో ఏమయినా కావచ్చు కవి దృష్టిలో
నివురు కప్పిన నిప్పులా వాస్తవం బ్రతుకులో

## 11. సుఖ యానం

మనిషి మనిషినీ దిశ దిశనూ చేరుతుంది
కవిత! చేతన చరణాలపై, మానవమై
పని పడని చుక్కలు రాత్రి తెల్లని పూలుగ తోచేను
మనిషి దృష్టిలో మార్పులెన్నో! ప్రయోజన పథంలో

ఉదయం అస్తమయం రెండూ సమానం
పయనానికి కాల విభజనతో పనిలేదు

జల నిలయం పడవను ఆహ్వానిస్తుంది
నదియొ! చెరువొ! చెలమొ! నూయియో!
ప్రాణుల దాహార్తిని తీర్చే మంచి నీరు ఒకటే
జీవన క్షేత్రంలో మట్టిని సస్యమయం చేసేను

సముద్ర మొక సుందర స్వప్న నికేతనం
మహాత్ముని హృదయాన్ని తలపింప చేస్తుంది

బయటి నుండి లోనికి లోనుండి బయటికి
రెండిటిలో మానవం! వాస్తవ పద గతిలో
పయనంలో కోరిక! కాలాని కతీత మయింది
ఏ దేశ మయినా మనిషి మనో వ్యవహారమొకటే

నర ఘోషతో నర హననం ఒకరిచే
ఇది సమాజ బింబానికి కళంకం
స్మృతి నిలయానికి శిథిలాకృతి నిచ్చేను
ఎగుడు దిగుడు నేలపై సుఖయానం జరగదు

మండే జ్వాల వలె సాయం సంధ్య
మనిషిని భయానికి గురి చేసేను
ఎగసే మెలకువ వలె ఉదయ సంధ్య
మనసును రాగ మయమొనర్చేను

ప్రశ్న సమాధానం పయనం సాగుతుంది
పయనం మనసును రాగ మయమొనర్చేను

గమ్యం నుండి గమ్యానికి! ఎంతకాలమయినా
దారిన పోవలసిన దూరం ఒకటే! ఎప్పటికీ
ఎన్ని తరాలు గడచినా కాలమదే
తిరిగే జీవన చక్రంలో మార్పులతో

# 12. సార్ధకంగా

చెట్టు కల ఫలిస్తే పూవు ఫలంతో మోదం
మనిషి కల ఫలిస్తే సమత మమతతో హ్లాదం

కవితలో జీవితం సమాజం మానుషం రాజ్యం
దేనికైన సంబంధించిన ప్రశ్నలు ఒక వైపున
సమాధాన సూచనతో ఆలోచన ఒక వైపున
బంగరు నాణెం మాదిరి చెల్లుతుంది కవిత!

సృజన ప్రతిభ ఉన్న వ్యక్తిలో ఆలోచన సంవేదన
అక్షరాకృతి పొందుతుంది, కవిత వెడలుతుంది
భావన చేతన స్పర్శతో ఆదరణీయమవుతుంది
భాషా సంస్కృతిలో భాగమవుతుంది చరిత్రలో

ఆదర్శం ఆచరణంలో ఎదుర్కొనే పరీక్ష లెన్నో!
సహనం నిపుణత నైతిక స్థిరతలకు చోటు దొరకేనా?

ప్రజాస్వామ్య సామ్యవాద స్వేచ్ఛా సమాజంలో
అందరికీ అవకాశ దిశలు! తెరవబడీ

అదృష్టంపై అశ్వ విహారం చేస్తారొకరు
నీరు అందని కట్టపై దాహంతో తిరగేరొకరు

ఎర్రని ఆశల పూల శాలువా బుజాన వేలాడుతూ
వీధిలో ఫిడేల్‌పై ఆకలి తీరే రాగం వినిపించేనా?

మనసులో గుట్టలుగా పేరుకొన్న కోరికలు
ఆచరణంలో బయటికి వచ్చేను నిర్భయంగా
ఆలోచన కారాగారామయితే కష్ట దశలో
పూలు చల్లక పోయినా కత్తి దూయ కుంటే చాలు!

ఉపయోగం తెలిసేది అవసర మయినపుడే
పిడుగు వలె భయపెట్టే స్థితి ఉండదు కవితలో

ఆలోచనలొకటొకటి స్పందనలో కవితయై
నిప్పులా వెలగవచ్చు, మంచులా మెరవచ్చు

రోజు గడచి బరువు తగ్గుతుందనుకుంటే
పాత దానితో కొత్త బరువు స్నేహమయ మవుతుంది
మౌనంలో దాగిన శబ్ద ప్రపంచం
కవితలో దిగుతుంది సార్ధకంగా

# 13. మనసును తడుతుంది

కొత్త మాట కొత్త బాట అనుభవ గంధంతో
దూర దూరం తన ఉనికిని చాటు తుంది కవిత,
ఇది చెలమ కాదు చెరువు కాదు రసధుని
సుదీర్ఘ యానంలో జీవన దృశ్యాలతో!

గతాశ్లేషం నుండి ముక్త మయిన వర్తమానం
జన బంధువు! సుమనోజ్ఞం! స్వేచ్ఛా కవిత్వం
భూమిపై ఆత్మీయం సమాజంలో భాగం
పవనం సన్మిత్రం భావనలో నవ మానవం

ఒక సమయంలో నీ కన్న ముందు నీడ!
కదలుతుంది, మంచి తోడుగ నడుస్తుంది
భయం లేని హృదయంతో సాగే కవిత
పీడిత దుఃఖిత శ్రేణుల సౌభాగ్యం కోరుతుంది

నీలి మబ్బు తన దారిన వెళుతూ
సూర్య బింబానికి అడ్డమవుతుంది
కావాలని చేసింది కాదు
జరిగింది! అనుకోని ఘటన!

పిల్లల ఆటలో బంతిలా చుక్కల మధ్య చంద్రుడు
పెద్దల మనసును బాల్య దశకు తీసుకపోతుంది
మనసు నుండి అశాంతి దూరం జరుగుతుంది
ప్రసన్నయిన వలయంలోకి ప్రవేశిస్తుంది కవిత

ప్రకృతి నుండి సమాజం నుండి నేర్పినదెంతో
ఒంటరిగా పొందలేని విజయాలెన్నో!
ఒకటి మాత్రం ప్రత్యేకం అది! వ్యక్తి స్వేచ్ఛ – స్వతంత్రం
ఆలోచనలో ఆటంకం లేదు; అనుభవ గతిలో అడ్డంకులు!

భద్రతలో బాధ్యతతో రక్షణలో కర్తవ్యంతో వ్యక్తి
ఆకలి తీరేందుకు భాగ్యం పొందేందుకు
ఎక్కడికయినా వెళ్ళేందుకు సిద్ధంగా!
ఊరు నుండి నగరానికి నగరం నుండి అడవి కయినా!

కాలాన్ని శాసించే శక్తిని కోరేను మనిషి
రణానికీ శాంతికీ మనసును తడుతుంది కవిత

## 14. ఊపిరితో ఒకటై

అక్షర మర్యాదను మన్నన స్థాయిని నిలిపే వారున్నారు
అక్షరాన్ని బురద బురద చేసి! అమాయక వాలకంతో
పంకజాన్ని పొందాలని ఆరాట పడే వారు కొందరు
అక్షరాన్ని హింసించి ఆనందించే వారు కొందరు

అవసరానికి వాడుకొని భంగించే వారున్నారు
ఆయుధంగా మలచుకొని విజయం కోరే వారూ
మానవ జీవన సంస్కృతిలో శిఖర భాగం, కవిత
మనిషి ఎత్తును లోతును చూపుతుంది జీవితంలో

మెదడు నుండి పెదవులపై నర్తిస్తుంది మౌఖికం
ఎదురుగ పూవులా విప్పారుతుంది లిఖితం
ఎడారిలో తిప్పవు; మరీచి కల్ని చూపవు
భౌతికంతో మనోమయం అక్షర కృతి కవిత

అనుభవంలో పచ్చని పొలం గట్టుపై నడిపిస్తుంది
శుష్కతకు చోటు లేదు, ఆ సమయం ఆర్ద్రమయం
సంఘంలో అందరినీ కలుపుతుంది మాటలో
చిర బంధానికి కారణ మవుతుంది, అక్షరం

శిశు దశలో ఊహ వెంట మాట ముద్దుగా
పరిణతిలో అధిష్ఠా తృ శక్తిమయం కవిత
మంచి చెడు అనుభవ సూక్ష్మతలతో
మనోగుణ సుందరతతో అభిలాషను పెంచుతుంది

చీకటిలోనూ నిర్భయ ప్రవాహ రూపమవుతుంది
జలధిలో పయనానికి నావగ మారుతుంది
ఎంతటి కష్టంలో నష్టంలో ఆగదు కవిత
జీవన లక్ష్యంతో దిశలను నిర్దేశిస్తుంది

కల్పన కవకాశం లేని జీవితంలో
వాస్తవ మొకటే ఆశయానికి మార్గం
కల్పనలో వాస్తవానికి చోటు దుర్లభం!
వాస్తవ గతిలో కల్పన కవకాశం దొరకవచ్చు

జీనవ రాగంతో కవిత! అక్షరమయం
ఊపిరితో ఒకటై ప్రాణిత మవుతుంది!

# 15. ధైర్య కవచమిస్తుంది

శ్రమ జీవన సమాజ ప్రతిఫలనం! అక్షర నిలయం
దహన స్థలమయినా సమాధి రూప మయినా
శూన్య మనుకొనే చోట తొలి చినుకులకు
తల ఎత్తిన మొలక! కవితకు ప్రేరణమవుతుంది

బాధలో దుఃఖంలో కోల్పోయి పచ్చని కళ
అక్షర ప్రియులకు కవితలో కనిపిస్తుంది
చీకటి తొలగిన క్షణాన ఉదయ రశ్మిలో
నిర్మలిన మయిన మనసు శుభ్ర హంస అయ్యేనా?

కంచం మీద మంచంమీద సూది మీద దూది మీద
బులుపు కవిత! ముత్యంలా మురిపెంలో ఇష్టంగా
కనిష్ఠ రూపంలో పూవును తలపిస్తుంది
లోని సృజన రేఖ మతిని ఆకర్షిస్తుంది

రోజు వెంట రోజు రాకపోకలతో బ్రతుకులు
విసుగును పుట్టించేనా? వదలాలనిపించేనా?
అనుభవ క్షేత్రంలో కాలం గతులతో రుచులతో
అను రక్తిని పెంచుతుంది, సృజన కళా హృదయం

అక్షరాభ్యాసంలో తెలియని తనం నుండి
చదువులో తెలిసిన తనంలోకి మానసికంగా
కవిత్వ పఠనంలో కాలం ఆగినట్లనిపిస్తుంది
మలుపు తీసుకొనే ప్రవాహ గమనం అందం చూపేను

విగ్రహంలో ఆదర్శ బింబం
గతాన్ని జ్ఞాపకం చేస్తుంది, మాటి మాటికీ

కవితలో కవి యశో రూపం
వర్తమాన రుచిని పెంచుతుంది
భవిత పట్ల ఆశను నిలుపుతుంది
సమాజ శక్తికి దిశను చూపుతుంది

దోషిని అపరాధిని సంస్కరణ పథంలో పెడుతుంది
మార్పులో ప్రతి మతికి ధైర్య కవచ మందిస్తుంది

అక్షర మయ నవ కవితాలోకం
జన గణ యుత సమ సమాజ రూపం

# 16. ఇక్కడే

ప్రతిమలో సజీవ భావన అనుభవంలో దైవం
శూన్యంలో తత్వ దర్శనంతో విశ్వాసంపై పై లోకం
భూమిపై జీవన కథలో విభవ విజయ కాంక్షాలోకం
అక్షర పద పద్మంలో కవిత కవి కాంక్షా రూపం

బ్రతుకు పై అభిలాష నవ నవ మయి ఉన్నంతవరకు
భవితపై నమ్మకం బెదరి చెదరి పోనంత వరకు
శిలా తలంపై పారే జలధారలా ఆలోచనలో
తాప శిఖలపై మేఘంలా ఆశయ రూపం కవిత!

ప్రతి కవిలో తన సృజన అపూర్వమై నిలవాలని
ఆగని పవమాన యానంలో దిశలను చేరాలని

మౌనం కత్తిరింపబడి సుకుమారంగా
అందమైన మాటల బొమ్మలు విడుదలయ్యేను
స్పందనలో జీవ గుణం కవితను బ్రతికిస్తుంది
వర్తనలో వెలుగును మనిషి మనసు కోరుతుంది

కవితను పొందేందుకు కానుకతో పని లేదు
సిపారసుతో పని లేదు, వెల చెల్లించనవసరం లేదు
ఉదయ కిరణంలా ఉత్సాహంగా వెడలుతుంది
విజయ హృదయంతో రోజు నిష్క్రమిస్తుంది

తుపానును తలపిస్తూ ఉగ్రతను చూపవచ్చు
వ్యతిరేకాన్ని వినిపిస్తూ ఉద్యమం రూపెత్తవచ్చు
నేపథ్యంలో జలధి అలల హోరుతో
సమాజంలోని అలజడిని ధ్వనింపవచ్చు

జన గళం నుండి పిడుగులు రాలవచ్చు
మస్తిష్కం అగ్ని వేది కావచ్చు, రణక్షేత్రం కావచ్చు

అదృశ్యమయిన బలమైన కోట గోడ స్థానంలో
ఇపుడు ! జన సమూహి పంక్తులు! ప్రజాస్వామ్యంలో

ఉఛ్వాస లహరులలో ఒకటై అక్షరం
సృజన గుణంతో కవిత! ఆశావంతమవుతుంది

ఏది కవిత? ఎవరు మనిషి? మానవతా సుధ ఎక్కడ?
ఇక్కడే, ఈ భూమిపై జీవితంలో, మరో చోటు లేదు

## 17. పాత్రలు భిన్నం

ఊహ నుండి మాటలో వర్తనలో పనిలో
ఆవిష్కృతమవుతుంది, మనిషి! వ్యక్తిత్వం
ఇది కవితకు అస్తితలో ప్రత్యేకత నిస్తుంది
బయటి నుండి చూపుకు అంతా ఒకటే!

కవికిది సంతోషం కలిగించే విషయం
మరొకరి నుండి విమర్శకు గురి కావచ్చు
మనిషిలోని శత్రు మిత్ర భావ చయం
రణం శాంతి వేరులతో పొదుకొన్నవీ

పయనంలో దూరాన ఏ మందిర శిఖరమయినా
ఒకటే! ఆదరణీయ మవుతుంది మనసులో
దగ్గర కెళితే పరిమితిలో బంధిస్తుంది
వ్యక్తిని మానసికంగా కట్టడి చేస్తుంది

కవిత నుండి దారులెన్నో! దిశలలో
కవిత వైపు చూపులెన్నో! దిశల నుండి
రథ చక్రంలో అరల వలె అభిప్రాయాలు
సృజన కళ ఇరుసుతో, కవిత తిరుగుతుంది

చలనంలో అభివ్యక్తి సుందరత కళామయం
ఒక్కొక్క స్థానంలో ఒక్కొక్క వాదమొ, దార్శనికమొ
లక్ష్యం! సమాజ స్పృహతో విలువల జీవితం
ఆమోదం వ్యతిరేకం ఒకదాని వెనుక ఒకటి

అన్నిటికీ కారణాలు నిబంధనలు విధానాలు పరంపరలో
విశేష సందర్భంలో అంతరంగ ప్రవేశం జరుగుతుంది
కవితా రచనకు వ్యూహం ముందుగ పైలట్ వాహనంలా కదలుతూంది
సృజన పై అభినందనం అభిశంసనం స్వేచ్ఛా వేదికపై సహజం

ప్రతి సమస్య అగ్ని పరీక్షకు గురి చేయబడదు
మనో బింబ ప్రకాశంతో తీర్పు వెడలుతుంది
భేదాలను అనుమానంలో ముంచి తీయడం కుదరదు
సృజనలో ప్రతిభ, విమర్శలో ఔచితి ప్రాధాన్యం వహిస్తాయి

ఉన్న ఊరు మారవచ్చు, లేని వెన్నో చేరవచ్చు
గిరి నది జనతతితో కవుల మనోభవం పాత్రలు భిన్నం!

# 18. అమృత హస్తం

జీవన మథనంలో హాలాహల కోలాహలంలో
కవిత! అమృత బిందువులను పలుకుతుంది
ఎవరిదయినా జీవితం! ముగిసిన పుస్తకం కాదు
ఇంకా మిగిలే ఉంటుంది! మరో తరాని కందుతుంది

పొందిన దానికి పొడిగింపయి గ్రంథం స్వతంత్రమై
కాలం అందంగా గడవాలని ఉంటుంది
అనుభవం సఫలం కావాలని ఉంటుంది
ఇది సులభం కాదు, దీని కెంత కృషి అవసరమో

కవిత మొదలు అవడంతో కవి హృదిలో
ఉషసు అడుగు పెడుతుంది హిమార్ద్ర కిరణంతో
మౌనంగా ఉన్న పెదవులపై క్షణాల్ని పలికిస్తుంది
మనిషిలోని నిజ రూపం ప్రకటిస్తుంది, చూపిస్తుంది
శ్రమ జీవుల అడుగులు గొంతుక శబ్దం వినిపిస్తుంది
పల్లె పట్టణ మని వేరుకావు, పని విషయంలో ఒకటే
కవితలో కోష్ణత క్షణాల్ని కరిగిస్తుంది
మంచు ముక్కలవలె హ్లాదంగా సరిస్తాయి

చల్లని గాలికి ఇంకా నిదుర తొలగని
మనుషుల మనసుల్ని మేల్కొల్పుతుంది కవిత
కలహం నుండి స్నేహం వైపు తిప్పుతుంది
ప్రేమ కరుణ స్పర్శ కందరూ సమానమే

సంశయం నుండి నిర్ణయానికి నడుపుతుంది
అనాసక్తికి విరాగానికి గుడ్‌బై చెబుతుంది
అభిలాషకు నిబద్ధతను జోడిస్తుంది
శ్రమ శక్తిని చైతన్యమయం చేస్తుంది

పయనంలో పరిచయం మనుషుల్ని కలిపితే
మానవంతో కవిత! మనసుల్ని కలుపుతుంది

సమత మమత నవతలను కలిపి పేనుతుంది
ఒకేమాట! ఒకే బాటతో గమ్యం ప్రజాస్వామ్యం
విధ్వంసంలో శిథిల దృశ్యంలో ప్రాణికి
ఊపిరి నిలుపుతుంది! అమృత హస్త మందిస్తుంది

# 19. అవసరమైంది

భూమి తాపం తీరేందుకు మేఘం
ఎక్కడనో ఉన్న జలధి నుండి రావలసి వస్తుంది
ముందుగ చల్లని గాలిచే కబురు తరలుతుంది
గర్జనతో తన రాకను ప్రకటిస్తుంది

కవిలో స్పందన గుణ చేతనతో కవిత
గిరిలో నదిలో మదిలో ఉత్సాహం నింపుతుంది
నిర్మాణానికి అడుగులు ముందుకు వేయిస్తుంది
ఫర్మానాలకు తల ఒగ్గదు, కథ నడిపిస్తుంది

కోరిక ముక్కలయితే గమ్యం చేరే దెట్లా?
గతాన్ని భవితను కలిపే వర్తమాన దృశ్యంలో
ఎవరి మనః ప్రపంచం వారికి ప్రియం, ఘనం
అద్దంలో వలె కవితలో సమాజం! బహు కోణాలలో

గుప్తంగా ఉన్నవి లోనుండి బయటకి వస్తే
ఇంకేముంది? పరస్పరం కలహ సంరంభం
లోన ఉండడమే మంచిది! అందరికి తెలియకుండ
ఉన్నది గుహ కావచ్చు లోయ కావచ్చు గోయి కావచ్చు

మెలకువలో ఈ జగత్తు స్వప్నం కాదు
వాస్తవంలో అతీతాన్ని వెదకు తుంది కవిత!

నీరు కొలది తామర, పాత్ర కొలది నీరు
ప్రతిభ కొలది శ్రమను బట్టి జీవన సఫలత!
శుష్కతకు మనోదరిద్రానికి చోటులేదు కవితలో
త్యాగం రాగం కరుణ సమత బంధంతో మానవం

సమస్యకు పూర్తి సమాధానం ఏ తర్కంలో దొరకదు
అంతరంగ స్ఫూర్తి ఒకటే ఆశ్రయ మవుతుంది
ఇది హృదిలో అనుభవ స్మర్శను కోరుతుంది
సానుకూల దృష్టి నిబద్ధత కెదురు చూస్తుంది

వ్యక్తి – సమాజం రెండిటి ప్రభావ బలంతో
పూర్ణత కవకాశం బ్రతుకులో ఉజ్వల ఘట్టం
ఇది మానవ సంస్కృతీ వికాస దశలో అపూర్వం
కవిత దేనికి! మనసు కవసరమయింది ఈ జీవన నైజం

## 20. తెలియక పోవడం లోనే

సాహిత్య స్థాయిని బట్టి కవితపై అవగాహన ఏర్పడుతుంది
మనో నయన దృష్టి ప్రసారాలతో కోణాలేర్పడుతాయి

పసి మనసుకు కూడ ఊహలో తీరు తెన్ను లుంటాయి
ఉపయోగంలో ఏదీ వ్యర్థం అనవసరం మాట లేదు
ప్రశ్నలనంతం! ఒక దాని వెనక మరొకటి!
సమాధానమేదీ ? ఏదీ చివరది కాదు; కానేరదు

తెగిన తీగెతో నిశీథి చీకటిలో
వాద్యం వయొలిన్! నవ యోగం పొంది
ఉదయ వేళకు సంసిద్ధ మవుతుంది!
కొత్తగ నవ చేతనతో మనిషిలో

గాలి కదలి వడిగా మ్రోగ చూచే వేళ
మనిషి వేళ్ళు తీగలపై కదలుతాయి!
అంతవరకు మౌనంగా ఉన్న మాట పలుకుతుంది
బ్రతుకుతో స్వనిస్తుంది కవిత శ్రుతి పేయంగా

కవితకు ప్రేరణ స్థానం దొరకుతుంది సమాజంలో
చీకటి భయంతో పాటు! సంకుచితం తొలగుతుంది
కవితకు శాశ్వత నిలయం లేదు అక్షరమే విశ్వ పీఠం
ఉన్నదానితో తృప్తి పడితే, పొందేది లేదు ఎదిగేది లేదు

దారిన పోయే అడుగు లెవరివయినా కావచ్చు
పాపివి కావచ్చు దొంగవి కావచ్చు ఉదారులవి కావచ్చు
ఏవి ఎవరివో! ఎవరు నిర్ణయించగలరు ?
అవి మనుషుల పనిలో వారి దారికి సూచనలు

ఆరాటం అనుబంధంతో కదలే అలలవలె లిప్తలు
దూరం నుండి చూస్తే ఊయెల వలె జలధి !

వర్తమానంలో అనుభవమొక వాస్తవ దృశ్యం
ఆ వెనుక నున్న భవిత! ఆశా రూపానికి నిలయం

నిప్పు నెవరు చేతులలోకి తీసుకుంటారు?
ఇది పట్టుకునే సాధనం సహకారం కోరేరు!

భౌతికం పునాదిపై అతీతం రూపొందుతుంది
అర్థం పూర్తిగ తెలియక పోవడంలో, కవితకు అందం!

# 21. జడతలో చలనం

ప్రభుతతో కవిత
జన సమూహ పంక్తులతో

ఎడారి హృదికి జలస్పర్శతో పచ్చదనం ఇస్తుంది
మట్టి మతిని పైరుతో భాగ్యమయం చేస్తుంది
మనిషి బ్రతుకు మృగ తృష్ణగ కనిపిస్తే
వాస్తవాన్ని పరచి హరిత కళను చూపుతుంది

దారి మధ్య బండరాయిని పక్కకు జరిపి
దాని నొక శిల్ప ఖండంగా తీర్చవచ్చు

జరుగుబాటు లోపించిన పేద వాని మాట
తిరుగు బాటు నినాద రూప మెత్తవచ్చు
ఇది వాస్తవ జీవితాన
వేడి వాడి స్థితి రూపం

కవిత మనిషి మనిషి మధ్య మాటల వంతెనయై
భిన్న వాదమతులను ఒకటిగ కలుపుతుంది
దాట రాని దాన్ని దాట జేస్తుంది! ధైర్యంగా
తీరం దాటాక! తృప్తి మార్పును వరిస్తుంది

రైలు కారు విమానం రూపంలో అక్షర వాహనాలు
అశ్వాన్ని కరిని పక్షిని మరపిస్తాయి కవితలో

నాలుగు గోడల మధ్య వసతిగ వ్యక్తి చేతన
గోడల్ని దాటి విశాల క్షేత్రాలలో సమాజ చేతన
రెండిటి ఆదాన ప్రదాన ప్రభావ గాథలతో
సుగమ జీవితం కై సంవేదన సంకల్పం కవితలో

అమర భావ గుణంతో కవిత! విజయానికి ప్రతినిధియై
కన్నీటి బిందువులో కుసుమ కళిక చూపేను

సూర్యుని ఆవాహనతో కవిత! వెలుగు దారి అయ్యేను
చంద్రని వశం చేసుకుని హ్లాద మయం అయ్యేను

వర్తమాన ఫాల తలంపై అక్షర కళతో కవిత!
పరిసరాల జడతలో చలనం మేల్కొల్పేను

కవిత ! ప్రభుతతో
జీవ సమూహ పంక్తులతో

# 22. వినని స్పందన

నిన్నటి ఉత్సవం నేడు స్మృతిలో గుర్తుగా
నిన్నటి రణ పదం నేడు, గుణ పాఠంగా
బీటలు వారిన బ్రతుకులో అసాధారణంగా
ఆర్ద్రతతో కవిత! పసిమి నింపుతుంది!

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు
ఎంతటి వారయినా ఇష్టంలో పని లేకుండా
మౌనాన్ని విప్పుతుంది అంతరంగ ధ్వని
దిశ దశ మారే యత్నంలో కవిత !

అశ్రు బిందువులో వెచ్చని ఎరుపు రేఖ
వర్తమాన సమాజంలో క్షోభను చూపిస్తుంది
అశ్రు బిందువులో చల్లని తెలుపు రేఖ
వ్యక్తిలో పైకుబికే ప్రేమను తెలుపుతూంది

ఎంతటి శిల్పంలోను శిల కాదు, కవిత
చలనంలో అలయై ముందుకు కదలుతుంది
పద పదంలో స్నేహ కళను నింపుతుంది
శ్రమ చేతనతో మనసును లాగుతుంది

బొగ్గుకు నిప్పంటితేనే దహన గుణ రూపం
మండే సూర్యుని తలపించవచ్చు
మెరసే వజ్రాన్ని ప్రదర్శించవచ్చు
సరికొత్త విలువలతో బంధిస్తుంది

ఏ రోజున కారోజు ఒక అధ్యాయ మయ్యే
జీవన గ్రంథంలో కవిత ! మానవ భావనతో

ప్రేమకు తగని వస్తువు లేదు ప్రపంచంలో
పాము పక్షి విరోధులయినా చోటు లభిస్తుంది
భౌతికావసరాలకు "ధనం" పాత్రలాగా
మానసావసరాలకు 'కవిత', అమూల్యంగా

జీవితమెన్ని దిశలతోనో కవిత అన్ని ముఖాలతో
స్థలమేదయినా మాటలవే! బాటలవే! తీరులవే!
ఓటమి విజయం కష్టం సౌఖ్యం కలిసిన అక్షర రూపం
చరిత్రలో వినని స్పందనల్ని వినిపిస్తుంది కవిత!

# 23. తెలిసినవీ తెలియనవీ

కవిత బరువు కాదు గొప్ప బాధ్యత యే!
తేలే మబ్బులా విరిసిన పూవు లా తేలికయే
మనిషి హృదిని పలకరిస్తుంది, మాట్లాడుతుంది
జీవన గమనంలో ప్రతి దశలో సహకరిస్తుంది

అవనిపై తీగెలా విస్తరిస్తుంది
నింగిలో పక్షిలా పయనిస్తుంది
కవి స్వేచ్ఛా పరికల్ప పథంలో
పద పదాన సుందర గుణ కళతో

భౌతిక ప్రాకారాలను దాటి ఆపై చూపుతో
ప్రతి కవిలో అస్తిత! అపూర్వమై ప్రత్యేకం

పదపదాన ప్రసరించే వెలుగు ప్రభుతతో
కవితకు పట్టాభిషేకం జరుగుతుంది
కవి మనో పీఠంపై ఉత్సవ కళ పొందుతుంది
ఇది జీవన సాఫల్యంతో పూర్ణత చేకూర్చేను

వ్యక్తిలో అర్థం కాని విశేషాలెన్నో
కవితలో అన్ని! అందంగా విలసిస్తాయి

మనో భూమికలో పైకి కనిపించని మహనీయాలు
ఎన్ని గొప్ప పనులు చేస్తామో! తెలియంది "అదృష్టం"

కవిత ముందు అహంకార జ్వాలా మస్తకం వంగుతుంది
ఏ రసమయినా పొంగి పొంగి శమనం పొందాలిసిందే

సహనం శమనం ప్రేమ త్యాగం దిశలలో
యానం! ప్రతి కవిలో అనుకోని ఘటనలతో

ఏ కవిత అయినా కదలి కదలి చివరకు
తెలియని తీరం చేరుతుంది! నిశ్శబ్దంగా
రెండు కొండల మధ్య ! ప్రవాహంలా కవిత
ఆలోచన అనుభవం బుజాలపై చేయి వేసి సాగుతుంది
ఆలోచనా క్షేత్రాల్ని సమార్ద్రం చేస్తూ
అనుభవాల మజిలీలను పరామర్శిస్తూ

పదాలన్ని ఒకటే! మనుషులవలె అవసరాలలో – ఇది
తెలిసినవీ తెలియనివీ కలిసిన ఆత్మీయ సమాజం!

## 24. భవితలోకి

రాత్రి చీకటిలో కలలను విత్తేరు కొందరు
తెల్ల వారగనే వెలుగలవలె మొలకెత్తేననుకునేరు
తెల్లవారి చూస్తే, అదృశ్యమయి అంతా శూన్యం!
ఆశకు ఔచితి లేదు పనికి పరిమితి లేదు

అంత రంగాన్ని మరచి శరీరం బయలు దేరుతుంది
సుఖమూ సంపద అధికారం కయి లౌకిక తంత్రంతో

ప్రభాత సంధ్య తెలుపు నుండి ఎరుపులోకి మొగ్గుతో
సాయం సంధ్య ఎరుపు నుండి నలుపు వైపు మొగ్గుతో
కొన్ని రాత్రులు వెన్నెల కవకాశంతో
ఇవి జీవన పరివర్తన స్థితులకు గుర్తులు!
నేరం దోషం పేరుతో చేరే మలినాన్ని తుడిచేస్తూ
స్వచ్ఛంగా స్వేచ్ఛలో ముందకు పోవలసిందే
కష్ట జీవుల్ని నష్ట జాతకుల్ని అమాయక ముఖాల్ని
కనిపెడుతూ పోవలసిందే! ప్రగతి పథంలో

తిండి బట్ట ఇల్లు వరకు సమానత సంఘంలో
ఆపైన పోయే కొద్దీ విషమతలెన్నో! సమస్యలెన్నో!
అవకాశం దొరకవచ్చు చేక్కగ ఉపయోగించేరా?
మమత నవత సాధ్యం కావచ్చు, నిర్నిరోధంగా

నేడు కంటె నిన్న "బాగు" అని తలచవచ్చు
నేడు కంటె రేపు "బాగు" అని తోచవచ్చు
నిన్న రేపు మధ్య నేడు ఆశలు బరువులతో
కాలంతో పాటుగ వేగంగా పరుగెత్తే దెవ్వరు?

అబద్ధం పూలు పూయదు, ముళ్ళు చూపుతుంది
కంటిచూపు పోయాక అద్దాలతో పని ఏమి?
ఎండిన కట్టె ముక్క దేనికి పనికొస్తుంది?
పొయిలోకో! పెత్తనానికో! చిరు దండనకో!

సింహానికి నిలయం అడవిలో గుహయే
పులికి నివాసం అడవిలో పొదలే
మనిషికి ఆశ్రయం సమ భావనతో సమాజం
కవితలో సమాజ చేతన భవితలోకి నడిపిస్తుంది!

## 25. కవితకు ప్రియంగా

అనుభవ సుందరతకు ఉత్సాహ నిలయం కవిత
సాహిత్య కళా సంస్కృతి స్థాయికి ఆరోహణం
వింటూ ఉన్నా చదువుతూ ఉన్నా
ప్రవాహంలా ఉంటుంది, ఆర్ద్ర కళతో

అంతశ్చేతనతో ఆవిష్కారం పొందింది
సమాజ బంధంతో కాలానికి శోభ నిస్తుంది
అక్షర హస్తం ఎదను తడుతుంది
మనిషి మతిని సావధాన పరుస్తుంది
ఆలోచన వికసిస్తుంది
క్రియాశక్తి పదను తేలుతుంది
బాధలు మరపిస్తుంది, తోడుగ నిలబడుతుంది
పుట్టిన క్షణం నుండి పరిసర సమూహాలు బంధంతో
ఆపై సమాజ యశో రూపం వెడలుతుంది
ఎవరి రాక కోసం నిరీక్షించదు, నదిలా

రాత్రి అయినా భయం లేదు, చీకటిలో
చూచినా చూపుకు రూపం కనిపించదు
హిమ గిరిలా కవిత ధైర్య ముద్రతో
తోడుగ నిలుస్తుంది గుప్త రహస్యంతో

కవితలో "నిజం" రవి తేజంలో వజ్రంలా
అస్తిత అయితే! వాస్తవ రమణీయంగా
ఎవరు ఏ పయనంలో ఉన్నా
ఎవరు ఏ ఆలోచన చేసినా!

తరాలుగా సంపదలో భాగమై
సుగంధ పేటిలా అక్షర రూపం

అక్షర సహయోగంతో కవిత
అభిలాషా హృదయం కేంద్రంగా
బయటి జగం లోని జగం మధ్య
ప్రకాశ మాన ప్రసారాలతో అనుభవం

రోజు వెనుక రోజు క్షణాల పూల దండతో
కాలం! గుడ్ బై చెబుతుంది కవితకు, ప్రియంగా

# 26. అక్షర యోగం

స్వేచ్ఛా పథంలో సృజన యానం దృశ్యమయం కవిత
వెనుకనే గతం ! తిరిగే స్మృతి చక్రంపై నిశ్చలంగా
వర్తమాన వాహనంపై వాస్తవానుభవంలో కవి రూపం
వేల కలలు! మనసులో అణగిమణగినవి పైకి రావాలని

దార్శనిక యోజనలో భవిత చుట్టుకొనీ
హృదయం! నిజ జీవన దర్శనాన్ని కోరుతుంది

కొత్త పంట కొత్త బట్టలు కొత్త ఊహలతో
పరివర్తన చిహ్నం ఉగాది, జీవితం మనోమయం
చుట్టూ అయిన వారే కాదు కానివారూ
అందరిలో కలసి పోయి ఒకరొకరు! సమాజమై
కాలం గడవడమే కాదు అందరికీ భాగ్యం చేరాలనీ
నవ జీవన విధంపై! అభిలాషను కనబరచేరు

బయటి తలుపులు తెరుస్తూ మూస్తూ గడపడం లౌకికం
లోని తలుపు తెరవబడీ మూత పడనిది ఆదర్శం

గతం వెనకనే ఉంటుంది ఉన్నచోటునే
కదలదు, దారి చూపవచ్చు, సూచన చేయొచ్చు

ఆట పాట విరామ సమయంలో ఉల్లాసంగా
తన రాకకు సమయంతో పనిలేనిది కవిత !
బయటికి రెక్కలు లేని కవి మాత్రం
తనలో సంవేదన సంకల్పంతో విహరించేను

అహంకారంలో సెగలతో ఆలోచనలు
సగానికి పైన పొగలు కమ్ముకొనీ

వేల నిజాలు మనసులో ఉన్నవి పైకి రావాలని
గర్వంగా చెప్పుకొనే చరిత్రలో సగంపైన కల్పనలే

చిలుకతో పంజరం బయట కవి వెంటనే
అందరికీ అవసరమై కోరే జోస్యం చెబుతుంది
పరచిన కార్డులలో ఒకటి తీసి లోని కెళుతుంది
మూడు కాలాల రహస్య పేటికల్ని తెరుస్తుంది

కవిలో “నేను” చుట్టూ సమాజ సంరంభం
మనమై కవితయై అక్షర యోగం పొందుతుంది

## 27. వర్తమాన స్పృహతో

నిశ్శబ్ద రణ తంత్రంలో లౌకికాన్ని చూపుతుంది
రోజులు గడచే కొద్దీ విశాలతను పొందుతుంది
దొరకిన అవకాశంలో ఉన్నతిని నిలుపుతుంది
అందరూ ఒకటే విశ్వ భావనలో
ఒకరిలో అందరూ జన వ్యవహారంలో
సమ భావంతో అన్నిటికీ చోటుతో కవిత

వానకు సూచనగా మెరుపుతో మేఘం రావాలని
పిడుగులు మాత్రం దాచుకోవాలని కొందరు
మబ్బులతో తుపాన్‌ను వదలే సముద్రం
జల కళతో పంటను జ్ఞప్తికి తెస్తుంది

మల్లె పూవు పరిమళాన్ని
ఉదయ కిరణ రాగ కళను
శిశువు నవ్వులో ముఖాన్ని
ఎవరు మరచి పోతారు?

ఉదయంకై అర్ధరాత్రి వెదకేరా? దొరకేనా?
దారిన దీపంతోనే తృప్తి సంతోషం పొందేరు

పూవు కొద్ది కాలంలో రాలిపోయేనని తెలుసు
అయినా పూవు నుండి మనసు వీడదు మరవదు
అందంతో పరిమళం ప్రధానమై ఆ సందర్భం
శిలను స్పృశిస్తుంది హృదిని హత్తుకుంటుంది

హేతువు కతీతమైన అనుభవ రుచిలో
గుణ గణ విచారణల ప్రసక్తి లేదు
సుఖాన్ని బాధను ప్రేమను ద్వేషాన్ని
గుర్తిస్తుంది కవిత! తనలో బింబిస్తుంది

పశ్చాత్తాపానికి దారి తీయవచ్చు
అభిమాన ముఖాన్ని దీప్తం చేయవచ్చు
హేతువుతో దొరకవచ్చు అన్వేషణలో "వజ్రం"
అనుభూతి! మరొకరికి బదిలీ కాదు

వైయుక్తిక సామాజిక స్మృతి లహరులపై
వర్తమాన స్పృహతో పయనిస్తుంది కవిత

# 28. ఆత్మీయ స్పర్శలో

సమయాన్ని అనుకూల మయిన వాద్య విశేషంగా
మలచుకొనే కార్యాచరణ చతురులు కొందరు
శబ్దాన్ని రాగ రంజితంగా తీర్చేరు కొందరు
మనసును అలరించే విలాస భావుకులు కొందరు

పాటల ఒరవడిలో నిశ్శబ్దాన్ని అలంకరించేరు
మెట్టు ఎక్కుతూ దిగుతూ ఆశ్రయాన్ని కాపాడుకునేరు
ఏది దొరికితే అది భాగ్యంగా! తలచేరు కొందరు
తెరచిన తలుపు వలె శబ్దం నిలయానికి చేరుస్తుంది

కష్టాల్ని బ్యాగ్‌లో సర్దుకొని ముందుకు వెళ్ళేవారు
కొత్త సన్నివేశంలోకి ప్రవేశించేరు కవితతో
కొమ్మ నుండి పూవులా గాలి కెగిరి పైకి
నింగిలో చేరాలని, తారయై నిలవాలని
హఠాత్తుగా నేలపై మట్టిలో చేరుతుంది
పయనంలో కోరిక గమ్యం వేరవుతాయి

ప్రతిభచే దిశలను మెరపించే యశః కాములు
లౌకిక పథకంలో ఆరి తేరిన శబ్ద ప్రియులు
ప్రతి పని పరస్పర సంబంధంతో రూపొందుతుంది
భావావేశంలో కవిత! అవతరిస్తుంది మనసులో

ఒరలో ఖడ్గం అవసరానికి ఔచితి వహిస్తుంది
జటిల వాస్తవాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా
ఇది బహుమానం కాదు, అలంకారం కాదు
శాంతి పట్ల మెలకువతో జాగ్రత అవసరం

దోషానికి పశ్చాత్తాపం వెడలుతుంది మౌనంగా
ప్రతి పని! పరస్పర సంబంధంతో రూపొందేను
పూవు వలె బ్రతుకులో చుక్కవలె నింగిలో
నిలవాలని కోరిక మనషుల కల్పనలో భాగం

పారాషూట్‌లా దిగుతుంది కవిత! మనసులో
హృదయం సుందరతను వరిస్తుంది శబ్ద కళతో
కవికీ కవితకు ! ఒంటరి తనం ప్రసక్తి లేదు
సామాజిక వర్తనలో ఆత్మీయ స్పర్శతో సర్వస్వతంత్రం

స్వేచ్ఛా కవిత్వం - 102

# ఏది కవిత

## (5)

## అయిదో భాగం

# హృదయ దర్పణం

మాదిరాజు రంగారావు



2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**EDI KAVITHA**

**Part - V**

**Hrudaya Darpanam**

Free Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

*Presented to*
*my son*
*Dr. M. Santhosh Kumar*
*on his Birthday*
*with blessings*

# పీఠిక

ఇది 'ఏది కవిత' దీర్ఘ కృతిలో అయిదో భాగం. నాలుగో భాగం తరువాత అనుకోకుండా రచనలో అయిదో భాగంగా వెలువడింది.

కవి ప్రధాన కర్తవ్యం ఆధునిక యుగంలో రచనలో వాస్తవాన్ని నిజంతో రచనకు కేంద్రంగా కలిగి ఉండడం. చాలా విషయాల్లో ఇది అంత సులభం కాదు. ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయి. అయినా తన వైపు నుండి ప్రయత్నం అవసరం. ఇది ఈనాటి రచనలలో అనివార్యమయింది. ఇది authenticity ని కలిగిస్తుంది. మనిషి మనో రూపం సంక్లిష్టమైందే కాదు, పలు అంశాలతో సంశ్లిష్ట మయింది. ఎవరు ఎంత, విశ్లేషణతో వివేచనతో ఉపక్రమించినా ఇంకా ఏదో కొరత మిగిలే ఉంటుంది. అది తరువాత వచ్చే వారి కందుతుంది. ఈ సమస్యను దాటే కనీస స్థాయిలో ఆలోచన మాత్రం కవిలో విమర్శకుని పాత్ర నిర్వహిస్తుంది.

వస్తువులో విషయం దృష్టికి రాగానే కవిలో సమాజ చరిత్ర, మానవ వికాసం, వర్తమాన స్థితి, భవిష్యత్ దర్శనం, అప్పటి అవసరం ఇలా అనేకం తరుముకొని వస్తాయి. దీనికి విస్తారమైన అధ్యయనం గాఢమైన అనుభవ సూక్ష్మత అవసరమవుతాయి. ఇవి రచనకు నేపథ్యంలో నుండి పని చేస్తాయి.

అప్పటికీ స్థిరపడిన వస్తువు ఎన్నిక – విషయ రూపాల్ని నిర్వహించటం సులభం. అవి వెనక నుండి వెలుగును ప్రసరిస్తాయి. దారి చూపిస్తాయి. framework ను ఏర్పరుస్తాయి. కాకపోతే కొద్ది మార్పులు చేర్పులు జరగవచ్చు.

కానీ ఆధునికమయిన వస్తు–విషయ దృష్టి – దార్శనికం భావనలో దీని 1) నిర్ధారణ 2) స్థాపనం, 3) ప్రాముఖ్యం, 4) ఆవశ్యకత గురించి ఆవిష్కారమంత సులభంకాదు. ఆధునిక రచనల పట్ల కవులందరూ ఎదుర్కొనే సమస్య. అయినా ఒక్కొక్కరు ఒక్కొక్క విధమయిన పద్ధతి నవలంబిస్తారు. ప్రణాళిక నేర్పరచుకుంటారు. తమకు తెలిసీ తెలియకుండానే సృజనలో భాగంగా పరిణమించడం దీని ప్రత్యేకత. ఈ కృతి ఈ మార్గంలో అవతరించింది. మొత్తం మీద సృజనకు విశేషతను ఉదాత్తతను ఉపయోగితను కలిగిస్తుంది. నవ్యతను చేకూరుస్తుంది.

ఇక స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు – విషయం – దృష్టికోణం – ప్రయోజనం –అభివ్యక్తి – దార్శనికం వ్యక్తిత్వం – నిర్వహణం అనేవి స్వతంత్రమయిన భావనామయాలు కావడం చేత ఏది అవసరం? ఎంతవరకు? ఏ విధంగా? అన్నవి కవి నియంత్రణంలో రూపొందుతాయి. "ఏది కవిత" – స్వేచ్ఛా కవిత్వంలో ఆధునికమైన భావ జాలంతో మానవీయమయిన విలువలతో సంపన్నం చేసేదిగా భావిస్తాను.

**మాదిరాజు రంగారావు**

# 1. ఒర నుండి కత్తి

వాస్తవమూ కల్పన రెండూ అనివార్యాలు
బ్రతుకులో కవితలో ఇరు స్థాయిలలో

పూవును తెంపితే ఒకరిలో ఆవేదన
దాని అంతట అది రాలితే వాస్తవికం
ఇది పరిణామ సహజమని మౌన సమాధానం
ప్రస్తుత స్థితి భూమిపై, మునుముందుది దివిపై

అనుభవం ఆలోచన మనిషిలో అస్తితకు
రెక్కలవలె ఉపకరిస్తాయి, పైకి ఎగిరేందుకు
పైపైకి వెళుతూ అతీతాన్ని స్పృశించాలని
పగలు రాత్రులతో అనుకూలం ప్రతికూలం!

ఇరు వైపుల మైదానాలతో మహానది
ఆర్ద్రమయిన భూమిపై సృజన కళతో
ఇరు వైపుల గుర్తులతో నాణెం
జీవితంలో వస్తువు విలువలతో

రోజు కిరువైపుల తాపం వెన్నెల చీకటి
శ్రమ కేతనమై స్వాగత మిస్తుంది వెలుగు
భౌతిక మానస స్థితులలో దరిద్ర దశలు తొలగే
ఉద్దేశంతో కవిత! అభినవ సుందరమై

ప్రకృతిలో నిప్పు ఉంది నీరు ఉంది
రెండిటిలో ఏదయినా కావచ్చు బ్రతుకులో
అడవిగా, తోటగా పొలంగా బీడుగా
మనసులో క్రోధముంది, సహనముంది

ఉదయం ఎదురగ పుష్పం కనిపిస్తే
నిర్మల మై మనసు అద్దం వలె అవుతుంది

రాత్రి పడుకునే ముందు
ఒర నుండి తీయబడే కత్తి పదును చూచి
యధా స్థితికి చేర్చబడుతుంది
మనసుకు ధైర్య కవచ మందిస్తుంది

## 2. అవసరాన్ని బట్టి

ఉదయం వేలికి తొడిగిన ఉంగరంలో
పొదిగిన రత్నం రవి ఉత్సాహం నింపుతుంది

తెరచిన పుస్తకం పేజిలో రోజు
కవిలో కవితను నింపుతుంది!
క్షణాలు అక్షరాలలోకి పరివర్తన పొందేను
వెలుగు ప్రేరణనిస్తుంది, చీకటి సాంత్వన మిస్తుంది
ఎవరి అవసరాన్ని బట్టి వారు
చేసే యత్నం ఒక సుందర దృశ్యం

ఈ జీవితం లభించిన బహుమానం
ప్రదర్శన లోకి చేరేనా?
కుదవపెట్టపడేనా?
అమ్మకానికి బయట పడేనా?
ఎవరి తీరు వారిది ఇష్టంలో
ఎవరి బ్రతుకు వారిది చలనంలో

అంతా మన మంచికే అనుకోవడంలో
ఒక తృప్తి మనసు నిండుతుంది

లేంది నిరాశలో ఘాతుకానికి దిగేను
చుట్టూర శూన్యంలో ఒంటరితనం పొందేను

భూమి నుండి మొక్కల వలె
మనసు నుండి కవిత వెడలుతుంది
కోరిక లెన్నో చేరాయని మనిషిలో
మరోకోరిక! అడుగు వెనక్కి వేయదు

పక్షి ఎగురుతుంది గూటికో తిండికో
మనిషి కదలేను పనికో! ఇంటికో

వ్యక్తి నుండి సమాజానికి బాధల గాధలు
నిరంతరం సాగుతూ, ఎవరైనా ఏ కాలమైనా

ఆక్రందన ఆకాశాన్ని చీల్చవచ్చు
మనిషి మాత్రం శిలవలె నిశ్చలంగా
ఎగిరే పతాకలో శిరసు పైకి
లేచి రెపరెపలాడుతుంది అభిమానంతో

## 3. మనిషిలో అగ్ని -జలం

మనిషిలో అగ్ని ఏదో ఒక స్థాయిలో
మనిషిలో జల సేచనం ఆ పక్క నుండి

జలధి నుండి బయలు దేరిన మేఘం
వితరణ శీలంతో దూరం పయనిస్తుంది
ప్రక్కనున్న ఇంటి దీపం వెలుతురు
మరో ఇంటి వైపు తిన్నగ వర్తిస్తుంది

అడవిలో పాతదనం ఎప్పటిదో
తోటలో కొత్తదనం ఇప్పటిదీ
స్వచ్ఛంగా శుభ్రంగా ఆకర్షణ వంతంగా
ప్రతి మనిషి పరిచయంలో ఏదో కొత్తదనం

కవి లేక పోవచ్చు ఎదురుగా
కవిత పలకరిస్తుంది, మాట్లాడుతుంది
జీవితం సంభ్రమాశ్చర్యాల నిలయం కాదు
సహజమైన పరిణామంలో వాస్తవ రూపం

దాహార్తిలో ప్రాణం జల సేచన కోరుతుంది
బాధా హృదయం కరుణ స్పర్శ కోరుతుంది
మనిషిలో మనిషిని మరపించే
బీభత్స కాండలో శాంత పవనం అవసరం

భూమితో గగనం పట్టరాని చీకటికి
నిష్క్రమణ పథం చూపుతుంది వెలుగు
వెలుతురు తలుపులు తెరుచుకొనీ
మనసుకు రశ్మి దుస్తులు తొడుగుతుంది

అంతరాంతరాన సృజన బీజం
ఎడారిని హరిత వనం చేస్తుంది
అలలతో తీరాన్ని పలకరిస్తూ పోయే
నదిలా కదలుతుంది, కవిత! సమాజంలో
గాయపడిన పక్షి ! భూమిని వదలదు,
వరమయిన స్వర్ణ కవచం! విపద నుండి కాపాడేనా?

# 4. మేఘం పైనే ఇష్టం

తొలి ఊపిరికీ మరలి ఊపిరికీ
నడుమ స్వల్ప విరామ రమణీయం
వాదాలకు విభేదాలకు దూరంగా
చినుకుతో జీవ శక్తి పొందుతూ
దుఃఖితులు పీడితులు దీన జనుల పట్ల
సానునయ రాగ కరుణ హృదయంతో
కవుల దృష్టి కవితలో
బ్రతుకులో కాల రేఖలు దాటుతో
సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది

మనిషి, అడుగు పడడంతో భూమిపై
చుట్టు ఉన్న జగత్తు స్వాగతమిస్తుంది
మనిషి కోరే దాని కన్న ఎక్కువ ఇస్తుంది
తుపాను వీచేననో భూకంపం వచ్చేననో
సంకుచిత స్థితిలో క్రుంగిపోవడం జరగదు

శరీర మొక పతాకగా మనసుకు గర్వంగా
సమాజం పట్ల మనుషులు సమూహాలుగా
పూల తీగె కదలినంత సులభమైన చలనంతో
మనుషుల పట్ల సమాజం ఎప్పటికీ ప్రియంగా

ఏదో రాగ మెవరి నుండో వినిపిస్తుంది
వివిధ రాగ మేళనంతో బ్రతుకులు! గడచేను
మనసులోని ఆశాపుష్పం వికసిస్తుంది
అన్ని చక్కగ అమరాయనుకునే లోపల
చీకటి రిబ్బన్ కళ్ళకు కట్టబడుతుంది
నిప్పుల దడి దారిలో అడ్డంగా జ్వలిస్తుంది

కత్తి పడవలో పయనానికి సిద్ధంగా
నీటిలో దీని అవసరం పడకపోవచ్చు
కత్తిని చేత పూనే అవకాశం కలగవచ్చు
ఒరలో కన్నా కత్తి, చేతిలోనే శోభిస్తుంది

కవితకు ఇంద్ర ధనుసు రూపం కన్నా
కదలే మేఘం ఆర్ద్రపాత్ర పైనే ఇష్టం!

# 5. ఉదయం కయి

ఉదయం కయి ఎవరు ఎదురు చూడనక్కరలేదు
వేళకు వస్తుంది ఇంటి గడప నలకంరిస్తుంది
సృజన హృదయంతో వెలుతురు కవితను రప్పిస్తుంది
ఎపుడే కథలో ఘటనను విప్పేదీ తెలియదు

అంతరంగ మొకరిలో సూర్య బింబమవుతుంది
మరొకరిలో అది! నిశి చంద్ర బింబ మవుతుంది
బ్రతుకులో బంగరు బాటను చూపాలని కోరిక
భవితకు వికాస గమ్యం నిలపాలని తహతహ

ఏదో ఒక రోజుతో ఏ కథ ముగియదు
అది ఏ రోజూ సాగుతూనే ఉంటుంది
కలిసే మనుషులతో సంబంధంతో
ఉన్నంత వరకు చెదరని అల్లికతో గడచేను

మూడు అక్షరాల మాట “కవిత” పలికితే
లోనున్న పావురాయి లేచి ఎగురుతుంది
విప్పారే రెక్కలు బరువు కాదు
ఎగిరే శక్తికి బల హేతువులు

బంగరు రవి బింబం ఉదయిస్తుంది
మెలకువ ద్వారం తెరబడుతుంది
స్వేచ్ఛా జగత్తులో ఏదయినా జరగవచ్చు
బాణం దూయవచ్చు శాపం తగలవచ్చు
విరోధం ప్రమాదం ఆటంకం ఏమైనా కావచ్చు
వెలుగులో సమస్యలు! ప్రశ్నలు బోనులో నిలిపేను
నింగిని తాకబోయే గిరి శిఖరం స్పృశిస్తూ
చల్లని వెచ్చని వార్తల్ని తెస్తుంది, గాలి!

మంచిని హత్తుకొనీ చెడును విసరి వేస్తుంది
గళం నుండి శబ్దం కవితయై వెడలుతుంది
ఉదయానికి స్వాగతం హృదయం విప్పుతుంది
పగలు రాత్రి అడుగులపై కదలే కాల రూపం వహిస్తుంది

## 6. భూమి ఎవరిదీ కాదు

నా వెనక గతం మౌనంగా యశోమయం
నాతో వర్తమానం విప్పారే సుమ లిప్తలతో
అర చేతిలో పండులా
అనుభవ రూపంలో నేడు

ఆశతో మెరసే ముఖంతో
విశాలావకాశ సూచనతో రేపు

గిరి నది వన దిశలు భూమి
ఎప్పటికో! పురా ప్రపంచంలోవి
తరం వెనక తరం కొత్తగా
కొత్త పరిచయాలతో సమాజం
ఎప్పటి కపుడు రూపం మారుతూ
జీవన సూత్రానికి విరణంలా

నిదాఘ సమయంలో వినీల జలదంలా
సంక్లిష్ట సమాజ వివిధ తలలో కవిత
జలదం ఎవరి చేతికీ అందదు
చినుకు చేతిలో పడుతుంది ముత్యంలా

కాలం కరుగుతూన్న అనుభూతి కలుగుతుంది
చీకటి దారి చూపే ఉపాయ మొకటే!
దీప సహాయంతో ముందుక నడవడమో
తానే ఒక వెలుగు దీపమై వ్యక్తి చరించడమో

నిజ రూపం తెలిసేది కవితలోనే
మనో దాహం తీరేది కవితతోనే

శబ్దం లేకుండా కవిత లేదు
వెలుతురు లేకుండా బ్రతుకు లేదు

మనిషి యశోరూపం నిలుస్తుంది సమాజంలో
తెలుపు ఎరుపు పచ్చన రంగుల దుస్తులలో

కనిపించని స్వర్గం మరపున బడవచ్చు
కనిపించే భూమి మాత్ర మెవరినీ వీడదు

## 7. జీవన రుచితో

శిశువు రేపటి భాగ్యానికి చిహ్నం
ఎదుగుతూ బాధ్యతను పరుస్తుంది

మనసు గతంలోకి జారినంత సులభంగా
భవితలోకి కదలదు, మెల్లగా తరలుతుంది

స్మృతిలో అనుభవం మంచిది, వాడని పూవులా
లోనుండి కర్తవ్యాల్ని గుర్తు చేస్తుంది
నిరాశ స్థానంలో సదాశ చోటు చేసుకునేను
పక్షి గూడులో నిర్మాణ కళ, మనిషికి ప్రేరణం

చెట్టుకు వేలాడ దీసే శిక్షలతో
జీవితాన్ని అలంకరింప చూచేరు

వీధిలో కనిపించే ప్రతి వ్యక్తితో మాటలుండవు
కొద్దిమందితోనే పలకరింతలు సంభాషణలు

భద్రతలేని రక్షణ లేని రాజ్యం
ప్రజాస్వామ్యానికి స్థిరత నీయలేదు
గాలిలా స్వేచ్ఛ దేశాల్ని కలుపుతుంది
మనుషుల్ని ఒకటి చేస్తుంది ప్రాణమయం

దాటరాని చోట్ల బ్రతుకులో స్నేహం
వంతెనయై మానవతా వాహనంపై దాటిస్తుంది

సముద్రం ఎగసి పడుతూ అలలతో
మనిషిలోని సమాజాన్ని సూచిస్తుంది

ఖడ్గ సృష్టి హింసతో మొదలవుతుంది
విజయంతో ఒరలోకి వెళ్ళాలని చూస్తుంది

కవితా సమావిష్కారంలో దాపరికం ఉండదు
అందరికీ తెలియాలనే ఉంటుంది గుప్తంగా కవిలో
అక్షర కళతో స్వచ్ఛమైన వాతావరణంలో
ఒక మంచిమాట కోసం హృదయ మెదురుచూస్తుంది

విడుదలయినది తుది ఎరగదు! అక్షర నవలోకంలో
పద పదంతో ముందుకు సాగుతుంది జీవన రుచితో

# 8. తరం నుండి తరం

సౌభాగ్యం దారిద్ర్యం రెండు కావడి కుండల్లా
కవితలో కవినుండి సమభావన సమాజగతం!

పచ్చని కొమ్మలతో చెట్టు
ఎత్తిన ఆశీః కరాన్ని తెలుపుతుంది

మనిషికి తన నివాసం భూమి కన్న
భూమికి మనుషులపై ప్రేమ ఎక్కువ

మనిషి పుట్టుకతో స్వతంత్రంగా
పరిసరాల ప్రభావాలతో బంది అయ్యేను
కవికి లేదు సరిహద్దులతో భేదం
కవిత లోనయితే ఆలోచన విశ్వమయం

పట్టపగలు చీకటి కమ్మినట్లు
మనసులో శత్రుత ద్వేషం వికారాలు
మనిషి ఒక పతాకయై వీధిలో నడచేను
కాంతి పథంలో విజయసిద్ధి కోరేను

గుండె పగలదు, మారవచ్చు
సత్యాగ్రహం నుండి ధర్మాగ్రహం దాక
చూచే వారి కనుల నుండి పూలు రాలేను
గాలిలో పరిమళం, దిశలను చేరేను

మనిషి తన ఉనికిని పదిల పరచుకునే
యత్నంలో భాగంగా యుద్ధంలో, బీభత్సం
ఎంతకయిన తెగించేను, కార్య సాధనలో
దేనికయిన సిద్ధపడేను కష్టంలో నష్టంలో

అక్షర యానంలో కనిపించే సమాజ దృశ్యాలు
స్వాతంత్ర సిద్ధించి దేశానికి డెబ్బది ఏండ్ల పైబడినా
ఆ మొదటి రోజు ఉన్న సమస్యలే ఇప్పటికీ
తరాలు మారినా! ప్రశ్నలవే పూర్తి జవాబులు లేవు

ప్రతి మనిషి జీవితాన లభించేది కొంత వరకే
తరం నుండి తరం మార్పు కోరుతుంది పరంపరలో

# 9. యత్న ఫలం

స్వేచ్ఛ వ్యక్తికి అనివార్యమైంది, అవసరమైంది
సమాజ సంబంధంతో పలు దిశలను చూపుతుంది
జీవన మార్గంలో పలు దృశ్యాలను నింపుతుంది
భావమయం క్రియాగతిలో శక్తిని ప్రకటిస్తుంది

మనిషిలో కోరిక శిఖరం స్వేచ్ఛ
ఇది కనుగొనడానికెంత సమయం కావాలో
ఇది పూర్తిగ పొందేందుకు ఎంత శ్రమపడాలో
జీవితంలో ఎప్పటికీ శిఖర ముఖం మిగిలే ఉంటుంది

ఏ మూల నుండో భయరావం వినబడవచ్చు
ఏ వైపు నుండో ఆయుధ శబ్దం మోగవచ్చు
నడక నిలిచి పోయేనా? పోదు
అడుగు వెనక పడేనా? పడదు

వ్యక్తిలో ఉత్సేకం ఉద్వేగం రెక్కలపై
పైకెర చేయ చూస్తుంది అవసరం
ప్రాణానికి ముప్పు అయినా
సాహసం ముందుకు నెడుతుంది

నిషేధింపరాని స్వతంత్ర రూపం స్వేచ్ఛ
అందరికీ చెందింది, ఎప్పటికీ ఉండేది
జీవన పద్మానికి విశాలతనిస్తుంది
ప్రజాస్వామ్య సంస్కృతికి పరిమళత నిస్తుంది

రవి రశ్మికి శిఖర తలంపై మంచు కరిగి
నీరై దాహం తీరుస్తుంది, ఆరోహణలో
శిలల మధ్య మట్టి నుండి అణువణువు
పైకి సృజన ముఖాలని తపించేను

కొండ ఎంతటి మంచు బరువునైన వహిస్తుంది
సమాజమూ ఎంతటి సమస్యనైనా భరిస్తుంది
స్వేచ్ఛలో పైకి దారి దొరకాలనీ
మనిషిలో యత్న ఫలం రూపొందాలనీ

# 10. చందన స్పర్శలోకి

గాలి పలుకుతుంది ఏ వాద్య ధ్వనినయినా
కవిత ధ్వనిస్తుంది ఏ రాగ స్వరమయినా

చీకటి మాట్లాడదు మౌన శిలాకృతియై
అనలం మాట్లాడదు అనల భావ శిఖయై

కొండలు మాట్లాడవు, జల పాతం మాట్లాడుతుంది
కంటకం మాట్లాడదు, గులాబి పూవు మాట్లాడుతుంది
వెలిగే దీపం మాట్లాడుతుంది, పరిసరాలతో
మనిషికి నిశి వెలుతురుతో ఉత్సాహం నింపుతుంది

ఎడారితో స్నేహం! ఎంత కాలం?
దాహంలో దూరం! కాక తప్పదు,
దుఃఖానికీ కన్నీరుకూ స్నేహం
తాపానికీ వేదనకూ స్నేహం

దైన్యానికి హైన్యానికి నిలయం పేదరికం
చీకటి దుస్తులతో బయట పడుతుంది
సంఘంలో చిక్కుపడిన సమస్యలతో
భౌతిక మానస స్థాయిలలో స్వేచ్ఛను నిలిపేను

మనిషిలో ప్రాణ మయిన గాలి
మనిషి నుండి మనిషికి ప్రియంగా
మాటను పాటను వహిస్తుంది తేలికగా
అక్షరానికి ధ్వని రూపమిస్తుంది కళగా

పూవు ఫలం ద్వారా చెట్టు అవగతమవుతుంది
మాట చర్య ద్వారా మనిషి పరిచయ మయ్యేను
గగానాన్ని అందుకొనే ఉద్వేగంతో సముద్రం
తనలో ప్రతి ఫలనంతో తృప్తిని పొందేను

దేశానికీ మనిషికీ ఎప్పటిదో? బంధనం
వీడని అమృత లిప్తలతో ఆధునికం
అనల స్పృహ నుండి చందన స్పర్శలోకి
ప్రజాస్వామ్య జగతిని అవతరింపజేసేను

వినోదానికీ విలాసానికీ కాదు! విమోచనం
వికాసానికీ జీవవంతమైన చరిత్ర గతికీ

# 11. హృదయం విశ్వమయం

మనిషికి తోడు మనిషే కాదు! ఒంటరి వేళలలో
తన సంపదలో చెట్టు! పూలతో పండ్లతో ఆకులతో
వీధి సయితం మనిషుల కై ఎదురు చూస్తుంది
టేబిల్ పై కాగితం పెన్ను కవితకై నిరీక్షిస్తాయి

వసంతం! జంటను మాత్రమే ఆహ్వానిస్తుంది
శిశిరం ఆకురాలిన ఒంటరినీ స్వాగతిస్తుంది

నిన్నటి వాడిన కుసుమం హృదిలో మిగులుతుంది
నేడు విరిసే పుష్పం! అనుభవ కళ నిలుపుతుంది

కాలమేదయినా గాయ మెపుడయినా
రాయొ ! చాకో! బాణమొ! తూటానొ
బాధ ఒకటే హింసకు మూలం! ఎప్పటిదో!
ఇది అనుకున్నది కాదు, తప్పిన బ్రతుకనిపిస్తుంది

దుర్భిక్షం దారిద్ర్యం బాధలు హింసలు పోటీగా
రాత్రి కన్న కలలు నేడు మూలన చీకటిలో
గుండె బరువు నెవరు, మోయ నవసరం లేదు
దాని కదే వహిస్తుంది, బాధ్యత నంతటినీ!

తన చుట్టు ఇనుప కంచె లేకపోయినా
మనిషి చర్యచే బందీ అవడమొక దౌర్భాగ్యం
విభేదాల మధ్య రేఖలెంతటి వయినా
నెత్తురు ముద్రలతో చిత్రిత మవడం దారుణం!

భారత కథలో విరోధి! అశ్వత్థామ
సంజయుని దృష్టిలో మహా క్రూరుడు
గాంధారి దృష్టిలో మహా వీరుడు
రణ చరిత్రలో పాత్రలు! కవికి సమానం

స్నేహంలో వైరంలో శాంతికీ అశాంతికీ ఆలోచన!
నడకలో లయతో గమ్యంలో మనిషి మనిషికీ భిన్నం

మనిషిలో కవిత మనో రూపం మారుస్తుంది
కవితను కవి హృదయం విశ్వమయం చేసేను

## 12. నిరంతరరత అవసరం

అంతరంగ ప్రకాశ మెంతటి దయినా
బయట ఉదయంతోనే జీవన చలనం
ఇది సమాజ మయమవుతుంది మనోజ్ఞంగా
వికాస భావ ప్రభావాల కిరణ్మయ మవుతుంది

అంతలోనే బీభత్స కథా సముద్రం కావచ్చు
కనబడేది తక్కువై కనిపించని దెక్కువగా

ఎవరి శక్తి మేరలో వారు ప్రభుతతో
ఎవరి యశో పథంలో వారు అమరంగా
ఎవరి కీర్తి కిరీటంతో వారు కథలో
ఎవరి సమాజం బంధుత వారిది ప్రియంగా

పగలంటే వెలుగే! చీకటి ప్రసక్తి లేదు
ఎక్కడనో ఒక మూలన చీకటి ముడుచుకొనీ
అడవి జలధి గిరి నది ప్రాణి మనిషి భూమి
దేనినైనా ఆవహించి కిరణం! నిజం బయట పెడుతుంది

చీకటి రాజ్యం శాశ్వతమనకునేరు కొందరు
ఉదయం ! ఎచ్చటి దచ్చట విచ్చిపోయి మాయమవుతుంది
ఉషస్సు స్పృహతో మెలకువ పొందని వారెవరు?
మెలకువ తలుపులు తెరవబడీ లోనికి ప్రవేశించేరు

ఎవరికి వారు ఏదో సాధించాలని కోరిక
జీవితంలో పొందవచ్చు, పొందక పోవచ్చు

కాలం నిలవదు, బ్రతుకులు ఆగవు
జడతలో శిలా కృతులు పొందేను

మనిషిలో శక్తి మనసుకు తెలియకపోవచ్చు
యుద్ధం చేయలేని విషమ క్షణంలో
తెలియక పోవడమే నయమనిపిస్తుంది
ఏడవడానికి ఆశ్రయపదమవుతుంది

గాలి ఆగదు, ఆగరాదు కదలాలిసిందే
నిరంతరత నశిస్తే ఆపద, హాని, ప్రమాదం

## 13. భవితపై

భౌతిక పునాదిపై మనిషి నిరంతర విజయం
ఉద్గమనానికి సూచనగా మస్తక శిఖరం
సమాజ చింతనలో కింది నుండి పైకి
ఆరోహణ మొక వాస్తవ నిజ కర్తవ్యం

ధనం అవసరం లేని బ్రతుకులు లేవు
భేద బీజ మెరగని ఏ సమస్య లేదు

కార్య దక్షత జ్ఞాన సంపద
కళా బంధుత శాంతి కామన
జనత క్షేమం ఎజెండాతో
ప్రగతి మార్గం చరణ గతిలో

కవిత పెంచుతుంది ఆత్మ విశ్వాసం
నవత చూపుతుంది పోవలసిన పథం

జన వాణికి అవకాశంతో
సమూహ భాగ్యంపై గురితో
శుభ్ర భావనతో నీతి పాలనతో
పారదర్శకతను చూపుతుంది! నిర్మాణం

జన రక్షణ భావన నవచేతన గమ్యం
ఆగని యానంలో భవితపై చూపులతో

పాలకులు పాలితులు పీడకులు పీడితులు
పితరులు సంతతి వ్యక్తులు సంఘం
నాలుగు స్తంభాలపైన జీవన నిలయం
"స్త్రీ" కేంద్ర బిందువుపై ఆధారబలంతో

పూవు రాకముందే మంచు పొరలు కమ్మేను
కోకిల స్వరంలో విషాద రేఖ కదలేను
ఏది జరుగకూడదో అది బయట పడుతూంది
పూలతో తోటలో దారి నెత్తురు చిత్రం చూపేను

తుపాను రాకతో ఆకులవలె ఆశలు వణకేను
నెమలి నృత్య భంగిమలో లయ విషమత పొందేను

# 14. ప్రభావ రూపాలెన్నో

చెట్టుకు పచ్చని ఆకుల స్థానంలో మరొకటి చేరదు
నదిలో కదలే అలల బదులుగ మరేదో చేరదు
మనిషిలో మానవతకు బదులు ఏదయినా చేరేను
మనసు నుండి మానవం క్షణంలో మాయం కావచ్చు

సౌందర్యం సమాజికం రెండూ కలిసినవై
కళతో ప్రయోజనంతో కవిత దార్శనికం
కవితలోని భావశక్తి సుందరతలు
మనసును నిర్మలినం చేసేను ప్రేమతో

సృజనకు స్పందన ప్రేరణయై నిలిచేను
భావన రచనకు పుష్టిని చేకూర్చేను
చేతనతో వస్తువు స్వతంత్రమై స్వేచ్ఛగా
సరికొత్త మనో జగాన్ని దింపుతుంది కవిత

మాటకు మాటకు మధ్య నిశ్శబ్దం
అంతేకాదు తరువాతనూ నిశ్శబ్ద వలయం!
కవితను సార్ధక పరచే
ప్రభావ మనోజ్ఞతలతో

నిప్పు కణం ఎగిరి మీద పడవచ్చు
నిప్పు కణాలలో దేహం! పడిపోవచ్చు
ఒకటి కాదు! దేనికదే అనుభవాలు వేరు!
స్థితుల నన్నిటినీ వహిస్తుంది మనసు

పలు వస్తువుల ఆకారాలతో మబ్బులు
మనుషులు మాత్రం చెక్కిన శిల్పాలను కోరేరు

ఒంటరి తనంలో మనసులో చేరేను ఎన్ని వస్తువులో
గుప్తంగా ఉన్నవి, అక్షర యానంలో బయటపడేను

సూర్యుడు ఆడే బంతిలా తోచేను
చంద్రుడు మల్లెపూల చెండును తలపించేను

కవి నుండి పాఠకులకు చేరే కవిత నుండి
ప్రభావ రూపాలెన్నో! మానస జగత్తులన్ని!

## 15. అనుకోనిది

కవి గళం నుండి బయటపడే మాట
కవితలో వెనకనుండి వాద్య స్వనం వినబడేను
ఒంటరి తనంలోను వస్తూ పోయే మనుషులతో
వీధులు పల్లెలు పట్టణ నిలయాలతో మనస్సు!

మనసు పాతే సరికొత్త రూపం కోరుతుంది
అభినవంగా ఉండేందుకు దారిని మారుస్తుంది
కొత్త పరిచయాల కయి తహతహలాడుతుంది
పాత వాటిలో పనికొచ్చేవి తీర్చి దిద్దుతుంది

ఎప్పటివో ప్రశ్నలు! సమాధానాల్ని కోరేను
ఓదార్పులు సానుభూతి పశ్చాత్తాపాలు!
ఉన్నది ఉన్నట్లుగా! కనిపించే స్థితి ఉండదు
చేతికందని పాదరసం కణాల్లా! క్షణాలు

ప్రాణం తీయదానికి సమయమెక్కువ పట్టదు
ఉద్రేకంలో మెరపు వేగ మందు కునేను
వివేచనకు సమయ మసలే ఉండదు
గట్టు నుండి గట్టుకు దూకి నట్లు ఉంటుంది

ఈ లిప్తలో ధనం అధికారంతో స్వార్థం
మొండి సాహసంతో విపరీతం ఏలుతుంది

ఇంటి ముందు "నేమ్ ప్లేట్" ఉంది, వ్యక్తి సూచనయే
గుణ వర్తన గురించి మాట! నీటిపై రాతలే

దాగిన రహస్యం! మాటలు గాలి కబుర్లే
టేబిల్‌పై భోజనం! సిద్ధంగా ప్రీతికరంగా
కవిత వచ్చి నిలిస్తే ! ముందు వినవలసిందే
ఇది మనోమయం ! కొత్త జగంతో పరిచయం

వాడుకలో ఉపయోగానికి రాని బహమతులు
పడిన కష్టాలను మరపిస్తుంది! ఆర్ద్ర స్పర్శతో
కొత్త ముఖం కనిపిస్తుంది! హృదయ దర్పణంలో
చెప్పదలచుకుంది మరపున పడి, అనుకోనిది ముందుకొచ్చేను

# 16. ఆగని ప్రవాహం

అక్షరాల ఆల్బం కవిత! భావ మయం
సహన కలహ రేఖలతో మోద ఖేద దృశ్యాలతో
గతం లోని జీవన వాస్తవాలతో
మనో నయన కాంతి సమర్పణంగా

ఆలోచన యవనికపై గతాన్ని చూపిస్తుంది
నిజాన్ని నిప్పు వలె కాక
పుష్పంలానో వజ్రంలానో మనసుకు తెస్తుంది
వర్తమానాన్ని తప్పించుకొని గతం వచ్చినట్లు ఉంటుంది

తాపాన్ని శమింపజేసే చినుకు
భూమికి పచ్చని దుస్తులు తొడిగే కోరికతో
వర్షమై అధికమైన వరదలతో ముంచెత్తేను
బ్రతుకు ఊహ కందని బాధా వశమయ్యేను

కష్టాలకు నష్టాలకు గురి చేస్తూ సమాజాన్ని
తన దారిన వెళ్ళి పోతుంది అమాయకంగా

తరాలు గడచినా సంస్కృతి రేఖలపై
పూర్వపు అనుభవ సుందరతను చూపిస్తుంది
గమ్యం మారవచ్చు, పథం వేరు కావచ్చు
అప్పటికీ ఇప్పటికీ కోర్కెలు విలువలు ఒకటే!

విశాల భవనమయినా చిన్న గుడిసె అయినా
అవసరాలు వేరయినా అనుబంధంలో హృదయమదే!

వ్యక్తి దృష్టి నుండి సమాజ దృష్టికి మారిన
జీవన సారంలో భాగ్యం ! అందరు కోరేదీ!
మనిషి ఇపుడు పొందే విధానం వేరు కావచ్చు
అలంకార సౌందర్యం దుస్తులు వేరు కావచ్చు

అవసరాల మేరలలో ఒదిగి ఉండవచ్చు
అవసరాలు లేనిచోట చూపు పడక పోవచ్చు
ప్రజకు క్రీడా స్థలం కావచ్చు
జన వినోద వనం కావచ్చు

మార్పులేవయినా ఎదురుపడే, కాలమదే
ఆగని జీవన విలోల ప్రవాహం పరుగు అదే!

# 17. స్మృతిలో శబ్దం

ఇది రాజకీయం, మనుగడలో ప్రభావ భాగం
హఠాత్తుగా తూకంలో తూచే రాళ్ళు మారతాయి
అంతలో నిప్పు కణా లెగసి పడను తేల వచ్చు
రాజనీతి బూది పొరలతో బరువు మారుతుంది

వీధిలో శబ్దం నినాదాల రెక్కలు విప్పుతుంది
మాటలు రాళ్ళుగ విసర బడతాయి
చేతలు చీకటిలో ముళ్ళను పరుస్తాయి
వెలుతురులో వివేచన తెరమరుగవుతుంది

ఆవేశం అనల చరణాలపై పరుగెత్తుతుంది
ఉద్రేకం నిశిత కంటకాలతో చేతులు చాస్తుంది
కల్లోల సముద్రం మధ్య శాంత ద్వీపంలా కవిత
బాధలో వేదనలో స్వాగత హృదయం విప్పారుతుంది

కవిత ఎవరినీ గాయ పరచదు
లోని గాయాన్ని మానుప జూస్తుంది
సర్పంలా చుట్టుకొనే నిరంకుశాన్ని వదలిస్తూంది
ఇది చలి కాచుకునే అనల జ్వాల కావచ్చు

దారి వెంట పైన కదలే మేఘ ఛత్రం కావచ్చు
ఎండ నుండి కాపాడే చలివేందర అవచ్చు
పోరాట శిఖరాలెన్ని దాటినా దాటనున్నా
లక్ష్యం! శాంతి సమాజ బంధుత దృశ్యం!

స్తబ్ధమైన సహనశాంతి నెవరుకోరతారు
వస్తువులో చలనం, చేతన చిహ్నం
ఉత్సాహం ఉద్గమనానికి సంప్రేరణం
వికసించిన ఆలోచనతో ప్రభవించిన రూపంతో

కవితలో రవి రశ్మిగానో శశి వెన్నెలగనో
వెనక నుండి కనిపించని కవిలో వ్యక్తిదీ అపూర్వం
ఆర్ద్రతలో సానబట్టిన గంధంలా ప్రస్తుతం
మనో వేదిపై నుండి శబ్దం! పలు భంగులలో స్మృతిలో

# 18. అవనిపై ప్రేమతో

కలహ నిలయం కాదు యుద్ధ రంగం కాదు
సమాజ మొక జన సహకార నివాస రూపం
కలహం యుద్ధం అపుడపుడు వస్తూ పోయే
బలవంతపు అతిథులు, చరిత్ర గతిలో

ఉష్ణ తాపానికి సమంగా
శీతల సమీర లహరులతో
వైర భావానికి సమంగా
శాంత రమణీయ గాథలతో

వనమాలికి తెలుస్తుంది
సుమ సంతతి నెచట నిలపాలో
ముళ్ళ కంచె నెచట నాటాలో!
కవికి తెలుస్తుంది! శబ్ద మేది పొదగాలో

ఆరోహణ శిఖరాలకు పరిమితులు లేవు
చేరే గమ్యాన్ని బట్టి మనిషి మనిషికీ భిన్నం

తీగెలో విద్యుత్ప్రవాహంలా మాట ప్రసారంలా
కవిత ! పైకి కనిపించని శక్తి నిలయంతో

రైలు పట్టాలపై గగన పథంలో
భూమిపై బస్‌లో కాలి బాటనో
తలపిస్తుంది స్వేచ్ఛా కవిత అనుభవంలో
దేనినీ నిరాకరించలేని స్థితులు! పయనంలో

క్షణం పూవులా అలరించవచ్చు
తేనె టీగలా బాధించవచ్చు
ఎత్తిన పిడికిలితో లిప్త లెదురు కావచ్చు
పూల మాల చేతులతో సమీపించవచ్చు

ఎవరు రాని వేళలలో అద్దంలో తన ముఖంతో
పలు రకాల పాత్రలతో మనిషి మాటలాడుతూ!
జలధిలో ఎగసి దూకుతూ వచ్చే
కెరటాల మహా భయం నుండి
ముక్తం చేస్తుంది చెలియలి కట్ట!
అవనిపై జీవన సుందరతపై ప్రేమతో

# 19. దార్శనిక పథంలో

ఇంటి బయట గోడలు తన మనసులోనూ
చూడనవసరం లేవనుకున్నవి, తప్పేందుకు
ఉన్నవి తనకిష్టమైనవి స్వంతం అనిపించేందుకు
విస్తరణ కాంక్షలో దృష్టి వలయం తగ్గుతుంది

కారణ మేదయితేనేం? కొత్తనో! చిత్రమో
అదుపు తప్పి దూసే వాహన భ్రమణాన్ని
కవిత అనుకరిస్తూంది! అదొక ప్రయోగరూపంగా
దారిన పోయే వారు ప్రమాదంలో నలిగినా

ఆకలి తీరే ఆలోచనతో మనుషుల మనుగడ
ఆకలి వేయంది! జీవిత మెక్కడుంది? లేదు
ఎన్ని పనులకో గుడ్ బై చెప్పాలిసి ఉంటుంది
ఒకరి ఇంటి ముందు పాత్ర చాచవలసి వస్తుంది

ఉన్న సమాజ స్థితిని ప్రశ్నకు గురి చేయొచ్చు
ధిక్కరించవచ్చు! మార్పుకు పురికొల్పవచ్చు
కొత్త ఊహతో మరో వ్యవస్థను తలపోయవచ్చు
ఆకలి తీరేందుకు ఎక్కడికైనా వెళ్ళేందుకు సిద్ధం!

తిండికై దొంగ తనానికి పూనే వారు ఉండవచ్చు
ఏ చేయరాని చెడు పని తలపుకు రాకుండా
భిక్షాటన మొక సుగమ పరంపర ఉంది!
జీవన గ్రంథంలో ఉదార పదానికి వీలుగా

ఆకలి అణచబడేది కాదు, మరచేది కాదు
మట్టిలో విత్తుపడగానే ఆకలి తీరదు
దీని కెన్ని దశలు గడవాలో క్రమ క్రమంగా
చివర కెవరి చేతిలో పడేదీ తెలియదు

చిచ్చు కావచ్చు, ఆయుధం కావచ్చు సందర్భం
శ్రమ చక్రమై తిరగవచ్చు ఒక సమయంతో జీవితం
నిజ శక్తిని చూపవచ్చు దార్శనిక పథంలో
కొత్త దారి వరించవచ్చు మానవీయ ప్రభుతతో

## 20. తెలుస్తుంది హృదిలో

సుముఖతో విముఖతో ఇష్టమో కష్టమో
మాటో పాటో! స్థితికి సరి పడుతూ పోవడమే
ఎవరి స్థాయిలో వారు జీవన శ్రేణులలో
ఒహో! అనో, ఆహా! అనో, అయ్యో ! అనో, నడపడమే

రోజులు పేరుకొని గతమొక పర్వతమై
జడ శిఖరం నుండి జలధారను వదలేను
గతంలో తగిలిన గాయాలు మరచి
ప్రస్తుతానికి సుమ శోభను చూపేను

కరువుతో మేఘ గర్జా రవం వలె
క్లిష్టతలో జన నినాద ధ్వనుల హోరు
పరిష్కార దిశకు ప్రేరేపిస్తుంది
మతిలో క్రియా శక్తిని పెంచుతుంది

తమను చూచే వారు లేరని
అడవిలో పూలు పూయడం మానవు
వినే జనం ఎదురుగ లేరని
కవుల గళం పలకడం మానదు

రాత్రి వెన్నెల తృప్తి రేఖను గీస్తుంది
పగలు వెలుతురు ప్రగతి కవచ మవుతుంది

గోడకు వేలాడే కాలెండర్ లో
నెలలో రోజులన్ని ఒకటి కావు

నిన్న నేడు రేపు ఒకే బ్లాకుగా ఏర్పడీ
స్నేహ సుందరంగా కనబడేను కాలవేదిపై

దైవమెట్లా ఉండేదీ ఎవరికి తెలుసు? తెలియదు
ఎవరికి వారు తమ సంస్కృతి గుర్తులతో తీర్చేరు
ఇష్టమైన వస్తువుతో తమ ముద్రలు మలచేరు
ఎవరి భాషలో వారు స్పందన ప్రకటించేరు

ఏదో చెప్పాలని అతీతమైన విషయం అలలను దూకిస్తుంది
గలగల శబ్దం ఒడ్డుకు చేరుతుంది ప్రియంగా
బ్రతుకుపై అభిలాషను పెంచే అనురాగంలో అర్థం
మౌనం ఎరగని కవికీ నేతకు తెలుస్తుంది! హృదిలో

# 21. చెదరిన స్థితిలో

ధూళి నుండి బయట పడాలని శుభ్రత కై
పొగల లోకి చొచ్చుకొని ప్రవేశించేను శరీరం
నలుపు రంగు చిత్ర కళతో బయట పడేను
వెలుతురులో తన ప్రత్యేకత చాటాలని చూచేను

ఉన్నంత సేపు విచిత్రానికో వినోదానికో ఆకరమవుతుంది
ప్రయోగ శీలతలో కవితకు దారి తీయవచ్చు
ఇది వికాస చరిత్రలో భాగమనుకునేరు కొందరు
ఇదొక అలంకార సుందరతగ విశ్లేషించేరు

అవినీతికి రత్న కిరీటం అమరినట్లు ఉండేనా?
మోసానికి స్వర్ణ కవచం తొడిగినట్లు ఉండేనా?
సంఘంలో సహృదయుల సంఖ్యను పెంచేనా?
బ్రతుకులలో కొత్త జగం నిర్మాణం జరిగేనా?
సామాజిక స్పర్శతో ప్రకటితమయ్యేను
వ్యక్తిత్వంలో రహస్య వేషం దాగేను

ఇందులో మాయ లేదు మర్మం లేదు
ఇది అందరికీ తెలిసిన వ్యవహారమే
తెలియనట్లు అమాయకంగా చరించడం
ఒక నాటక ఘట్టంలో అనూహ్య సందర్భం

రాత్రివేళ గుండె బరువుతో
విరామాన్ని కోరేరు, కొందరు
ఇది చీకటి భయ సహజ మనేరు కొందరు
మనిషిపై మనిషితో అనుమానంతో కొందరు

నదీ తీరాన నడిస్తే చివరకు జలధిలోకి
కాలి బాటలో కదలితే సరాసరి అడవిలోకి
తన చుట్టూ తిరిగితే, వలయంలో భ్రమణం
మనిషితో మనిషి నడక సమాజం లోకి కొత్తగా

మనిషి పైన నమ్మకం, బాధ్యతలో అంకితం
చెదరిన స్థితిలో, ఉంది నేటి సమాజ రూపం!

## 22. అహంకార మూలం

మనో నిలయమెన్ని వస్తువుల తోనో నిండి
దాచాలనుకునేవి, స్వంతమై పోయినవీ
అన్నిటికీ భద్రమయిన చోటులో
తనకు తెలియకుండా రాలేవు బయటికి!

గిరి శిఖరంలా తల ఉన్నంత వరకు
గడియారంలా హృదయం ఆడేంత వరకు
తల సరిగా ఉంటే చాలు, మంచి ఆలోచనతో
ఎన్ని తలలున్నా పని చేసేది ఒక తలయే

మనిషికి మనిషి జాడ లేకపోయినా
ఎదను తిన్నగ నిమురుతుంది గాలి
కష్టంలో సానుభూతి స్పర్శను చూపుతుంది
సమయానికి దయతో ఆదుకుంటుంది

భయ భావంతో చేతిలో కత్తితో
ఆ తట్టే తలుపు లెవరు తెరచేరు?

రాత్రి మెలకువలో నిద్ర గురించి ఆలోచన
పగలు మెలకువలో పనిని గురించి ఆరాటం
వృత్తి ప్రవృత్తి ఒక దాని కొకటి పోషకమై
సుఖదమైన జీవన గతికి సహకరించేను

బ్రతుకులు కోరే భాగ్యానికి కావలసిన అవసరాలకు
పుట్టుకొచ్చిన కులాలు మతాలు వర్ణాలు వర్గాలు
ఒక్కొక్క దశలో ఒకటొకటి వికాస హేతువులు
తదుపరి కాలాంతరాన బంధనలుగ తోచేను
సమయ సమయం ఆటంకగాను పరిణమించేను
పరస్పర దూషణలతో ఆటవికంగా మారేను

పదిమందికి మేలు చేసే అవకాశం ఉన్న పదవి
తనలో పరిమిత స్థితిలో అహంకార మూలమయ్యేను

వేరు నుండి అనల తరువు పైకి ఎదగవచ్చు
నిప్పు కణాలను కూడ పూయవచ్చు
వాడి బాకుల ఆకులు చూపవచ్చు
నీడన సర్పం చుట్టుకొనీ విశ్రమించవచ్చు!

# 23. ఇరు వైపులలో

కవిత బయట పడదు ఒంటరిగా
ఎవరినో దేనినో వెంటతీసుకొని వస్తుంది
పరిచయాల్ని అనుభవాల్ని ఆలోచనల్ని మనుషుల్ని
మంచి చెడు ప్రభావ సంపదను సమాజాన్ని

మానవ ద్వారం తలుపులు తెరచుకొనీ
సంస్కృతి నిలయంలోకి ప్రవేశిస్తుంది
నిలయానికి గోడల అవసరం, చుట్టూ
అవసరాల విశేషతలతో గుప్తతకూ

పరిసరాల భౌతిక సుందరతతో
మనిషికి మానస శుభ్రత అవసరం
ఎప్పటివో సంధించిన ప్రశ్నలతో సమాజం
ఎప్పటకప్పుడు ఆధునికంతో విలసించేను

గోడల్ని దాటి పోవాలని స్వేచ్ఛ కోరుతుంది
సాంద్రమయిన అనుభవ గంధంతో! హ్లాదంగా

పగలు సూర్యరశ్మి! ఉత్తేజ కరంగా
రాత్రి చుక్కలలో, ఆశావహ దీపం!

నడకను నడతను పల్లెకు వదలి
నగరానికి యంత్ర వాహనంపై పౌరులు

ఎప్పటివో అలవాటయిన సాధనాలు వదలి
కొత్త వాటికయి! అన్వేషణలో శ్రమ జీవులు

నలిగే బాటతో మొక్కకు వీలులేదు
గడ్డ కట్టిన పరంపరలో సృజనకు చోటులేదు

స్వేచ్ఛలో ఏదయినా జరగవచ్చు
విమోచనతో స్వతంత్రం పొందవచ్చు
హక్కుల కై పోరాటం సాగవచ్చు
దిశలలో సమైక్య స్వరం వినిపించవచ్చు

ప్లస్ మైనస్ గుర్తులతో బ్యాటరీ సెల్‌లా
ఇరు వైపులలో ద్వంద్వానుభవం జీవితం

# 24. నిలయం చేరక తప్పదు

తగిలిన గాయం చిన్నదో! పెద్దదో! ఏదయినా
కొడవలిదో, గొడ్డలిదో! భయం లేదు
మట్టి చెరగి చల్లి కప్పబడుతుంది పలచగా
ఇప్పటికీ ఇదే పద్ధతి ! అందుబాటులో ఊళ్ళో

అజ్ఞానం కావచ్చు! ప్రకృతి సిద్ధమనవచ్చు
పరంపరాగత చికిత్స కావచ్చు సమాజంలో

దారిన వెళ్ళే బండి చప్పుడు
ఎడ్ల మెడలో గంటల మ్రోతతో
గతాన్ని చక్రం వలె తిప్పుతూ స్మృతిలో
దూరాన పరుగెత్తే రైలు శబ్దం విజిల్‌తో
వర్తమానం కిటికి తలుపు తెరుస్తుంది
కొన్ని చూచేందుకు ఇంపుగ గాలి పటంలా!

చెత్త కుండీలో భద్రమనుకొని వదలబడిన
పసిపాప! ఏడుపు కేక ! ఉదయం పాలకై
కరుణ ఎంత కరువులో ఉందీ, తెలుపుతూంది
మనిషి విలువ ఏమిటో మనసుకు చూపుతూంది

చుట్టు ఉన్నది మనుషులు! పౌరులు ! పెద్దలు
సంస్కృతీ సమలంకృతులు! చరిత్రలో అహంయువులు

నిరాసక్తి నిరాదరణ కటుత స్వార్ధంలో
ఎంతటి మార్పులలోనూ తమ స్థానం భద్రంగా

కాలమెంత గడచినా ! శిథిలాలలో ఇంకా
అమూల్యమేదో దొరకేననే! ఆశ మనసులో

చీకటిలో స్పందన వేగమందుకుంటుంది
వెలుతురులో వేదన ఎద వెలిగిస్తుంది

బాధ కొండ వలె నిలిచి ఉంటుంది
సానుభూతి నీటి జాలులా సాగుతుంది
భవిత! మంచు పలకవలె ఘనీభవించింది
కోష్ణ రశ్మి కోరుతుంది! ప్రవహించేందుకు

పక్షి గూడును పాము పుట్టను చేరతాయి
మనిషికి చేరక తప్పనిదీ తన నిలయం!

# 25. మట్టిపై మట్టితో

ఈ వసుధ కత్తితో గెలవ బడిందా?
అయితే హృదయంతో పనిలేదు
ఈ పృథివి ప్రేమతో గెలవబడిందా?
అయితే ఆయుధ మక్కరలేదు

సమాజాన ఇరు స్థాయిలలో
రెండూ కనిపిస్తాయి, చరిత్రలో

స్వర్ణ రత్నమయం కత్తి పిడి
మనిషి కళా హృదిని చూపుతుంది
తళ తళ లాడే అంచు పదును
విజయాశయ రుచిని తెలుపుతుంది

విత్తనాన్ని బట్టి పూవు అందం గంధం
మానసాన్ని బట్టి మనిషి ఊహలు చర్యలు

ఎంతటి భోగం భాగ్యం లోనూ
మనిషి మనసు అడుగున వేదనా స్రవంతి
సన్నగనో తిన్నగనో సాగుతుంది
ఇది ముక్కలవదు చెదరదు మారదు

దేని కోసమో దాని ప్రభావంతో తరలుతుంది
గట్టుపైన భూమిపై హరితవనం వాస్తవం

కష్టమో నష్టమో బాధో వేదనో! ఆంతరం
వహించక తప్పదు! లోన సూక్ష్మ భావనతో

ఉదయంతో అస్తమయంతో పనిలేదు
పగలు రాత్రి భేదాలతో పనిలేదు

తాను మరో రోజున రాలేనని పూవుకు తెలుసు
అందంగా సంస్కృతితో గడవడమే జీవితం

భద్రత రక్షణ కల్పించే దెందరు? ఎందరికి?
వ్యక్తి స్థాయిలో మానస పరివర్తనతో సులభం

ఆకారంతోనే ఆలోచన అనుభవ సుందరతలు
ఇవి జీవన పార్శ్వాలు మట్టి పై మట్టితో బంధంతో

# 26. అంతరంగ దృష్టిలో

నిజం "నేతి బీర" కాయలో నేయిలా
గగనంలో దినమణిలా ప్రవాహంలో విద్యుత్తులా
దీనిపై ఆలోచన దీనికై అన్వేషణ సాగుతుంది
బాధ్యతలో కవులు మౌనం వహించలేరు

తటస్థమంటే ! దార్శనిక లక్ష్యాన్ని మరవడమే
ఇది లౌకిక వ్యవహారాలలో ఆటంకమనీ!

మొన్న శిశువు నిన్న యౌవనం నేడు మనీషి రేపు మనస్వీ
విభిన్న స్థితులతో జీవితం కాలాన్ని ఆవహిస్తుంది

తోటకు పోయినా పొలానికి వెళ్ళినా
యంత్ర నిలయం చేరినా, ఆఫీసుకు కదలినా
మలుపులు తిరగని దారి లేదు
మెలికలు చూపని సమస్య లేదు

చేతిలో రాసే కలం వదలి
ఆయుధం పొందవచ్చు; చకితంగా
ఏ దయినా బాధ్యత కవులదే
ఏ దయినా చర్యలు మనసువే

మనిషి గురించి ఆలోచన చేసేది మనిషే
ఊహలు చర్యలు కలిసి సమాజ మేర్పడేను

దప్పికలో నీరు లభిస్తే ఉత్సవాన్ని కోరేరా?
ఆకలిలో తిండి దొరికితే సన్మానం జరిగేనా?

రాజకీయ వర్తనలో నమ్మకం నిబద్ధత ఆశయం
గల్లంతయి! సమాజ మిపుడు సంక్షోభంలో
మానస శిఖరంపై నిలిచేది కొంతసేపే
ఏ భాగ్యమయినా! జీవితమంతా మట్టిపైనే

అవకాశంలో సాగే శాఖలతో కవిత
భూమిలో వేళ్ళతో పైన రూపం అందరిదీ!
మానుష యత్నఫలం! అనుభవానికి వచ్చేందుకు
మేకప్‌తో అద్దంలో బింబం చూస్తే సరిపోదు

ముఖం వెనుక నున్న వివిధ వర్ణచిత్రం
ఎవరికి కనిపిస్తుంది, అంతరంగ దృష్టికి తప్ప

## 27. దాహం ఆగదు - ఆకలి తీరదు

ఇవి మంటలు కావు దూరం నుండి కనిపించేవి
గులాబి రూపాంతరాలు బంగరు వెలుగులు కవితలో
మనసు నుండి సామాజిక స్పందన ప్రభావాలు
చూపును భ్రమింపచేసేనా? ప్రగతి పథం ఎదురుగా

ఎంత సాంద్ర మయిన అడవి అయినా
కాలి బాట కవకాశం లభిస్తుంది

ఉదయించే సూర్యునికి అస్తమయం మరో వైపు
స్వాగత ద్వారానికి ఎదురుగా గుడ్‌బై గేటు
ఇది ఏ రోజూ జరుగుతుంది ఆగమనం నిష్క్రమణంతో
జీవితం! అట్లా కాదు! ఒకమారే పరంపరా రూపం

ఎంత చీకటి జీవిత మయినా ఏదో దరిద్రంలో
ఆశా కిరణం చిత్ర రూపం పొందుతుంది మనసులో
సమాధిలో భూమి తనలో హత్తుకుంటుంది
దహనంలో అగ్ని తనలో కలుపుకుంటుంది

ఎంత సృజన ప్రతిభ ఉన్నా అనుభవమున్నా
ప్రభవించిన ఆకారం అదృశ్యమయి పోతుంది
రూపం లేని భావజగం మిగులుతుంది సంఘంలో
తరాల కస్తిత్వం సంఘానికి ఉపద మిగులుతుంది

రవిపై శశిపై చీకటి వెన్నెల ప్రకృతిపై రాసినంత
సులభం కాదు మనిషిపై సమాజంపై రాయడం

ఎచటి కచట ఆటంకం ఆపదలు ప్రమాదాలు సమస్యలు
మోసం ద్వేషం భయం జిగీషలో ఎవరికి వారు
వేచి ఉన్న కవితకు విషయం పుష్కలం ఎంతో!
కొత్త అనుభవంకై చూచేరు, కవితను ప్రేమించేవారు

గట్టుపై పడవకై వేచి ఉన్న మనసుతో
తనలో ఉదార చరితను సంకేతిస్తూ కవి
గళంలో కదలుతూ పెదవులపై ఒలుకుతూ
వేచి ఉన్న కలం చివర వేదికతో కవిత

దాహం అప్పటితో ఆగదు, ఆకలి ఆ రోజుతో తీరదు
బ్రతుకులో దూరాలు దాటిస్తుంది, బంధాలు పెంచుతుంది

# 28. బాధలలో వేదనలో

**(1)**

గాలిలో కదలి పై మబ్బులతో సాగేనా?
నీటిలో తేలి జలధి అలలపైన కదలేనా?
ఎపుడు బడితే అపుడు కవిత వెడలని మాట నిజం
సృజన ప్రతిభ అవకాశంతో హృదయాన్ని లాగుతుంది

మానవ చరిత్ర ముక్కలతో ఒకటి అందుకొనీ
నెమలి ఈకలా మబ్బు ముక్కలా మనసును దువ్వేను
నాటకమొ నవలో కథయొ కవితో! ప్రజకై
మార్పులతో చేర్పులతో చోటు చేసుకుంటుంది

కనిపించని వారు ఎదుట నిలిచినట్లు ఉంటుంది
జీవితమేదో దేని కోసమో దానితో మనసు నిండుతుది

వాస్తవ జగత్తును అభిమానంతో అభిలాష ఏలుతుంది
లౌకిక పథంలో ప్రగతిని ఉత్సాహ పరుస్తుంది

**(2)**

కాలం పాతబడే కొద్దీ శిథిలాలలో
దొరకిన విషయం అల్లికతో ఇష్టమైన ప్రపంచం
జన సమూహ పంక్తులలో జాగృతిని నిలుపుతుంది
శూన్యాన్ని నింపుతుంది, బంధాన్ని దృఢ పరుస్తుంది

కళ్ళకు గంతలు కట్టిన పాత్రతో
కంటి చూపు లేని అంధీభూత ముఖంతో
స్వేచ్ఛను బంధించే నిరంకుశ చర్యలతో
తమ చుట్టూ వలయాలలో తిరిగేను జీవితాలు

ఉదయించే రవి బింబం అందరికీ చెందిన తేజం
ఎవరికి వారు తమ భాగ్య రూపంగా తలచేరు
కిరణ స్పర్శతో ఉజ్జీవితమయ్యే సందర్భంలో
పోవలసిన దారిని చూపుతుంది, మనసుకు మేల్కొలుపుతుంది

నిరంతరం సాగే జీవన లిప్తల మధ్య
కాస్త లభించిన విరామ సుందర సమయంలో
ఇంటిముందు తొక్కబడి చెదరిన రంగవల్లిలా
బాధలలో వేదనలో నుండి! ఎదుగుతుంది కవిత!

# 29. కొత్త కథ కవకాశం

**(1)**

ఇలకు కరుణ జలదంపై అభిలాష
హృదికి విజయ చిహ్నంపై ఆనందం
వ్యాపారం కాదు వ్యవహారం కాదు కవిత
వితరణ గుణ మహోదార చరిత్రను కలిగింది

చెట్టుకు చూపే పూలు పండ్లు ఆకులు
ఎన్ని విడత లయినా వచ్చే విధ మదే!
మనిషి మనో రూపం మారుతుంది అనుక్షణం
అభినవ సుందరతను కోరుతుంది జీవితం

పంజరంలో చిలకలానో బోనులో పులిలానో
బ్రతుకులు గడచేందుకెవరు ఇష్టపడతారు?
వనిలో హరిణం స్వేచ్ఛగ విహరిస్తుంది అందంగా
దానిపై చూపుతో అడుగులు వేస్తుంది పులి!

**(2)**

కాలంతో లేదు పేచి! ఇది అందరిదీ
ఎవరి పట్ల వివక్ష లేదు, భేద భావ మసలు లేదు
అన్నిటినీ బింబించే విశాల శుభ్ర దర్పణం
ఎవరి స్వేచ్ఛ వారిది ఎవరి ఊహ చర్య వారిది

మొదటి సారి కవిత మనసుకు చెంగలింప చేస్తూంది
చివరి సారి దనుకునేది చతురత చూపిస్తుంది
సమయం మారుతుంది పుస్తకంలో పేజీలా
సమయం జారుతుంది మబ్బునుండి జలకణంలా

అందాక తెలియని కవిత చకితంగా
అక్షరాల పంజరాన చిక్కుతుంది
దగ్గర కొచ్చిన వారికి హ్లాదం కలిగిస్తుంది
మార్పుతో కొత్త కథకవకాశం కలుగుతుంది

# 30. తనకు తాను భూమి

**(1)**

మంటలు చుట్టిన పచ్చని చెట్టుపై గూడులో
ఉన్న పావురం ఎగిరి! కవితలో కనిపిస్తుంది

బయటి కెళ్ళి జన గణ సమ్మర్దం నుండి
తిరిగొస్తూ వార్తా శకలాల బరువుతో
వస్తుంది గాలి! కవి ఎదను స్పృశిస్తుంది
అంతరంగ ప్రకాశంతో నిజం తెలిసిపోతుంది

ఏ గార్డెన్ లోనో ఏ ప్లాట్ ఫార్మ పైనో
నడచే ఆయువు కాదు ఎవరి జీవితం!

వ్యక్తి వెనుక నున్న సంస్కృతీ సమాజంతో
మానవ హక్కులతో వీడ రాని బంధంతో స్వేచ్ఛలో
బ్రతుకులో తైజసాన్ని నింపుతూ పోయేను
మనసులో పరిమళాన్ని వదలుతూ పోయేను

**(2)**

మనిషి మనిషికీ మధ్య పయనంలో మనసుకు
ప్రవాహమో లోయో గిరియో దాటాలిసి వస్తుంది
వంతెన యో యాన సాధనమో అవసరమవుతుంది
ఏర్పడేవి భేదంలో మరో పథం దొరకుతుంది

నిరసనతో మొదలై ప్రతిఘటనకు చేరి
తనకు తెలియకుండా ఉద్యమయ్యేను
తన కోసమొ ఇతరుల కోసమొ గలగల మాటలు
కొత్త ఊహతో మనిషిని ఉత్తేజపరచేను

వరాల మూట విప్పి చల్లినట్లుగా
అభిలాషను పెంచేను, ఉత్సుకతను నిలిపేను
ఏదో సందర్భంలో భూమి! తనకు తాను
జల బిందువు బదులు, నెత్తురు చుక్కను తలచేను

# 31 సమాధాన కిరణం

## (1)

సుందరతకు ప్రమాణం వ్యక్తి నిష్ఠం తన ఇష్టం
ఎవరి దృష్టి వారిది తమ సమాజ సంస్కృతిలో
ఎవరయినా! ఆ చూచే చల్లని కళ్ళ నుండి
మెరపు విడుదలయితే చాలు! స్వచ్ఛంగా

ఏది కవిత ప్రశ్నకు సమాధాన కిరణం
పరచిన మనో విశాల నీల గగనంలో
రవియొ శశియొ చుక్కలొ! కనిపించడం
ఉన్న స్థాయిలో పరిమళ కుసుమాన్ని పూయడం

చీకటి నెవరు పిలవ నవసరం లేదు
అది ప్రశ్న వెనకనే సిద్ధంగా ఉంటుంది
ఖడ్గాన్ని తలపించి భయ పెట్టవచ్చు
భవమతికి ప్రతినిధి కావచ్చు!

## (2)

నీరు జారిపోతుంది గాలి కదలిపోతుంది
చేతిలో గట్టిగ నిలిచే దొక విలువైనది నాణెం!
ఇల్లు ఎవరి స్వంతమయినా, ఇంటిముందు
వీధిలో నడచే హక్కు అందరిది, కర్ఫ్యూలో తప్ప

ఎక్కడెక్కడో తిరిగి తిరిగి ఇంటికి చేరడం
ఎక్కడా దొరకని అనుభవంలో ఆత్మ తృప్తి
ఇల్లు లోకమొక ఎత్తు, ప్రత్యేకతలతో
బయట లోకమొక ఎత్తు విశేషతలతో

కిటికీలు మూసినా తలుపులు మూసినా
ఇల్లు ఇల్లే! ఎద కిటికీ తలుపులు తెరవబడీ
రాత్రి నిస్తబ్ధ కాలానికి చంద్రుడు చుక్కలు అలంకార దృశ్యం
దిగులు పడని భయంలేని మనో విధం తలపిస్తుంది

# 32. ఆరాటం -ఆవేగం

**(1)**

రణమంటే అనలానికి గాలి తోడు కావడం
దాని కెదురుగ జ్వాలా చర్య తీర్చి దిద్దడం
సహనం మంటలలో బూడిద అయిపోయేను
ఇరువైపుల నిరంకుశం నినదించేను

నిజ మంటే విజయానికి అంతరంగ సాధనం
జన జీవన భాగ్యానికి శాంతి మొదటి అవసరం
ఏ మాట చివరదవదు రణ సంభాషణలో
దీని నందు కోవాలని కాచుకొనీ మరొకటి

ఏ చర్య చివరదవదు రణ సందర్భంలో
దీని నందుకోవాలని అనుక్షణం మరొకటి
గగన మంత అవకాశం శాంతికి సంక్షోభంలో
మనిషిలో సానుకూల రసహృదయం స్పందిస్తే

**(2)**

నిలిచి ఉన్న అవని తలం వర్తమాన వాస్తవం
తలపై అందని దివి ఆశకు మణిమకుటం
ఉదయంతో కదలే నడకతో రవి కిరణం
నఖ శిఖ పర్యంతం వెలుగు రేఖతో మనిషి

నిశీథి చీకటికి కవిత వెలుగు ముఖం ఇచ్చేను
పక్కనున్న శిలాకృతులకు చేతన నింపేను
ఆలోచనలో వెలుతురు! మానుష గుణ తేజం
మనిషి మనోలోకంతో నిర్వచనాని కతీతం

చీకటి ఆలోచనతో మానుష గుణ పతనం
మతిలో వికార రూపం! బీభత్స పాత్రతో
కవికి ఆరాటం సృజన భూమికపై
రవికి ఆవేగం కాంతి ప్రకటనపై

స్వేచ్ఛా కవిత్వం - 103

# ఏది కవిత
## (6)
## ఆరో భాగం
# నేను నేనే

మాదిరాజు రంగారావు



2019

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**EDI KAVITHA**

**Part - VI**

**Nenu Nene**

103 Free Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2019

***Presented***
***to***
***Dr. M. Santhosh Kumar***
***on his Birthday***
***with blessings***

# పీఠిక

ఇది 'ఏది కవిత' దీర్ఘ కృతిలో ఆరవ భాగం చిట్టచివరిది, "నేను నేనే". ఇది కళాత్మకతతో పాటు వర్తమాన (1) సామాజిక (2) రాజనీతిక (3) మానవీయ (4) మనస్తత్వ కోణాల్లో దార్శనికతను కలిగింది. శుద్ధమైన మానవీయమైన మానసికమైన అనుభూతి శిఖర రూపం, ప్రసార మాన రస భావం స్పష్టంగా కనిపిస్తుంది. స్వేచ్ఛా కవిత్వమన్న మాట బహు ముఖీనమైన స్పందనలతో అన్వర్థ మవుతూంది. కవిత్వ కళకు నేపథ్యంగా మౌలికమైన సామాజికం వివేచనకందుతుంది. వర్తమానంపై ఆలోచన ప్రధానంగా దృష్టికి వస్తుంది. అశాంతి నుండి శాంతి వైపు పయనం.

ఒక వస్తువు కావాలంటే మరొకటి వద్దని కాదు, వ్యతిరేకమూ అవదు. అప్పటి ప్రాధాన్యాన్ని బట్టి ఎన్నిక ఉంటుంది, ప్రతివ్యక్తి జీవితంలో సార్ధకాని కవకాశాలెన్నో! ఎవరికివారు ఇష్టంగా ఎన్నుకోవాలసి ఉంటుంది. దీనికి శుభ్రమైన క్రియా శీలత ముఖ్యం. ఇది ఈ కవిత్వానికి బాగా వర్తిస్తుంది. ఈ మానసిక చేతన భూమికలో ఈ కృతి రూపొందింది. మానవ మనస్తత్వ కోణంలో సాగింది.

కవిత్వానికి అవసరమైన 1) కళాత్మకత 2) పరిసరాలతో తప్పని సామాజికత గురించి ఆలోచన స్ఫూర్తికి వస్తుంది. మొదట్లో అనుకున్న ప్రణాళిక మారింది. రచన పెరిగింది. "ఏది కవిత" ఆరు భాగాలుగా వెలువడడం ఎంతో తృప్తికరమైన సంతోషాన్ని కలిగించే విషయం. ఇదొక ప్రయత్నం.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ రచన విశిష్టమైందిగా భావిస్తాను, "నేను నేనే" అన్న మాట కవిత్వంలో కవి ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని సూచిస్తూంది. ఇది అపూర్వమైంది. నవ్యతను దృష్టికి తెస్తుంది. స్వేచ్ఛా కవిత్వానికి ఆయువుపట్టు.

ఇందులో భావరూపాలు ప్రతీకలు గురించి వేరే చెప్పనవసరం లేదు. ఇవి నిర్మాణంలో సమగ్రతకు తోడ్పడినాయి. రచనకు గభీరతను చేకూర్చాయి.

ఈ విధం మొత్తం మీద ఇంతకు ముందు లేనిదీ, తనదైన ప్రత్యేకతను కలిగింది.

**మాదిరాజు రంగారావు**

# 1. సంఘానికి ఉపద

కవితకు శిశిర ప్రభావ మంటూ లేదు
చండ గ్రీష్మ తాండవం ప్రసక్తి అసలు లేదు
అటు కారుణ మేఘం ఇటు హ్లాద వసంతం
ఇరువైపులలో సుందరతను కలిగిందీ

విద్యు దూహలతో ఆకర్షణ కళతో
ఇది మానవ వికాస విజయ కేతనం
ప్రజాస్వామ్య సామ్యవాద పురా మూల గుణంతో
కలిసిన భావన తో వర్తమాన స్వేచ్ఛాజగం

తరం వెంట తరం అంది పుచ్చుకొనీ నవ్యత
మంచి చెడు మిశ్రమ రూపం జీవన ప్రతిఫలనంతో
బ్రతుకును సుఖమయం చేసే పనిలో విజ్ఞానం
పింఛాన్ని విప్పి చూపుతుంది కవితపై విమర్శ

అధ్యయనం అనుభవం కలిసి క్రియాశక్తికి
ఉన్నతినీ వికాసాన్ని మానవీయ మొనర్చేను
స్నేహం సమరం రెండూ జీవన తేజానికి
గమన రూప మిచ్చేను, గమ్యం చేర్చేను

శిలలను చిగురింప చేస్తుంది ప్రేమ
శిలకు ఆయుధ రూప మిస్తుంది వైరం
రాజ్య హింస ప్రజాస్వామ్యం మనుగడకు ఆఘాతం
దీనితో అశాంతి అగ్నియై నిరంకుశాన్ని మింగుతుంది

అక్షరం నక్షత్రమై నింగికి శోభ నిచ్చేను
అర్థవంత మయిన కవిత ఓటమి నెరగదు
చరిత్రలో కవి స్థానం విజయ ముఖంతో
కాలాని కతీతమై సంఘానికి ఉపద! యై

## 2. సామాన్యం కాదు

మౌన సమాజానికి మాట్లాడే ముఖం
శిలా మానవాళికి స్పందించే హృదయం
వర్ణ వర్గ భేద దృష్టి లేని కవిత నవం
మానవతా రాగంతో దిశలను నింపుతుంది

తిరుగుబాటు నిరసన మదిలో లో పొరలో
అనైతికం అమానుషం అధర్మం మట్టు పెట్టి
కొత్త బాట వెలుగు మాట పై పై పొరలలో
అంతరంగ స్ఫురణ తోనే కవిలో పయనం

ప్రతి వ్యక్తి హక్కును కాపాడే బాధ్యత పాలకులది
తన బాధ్యత మరచి పోని స్థితిలో కర్తవ్యం మనిషిది

మనిషికి దిక్కు మనిషే విషమ స్థితులలో
బ్రతుక్కి గమ్యం! ఒకటే అది సమాజం
దారిలో చలన మాగడం విరామ చిహ్నం
తిరిగి అందుకోవడం ప్రస్థానంలో భాగం

శిలలో చైతన్యం తేవడం కవి సహజం
మ్యూజియం ప్రదర్శనలో కదలే బొమ్మకాదు మనిషి
జీవ కణ నిర్మితిలో మానవ గుణ చేతనతో
నిరంతరం! ఆరోహణలో మనిషి! విశిష్ట రూపం

జయంతులు వర్ధంతులు ఇవి జ్ఞాపక చిహ్నాలు
ఇవే సర్వమనుకోవడం శూన్యంలో భ్రమణం
తరాలు వచ్చినా యుగాలు గడచినా
మనోవికార చర్య లెప్పటికీ కనిపిస్తాయి
ఎప్పటికప్పుడు సరిచేస్తూ పోవడమే!
మనిషి నుండి ఉపకృతి సామాన్యం కాదు

# 3. జీవన సంరంభం

నిరంకుశాన్ని ఎదిరించడ మొక సాహస కార్యం
ఎన్ని మార్లు అణచినా మళ్ళి మళ్ళి తల ఎత్తుతుంది
మధ్య మధ్య విష కుసుమాలను విప్పుతుంది
బాధా శిఖలను చూపుతుంది నిర్భయంగా

పేదవాడి బాగును స్వప్నిస్తుంది కవి కలం
అనల కీల వదలుతుంది, అవసర స్థితిలో
ఉదయ వేళ కిరణం అందరిదీ అందరికీ
చీకటి నణచే చరణం అవసరం ప్రతి రోజు

ఎవరి మాట తీరు వారిది : సమాజంలో
భాష తో సజీవ సూత్రం కలుపుతంది అందరినీ
స్పందనలో జీవన లయ కాపాడుతుంది
మనసును చేతనతో సృజన వశం చేస్తుంది

స్నేహ నిలయం కావచ్చు ఆయుధ పదం కావచ్చు
ఉరుములతో మెరుపులతో పరివర్తన సూచన అవచ్చు
పూవులా రాగ రూపం మబ్బులా ఆర్ద్ర భావం
కత్తిలా వీర తేజం కవితకు ముఖాలెన్నో!

ఇది తరగని పరంపరా నిధి రూపం
ఎవరి మాట ఎవరి సేత వారికి ప్రియం
మనిషిని దేశాన్ని మట్టిని పరిమళాన్ని
అలదు కోనీ భాష! ఒక అనుభవ కమనీయం

అనుక్షణం మారుతుంది మాట జీవన దృశ్యంలో
ఏ పాత్ర ఎపుడు ఏది పలికేదీ ముందుగ తెలియదు
అనుమానం అనిశ్చయం ఆవేదనలో మనిషి వర్తనం
ప్రేమ హింస భేదం వాదం తో జీవన సంరంభం!

# 4. స్వచ్ఛందంగా

నిట్టూర్పులో సంతృప్తో సంవేదనో! ఆ మతికే తెలుసు
వర్తమాన దృశ్యంలో తెలిసినవీ తెలియనవీ ముఖాలు
తెలిసిన దాని కన్న తెలియనిదే ఎక్కువ అనిపిస్తుంది
వచ్చే స్థితికి చోటు నిస్తూ ఉన్న స్థితి జరుగుతుంది

శరీర పేటిలో రత్నంలా భద్రమైన
గుండె లా కవిత! స్పందనలో వినిపిస్తుంది
నది నిలవదు అల ఆగదు కవిత చెదరదు
నిజం ప్రతిఫలిస్తుంది! నిర్మోహమాటంగా

కవితకు ఏ లౌకిక విభేద స్పర్శ లేదు
ప్రజలు అనుకునేది ప్రాణిత మవుతుంది
పూల వనంలా వివిధ భాషల పరిమళ సమాజం
హద్దుల లేని ఆశయం! పిడికిలిలో వలె కవిత!

పుట్టింది వ్యక్తి పరమయిన స్థితిలో
పెరిగింది చుట్టు మనుషుల బంధంతో
అస్తిత సమాజ వికాస చరిత్ర తో
స్వేచ్ఛ తో స్వతంత్రం హక్కుతో బాధ్యత బ్రతుకులో

గాలిలా స్వేచ్ఛ ఆగని ప్రసారంతో
నీరులా స్వతంత్రం, తరలే చలనంతో
భూమి వెంట హక్కు నింగి అంత బాధ్యత
జీవన పథాన ప్రశ్నలకు సమాధానాలుగా

సమస్య ఒకటే అయినా తల కొక సమాధానం
కుసుమం లానో బాణం లానో జలదం లానో
నిర్ణయాల రాశిపై మంచి చెడు గురించి
స్వచ్ఛందంలో తర్కంతో ఆయువు చెల్లుతుంది

# 5. వెలుగు అక్షరం

గమనానికి దిశను ఎన్నుకొనే నిర్ణయం మనిషిదే
గమనంలో 'నేను' విత్తులా పని చేస్తుంది మనసులో
తరువును తలపించే అస్తితతో పెరిగి
సంఘంలో భాగమై సమాజ శక్తిగ మారేను

మార్పు తప్పని కాలంలో చెదరిన శిథిలాలపై
పరివేదన స్వరంతో ప్రయోజన మేముంది?
నవ నిర్మాణంతో కొత్త చరిత్ర కవకాశం
ఒకటే! రావలసిన మానవ ప్రతిభా చిహ్నం!

ఊరు ఏర్పడక ముందు! ఇది ఒక అడవి
నాగలి ఎద్దు బండ్లతో అలంకృతమయింది
అడవి అదృశ్యమయినా ఆ లక్షణం మాత్రం
మనిషిలో పులిలా తిష్ఠ వేసుకొనే ఉంది! విచిత్రం

స్పందన భావన అనుభూతి విశేషంతో
పండిన మనిషి అంటే ఎవరు ఇష్ట పడరు?
నిజ రూపం కనబడకుండా కప్పేసే పొరలెన్నో
హేతువు కందబోయి అందకుండ పోతుంది

అగ్ని సుమం రవి మణి మరెన్నిటితోనో
సంకేతిత మవుతుంది ఆదర్శాకృతి వహిస్తుంది

మట్టి నుండి పై కెదిగిన చెట్టు చివరి కొమ్మపై
వాలిన పావురాన్ని తలపిస్తుంది, శాంతిని సూచిస్తుంది
సంస్కృతీ పరీమళాన్ని నాల్గు దిశలలో వదలుతుంది

చీకటిలో వెలుగు అక్షరాల్ని ఎవరు చెరపగలరు?
చూపులో లిపి తెలియకపోవచ్చు
మనసుకు అర్థం పట్టక పోవచ్చు

# 6. నిరీక్షణం

ఆయువు ఉన్నంత కాలం ప్రతి ఏడు జన్మ దినం
కొత్త మొగ్గలా వచ్చి పూవుగ విరిసేను
దుఃఖం వదలి మోదం కోరే మనసు మనిషిలో
అపుడపుడూ సమయం అందని గగన పుష్పమవుతుంది

ఉదయం అడుగు వేసి తీసే లోపల
స్మృతులు ! నిశి అందని చుక్కల వలె మెరుస్తూ
స్థితి నుండి స్థితికి మారే నిజ జీవన గమనంలో
వెనక్కి వెళ్ళే వీలులేదు లిప్తల లహరులపై ముందునకే

తీరం చేరే వరకు కాలికి మట్టి అంటదు
భూమి నుండి స్వాగతం లభిస్తుంది సాదరంగా
మనిషిలో కృతజ్ఞత పుష్ప గుచ్ఛ మవుతుంది
మట్టి అంటని పరిమళ సుమ హృదయంతో తీరం

కవిత కళామయమే కాదు, హృదయాకర్షణతో
సమాజ మూలాలతో జీవన వికాస దిశలతో
నేపథ్యంలో నిలిచీ, బయటి మనిషికి ప్రాధాన్యం
ఆయువు కాలాన్ని క్రియతో సార్థకపరుస్తుంది

క్షణం పల్లవించవచ్చు పుష్పాకృతి పొందవచ్చు
క్షణం రగిలి మండవచ్చు దహనకణం చిమ్మవచ్చు
సృజన విలయ గతుల సంగమంతో కాలం
కావలసింది వెదకడం పొందడంలోనే గడుస్తుంది

దీప మవసరం లేని పగలునూ
దీప మవసరం ఉన్న రాత్రినీ
రెండింటినీ వహిస్తుంది! మనసు
లో నుండి ప్రకాశ నిర్దేశంతో

కొండ గుర్తు జన్మ దినం నుండి మరో జన్మదినం దాక
పాత బరువు వదలి కొంత కొత్త బరువు చేరవచ్చు
బరువు గురించి చింతనలో యోచనలో మనస్సు
మరో జన్మదినం! రాకకై ఎదురు చూస్తుంది, సహజం

# 7. అభేదం

కవితలో శబ్దం! జలాలపై నావలా అలవోకగా
మట్టి అంటకుండా పఠితను పయనింపచేస్తుంది
తీరం చేరాకనే మట్టితో సంబంధం! భూమిపై
మనిషిలో అమృత వాహిని! కాలాన్ని పండిస్తుంది

వ్యక్తి నుండి సమష్టి రూపం బయటపడుతుంది
మేధ విప్పారి మనసు విశాలతను పొందుతుంది
శబ్దం తెరచిన కిటికీ అవుతుంది భావనలో
మనో నయనానికి దృశ్యం! అపూర్వంగా, క్షణంలో

అనుభవ ప్రకాశంతో! చీకటి దూరం కదలుతుంది
కణ కణం చేతనతో భావాకృతి పొందుతుంది
పృథ్వి పయి సంస్కృతి రూపాలు, దార్శనిక విభేదాలు
ఒకచోట చేరి సమభావంతో విశ్వమయమయ్యేను

సంకెలను మీరిన మానస బంధనం
తొలగి పోవడమంత సులభం కాదు
అది బంధనలో ఉన్నది తెలియని స్థితి
బ్రతుకులో అవసరాలతో ముడి పడింది

నేను మూలం నుండి పైపైకి ఎదుగుతుంది
పచ్చదనం సుమ ఫలం రూపంతో తరువులా
చెప్పే హృదయంతో వినే హృదయం ముఖ్యం
ఇరువురు కలిసిన రూపం కవితా లోకం

ఆలోచనా ప్రసారాల్ని ఎవరు ఆపగలరు?
క్రియాశక్తి ప్రభావాన్ని ఎవరు నిలపగలరు?
రెండూ కలిసిన స్వతంత్ర చరిత్ర మనిషిలో
అణచివేత బంధనల్ని ఎదుర్కొనే పథకంతో

వేసిన ద్వారం తలుపుల్ని కిటికీ రెక్కల్ని
గాలిలా కవిత తడుతుంది, మనిషిలో
స్వేచ్ఛ సందు చేసుకోనీ తన శక్తిని చూపుతుంది
దీనికి పగలు రాత్రి ప్రసక్తి లేదు, మనుషుల భేదం లేదు

# 8. కృషి ఫలం

కథలో ఏదో ఘట్టం ముగుస్తుంది
మిగతా భాగం అలాగే ఉంటుంది
పయనంలో ఎక్కడో దిగిపోతే
మధ్యలో పథం వీడిన మనిషి గమ్యం చేరేనా?

మంచి మాటకు పునరుక్తి దోషం లేదు
అది చర్విత చర్వణమై వ్యర్థం కాదు
మధ్య మధ్య చీకటిలో దీపంలా వర్తిస్తుంది
ఎన్ని మారులు విన్నా విలువలు కావలసిననవే!

ప్రతి రోజు ఉదయించే రవి కిరణం
ఎంత కాలమయినా నవ్యంగానే ఉంటుంది
ఏదో పాత్ర ప్రవేశిస్తుంది నిష్క్రమిస్తుంది
అంతటితో కథ ముగిసి పోదు, సాగుతుంది

తలపై నింగిని కదలే నీలి మబ్బులలో
ప్రతిదీ కావలసిన వర్షంతో అభిషేకించదు
కొన్ని మనిషి చూపుతో మెరపులో కలిసి పోతాయి
కొన్ని తమ గర్జతో భూమిని పలకరించి పోతాయి

కొన్ని పరిచయ మాత్రంగా నిలిచిపోతాయి
సృజనపై హృదయ బంధంతో, కురిసేవి కొన్నే

అనుకొనా అనుకోకనా నీళ్ళలో మునిగిన శరీరం
కాసేపటికి తేలక తల ఎత్తక తప్పదు
తనలో నైపుణి ప్రకటన కవకాశంతో
జీవ వంతమైన శక్తికి చిహ్నంగా మిగులుతుంది

కలలో నయితే ఎంత లోతైనా ఎత్తైనా చేరవచ్చు
వాస్తవ గతిలో వేసే అడుగుపైన జాగ్రత్తలెన్నో

ప్రతి రోజు ముగింపులో మనసు కోరుతుంది
తన కృషితో ఫలితంలో భాగం మాత్రమే

# 9. దహన క్రీడ

దహనంలో విసరే జ్వాలా రూపం
కొందరికి క్రీడాలోకం
చైతన్య మనుకునే వారు ఉత్తేజం పొందేరు

అగ్ని మౌనంగా తపిస్తుంది
జలదంతో కవిత అవతరిస్తుంది
చల్లబడిన భూమిని సృజనమయం చేస్తుంది

తెలుపు పసుపు ఎరుపు వర్ణ కిర్మీర హృదయంతో
ఉషోదయం వసంత శోభను గుర్తుకు తేవచ్చు
అస్తమయం గ్రీష్మ జ్వాలను తలపించవచ్చు
ఒకరొకరికి ఒక్కొక రసమయ దృశ్యం ఇష్టం
మరో భావ జగంలోకి తీసుక వెళుతుంది
ఎవరిలో వ్యతిరేకత ఉండదు, అన్నీ వారి వారి అస్తితలోవే

పాలలో నీరువలె నిజంలో అబద్ధం కలిసీ
దేని కది వేరు చేసేందుకు
మనిషిలో నయితే హంస రూప మవసరం
సంక్షుబ్ధ సమాజంలో వివేచన కవకాశం లేదు

దేని కదే! కవి హృదయం పసి గడుతుంది
స్పందమాన శుభ్ర జగతిని పరిచయం చేస్తుంది
వేదనలో చింతనలో అన్వేషణ మతితో
రహస్యాన్ని తెలుసుకొనీ అందుకొనీ
అందరికీ తెలుపుతుంది కవిత! కళాకృతితో
సమస్యను వడపోసి స్వచ్ఛంగా అందిస్తుంది

స్వేచ్ఛకు కట్టడికి మధ్య నడచే చరిత్ర
మనిషిలో శక్తి యుక్తి ప్రకటనకు పరీక్షగా
తిండికై నింగి కెగిరిన పక్షి నివాసం
చెట్టుపై గూడు నెవరో భగ్నం చేసేరు

# 10. జయభావన

శబ్దాలన్ని ఒకటి కాదు దేని ఛాయ దానిదే
దేని అర్థం దానిదే! పయనంలో పరిమితులతో
బాధలో పీడలో నిరసన విప్లవ గమనంతో
తృప్తితో మోదంతో రాగం సన్మతి చలనంతో

యుద్ధానికి అడుగు పడే ముందుగ వీరుడు
ఒర నుండి కత్తి మొనను ముద్దు పెట్టుకునేను
ఉరి కంబం ముందు మరణానికి సిద్ధంగా నేరస్థుడు
ముఖాన్ని కప్పే నల్లని తొడుగు ముద్దు పెట్టుకునేను

కవిత మొదలు పెట్టే ముందు కవి
శబ్దంలో అమృత శక్తిని ముద్దు పెట్టుకునేను
తన ముఖాన్ని అద్దంలో చూచుకొనే కోరికలో
సౌందర్య కళాభిజ్ఞతకు శ్రీకారం జరుగుతుంది

మృత్యువు ప్రాణులపై ఎప్పటికీ అధిపతియే
ఇది వికార దశకు పరాకాష్ట! జీవన రుచి వ్యతిరేకం
జీవిత మెప్పటికీ పెరిగేది! పలు స్థాయిల్లో ప్రాణితమై
చుట్టూ ఎన్ని దిశలున్నా! నడచే దిశ మాత్రం ఒకటే

పయనంలో నిజ రూపం మారుతుంది మనిషిలో
అనుభవ సుందరమయిన దృశ్యాల ప్రభావంతో
నీటిపై గాలిలో వెళ్ళే కోరిక సహజం మనసులో
అది తీరే సాధనాలు! నావ విమానం విజ్ఞాన విజయాలు

పాము తన పిల్లల్ని మింగుతుంది తెలియకుండా
మనిషి మనిషి హతమార్చేను సర్వం తెలిసీ
పద పదాన మృత్యు భయం ! సమాజంలో
వ్యక్తిని జాగ్రత పరచేదొక! విజయభావనయే

మిన్ను విరిగి మీద పడేంత భయంతో
ఎవరెవరినో ఆశ్రయించేరు! రక్షణకై క్షేమంకై
పావురాన్ని ముద్దుగా దువ్వి వదలినట్లు కవిత
జనత గుండె గూడు నిర్మితిలో భద్రంగా!

## 11. మనిషి మనిషిలో

ఏదో ఒక వైపు చేరని, నీడను ఆశ్రయించని
మనిషి లేడు మనసు ఉండదు, విశాల సమాజంలో
సగం వైయక్తిం సగం సామాజికం
నిలయం నుండి లౌకిక వలయంలోకి

కోరికల్ని బట్టి పొందే ఫలితాలతో
ఒకదాని నొకటి ఆవహించే ప్రవర్తనం
వ్యక్తి స్వేచ్ఛ సమాజ నిష్ఠ సమాంతరంగా
మధ్య మధ్య కలుస్తూ విడిపోతూ జీవన గమనంలో

గగనానికి అందరూ సమానమే అన్ని దిశలూ
ఆలోచనకు హద్దులు లేవని రుజువు పరచేను
వసుధకు భేద భావన లేదు అందరూ ఒకటే
అందరికీ శ్రమ చేతన ఫలాల వీలు కల్పించేను

భూమికీ గగనానికీ మధ్య బఫర్ జోన్‌లా
వాస్తవమూ కల్పన అంచులు తాకుతూ సమాజం
బాధల్ని కష్టాల్ని మోదాన్ని తృప్తినీ లీనం చేసుకోనేను
ధిక్కార స్వరానికీ కర్తవ్య చర్యకూ చోటు దొరకేను

మౌనంతో మొదలయిన జీవనం చలనం
కోలాహల శబ్దంతో పరి సమాప్తి పొందేను
చరిత్ర సారానికి సంస్కృతి తేజానికి స్థాయిలో
ప్రతినిధి అవుతుంది కవిత! అక్షర జగత్తులో

అనుకూలం ప్రతికూలం ఇరువైపులతో
మనిషి మనిషిలో రణం శాంతి ఛాయల చిత్రాలు
వ్యక్తి నుండి సమాజానికి మారే ప్రయోజనం
సౌఖ్యానికి భాగ్యానికి వికసనం కోరుతుంది

శిలకు మానవ రూపాన్ని దిద్ది చెక్కితే
మనిషిలో మనిషి దైవం రేఖలు తలచేను

## 12. వికాస కళతో

ఏకాంతంలో కవిత అవతరించినా
మనుగడలో సమాజాన్ని వరిస్తుంది
జన హృదయ వికాసం కోరుతుంది
నిజ జీవన వాస్తవికత ప్రతి ఫలనంతో

జడమూ చేతన అతీతం మూడు స్థాయిలలో
కలిసిన విశేష రూపం, హృదయం కేంద్రంగా
పక్షి ఎగురుతుంది గూడు నుండి ఆహారంకై
బయటికి రాకపోతే! ప్రాణ పోషణ మెట్లా?

కవిత అనుభవం లోకి వస్తూనే
కనుబొమలు కదలుతాయి
చేతిలో విల్లు వంగినట్లు
ఒర నుండి కత్తి వెడలినట్లు

మెరపు పొందవచ్చు పదును తేలవచ్చు
చీకటి తలుపులు బార్ల తెరవబడీ
వెలుతురు నిండినట్లు ఉంటుంది

మాటకు పాతలేదు, అరగడమనేది లేదు
పరిమళ వీచి అనుభవం, మనసుకందుతుంది

ప్రవాహ గమనంలో కవితకు
పాత కొత్త భేద మెక్కడుంది?
కవిత ఎప్పటికీ అభినవ కళయే
జలధికి గట్టులా నింగికి దిశలా హద్దులలో

పరిశ్రమలో విడుదలయిన వస్తువు కాదు
అనుభవ జగత్తులో సుందరతను చూపేను
అంతరంగ స్పందన తో పలుకుతుంది నడిస్తుంది
సమాజ భూమికలో వ్యక్తి వికాస కళతో కవిత

## 13. ఉద్దీపకం

పరివర్తన శీల ప్రకృతి నేపథ్యంలో
జీవిత మెట్లా ఉండేనో? ఉండాలో! ఒకరొకరిలో
అది ఎట్లా ఉండ కూడదో, తెలిసిన వాస్తవం
అయినా సంక్షోభం బీభత్సం ఎదుర్కోక తప్పదు

హఠాత్తుగా శబ్దించే నిశ్శబ్ద వలయాలను దాటుతూ
అశాంతిలోను పక్షులు గూడు నుండి బయటి కెగిరేను
గాలిలో కాల్పుల ధ్వనులు భయరేఖలు గీస్తున్నా
అందాల్ని దాచరాని పక్షులు! ఆకర్షిస్తూనే ఉన్నాయి!

ఈ దృశ్యానికి ఈ దేశం ఆదేశం అని లేదు
ఏ చోటు అయినా, విపరీతం విపత్కరం సమానమే

నిన్నటి వరకు పరిచయ లత పూచిన పూలతో
అలంకరించి ఉత్సాహం నింపింది సమాజం
ఇపుడు సరికొత్త ముఖంతో ఎదురవుతూంది,
నిరసన ధ్వని ఆందోళనలో సమాజాన్ని ముక్కలు చేస్తూంది

మంచు పరచిన నేలపై నెత్రు చుక్క
మినీ రవి బింబాన్ని తలిపిస్తూంది
మనుషులలో విభేదాలకు వాడిని తెస్తూంది
భయం కప్పుకొనీ వీధులలో ప్రజ కదలిక! చలిలో
క్షణాలలో మార్పుకు తొందర పడుతూంది మనసు
ఇది సభ్య సమాజానికి ఇష్టంపై నిలిచింది
కోరే వారిలో మానుషం కుసుమించాలిగా!
చూచే వారిలో ఆమోద చిత్రం! మెరవాలిగా!

బయట గాలిని ఎక్కడికక్కడ నియతం చేయలేరు
ఎయిర్ కండిషడ్ మాట సార్ధకం కాలేదు

ఇది నిలయం కాదు సౌధం కాదు కార్యాలయం కాదు
బయట వీధులలో మైదానంలో పవనం జన హితకరమై

పట్ట పగలు చెదరిన చీకటి ముక్కల్ని వదలుతూ
వెలుతురు పక్షుల కన్న ఒకటి రెండు చీకటి పక్షుల ఆర్భాటం

## 14. ఉత్తేజకం

ఎపుడేది దూకి పై బడేదీ తెలియదు
వరదో కంపమో తాపమో తుఫానో
ముందస్తు సమాచారం, జాగ్రతలకు సరిపోదు
ఎప్పటి కపుడు దిద్దుబాటుకు సిద్ధం కావలసిందే

విపత్తు క్షోభకు గురిచేస్తుంది
మనిషిలో శక్తిని యుక్తిని తలక్రిందులు చేస్తుంది
అశాంతికి ప్రోత్సాహకాలు చీకటి గుహ నుండి
హింసకు రహస్య వ్యూహాలు ఉత్తేజితాలుగా

లేవగానే ఉదయం ఉషస్సు దృశ్యం బదులుగా
విషాద ఛాయలతో సమాజం చుట్టబడుతూంది
స్వేచ్ఛ లేని స్థితిలో తమ ప్రమేయం లేని ప్రజలు
చాటు నుండి మూకలు! నిప్పులు చిమ్మే పనిలో

గమ్యం చేరక ముందే పయనం మధ్యలో
పై స్టేషన్ పరిధిలో ప్రమాద వార్త! మోసుకొనీ
గాలి తడబడుతూంది విషాద భారంతో
నిప్పంటిన క్షణాలతో కాలం భయం వదలుతూంది

డెబ్బయి ఏండ్లపైగా అశాంతి అనుభవాలతో
ఈ జన పదం! నిరాశకు ప్రతిరూపంగా కాశ్మీర్
దోసిలిలో నీరులా మంచి మంచి అవకాశాలు
వేళ్ళ సందు నుండి జారుతూ దాహం ఆలాగే ఉంది

కవితలో అక్షరాలు రాత్రి చుక్కల్లా
ఉదయం కన్నీటి బిందువులయి జారేను
గదిలో అద్దం ముందు మనిషి! మాట్లాడేను
కిటికీ నుండి బయటికి పాటను వినిపించేను
మాట! జలధి ఘోష శబ్దించేనా?
పాట! బీభత్స ముద్ర వదలేనా?

## 15. జలదంపై ఆశతో

హింస లేని చరిత్ర ద్వారం ఎక్కడుంది?
శాంతిలో జరిగే వికాస చిహ్నం ఒకటే ఊరట!
సమస్యలేని మనిషి నిలయం ఎక్కడుంది?
సమరస భావనతో గడపడ మొకటే మార్గం

ఏడుపు కొత్త కాదు! ఎప్పటిదో పాత బంధువు
ఉల్లాసం ఎప్పటికప్పుడు కొత్త పరిచయంలా
బ్రతుకు హీనం కాదు, నరకం కాదు
అద్దంపై గీతలవలె బ్రతుకులో వికార చేష్టలు

పలు రంగులలో ! బహు భావాలకు గుర్తులు
ఎవరి కిష్టమైన విధంగా అది రూపొందుతుంది
సుఖమయ జీవన గతిలోను కలహ స్థితులు రావచ్చు
రణ సదృశం కావచ్చు, పరిష్కృతియే సంస్కృతి రూపం

జ్ఞాపకాలు మనసులో శ్రేణులుగా నిలబడే
కలల మరపున బడవచ్చు, అనుభవాలు నిలుస్తాయి
తనువుపై గాయాల గుర్తులుగానో
మనసుపై విఘాతాల ముద్రలుగానో

సుఖం కన్న బాధ బరువు ఎక్కువ అనిపిస్తుంది
రెండిటినీ సమంగా మనసు వహిస్తుంది
వెనకంజ వేస్తే దిగులుతో ఆత్మహత్య
ముందుకు పోతేనే జీవన సార్థకం

వీధులలో తిరిగే బిక్షువు అర చేతులలో
గాలి కెగసే దుమ్ము తప్పు ఏమి ఉంటుంది?
అశ్రువు అనుభూతి స్పృహకు శిఖరం
శిఖరం నుండి పక్కనే జారే జలపాతం

దృశ్యం జీవన వాస్తవాన్ని ఎదుట నిలుపుతుంది
వర్తమాన క్షణాల్ని ముందుకు పరుగెత్తిస్తుంది
మంటల కథలతో ఇది కాశ్మీర్
మానవీయ జలదంపై ఆశతో

# 16. విజయ స్ఫూర్తి

నిలయం లోకి ప్రవేశాని కెన్ని అవరోధాలో?
దగ్గరకే వేసిన తలుపు తెరవడమే కాదు
బయట అడ్డుకునే గేటు కాపలా
నిఘాలో కదలే రహస్య సంచారులు

లోనికి ఎలాగో ప్రవేశం దొరికితే
మనకు పని లేని వ్యక్తి ముఖం కనిపించవచ్చు
ఒకవేళ పని ఉన్న వ్యక్తియే అయినా
ఎడ మొగం పెడ మొగం ఎదురు కావచ్చు

స్వాగత ముఖంతో సాదర చర్యలతో
కనిపించడమొక సుందరమైన విశేషం
మానవ చరిత్రలో కూడ గట్టు కున్న
సార భూత మయిన సంస్కరణం సంకేతం

ఇది కాలానికి చెందిన విషయం కాదు
వ్యక్తిలో ఒదిగిన మరో రూప ప్రకటనం

ఆకలిని జయించే అవసరమైన కోరికతో
కనీస జీవనాన్ని పొందే ఆరాటం పోరాటం!
మూసిన గేటు ముందు నిలయం నుండి నిలయానికి
జీవించే హక్కుతో మనుషులు! నడచే శిల్పాల్లా

ఏ కవి మాటలతో నేతల చేతలతో ఈ రూపం మారేను?
ఈ స్పృహ కలగడ మొక ఎత్తు! ఫలితం దక్కడ మొక ఎత్తు!

శిలాత్వం వీడి మాంసల స్పందన హృదయం తోచేనా?
జెండాలు! ఎజెండాలు! వాదాలు వాగ్దానాలు! కొదవ లేదు
విడిదికి ఉపయోగపడే డేరా నిలయాలెన్నో
క్రమం తప్పకుండా ప్రచారాల రికార్డు ప్లేయర్లు

దరిద్ర సీమలు దాటే అవకాశం దొరకేనా?
కనిపించే దారిన నిశ్చింతగ గమ్యం చేరేరా?
విశ్వాసం ఆశకు గమన శక్తి నిస్తుంది
పరివర్తన ప్రగతికి విజయ స్ఫూర్తినిస్తుంది

## 17. అభినవ ముఖం

సహృదయ లోకం కోరేది కవితలో
బీభత్స కాండ నుండి బయట పడే ప్రకాశం
నిర్మాణ గుణ శక్తులతో సమన్వయ శీలం
అక్షర సహయోగంతో సుందర రూపం

మంత్ర తంత్ర ఇంద్రజాల విద్య కాదు
వాస్తవానుభవం లో జీవన దర్శనం
భావ వినిమయంతో హృది విశ్వమయం
కనిపించని మృత్యు కథను మరపిస్తుంది

జీవ పదం వేరు మరణ పదం వేరు
రెండిటి మధ్య స్వర్ణ రేఖ సజీవంగా
స్వర్ణ సీమను దాటితే అపాయ లోకం
ఈ ప్రమాద చిహ్నా మెవరికి మోదకరం?

అద్దంలో కనిపిస్తుంది బయటి ముఖం
మనో నయనానికే సాధ్యం, లోపలి రూపం!
మట్టి బొమ్మ నిప్పు నీదు మనసు
తను చుట్టూ ఉన్నవి మరచే మనుషు లెవరు?

నడచే మనిషికి గాలి వస్తుంది తోడుగా
వెలుతురు చీకటి వెన్నెల ఏదో ఒకటి
మనిషిని అంటుకొని వీడని మిత్రంలా
గగన మంత్ర మహాధైర్య మిస్తుంది హృదికి
సూర్యుని వలె విజయ బింబం చూపుతుంది
మృత్యువు తలపై అడుగు వెలయ జేస్తుంది

కవిలో సంకల్ప శక్తికి అక్షరాకృతి కవిత
వ్యక్తి వేదనతో సమాజ హిత బంధు కళా రూపం

చిత్రమేమంటే దగ్ధమైన మనో భూమి నుండి
అభినవ సృజన ముఖం బయట పడుతుంది

# 18. హేతు ధనుస్సు నుండి

మంచి రోజు అంటూ లేదు ఏ కాలంలోనూ
అది మంచిగ పరిణమించడం మనిషి చేతిలోనే
దారులు కలిసిన చోట మనిషి మనసు బయట పడుతుంది
ఏ దారిన పోవాలో అవసరంతో పాటు విజ్ఞత అవసరం

ఏదో ఒక గమ్యం చేర్చని దారి లేదు
దానిని ఎన్నుకోవడంలో ఉంది మనిషిలో నిపుణత

వాస్తవం వెనక నుండి కల్పన రాజ్యమేల చూస్తుంది
నిష్ఠురమైన నిజం వాస్తవాన్ని ఎదురుగ నిలబెడుతుంది
చిరకాల బంధువు వలె స్నేహ వారిధిపై నడిపిస్తుంది
కవి బహుమానం కవిత! కాలాన్ని తనలో బంధిస్తుంది

ప్రాణ మిత్రం గాలి తలుపు తడుతుంది
అవగాహన లేకుండా వివేచన కొరవడీ
రాత్రి అయితే! మృత్యు భయం వేస్తుంది
అంతలో మనస్సు ఇంద్ర ధనుసుగ మారేను
ఊహకు హ్లాదం కొత్త డ్రెస్సు అవుతుంది
గుండెకు చేతన జీవ ధార నిస్తుంది
సందర్భ ప్రమేయం లేకుండా ఏదీ జరగదు
జన మత చలనంలో వేగం మార్పు చూపుతుంది

నిరాశ నుండి ముందు ముక్తం చేస్తుంది ఉద్యమం
నినాద బలంతో క్రియా శక్తి ముందుకు నడిపిస్తుంది
ఎంత గొప్ప దయినా జీవితాన దార్శనికం
కొన్ని పరిమితులలోనే ఆచరణం సాధ్యం!
నిర్వేదం నైరాశ్యం రెండిటినీ తరుముతుంది
కష్టాల కొండలు బాధల జలనిధులు దాటిస్తుంది

ఎపుడు బడితే అపుడు మనో నయనం విప్పారదు
స్వచ్ఛమైన కిరణ స్పర్శతో అంతరంగ దర్శన స్పృహతోనే
రుతువులు మారతాయి ప్రభావాలు వేరవుతాయి
కవితలు మారతాయి సమాజ భావనా విధాలతో
ప్రశ్నకు పిలుపుతో పనిలేదు, ఆహ్వానమవసరం లేదు
హేతు ధనుసు నుండి దూసుక వస్తుంది బాణంలా

## 19. విశ్వమయం

కాలంతో కదలే కవిలో సమాజ పరిణామాలు
కవితలో ప్రేరణ భూమికతో వికసిస్తాయి
ఉత్తేజం తోనా? ఖండనతోనా? కలిపేనా? చీల్చేనా?
అస్తితలో భాగమైన దృష్టి, మనో విధతోనే భేదం

జలదం కోరేనా? అగ్నిని తలచేనా? మౌనం పూనేనా?
రెండూ మార్పుకు నిధానాలు, సృజన విలయ ప్రతీకలు

బ్రతుకు ఎక్కడయినా శ్రమ జీవన సంకలనం
వెలుగులో ఎవరయినా తమ అడుగు ముందుకే

గతం గురించి గుణ దోష వివేచనం
ప్రస్తుతంలో స్వానుభవ విశేషం
భవిష్యత్తుపై చెదరని దార్శనికం
ధనం కీర్తి అధికారం పై మనసులో

విదలించే మెతుకుల కోసం ఎవరు ఎదురు చూచేరు
తన భాగం తనకు చెందాలని హక్కుల ప్రకటనం
శ్రమతో పగలుకై రాత్రి వేచి ఉంటే
విరామ రాత్రిపై పగలు ఆశ పడేను

ఎవరి రాజనీతి పతాక వారిది
మానవీయ కేతనం మాత్రం అందరిదీ
మట్టి ఎక్కడైనా ఒకటే ఎపుడయినా
తీరు తీరుగా మనుషులు! వచ్చే మొక్కలవలె

ప్రాంతాని కొక భాష సమూహాని కొక మతం
వర్గాని కొక జెండా మనిషి మనిషి కొక వాదం
అన్నీ కలిసిన సంశ్లిష్ట సమాజ సౌందర్యంతో ఈ యుగం
పోరాడి ఓడినా ఒక తృప్తి; మళ్ళీ పోరుకు అవకాశంతో

అవకాశం దొరికితేచాలు! మనిషిలో ఆరాటం
జలధిని నింగిన భూమిని వశం చేసుకొనే సంకల్పం
సహనం శాంతి ప్రగతి త్రయం కవితలో
బీజ భూతంగా ఉన్నవి విశ్వమయత కోరేను

# 20. నేను నేనే

కవిలో మనో నేత్రం సక్రియలో
వివిధ స్థాయిలలో అరాజకాన్ని ఆందోళనను గమనిస్తుంది
సహన శాంతి నైతికతలను కోరుతుంది
సంఘ చక్ర చలనంలో విషమతల్ని చూపుతుంది

కవితలో పని చేసేది, రెండు కళ్ళతో పాటు
కవిలో విప్పారిన అంతర్వీక్షణ నయనం
రాజ్యానికి దూరంగా ఉండలేదు, కవి అయినా
అతనిలోను సాధారణ జీవనావసరాలు తప్పవు

కొందరి ప్రవృత్తిలో తీగెలా జీవితాన్ని అల్లుకొని
క్షణాల్ని పూలతో అందంగా సువాసనగ మారుస్తుంది

వ్యక్తి ఇష్ట మొకటే కాదు, సమాజ చింతన కూడా
అస్తితకు రూపం ఇస్తుంది, వివిధ కోణాలలో
సహకారమేమో కాని సానుభూతి అందరికీ వీలవుతుంది
ఏడుపు సందర్భంలోనే, నవ్వు ఎపుడయినా దూకుతుంది

ఎవరి కోస మెవరూ దీపంలా వెలుగుతూ నడవరు
చీకటిలో ఎవరికి వారు దీపంగా వెలగడం అవసరం
రేకుల అమరికతో కమలానికి ఆకృతి అందంలా
విలువల కలయికతో మనోజ్ఞమైన మానస వరం

విపణి నిలయం కాదు కవితా లోకం
వర్తక వ్యవహారం కాదు కవి మనోరూపం
చేతనతో అనుభూతి వశంలో మానవం
స్పందనలో అక్షర చర్యకు పూనుకునేను

ఏదీ అనుభవానికి దూరంగా అమూర్తంగా ఉండలేదు
కవి భౌతిక నిష్క్రమణం తరువాతనూ, కవిత బ్రతుకుతుంది

ఇది ఎవరి స్క్రిప్టుకో అనుగుణంగా సాగదు
ఆశా వహమైన సువర్ణ రేఖలతో దారి కనుగొనడమే

స్వేచ్ఛలో స్వచ్ఛమైన మానవ చేతన విప్పారనీ
మూస పోతలో పదాలు కదలవు! దేనికదే ప్రత్యేకం

# 21. సమాధాన కిరణం

సమస్యకు సమాధానం బాధకు గురి చేయడం కాదు
ఆత్మ హత్యకో మరొకరి హత్యకో దారులు చూపేది కాదు
సంవేదనా శిఖలపై ప్రాణాలను ఆడించదు
హృదయంలో సరికొత్త అనల బీజాలను చల్లదు

ఆకలి ముఖంతో వీధిలో చేయి చాచి
అడ్డు పడేరు కొందరు, బిక్షాటనలో
శాలువపై కోరికతో నిలయాల ముందు
అఱ్ఱాడేరు కొందరు! డబ్బు కోసమో పదవి కోసమో

ఉన్న వారయినా లేని వారయినా వివిధ స్థాయి భేదాలతో
బతుకులు నప్పే, మూల మనస్తత్వ శాఖలొకటే
విపదలో సమాధానంకై కవిత ఉత్సాహ పరుస్తుంది
గుండెకు దైన్యంలో సానుభూతి ఉపద నందిస్తుంది

తలపై ఉన్న దనుకుని మురిసే మకుటం దిగువన
ఎరుపు తెలుపు నలుపు గీతలో ! మచ్చలో!
తన విజయం లక్ష్యంగా చేసిన పనులకు గుర్తులు
సందర్భ మేదయితేనేం? ఇతిహాసంలో స్పష్టంగా

అనుభవంలో ప్రవాహ రూపం వర్తమానం
గమనంలో భవిత! తెలియని రహస్య గ్రంథం
ఎవరి దృష్టితో వారు చూచేరు, భావ ప్రపంచం
అనుభవించే వారికి మూసిన తలుపులు తెరచుకునేను

గాలి తలుపు తడుతుంది లోనికి వచ్చేందుకు
మనిషి హృదికి లోక వార్త అందేందుకు ప్రియంగా
కవిలో ఆలోచనా చిహ్నం! తన బాధ్యత నిర్వర్తిస్తుంది
అంతరంగం వెలుగులో రహస్య కోణం బయట పడుతుంది

నీడకు స్వేచ్ఛ లేదు, వెలుగు వెంట
నిరాడంబరంగా వస్తుంది పోతుంది
వెలుతురుకు ఎక్కడలేని బరువులు!
కవితలో సమస్య కొాక సమాధాన కిరణం

# 22. నవతలో

వాస్తవాన్ని ఎదుర్కొనేందుకు భయపడేరు ఎందరో
ధైర్యం గల మనోమూర్తులు! మహానేత మహాకవి మహావీరుడు
బ్రతుకు అవసరాలలో వాహన రూపం కాదు
ఏ యంత్రం తోనో లాక్కొని పోయే వస్తువు కాదు

కల్పనలో కాలక్షేపం జరుగుతుంది సుగమ సుందరంగా
అందుకే ఇది వీడదు వీడలేరు మనసు నంటి పెట్టుకొనే
కష్టాల అనుభవంతో మడమ వెనక్కి మరలుతుంది
సులభంగా కోర్కెలు ఫలించే ఉపాయం వెదకుతుంది

ఓటమి విజయంలో పైకి కనిపించని హేతువు లెన్నో
ఎవరికి తోచిన విధంలో వారు, తమ యుక్తిని ప్రదర్శించేరు
నడక బదులుగ వాహన రూపాలు మారుతూ పోయినా
పోయే ఉద్దేశం అదే! గమ్యం వేరు కాదు, ఒకటే

దిన మణి ఆగమనంతో ఉదయ శోభ! వీధులలో
జన తతి పంక్తుల కదలిక తోనే సార్థకం
అంత వరకు మందంగా నిశ్శబ్దంగా కదలే కాలం
జీవవంతమైన ధ్వనులతో వేగవంతమవుతుంది

కొమ్మనుండి కొమ్మలా ఆలోచన నుండి ఆలోచనతో
కవిత! తరువులా ఎవరి అధీనంలో లేని జీవన సత్యంతో
ఊపిరి ఉన్నంతవరకు సంబంధం నేలతోనే
చుట్టు ఉన్న ప్రజతో అనుబంధం పెరుగుతుంది

తెలియని విషయాలెన్నో! ఉండడ మొక వరం
ఇది నిదుర నుండి మేల్కొన్న అగ్నికి దూరం చేస్తుంది
వ్యథలో వేదనలో స్వేచ్ఛా జగంతో కవిత
ఏ అవతార మయినా జనామోదంతోనే సార్థకం

ఏ వెలుగు జాడలేని చీకటిలో పయనం
ఏ దిశను చూపు తుంది? ఏ గమ్యం చేరుస్తుంది
చలికి వణకే ఊహల తీరువేరు అగ్ని చిమ్మే ఊహల తీరువేరు
ఇరువైపులతో కవిత! జడత నుండి చేతనకు నవతతో

## 23. రస స్పర్శ

ఉద్యమ సందర్భాలలో గొప్ప పాత్ర నిర్వహించిన కవిత
ఆపై జీవన సమస్యల సమాధాన వేదిక అవుతుంది
ఓదార్పులతో సమస్య తీరదు
భయం నుండి ముక్తం కావచ్చు

రాత్రి రాత్రే చీకటి వెన్నెల విరామ దశల హ్లాదంతో
పగలు పగలే! శ్రమ జీవన కోలాహల జనతతో

స్వేచ్ఛలో వినిపిస్తుంది తత్కాల జీవన స్వర సంచయం
కవితలో వికాస బంధువు ప్రగతిలో ప్రేరణ రూపం

బ్రతుకు భయం శత్రుభయం ప్రభుత భయం
రాత్రి భయం మృత్యు భయం ఇంకా ఎన్ని విధాలో

బీభత్స ముద్రల్ని తుడిచేసే యత్నంలో శబ్దం
చీకటిలో కర దీపం, వెలుతురులో నవ చేతన

ఎండలో నడచి వచ్చిన మనసుకు చల్లని గాలి
కవిత! రస స్పర్శతో అనుభవ సుందరతను పొందుతుంది

అందని ఎత్తులో దూరం నుండి కంటికి
అమాయకంగా కనిపించే ఆకాశం
ఎన్ని ఆశలు నింపేనో? ఎన్ని భ్రమలు కల్పించేనో?
స్వర్గం భోగం అమరత్వం కల్పన కవధి లేదు
బ్రతుకులోనో ఎక్కడికక్కడ పరిమితులలో,
ఆవేదన మనసును విచలితం చేసేను

చెట్టు నీడ అందరికీ ప్రియం
మరో చోటికి మార్చరానిది
పుట్టుకతో అమాయకంగా మొదలైన మనిషి
ఆపై స్వార్థం కుటిలత రెక్కలుగా మారేను

అపుడపుడూ బ్రతుకులో నిరాశ తత్కాలికం, సహజం
బహుకాలం నిలిచే అవకాశం ప్రమాదకరం
నాతో నడచే అందరి ఆకృతులొకటే
కరచాలన స్పర్శతో ప్రత్యేకత తెలుస్తుంది

## 24. పరిచయంతో సమాజ బంధం

కొత్త వ్యక్తి పరిచయంతో మనిషి మస్తిష్కం
స్మృతి శాలలో చేరుతుంది భౌతిక రూపం
ఎచటెచటనో వ్యవహార లోకంలో తిరిగి తిరిగి
నిలయం చేరేను మనిషి ! అనుభవ సమీక్ష చేసేను

ఆ రోజు డైరిలో పేజి మరునాటికి వెనక్కి పోతుంది
అప్పటి దాకా సమాజ బంధం ప్రత్యక్షంగా
ఆ రోజు వరకు తన స్వంతం, ఆపైన సమాజానిది
అది, వివిధ శ్రేణుల్లో వ్యక్తుల సమూహాల సంగమం

ఒకరికి మరొకరు ఉపయోగపడే సందర్భం అనివార్యం
అవసర మెపుడైనా రావచ్చు, మానవ సంబంధం నిలుపుతుంది
ఒకరు బంతిలా ఒకరు బ్యాట్‌లా ఉల్లాసం పెరుగుతుంది
ఒకరు నీరులా ఒకరు పాత్రలా ఉత్సాహం నిండుతుంది

ఏ ఒకరి హద్దుల్ని మరొకరు నిర్ణయించలేరు
దీని కొక పరంపర ఉపయోగం మర్యాద ఉంటాయి
ఇల్లు లేని నిరుపేద నివాసం, వీధి కార్నర్‌లో జగా
చెట్టు నీడనో గోడ పంచనో పిలవని అతిథి పాత్రలో

పార్టీలు ఎన్ని ప్రణాళికలు విడుదల చేసినా
సమస్యలెప్పటివో ! ఆదిమ యుగం నుండి ఆధునికం దాకా
భూమి నీరు గాలి తిండి తిప్పలు ఆదరణం ఆవాసం

సమస్యను తీర్చే యత్నంలో మరిన్ని చిక్కులు చేరేను
సాధారణమైనవి పొందే తృప్తికి కరువవుతూంది

రోజు గడుస్తుంది వారి వారి శ్రమ చక్రంపై
కవితలో కనిపిస్తుంది, తాను చూడని ప్రపంచం
స్నేహంతో విస్తరిస్తుంది, వైరంతో ముడుచుకుంటుంది
ప్రేమతో వికసిస్తుంది, కరుణతో హృది చేరుతుంది

## 25. నిరంకుశ బిందువు

చెల్లని వాటికి బదులుగ అవసరాలలో
కొత్తవి చేరడం సమాజ పరివర్తనలో సహజం
డబ్బుకు తరుగు లేదనో గొప్ప వీరుడనో
స్వర్ణ ఖడ్గంతో రణం లోకి ప్రవేశం జరగదు

పదును దేని దయినా గాయపడేది శరీరం
తెగేది మనిషి తలయే! రాలేవి నెత్తురు చుక్కలే
నివాసానికి వాడబడని తాజ్‌మహల్ కట్టడంలా
ప్రదర్శనంలో అపూర్వమైన కళా ఖండం కావచ్చు

పరంపరలో ఔచితికి పెద్ద పీట లభిస్తుంది
ఊరు విడిచి అడవిలోకి మార్పుకోరే వాదంతో
క్రాస్ ఫైర్‌లో పచ్చని చెట్లు మౌనంలో దీనంగా నిలిచేను
ఎంతటి ఒత్తిడిలోను హింస, దార్శనికంలో భాగం కాదు

ఆకులు మాడి కొమ్మలు పొగచూరి విషాదంలో
ప్రమాద స్థితిలో "శాంతి" బిక్కు బిక్కు మనీ
నరక బడిన జీవన ప్రవాహంలో ఒక అల
అడవిలో గడ్డ కట్టి శిలాకృతిని పొందేను

ఆయుధ మెన్నటికీ అలంకార వస్తువు కాదు
అదుపు తప్పిన స్థితిలో అపాయకర మవుతుంది

మనిషికి మనషి ఉపయోగం ఎప్పటికీ అనివార్యం
అది ఏ విధంగా? అంటే, చెప్పేది అనుభవమే
బందీగనా? బానిసగనా? పీడితుడు గనా?
హంతకుడుగనా? పనిముట్టుగనా? పనిలో భాగం గానా?

ముల్లు కర్రగనా? కొడవలిగనా? అన్నిటికీ అవకాశం!
ప్రతి వ్యక్తి అంతో ఇంతో తెలిసో తెలియకనో తనలో
నియంత గుణ చర్యలకు బిందువుతో సాగేను
ప్రయోజన చక్రంపై తిరిగేను, జీవన రుచి పొందేను

# 26. మనిషితో చిరబంధం

పుట్టిన ఊరు గిరి నది జన వీధుల తీరులతో
అనుబంధం! ఒక సుందర వాస్తవ స్మృతి సుగంధం
మరో ఊరు! మార్పులతో మరో విధం, తక్కువది కాదు
సమాజ జీవితం! అక్షర పంక్తిలో కవిత, రెండూ ఒకటే

పై నుండి దైవం కల్పనలో దిగేను
నేల పైన మనిషి వాస్తవాన ఎదిగేను
చరిత్ర నావహించి రెండూ
నాణాని కిరు వైపుల బ్రతుకులో

ఎదురుగా కనబడే బాధ చూచినపుడు
ఎవరిదో! వినబడే ఆర్తి తలచినపుడు
కవిలో విశ్వమయం మేఘం కదలుతుంది
రాలే చినుకులు సమాశ్వాస కళికలుగా
మంటల మధ్యన తపించే ప్రాణం చల్లబడేను
లయ తప్పిన హృదయం సమతను పొందేను

శిల్పంతో ఆగక మానవాళికి సరిస్తుంది
అనుకోని బాధ్యతల్ని వహిస్తుంది కవిత
పూవు విత్తు తో పెరిగే చెట్టువలె
ఇరు పాత్రలతో రాణిస్తుంది! వ్యక్తిత్వం

మరో జన్మ ఉంటే బాగనిపిస్తుంది, ఒక సమయంలో
పూర్వపు దోషాలను వేషాలను సరిదిద్దుకొని
గుణ సుందరతను పొందేనని ఆశ
ఇది అసంభవం! ప్రియరూపంగా మిగులుతుంది

కనిపించే ఎక్కువ తక్కువల దృష్టి భేదంతో
అనిపించే దూరం దగ్గర మనో రూపంతో
భౌతికాన్ని దాటిన ఉదార హృదయ ప్రభావం
ఊరుతో మనిషితో చిరబంధం నిలుపుతుంది

## 27. ఉపయోగానికి పూర్ణత

పై కెగసిన మేఘం నడుస్తూ నడుస్తూ
మధ్య మధ్య బరువును కిందికి జారుస్తుంది
బయట పూలు ముళ్ళు తీపి చేదు ఫలాలతో
లోన కోరిక లెన్నో మిశ్రమ ఫలితాలతో

ముళ్ళు వదలి పూలను
చేదు వదలి తీపిని
గ్రహింప చేస్తుంది అనుభవంలో వివేచనం
పరీక్షలకు గురి అవుతుంది జీవితం

మెరసే నక్షత్రం వెండి నాణెం వలె కనిపించి
చుక్కల్ని అన్నిటినీ వశం చేసుకోవాలనిపిస్తుంది

మూడు అడుగులు కోరి, ముద్దుగా
రెండిటితో నేలను నింగిని ఆవహించినట్లుగా
ఏవో కొన్ని మాటల సందడితో కవిత
వలగానో గాలంగానో విసరబడేను
ఎన్నిటినో తనవి అవ చూచేను
ధనం పదవి కీర్తి సన్మానం బహుమానం!

ఖేదంలో ఒక కన్నీటి చుక్కలో
ఎగసిన జలధి కెరటం కనిపిస్తుంది
అంతర్వీక్షణ మెరిగిన వారికి
అంతర్వేదన తెలిసిన వారికి

ఉద్యమంలో వ్యక్తులందరికీ సమాన ప్రాధాన్యం
మాట మరిస్తే వ్యక్తి వీడితే బలం తరిగినట్లే
ఏది ఎవరి చేత నయ్యేది, అది వారికే చెందుతుంది
సమాజ చక్రం ఆగదు, భ్రమణంలో వేగంతో

ప్రతి వ్యక్తి శక్తి సంఘానికి బదిలీ అయి
లక్ష్యంలో ఉపయోగానికి పూర్ణత చేకూరుతుంది

## 28. కవికి తప్ప

నేనెవరిని? ఉదయ బంధువును, గాలి మిత్రుణ్ణి
కిరణ మిత్ర గణంతో జనతకు జవాబుదారును
చుట్టూ మనుషులే మనుషులు! రంగుల కలయికతో
ఎన్ని రకాలో అన్ని విధాలుగ ఒక్కొక ఆకర్షణతో

రహస్యం విప్పారేది, వెలుతురుతోనే, దీనికి రుచి భేదం లేదు
సానుకూల ప్రతికూల భావ మతులు! తమ తమ ప్రత్యేకతలతో
ఎపుడే పాత్ర లభించేది తెలియదు, అనుకోని మార్పులలో
ప్రజాస్వామ్య చేతనలో ప్రయోగాలు, కొత్తవి చేరతాయి

సమాజ వేదికపై ప్రదర్శన జరగుతుంది, ప్రజల ముందు
ఆరు బయలు అనుభవానికి గోడలు లేవు! తలుపులు లేవు
అందరికీ ప్రవేశం! ఎవరి పాత్ర వారికి ప్రియమొ! అభిమానమో
ఆదర్శం పై ఇష్టంతో అందరికీ కొత్తదనం కోరుతుంది హృదయం

కఠిన వాస్తవాన్ని ఎదుర్కొనే వేళలో డీలా పడిపోయేరు
కలల నెవరు కోరతారు, ఇవి నిజమయ్యేవి కావని తెలిసీ

ఎవరి భరోసాపై అమూల్యమైన కాలాన్ని వెచ్చించేరు
సందేహం ఊయెలపై ఎంతసేపయినా ఊగవచ్చు
మొగమాటమేమి లేకుండా నిర్ణయ ప్రకటనం కవికే సాధ్యం
విజ్ఞాన విశేషాలకన్న కవికి అవగాహన వివేచన ముఖ్యం

హఠాత్తుగా రోడ్ పై అనుకోని విషాద ఘటన
దగ్గరలో థియేటర్‌లో కొత్త చిత్రం వాతావరణం
ఎవరి పనులలో వారు! జరిగే వాటికి, మౌన సాక్షులు
అబద్దాల చీకటి ముక్కల్ని కూడా డ్రెస్‌లో కుట్టగలరు

వీరుడు అంగారాన్ని కౌగిలించుకోగలడు ధైర్యంగా
విజయంలో గగనం తలపాగాగా చుట్టగలడు

అబద్ధం తనకు కావలసిన ఆహారమవుతూన్నప్పుడు
ఎవరికి కావాలి కవికి తప్ప, కనిపించని హృదయవశం 'నిజం'

స్వేచ్ఛా కవిత్వం - 104

# స్వేచ్ఛలో స్వతంత్రం

మాదిరాజు రంగారావు



2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**104 SWECCHALO SWATANTRAM**

Free - Verse

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

*Presented to*
*my daughter*
*Mrs. Devulapalli Haritha, M.A.*
*on her Birthday*
*with blessings*

# పీఠిక

ఈ కృతి "స్వేచ్ఛలో స్వతంత్రం" దార్శనిక స్పృహ కలిగింది. నేను అభిమానించే ప్రజాస్వామ్య సామ్యవాద పథం సూచితమయిన రచన. 1953 నుండి ఈ భావ జాలానికి కట్టుపడింది. ఈ దిశలో కవితలు "తెలుగు స్వతంత్ర" గోరాశాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన పత్రికలో కొన్ని అపుడపుడూ ప్రచురితమయి కనిపిస్తాయి. స్వేచ్ఛ (Liberty) స్వతంత్రం (Freedom) రెండిటి సహయోగంతో ప్రజాస్వామ్య భావన ఆవిష్కారాన్ని పొందింది. ఇది ఈనాటి అవసరం కూడా.

ఇక "స్వేచ్ఛా కవిత్వ" విషయానికి వస్తే నేను మొదటి నుండీ వ్రాస్తూ ఉన్నది, కొనసాగించడం జరిగింది. ఇప్పటికీ నాకీ పేరు సముచితంగానే అనిపిస్తుంది. ఈ పరంపరా రూపాన్ని నేను అనుసరించిన నిజాన్ని గుర్తు చేయడమే ప్రస్తుతోద్దేశం. నాకు మాత్రం మధ్యలో వదలడం కుదరలేదు. "స్వేచ్ఛా కవిత్వం" అన్నమాట Alternate గా పనిచేస్తుంది. మరో విశేషం. ఇది ప్రజాస్వామ్య ప్రభావానికి కట్టుపడింది. ఈ Concept గురించి వ్యాసాలు వెలువడినాయి. పుస్తకమూ వచ్చింది. ఇవి ఈ ప్రక్రియను బలోపేతం చేస్తున్నాయి.

ఏది ఏమయినా చారిత్రక నేపథ్యంలో దీని సందర్భం గుర్తించవలసి ఉంది.

ఇందులో వస్తువు వర్తమాన సమాజానికి చెందిన విషయ తత్పరతను కలిగింది. చారిత్రక దృష్టితో పరిణామ దశల్ని పరిశీలిస్తే నేను వాడే "స్వేచ్ఛా కవిత్వ"మన్న మాటలోని సామంజస్యము అవగతమవుతుంది. ఒకే ప్రక్రియకు వేరువేరు పేర్లు ఉండవచ్చు.

ఇపుడీ ప్రక్రియ పరిణామ దశలతో ఎంతో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇవి సమాజ ప్రయోజనాన్ని కోరుతూ సముచితమైన పాత్రను నిర్వహిస్తున్నాయి.

ఈ "స్వేచ్ఛా కవిత్వం" మాత్రం సామాజిక రాజకీయ నైతిక సాంస్కృతిక విషయ ఛాయలతో ప్రజాస్వామ్య భావనతో సంపన్న మయింది. ఇది ముఖ్యమైంది. ఇందులో దీని నిర్వహణం భావ రూపాలు ప్రతీకలు కలిసిన అర్థాంతర స్ఫూర్తితో ప్రత్యేకతను పొందింది.

దీనికిది ఆరంభం నుండి అరవై ఏండ్ల పైగా తన విశిష్టతను నిలుపుకుంటూ సాగుతూంది. అవిచ్ఛిన్నమైన ప్రవాహకతను పొందింది. దీనికి తోడుగా ఈ దిశలో సాహిత్య విమర్శ రచనలు ఈ మార్గాన్ని బలోపేతం చేసేవి వ్రాయడం జరిగింది. వీటిలో చాలా భాగం మొదట్లో 'భారతి' పత్రికలో తరువాత వివిధ పత్రికల్లో వెలువడినాయి. ఈ సాహిత్య వ్యాసంగం తెలుగు సాహిత్యానికి ఒక ఉపదగా భావిస్తాను. ఇదొక నిరంతర పరంపరా రూపంగా వెలువడడం ఉత్సాహాన్ని స్థిర పరుస్తుంది.

ఈ అక్షర నిలయంలోకి సాహిత్య సహృదయులకు స్వాగతం

**మాదిరాజు రంగారావు**

# 1. జనవన మవుతుంది

ఇది స్వేచ్ఛా స్వతంత్ర దివసం జనత విజయ ఘట్టం
నభో మణి ప్రకాశంలో సంస్పందనతో కవిత
ఈ సమయంలో దిశలో దూసే విమానంలా
గగనంలో ఎగిరే రంగుల గాలి పటంలా

రాత్రి నుండి పగలుకు మారే సంధి వేళతో
చంద్ర కాంతి నుండి రవి కిరణం పై ఆలోచన
లోని హృదయ స్పర్శతో కవిత సిద్ధమవుతుంది
స్వాగత ముఖంతో ఉదయం ఉత్సవ కళ పొందుతూంది

మెలకువ స్పృహతో మదిలో రవి రశ్మి ప్రతీకాశం
ఏ రోజూ ఉండేదయినా ఈనాడు చరిత్రలో మహనీయం
రోడ్‌పై వాహన వేగంతో పేపర్‌పై అక్షర పంక్తులు
గమ్యానికి పరుగు తీయడం! కవిలో అద్భుతానుభవం

ప్రజల ఫాల తలంపై త్రివర్ణ పతాక
ఉద్యమాలు నినాదాలు వాదాలు సిద్ధాంతాలు
మరచి ఒకే స్వరంలో జన గణ గీతం వినిపిస్తుంది
దేశం పవిత్ర లక్ష్యం చూపుతూంది కాలం వెలుతురులో

బ్రతుకంటే మరచి పోని ఆశయ మార్గంలో
కాలాన్ని నడిపించే బాధ్యత పౌరులదే! నేతలదే!
వర్షా నృత్యం గురించి ఎడారి కలలు కనేను
పచ్చని భాగ్యం గురించి మనసు ఆశ పడేను

చరిత్రలో వివిధ దశలలో సాధించిన వికాసాలు
విజ్ఞానం సంపద విభవం సంఘంలో అందరివీ
ఏ ఒకరి స్వంతమో! కొందరి సొత్తో? కావు, ఎప్పటికీ
ఈ సందర్భంలో దేశం! సమాజపరమైన మాట వాస్తవం

ఈ సమయం స్నేహ సుందరమయిన మనుషుల సమాజం
ఉదయం చూపులో విప్పారిన పూల వన మవుతూంది!

## 2. ఉత్సవ శోభతో

అర్థ రాత్రం దాటే సమయంలో
లోన ఎవరి కర స్పర్శకో మెలకువ వస్తుంది
శబ్దానికి అర్థానికి అతీతమయిన
భావానికి వశమై హ్లోద సుందరంగా

స్వేచ్ఛలో స్వతంత్ర భావన స్థిరపడుతూంది
రోజు నుండి రోజుకు మారే మలుపులో
ఉదయ కాంతి దృశ్యం వైపు మొగ్గుతో
చరిత్రలో అధ్యాయం కొత్తది మొదలయింది.

అప్పటి కలలో భాసించిన విషయాలన్ని
కలిసి ఇపుడు తల కింద దిండులా అమరేను

సత్యం ధర్మం న్యాయం బ్రతుకులో సాధారణ సూక్తులలో
అన్వయంలో అనుసరణంలో భేదం తప్పదు! ఒకరొకరిలో
పక్కనున్న మనిషి కన్న మిన్నగ ఉండే ఆరాటం
మనిషి నుండి మనిషికి ప్రత్యేకతనిస్తూంది

భ్రాంతి శూన్యం రెండింటి మధ్య మనసు ఊగుతుంది
దిశ నుండి ఎదురు దిశను ఆలోచన సాగుతుంది
దిగంచలాలను తాకాలని యత్నం చేసేను
అంతలో భూమి తలంపై అడుగులు పడేను

కనిపించే వస్తువు వెనక నుండి దాని తత్త్వం
కదులుతుంది ఆలోచనలో మనస్సు ఉన్నందుకు
ఇది కొన్ని పరిమితులలో హద్దులలో చెల్లుతుంది
గమ్యం వేరై చీలిన దారులలో మనిషి మనిషి కొక పయనం

వాస్తవానుభవాలలో శ్రమ జీవన తీరులనేకం
వ్యక్తిలో శక్తికి యుక్తికి ప్రేరణ సూచనలతో
సందేహానికి తావులేని ప్రజల నిర్ణయ రూపం
ఉదయం ఉత్సవ శోభతో, సార్థకతను చాటుతూంది

## 3. అగ్గి పెట్టెలా

జరుగుతూన్న కాలంలో స్థాయిలో అవసరాలు తీరేందుకు
జీవన గమనంలో ప్రగతి వైపు ఆశలు సహజం
అనల శిఖలు కమ్మినపుడు అశాంతిలో
శామన చర్యలు కోరుతుంది సమాజం!
జల సేచన కెదురు చూస్తుంది వాతావరణం
సానుభూతి కావచ్చు, ఉపశమనం జరగవచ్చు

ఆలోచనలో తేలే శబ్దంతో
అనుభవ రుచితో పొందే అర్థంతో
మానస గంధంతో ప్రయోజనం లభిస్తుంది
సమాజ సంస్కృతికి కవి ప్రతినిధి అయ్యేను

పగలు వెనకనే వచ్చే రాత్రి అనుభవం
మనిషి నడకలో నడతను మార్చేను
ఇది ఏ రోజూ జరిగేదయినా
సరికొత్త పరిచయం వలె ఉంటుంది

దేని కొరకు ఆరాటం? అంటే బతుకు కొరకు
దేని కొరకు పోరాటం? అంటే విలువలకై
తెరువు కొరకు మెతుకు కొరకు హరువు కొరకు
భోగం భాగ్యం అధికారం పదవికై! తాపత్రయం!

ఎప్పటి కయినా చుట్టూ ఉన్నవి పోయేనని
ఇపుడే సమాప్తి రేఖలు గీసేరా?
కవితలో విషయ మిపుడు జీవితం సమాజం
సంపద వినిమయం అనుభవంలో వెలుతురులోనే

శిథిలాలను తొలగించినట్లు పాత నిలయం బదులు
కల్పనలో సరికొత్తగ నిర్మాణం తల పెట్టేరా?
ఇది అంత సులభం కాదని తెలుసు! అయినా
పట్టు వీడని మనిషి, పట్టు చీరెతో అగ్గిపెట్టెలా

# 4. నిర్మాణ దృశ్యంపై

మోసం నేరం హననం శరణం చుట్టూ తిరుగుతూ
నీతులతో కాలాన్ని అందంగా అలంకరించేరు
విన్న కథలలో తేజం! మనసు బయటనే ఉంటుంది
వీధిలో మసి బట్టిన దీపం వలె రాత్రులు కారాదు

ఏదో సాధించాలని ఎగిరి పైకి చిటికెలో
అతికిన బంగరు రెక్కలతో మిరుమిట్లు కొలిపేరు
ఇలయే భద్రమని అంతలో కిందికి దిగేరు
దివిలో కొత్త జగంపై మోజు తీరినట్లేనా?

బ్రతుకులో నిరాశతో దిగులుకు గురియై
చీకటి కొండగ మారేను మనసు
శిఖరం పై కనీసం చిన్ని దీపంకై యత్నం
జరుగుతుంది, మనస్విలో చేతన మతితో

గగన సరసిలో హంసలా ఈదుతూ
హృదికి హ్లాదంగా భవిత కనిపించాలని కాంక్ష!
దిశా ఫాల తలంపై పికాసో చిత్రంలా సంధ్య
మనిషి బ్రతుకులో విచికిత్సకు ప్రకృతి ప్రతీకయై

గాలి కెదురుగా నిలిచిన పర్వతం వలె
అణువణువు ఘటితమై మనిషి ఆదర్శం ముందు
అసహనం అశాంతి వేదన కల్లోల మయమై
మారణ రణ చర్యల చేతనతో ఇపుడు! సమాజం

సముద్రాన్ని దాటే కోరిక నెరవేరింది కాని
దరిద్రాన్ని దాటే యత్నం! సాగుతూనే ఉంది

మనసు తంత్రులు మీటుతూ బాధలు మరచేరు
సృజనలో కళామతికి జీవితమంతా అవకాశమే
విస్ఫోటం విధ్వంసం చెరొక వైపు నుండి తరుముకొచ్చినా
హింసకు తావులేని కవి దృష్టి! నిర్మాణ దృశ్యం పైనే

# 5. హేతువు కతీతంగా

ఈ రోజు అభయ ముద్రతో ఉదయం ప్రత్యక్షమవుతుంది
గాలి వీస్తుంది స్వేచ్ఛగా కల్మష రహితంగా
మనసు ప్రకాశిస్తుంది! స్వచ్ఛంగా స్వతంత్రంగా
బాధలు పక్కకు జరిగి! మోదం ముందుకు వస్తుంది

రోజు వారి ప్రలోభాలు విభేదాలు కనిపించవు
అవి పక్కకు తొలగి ఉదార చరితను చూపేను
తెర వెనకన ముసుగులలో ఉన్న వెలుగులు
బయటికి వచ్చేను; ఆదర్శ పాత్రలు వహించేను

స్వేచ్ఛలో స్వతంత్రానికి పెద్ద పీట వేయబడీ
ప్రజాస్వామ్య హృదయం అనుభవ మర్యాదను పొందేను

బాంబుల పిడుగులతో కత్తుల మెరుపులతో
కదలే మబ్బుల భయ సందర్భం తొలగేను
కాలం కాగితంలా ముక్కలవదు! ఎప్పటికీ ఒకటే
దీర్ఘంగా అమేయంగా అనివార్య పురోగమనంలో

రణం వాయిదా పడవచ్చు! అగ్ని పరీక్ష తప్పవచ్చు
స్వేచ్ఛా స్వతంత్ర మహోదయం! ప్రతి ఏడు వస్తుంది

సమయానికి వాన కురిస్తే ఆనందాశ్రువులు రాలేను
నింగి శూన్యమయితే! ఖేదాశ్రువులు జారేను
ఇరువైపుల కావడి బరువులు తప్పని మనస్సు
ప్రకృతి నుండి అతివృష్టికి, క్షామానికి సిద్ధంగా ఉంటుంది

వేదనలో కవిత! శాంతిని దించేను పారాషూట్‌లా
ఇష్టంతో మనసు అదే! నిద్ర నుండి లేస్తుంది!

రాత్రి వెన్నెల ప్రభావంతో పగలు ఉజ్వల రశ్మితో
సృజనకు తలుపులు తెరచే పని లేనే లేదు
పేకాటలో జాకిలా విలువలతో ఈ రోజు నిలుస్తుంది
తలుపులు లేని అక్షర నిలయం కవి ఉదాత్త మస్తిష్కం

ఇందులో ప్రదర్శన శాల ఉంది, లేబోరేటరీ ఉంది
హేతువు కతీతమైన స్వాగత వదనంతో సంస్కృతి రూపముంది

## 6. కాకూడదనే

సన్మానం పురస్కారం అవమానం తిరస్కారం తంతుతో
కవితకు సంబంధం లేదు వాటి నీడలు కవులను ఏలవు

కవిలో ఆశా జీవి మనిషి ఉండవచ్చు
చరిత్రలో కవిత ఉండేది వీటికి వేరుగానే
ఇది సంతోష ప్రకాశంతో నిలుస్తుంది
అనుభవ కళతో చిరంజీవి అవుతుంది
అక్షరం నక్షత్రం కాదు; కిరణ ప్రసార రూపం
మాటలో సంవేదన హృదయానికి తెలుస్తుంది

ఏ రోజయినా ఆకలి మంట
ఎంత పనినయినా చేయిస్తుంది
కాల్చి బూది చేయవచ్చు
బ్రతుకును భంగించవచ్చు
బంగారానికి పుట పాకం కావచ్చు
నేటి నుండి ఈ దుర్దశ ఉండదనే
నేతల వాగ్దానం! ప్రతి ఏడూ
ప్రయోజనం లేని మాట, గాలిలో

భూమి ఎవరినీ తిరస్కరించదు, నివాస విషయంలో
గాలి ఎవరినీ క్షతి చేయదు ప్రాణ పోషణలో
అగ్ని ఎవరినీ బాధించదు, నీతి చరితలో
ఆశా రూపానికి ఆకాశం! ఆసరా భరోసా హమేషా!
తాను ఇవ్వగలవి ఎన్నో! ప్రతి మనిషిలో
సమ సమాజ సంస్కృతికి ప్రతినిధియై కవిత!

ధర్మాగ్రహంలో ఆయుధమై కవిత!
సత్యాన్ని పైకి తీసే సాధనమవుతుంది
ప్రగతి పథంలో పరివర్తన శీలంతో
నడతకు వాడి వేడి ప్రేరణ నిస్తుంది

ఈ స్వేచ్ఛా స్వతంత్రమయిన భావమయం రోజునైన
కాలం ఎదురుగా మసి బట్టిన అద్దం వలె కాకూడదనే

## 7. ప్రేమ పరిమళంతో

సూర్యుడు పైనుండి భువికి దిగే ప్రశ్నలేదు
అడుగు దగ్గరవుతూనే భూమి భస్మవేది కావచ్చు
వస్తువు అస్తిత స్థానం ఉపయోగం దాని వరకే!
పై నుండి ప్రకాశ హృదయంతో ఆశీర్వదించవచ్చు

నింగి నుండి కిందికి విస్తరించి శ్రేయోరూపం
జీవ సమూహాల్ని రక్షిస్తుంది, పోషిస్తుంది
మానవ ప్రేమతో తపస్వి అయిన కవి
కవితలో విశాల మనస్వితను చూపేను

సహనానికి దగ్గర అయిన హిత కామన
హింసకు దారి నీయదం! విచిత్రం

గగన తలంపై మట్టి దొరకదు,
మధ్యన ధూళి పొరలు లేచి కనిపించవచ్చు
కుసుమం విప్పార వచ్చు, ఆలోచనలో
గంధం వ్యాపించవచ్చు, అనుభవ గతిలో

మట్టితో సంబంధం గల బ్రతుకులతో పాటు
దివితో కవులకు ప్రియ బంధం మానసికంగా

చీకటి ఉన్నా తప్పని దృశ్యాలతో
చీకటి అంటని తేజం! కవిత్వం
మానవం లేని బ్రతుకు లేదు, ఉండదు
అంతో ఇంతో తేజం లేని ఆలోచన లేదు

అక్షర యానంలో కవిత చూపిస్తుంది
భావ జగంలో మనుషుల నిజ రూపం

తరం నుండి తరానికి అవసరాలు ప్రాధాన్యతలు వేరై
కాల రేఖ వదలుతుంది, పరివర్తనలో సూచనలు!

స్వేచ్ఛా స్వతంత్ర లిప్తల చలన సుందరతలో
వికార వేషాలకు ప్రవేశం దొరకదు
సంతోష వల్లికి పూచిన కుసుమంలా
ప్రేమ పరిమళంతో ఈ రోజున కవి హృదయం!

# 8. వసంతాన్ని దింపుతుంది

ఎవరు ఎక్కడ ఎన్ని జన్మలు కల్పించుకున్నా
ఒకమారు విడిచిన లోకం మళ్ళీ లభించదు
ఇది మదిలో మానసిక తృప్తికి పనికొస్తుంది
కల్పనలో తృప్తితో సగం బ్రతుకు వెళ్ళిపోతుంది

దారుల కూడలిలో మహనీయుల మూర్తులు
నలు వైపుల నుండి ప్రజల నాకర్షించే ఆదర్శంతో
చూచే వ్యక్తులలో ఆ క్షణం మలినం తొలగ వచ్చు
యశో గంధంతో వాతావరణం పునీతమవుతుంది

మనసులో ముల్లు బదులుగా గులాబి తలెత్తవచ్చు
చల్లబడిన ఊహతో ప్రాణం హాయి పొందవచ్చు
ఆ మూర్తులలో వ్యక్తులు తమ జీవిత కాలంలో
ప్రశ్నల బాణాలతో ముందుకు నడచిన వారే

జవాబులకై అన్వేషణ జరిపినా వారే!
ఎవరి కయిన తమ హక్కును పొందే యోచన న్యాయమే

ఆది యుగం నుండి ఆధునికం దాక
రాజకీయ వ్యూహాలు లేని సమాజం లేదు
రాజనీతి నవలంబించని పాలకులు లేరు
ఇది నడిపే మతి ప్రభకు మలినమంటరాదు

వ్యక్తి నిరంకుశం నుండి ప్రజాస్వామ్యం వరకు
మనిషి పనిని పూర్తిగ హేతువుకు గురి చేసి
నిగ్గు తేల్చి కాలం! నిజ రూపం చూపుతుంది
ఇది ఎవరి అధీనంలో, లేని సర్వ స్వతంత్రం!

ఏకాతంలో ఎగసే అగ్ని తనలో నిలువునా
పశ్చాత్తాపానికి పరిశుద్ధికి పనికి రావచ్చు
సృజన కళ ఉన్న తన మదిలో
నవ నిర్మాణం అవతరించవచ్చు

ఒక్కడుగా ఉన్నపుడు ప్రియా ముఖం
వసంతాన్ని దింపుతుంది! సుమ పరీమళాలతో

# 9. మానవ శ్రమతో

ఎవరూ లేరనుకునే బాధతో లోన దిగులు
తన హత్యకో! పరహత్యకో! ఉన్మాదిగ మారవచ్చు
చిత్రమేమంటే అన్నిటికి అవకాశం దొరకుతుంది మనసులో
'ఆల్ ఇన్ వన్" లా ఎన్నిటికో ఉపయోగిస్తుంది

కాలు జారడం! అదుపు తప్పిన సందర్భం
దుఃఖాశ్రువు జారుతుంది వేదనలో
ఆ వేళను బొమ్మలాగ ఆడించే వారూ ఉన్నారు
ఒంటరిలో కన్నా తోడుతోనే! విజయానికి పూర్ణత

నింగిలో ఇంద్ర ధనుసు నిలిచేది కొంత సేపే
వర్షా గమనానికి స్వాగత శుభ ద్వారమవుతుంది
ముంచేసే వరదల బీభత్సంతో, ఖేదంలో కన్నీరు
అనావృష్టిలో నీటికి కరువై, వేదనలో కన్నీరు!

ఉప్పు నీరయిన ఎగసే అలలు భయపెట్టినా
నీళ్ళలోకి అడుగు వేసే ధైర్యం చాలకపోయినా
ఆపదను తలపించినా, మొసలి నోరు తెరచి ఉన్నా
సముద్రం తన విశాలతను గభీరతను చూపుతుంది

చూస్తూ ఉండగనే! నెమ్మదిగా నీళ్ళలోకి నావ
పయనం! మానవ మతికి పట్టం గడుతుంది
వేరు వేరు వేళలలో వెలుతురు చీకటి! నావలతో
గమనంలో సుందర దృశ్యం! భయాన్ని మరపిస్తుంది

మనిషిలో సజీవ చేతనకు ప్రతినిధియై కాలం
సాహస కార్యంతో అస్తితను దృఢతర మొనరిస్తుంది
వాస్తవాకృతిలో మనిషి పాత్ర! అభినందన పొందుతుంది

ఏడుపు – హ్లాదం రెండూ తరాజు పళ్ళేల వలె చెరొక వైపు
బ్రతుకులో ప్రతి వస్తువు విలువను గుర్తు చేసేను
స్వేచ్ఛా స్వతంత్రంలో సమాజ నిర్మాణం! మానవ శ్రమతోనే

# 10. ప్రయోజనం నిలిపేను

ఇది స్వేచ్ఛా స్వతంత్ర దివసం, సంస్మరణ మనోజ్ఞం
తరాల అంతరాలలోను ప్రతి ఏడు నవ్యంగా రమ్యంగా
ఈ దేశం పౌరులందరూ భాగధేయులుగా సమంగా
జ్ఞాపకాల్ని వారిలో అభినవం చేస్తుంది ఆత్మీయంగా

సంస్కృతిలో విభవాన్ని తలపుకు తెస్తుంది
ఈ మధ్యన రూపొందిన మలుపులు గుర్తు చేస్తుంది
పూర్వపు బాధల స్పర్శతో, పగటి లిప్తలు మెరసేను
పూర్వపు కష్టం స్పర్శతో, రాత్రి లిప్తలు వెలిగేను

ఎంత దూరమయినా స్వేచ్ఛ, తీగెవలె సాగుతూనే
స్వతంత్రం అస్తితకు విజయ ఫలం నిలుపుతుంది
గాలిలా కవితకు మొగమోటం లేదు
దేని నయినా కలుపుకొని వెళతాయి

వెలుగుకు చీకటి భయం లేదు, ఇది త్యాగమయం
చీకటి మనిషిలో ఎప్పటికీ గుప్త నిధికి పేటిక
పెట్టెలో బంగరు నాణెంలా అభిమానం
భద్రంగా ఉన్నది, బయటికి వచ్చే రోజు ఇదే!
దీనికెన్ని ఆటంకాలో, అన్నిటినీ అధిగమించి
మార్పులతో, కాలంపై ఉదార చరితను పొందేను

ఇప్పటికీ నాటి శాసనాలు శిల్పాలు బయటనే
ముక్కలుగా మిగిలినవి, చెదరి పడి ఉన్నవి
ప్రజలను మేల్కొలిపి సూర్యుడు! కవితయై
దహనగుణం వీడి, సృజన పథం వరించేను
మనిషిని తోడుగ తనతో నడిపించేను
బహుదూరం! భూమిపై చూపుకందినంతమేర

చీకటిలో వెలిగే దీపం! విరిసిన వెలుతురు సుమాలతో
ఈ సమయం మనో రూపం! దేనికీ లొంగని వజ్రసమం
మానవ చేతనతో శ్రమ జీవన క్రియాఫలం
ప్రజాస్వామ్య సుందరతను ప్రయోజనం నిలిపేను

## 11. అన్నీ జరగాలనీ

అంతర్వేదనలో వినిపించేను స్వరం
ధునిలా ప్రవహించే రసమయ రూపం కవిత
ఎగసే అలలకు భయపడి ఒడ్డునె నిలిచేర?
దాహంలో జలాల కయి లోనికి కదలేర?

జలయానం దాని కదే సుందర లోకం
తోడయినట్టి మనిషిలో, సమాజ చిహ్నం
గిరి అయినా వన మయినా ఎచటిది అచటే
జల యానం ఆంతర జీవన రుచి భిన్నం

తీరం దాటాకే ఇలపై తన విభవం
కోపంలో తాపంతో, గెలుపుకు యాతన!
భూమి తలం చేరగనే ఆత్మీయంగా
కనుల ముందు సమూహ కళ చరిత్ర గతిలో

కర్తవ్యం మనసులో నినదిస్తుంది
బాధ్యత విజయం కయి హవ ణిస్తుంది
బ్రతుకయినా కవితయినా సంస్పందనలో
మానుష బింబంతోనే ఒక ఆకర్షణ

అభయం కయి రక్షణ కయి మానస వేదన
మానుష రూపంలోనే దేవత అయినా

కవిత అర్థమవడం, లేదను కుంటేనో
అర్థమవని బ్రతుకులు కోకొల్లలు! మనలో
లోతులు ఎత్తులు తెలియని మనుషులెందరొ
తెలిసిన దాని కన్న తెలియనిదే ఎక్కువ
ఎత్తు తెలియకుండా శిఖరం పొందాలని
నిడివి తెలియకుండా, తీరం చేరాలని

## 12. శృంఖల అవకుండా ఉంటే చాలు

పేద జనత, దేశం మెడలో ఇనుప సంకెల
చూడగనే, కనిపించే తొలి అలంకారం
మనుషు లెవరు కోరరు దీనిని
ఇది కాలానికి ఇష్టం కూడా కాదు

ఘోర మయిన పరీక్షలు పెడుతుంది
సంస్కరణం ఉద్యమం విప్లవం ప్రబోధం ఎన్నో!
తుపాను వలెనో భూకంపం వలెనో వచ్చేవి అయినా
దీని మూల పీఠం మాత్రం కదలలేదు, చెదరలేదు

ఎంతముందుకు వెళ్ళినా చరిత్రను సృజిస్తూ
వెళ్ళాలిసిందెంతో ఇంకా మిగిలే ఉంటుంది

మాటతోనో చర్యతోనో మనిషి ఎదురు పడేను
ఏదో ఒక సుమ పరిమళంతో పవనం
స్పర్శతో స్పృహాలోల మవుతుందనుకుంటే
దిశలు శూన్య ముఖాలను బయటపడేసేను

ఆత్మ హత్యకు మందు, వికల మనో రూపంలా
దోష చర్యకు మందు, జలధిలో తుఫానులో నావలా

ఆగ్రహ స్థితిలో ఉన్మాద నృత్య రూపకం
వీధిలో అదుపు తప్పిన ఉద్యమ ప్రదర్శనం

గతంలోని పంట పచ్చదనం కలలకే పరిమితం
ఇపుడున్న స్థితిలో దరిద్ర తాండవం, ఒక విషాద దృశ్యం
ప్రజాస్వామ్య పథంపైన నమ్మకం కుదిరేనా?
జనాలోల హృదయం భాగ్యం స్వనించేనా?

మనుషుల చర్యలలో రాలే నిప్పు చినుకులు, ఆగేననీ
మస్తిష్కం తోటలో ఆలోచనా సుమాలకు ఆటంకం తొలగేననీ
హర్షంలో ప్రజల కళ్ళ నుండి ప్రకాశ రేఖతో
నమ్మకంలో భవితకు గమ్యం చూపేననీ
ఆశాబన్ధం ! స్వర్ణ హారమే మోకానీ
మెడలో శృంఖల అవకుండ ఉంటే చాలు!

## 13. పొగలు ధూళి తొలగిన కవిత

శాంతం లోను హృదిలో అగ్ని మేల్కొని ఉంటుంది
వికాస భావన లోను విప్లవ చలనం లోను
తర తమ స్థాయిలలో ఉత్సాహం నింపుతుంది
ఉద్యమాన్ని రగిలిస్తుంది! వ్యక్తి శక్తి నిరూపిస్తుంది

నడతలో నాణ్యత కవకాశం హృది స్వచ్ఛతతోనే
గుండె పై పూల గుత్తి హత్తే నని అనుకొనీ
నిప్పుల కుంపటిని వహించ వలసి రావచ్చు
ఏ చర్య కదే ముఖ్యం! స్వేచ్ఛలో స్వతంత్ర వర్తనలో

తన చుట్టూ గీసీన నీతి న్యాయం ధర్మం
వలయాలలోనె! తమ బ్రతుకులు గడవాలని
ఏ రోజు కారోజు నిన్నటిపై అభివృద్ధికి
ఎన్నుకొనే దారిలోనె, భవితకు శోభతో ప్రయోజనం

భోగానికి ఆరోహణ శిఖరాలెన్నో
త్యాగానికి హృదితలుపులు తెరవడం మవసరం
విలువల ఆకర్షణ ముందుకు నడిపిస్తుంది
ఆటంకం విపద లోను మనిషిని నిలబెడుతుంది

సుఖ సంతోషాలలోను శోకం కష్టాలలోను
సుగమ విషమ జీవన బింబాలు! కళలూ సాహిత్యం
దారులన్ని ఒకటి కాదు, దేనికది ప్రత్యేకం
విశేషాలతో సశేషాలతో మరల రాని బ్రతుకులో

ఎవరి దృష్టి కూడ సరళ రేఖ లోనే సాగదు
మలుపులు తిరిగేను దిశ మారేను గమ్యం వేరయ్యేను
కొత్త అవసరం ప్రేరణతో నవతను పొందుతుంది
బ్రతుకులోని దేదయినా ప్రతిబింబిస్తుంది కవిత!

పొగలు ధూళి తొలగిన రవి బింబంలా వెలుగుతుంది
ఎన్నుకొనే దారితోనే, భవితకు ప్రయాణ రూపం

## 14. సహజంగా రావలసిందే

కొత్తదనం పై మోజుతో
అనల పథాన్ని వరించడ మొక విశేషం
దృష్టికి జ్వాలా పంక్తి బాగానే ఉంటుంది
దీనిపై పయనించే మహా ధైర్యం ఎవరికి ఉంది?

కొత్తదనంపై ఆశతో
అనల రథాన్ని కోరడ మొక విచిత్రం
దీనికి రథి అయ్యే మహా సాహస మెవరికి ఉంది
నడత లోను వశంలోను మేఘానికి తప్ప!

మార్పు కోసమై కొత్తగా
అనల పీఠం పొందడమొక అద్భుతం
దీని నధిష్ఠించే యోగ మెవరికి ఉంది?
ఇది బహు గుణాల కలనం తోనే సాధ్యం

ప్రతి అవసరంలో ఏదో ప్రయోజనం పక్కనే
వికార భావరూపంతో అసౌకర్యం కూడా!
ఎండలతో వేగిన భూమిపైన
జోరున వాన కురవడం! సంతోషకరం

వీధులలో ఎగసే దుమ్ము అణగుతుంది
దారి మధ్య బురద నీరు నిలుస్తుంది కూడా
బురద నుండి పంకజంవలె మనిషి తేలేనా?
ఎప్పటికప్పుడు శుచి శుభ్రతతోనే జీవన సౌందర్యం

సంఘానికి బ్రతుకు అలంకారం కాదు
ఇది భౌతిక జీవన రూపంలో భాగం
ఎవరి బ్రతుకు వారిది, స్వతంత్ర మయిందయినా
ఒకరితో మరొకరికి అవసరం! మనుగడలో

ఎవరికి వారు వినిర్మించుకునే జీవితం
మరొకరి ప్రణాళికకు పోత పోయడం కాదు
కొత్త వాటిపై కోరిక! పాతవి స్మృతి నిలయంలో
సహజంగా మార్పులు పరిణమించవలసిందే!

## 15. దృష్టి బ్రతుకుపై

చీకటి మౌన రూపం వహిస్తుంది
వెలుతురు ప్రశ్నలతో సంసిద్ధమవుతుంది
బ్రతికినంత కాలం రోజూ విహగం
గగన తలంపై వాలే యత్నంలో,
మనిషి ఇపుడు గ్రహాలపై దృష్టితో
ఆయా లోకాలలోకి దిగే పరిశోధనలలో

"నేను" తో అల్లబడిన ఈ సంశ్లిష్ట జీవితం
కవితకు సుందర భౌతిక రూపం ఇస్తుంది
బ్రతుకులో బరువులు, మాటలో పాటలో దిగేను
అక్షర పేటికలో కవితలో భద్రపరచ బడేను

శిల మౌనంగా ఉంటేనే అందం
నది గల గల సరిస్తేనే అందం
కవిత ! పద పదంతో ధ్వనిస్తేనే అందం
నవత! నిజంతో స్వనిస్తేనే అందం

వ్యక్తిలో వేదన కోష్ణ ప్రతీకాశమై
కష్ట ఫలం! జీవన చలనానికి ప్రేరణం
సమాజ రూపంలో వికాస సంస్కృతి జాడలు
ఎవరి కేది ఇష్టమో అది ఎన్నుకో బడుతుంది

అద్దంలో బింబం సజీవం కాదని తెలుసు
ఇది మదిలో స్వయం స్పృహను పొంగచేస్తుంది
రోజువారి అవసరాలు అలవాటుకు చెందవు
కవితలో అనుభవ సుందరతల నలరించేను

కాలం అర చేతులలో ఎగిరే బంతులు
పగలు రాత్రి ! బ్రతుకులో వినోద రుచిని చూపేను
ఎవరు పైకి చూచినా చూడకపోయినా
ఆకాశం దృష్టి! భూమి పై మనిషి బ్రతుకుపై, భవితపై

## 16. సార్థకంగా

ఇది నాలుగు దారుల కూడలి
కార్నరులతో చౌరస్తా సందడిగా
సాయం వేళ ప్రజలకు దొరికే వేదిక
సక్రియలతో పాటు విరామానికీ అవకాశం

వస్తూ పోయే జన పరిచయ మిత్ర మేళనం
అనభవ దృశ్యాలతో కోలాహల మయం

ఎవరి పనులలో వారు సవేగంగా
ఎవరి తీరికలో వారు శాంతంగా
ప్రతి ఒకరి గమనంలో లయ భిన్నం
రాగంలో ముక్కల వలె మాటల స్వరాలు
చెదరిన వనిపిస్తూ విడివిడిగా వినబడినా
ఇవి సమాజ శక్తికి చెందిన బహు భాగాలే

ఇది ఏ ప్రయాణ నిలయం కాదు
ఇది ఏ సమావేశ స్థలం కాదు
ఇది ఏ ఆశయ కేంద్రం కాదు
గాలికి కదలే రంగుల రిబ్బన్‌ల వలె
మనుషులు! అందరినీ బంధిస్తుంది మానవం
మెరపు తీగవలె మధ్య మధ్య మెరుస్తూ

ఎవరి కోసమో నిరీక్షణలో ఎవరెవరో
తమ అనుభవ సుందరతను భావిస్తూనో
తమ కోర్కెలు తీరేందుకు నినాదాలతో సమూహాలు
పక్కన లాఠీలతో భటులు! నియంత్రణ విధులలో

ప్రవాహంలో అలలవలె కదలే జన పంక్తులు
బ్యారియర్ వలె మధ్యలో ట్రాఫిక్ రెడ్ సిగ్నల్
కొన్ని క్షణాలు ఆపే యత్నంలో సమయం

కార్నర్‌లో నిలుచొని ఉన్న మనుషులలో
కదలే ప్రశ్నలకు! జన దృశ్యంలో జవాబులు
అనుకోకుండా మాటలలో చర్యలలో సార్థకంగా

# 17. తెలిసీ తెలియనిది

చౌరస్తా దగ్గరగా ఫ్లై ఓవర్ క్రింద పూల మొక్కల వరసలు
పచ్చని హృదయం నుండి చల్లని వాతావరణంతో
ఎగసే ధూళిని పొగలను తాను భరిస్తూంది
కాంక్రిట్ సిమెంటు నిర్మాణానికి ఆయువు పెంచుతూంది

భూమి పొందే బరువుల్ని తాను వహిస్తుంది సులభంగా
మనుషుల క్రియా రూపాలకు విపులత చేకూరుస్తూంది

కాలం రెక్కలపై ఎగురుతూన్నట్లు లేదు
కాళ్ళపైనే మెల్లగ నడుస్తున్నట్లు ఉంది

ముఖ్యంగా సాయం వేళల చౌరస్తాలో సందడి
నిరాశా మతులలో ఉత్సాహం నింపుతూంది
దిగులు పడే మనసులలో ఉత్తేజం చూపుతూంది
కొందరికి అవసరంగా, కొందరికి తీరికలో

దోష పరీతంలో మునిగి తేలేవారు
మంచి పనులలో భాగ స్వాములయ్యేవారు
కంటకాలనో గులాబీలనో తలపించే చర్యలతో
మంచు శిలనో వెన్నెలనో నిలిపే ఊహలతో

కూలిన పాత భవనం శిథిలాలలో విషాదం
సరికొత్త నిర్మాణానికి ప్రేరేపిస్తుంది
హేతువు కతీత మయిన స్వేచ్ఛలో అంతరంగం
సహభావం సౌహార్దం సౌదర్యం పెంచుతుంది

మనిషికి తోడు మనిషి శల్య సారథ్యం కాకూడదు
మనిషికి అండ మనిషి మృగ తృష్ణ అవకూడదు
ఊహలో క్రియలో వ్యక్తిత్వం! రూపితమవుతుంది
ఏ యత్నంలో వరాల ప్రభావం! వ్యర్థం కాకూడదు

విజయుడైనా కర్ణుడైనా మరొకరు మరొకరయినా
విలువల స్థాయిని సూచిస్తూ వెనకనుండి రూపం పనిచేసేను
ఇది కంటికి కనిపించనిదీ
మనసుకు మాత్రం! తెలిసీ తెలియనిదీ

# 18. ఆదర్శం ఒకటే

నేను తల ఎత్తి చూచినా చూడక పోయినా
నా వైపే చూస్తూ ఉన్నట్లు ఉంటుంది ఆకాశం
నా యోగ క్షేమాల బాధ్యత తనదే అన్నట్లుగా
ఊహలలో పైకి కనిపించని రూపాలకు నిలయంగా

నన్ను అందుకున్న శిశు దశ నుండి భూమికి
ఇప్పటికీ ఎప్పటికీ నను హత్తుక ఉండాలనే
గాలి కయితే నాలో నిరంతరం కదలుతూ ఉండాలనే
ముందో వెనకో వెలుతురు అంటి పెట్టుకునే ఉంటుంది

చీకటి తనలో కలుపుకోవాలని వేచి ఉంటుంది
తప్పని పోరాటాన్ని ఎగసే జలధి జ్ఞాపకం చేస్తుంది
మనిషి నుండి మనిషి! హ్లాదంతో పాటు కష్టంతోనూ
తెలిసినవీ తెలియనవీ చేరిన సంస్థితుల సంకలనం

కవిలో అంతర్నయనానికి కనిపించే మనిషి వేరు
జీవన దృశ్యంలో సూక్ష్మరేఖలతో రూపం, మనోమయం
అహంకార బిందువు ఉజ్వల రవి బింబమయి
అక్షరాల అలలపై తేలుతుంది కవితలో

మంచు శిలలు కరగి ప్రయోజన గమనంలో
ప్రవాహ రూపం పొందవచ్చు, దాహం తీర్చవచ్చు
క్షుధ బాపే సస్యశ్యామలతను చూపవచ్చు
ఆశా రూపాలకు దారులెన్నో! సృజనలో సంకల్పంతో

ఉన్మదం గంతులలో నాశనం దూకుడులో
ఒకరు చాలు ! నిప్పు పెట్టడానికి
పైరుకు పంటకు నిర్మాణాని కొకరు చాలరు
సహజ చింతనతో శ్రామిక గణ మవసరం!

ఆలోచనతో చేసే పని! బ్రతుకును పండిచాలనీ
సంస్పందనతో చేసే పని! మనసును వెలిగించాలనీ

గళాలెన్నొ! స్వరాలన్ని! అభిప్రాయం ఒకటే
దర్శనాలెన్నో! మార్గాలన్ని! ఆదర్శం ఒకటే

## 19. స్వేచ్ఛలో స్వతంత్రం

స్వేచ్ఛలో అభిమాన ఘనంగా తల ఎత్తుకొని
పై ఆకాశం చర్యల ప్రభావంతో
అవనిపై నిర్భయంగా నిరాటంకంగా
ముందుకు నడవడమే స్వతంత్రం

ఎదురు పడే దృశ్యంలో సన్నివేశ సందర్భంలో
మనిషికి జీవన ప్రయోజనం తెలుస్తుంది
దశదిశలు చేతులు చాచి స్వాగత మిచ్చేను
దిశను ఎన్నుకొనే బాధ్యత మనిషిదే

మొనలు తేలిన కఠిన శిలలు ఎదురవుతాయి
ఊపిరి అలల పయి హృదయం తడబడవచ్చు
బాధల బరువులను వహించ వలసిందే
విశాల సమాజ ప్రయోజనంలో! ఒకటై

ఎక్కడనో ఎవరిపైనో వదిలేసే వీలులేదు
హృదిలో వేదన చుట్టలుగా పొందవలసి వస్తుంది
నిప్పులు పరచిన దారి ఎదురు పడినా
భయం వీడి నిజం తెలిసి
శత్రువుతో మిత్రంతో ఇరువైపుల
ఉపజ్ఞతో నడక సాగవలసిందే!

నిరాశలో క్రుంగిన మనసులు
శపిస్తూ చదికిలబడి పోయేను
ఎంతకాలం ? దేనికోసం? వెదకేరని
దారిన దొరికేవి కొన్ని, తన కెదురు పడేవి కొన్ని

ఎవరి ఆయువు ఆగిపోయినా ఏదీ ఆగదు
అన్నీ యధావిధంగా కదలేను, జరిగేను

పోయిన మనిషి నీడ ఏలాగో దొరకదు
మిగిలిన జాడలతో వ్యవహారం సాగేను
సమస్యల నెదుర్కొనే జీవన గతిలో
శూన్యాన్ని నింపేది, కఠోరమైన వాస్తవ మొకటే!

# 20. జనతను చేరాలని

ప్రకృతితో ఉన్న అనుబంధంతో జీవితం
జీవితాల విశాల సంకలనం సమాజం
ఈ త్రయంతో సంపన్నమవుతుంది కవిత
ఇది భౌతిక పద భావనతో మనోమయం

ఘట్టాలెన్నో కలిసి రూపొందేను చరిత్ర
కష్టాలు నష్టాలు భోగాలు త్యాగాలు కలిసి పోయి
మనిషి అడుగు జాడ గళ స్వరంతో మొదలయి
క్రియాశక్తితో శ్రమ సంపదతో రూపొందేను

చీకటి తీగెలపై కలహ స్వరం వినిపిస్తుంది
వర్షధార తంత్రులపై భాగ్యం తలపిస్తుంది
ఉదయ కిరణ పంక్తులలో అభ్యుదయం చూపేను
జ్వాలా శిఖల తీగెలపై విప్లవం శబ్దించేను

రాత్రికి భయపడి మూలన ఎవరు ఒదుగుతారు!
అవసర సమయంలో దివ్వెను అయిన వెలిగిస్తారు

అశ్వంలా దుముకుతూ కదలే కెరటం
గట్టుకు చేరే తొందరలో నేలపై తరలాలని
కవి కంఠం నుండి వెడలి కవిత! జనతను చేరాలని
ప్రశ్నకు జవాబుతోనే మనిషి ఉనికి తెలిసేది
అగ్నికి జల సేచనతోనే హృదయం తెలిసేది

ఎక్కడో పుట్టిన నది నడచి నడచి జలధిని చేరుతుంది
తిరిగే చక్రానికి అలసట లేదు,
పనిలో శ్రమ శక్తికి విరమణ లేదు
ప్రేమకు అవకాశం ఉన్నట్లే
హింసకు దొరికే మార్గాలెన్నో!

మనిషి మనిషిని జయించినట్లే, హరించడమూ
చినుకుల్ని రాల్చి వెళ్లిపోయిన జలదం
మెరుపులతో సరిపెట్టుకొనీ
పిడుగు విడువ నందుకు కృతజ్ఞతలు

## 21. ఇది అందరిదీ

దిశల నుండి వీచే గాలి ఎవరిదీ కాదు
గిరుల నుండి సాగే ఝరిణి ఎవరిదీ కాదు
రవి కిరణం అందరిదీ
జలద శకల మందరిదీ

అందుబాటులోని వారు అది తమదేనని
కలహ కారణాలతో వివాద మతులతో

కత్తి తనది కావచ్చు
తల తీసే హక్కు లేదు
మాట తనది కావచ్చు
బాధించే హక్కు లేదు

శాంత భావ మయినా
యుద్ధ చరణమయినా
పైకి ఉద్యమించే
మనో మూల మొకటే

పోటీ పడి పోరాడే ఉత్సాహం ఒక వైపున
ఆశ జారి ఓటమిలో దిగులు పడే రొక వైపున
మనిషి మనసులో ఎదురెదురుగ ఇరు పార్శ్వాలొకటొకటీ
కొంత గతం చోటు చేసుకొనీ
కొంత వర్తమానం యథాతథంగా
భవితపై పేరాశ గగనమంతగా
తనకు గోడ అవసరం రక్షణకై
మరొకరికి అనవసరం విపులతలో

ఆలోచనలో స్వర్గలోక భావన పదిలంగా
యుగాలపై బడి మనుషుల మతిలో చెదరనిదై
హద్దులలో మనుషులు! తీర్చబడిన పథకాలలో
నిశ్చయం నిర్ణయం లేని మరో లోకంపై ఆశలు

వచ్చే కాలంలో సుఖ సంపదపై కోరిక
కల్పనలో ఎందరినో తిప్పుతుంది వాగ్దానంతో

# 22. చేతన వెనక్కి నడవదు

వెలుతురులో చీకటిని సృజించుకొని
అందులో నిశ్చింతగ గడపాలనుకునే వారు
ఒకే ప్రశ్నకు జవాబు మనిషి మనిషికీ భిన్నం
ఆలోచనలో అనుభవ చిత్రం విడుదలవుతుంది

కళ్ళు తెరచి కొన్ని ఘటనలు చూస్తూ ఉండవలసిందే
భూ కంపం పెను తుపాను వరదలు ప్రమాదాలు
మానవ శక్తిని మించినవి, అతీత మని పించేవి
అక్షర యానంలో జీవన దృశ్యాలనేకం

బ్రతుకులో వెల కట్టరాని వెన్నో! వాటికవే చెల్లేను
సంస్కృతికి ఉన్నత ప్రమాణాల స్థాయిని పెంచేను

పేదరికంలో అందునా పీడన వాతావరణంలో
పుట్టడ మొక పాపం! దౌర్భాగ్యం అనుకుంటే
వికసన దశలలో సుందరతకు హ్లాదానికి తావు లేదు
ఇది తానయి మానవ శక్తిని సంకుచిత పరచడమే

ఏకాంతంలో కన్న కవికి సమాజమే విశాల వేదిక
స్వేచ్ఛలో స్వతంత్రంతో జీవన రూపంలో మార్పులెన్నో
పరివర్తన క్రమంలో కల్పనలకు తావులేదు
వాస్తవానుభవంలో జనజీవన దర్శనం సరికొత్తగా

మానుష రూపానికి దొరకే ఆయువు సార్థక మయ్యేనా?
కాలం మరచిన అనుభవాలు! కవితలో స్మృతి చిత్రాలుగా

విలాపంలో కళ్ళ నుండి నీరు కన్న
కోష్ణ రేఖ సాగుతుంది బరువు బరువుగా

సముద్రాన్ని తలపించే చేతనతో సమాజం
జోరున వర్షాన్ని తలపించే శ్రవణ పేయ శబ్దం
హృదిలో ఆర్తిని తలపించే గుడి గంటలు
కవితకు నేపథ్యంలో ఆకర్షణ పెంచేను

మనిషిలో పురోగమన చేతన వెనక్కి నడవదు
వెలుగులో సమాజం! ఎన్ని రంగుల దృశ్యాలతోనో!

# 23. ఒకటే మార్గం

ఇది ఏడుపు తెచ్చే జన్మ కాదు కర్మ కాదు
తృప్తికి హద్దులతో పచ్చదనం చూపుతుంది
బండ రాయిలా పీడించే యుగం కాదు
విసరిన అగ్నులతో దగ్ధం చేసే నీతి కాదు

సంధ్యా సమయం సంశయ మయినా మతిలో
వచ్చే చీకటి నిరోధమయినా వ్యధలో
ప్రశ్నకు జవాబుతో సిద్ధంగా మనస్సు
చర్చల పర్యవసాన ఫలం కోరుతుంది

వ్యక్తిలో “నేను” చుట్టూ గోడతో స్వయం నిలయం
ఒక కిటికీ తెరవబడీ తలుపులు వేయబడీ
బయట సమాజం దీన హీన స్వరాలతో
బాధితుల్ని ఆదుకోవచ్చు పరిచ్యుతుల్ని లేప వలసిందే

చీకటిలో కావలసిన వస్తువు మెరపుతో తెలిసినట్లు
వీధిలో మనిషి పరిచయం పరివర్తన పథంలో
మనిషి ఏ రూపంలో నైనా ప్రకటితం కావచ్చు
అశ్వం పులి సింహం యంత్రం పవమానం!

అక్షరాల అమరికతో నిర్మాణ రూపం కవిత
కొత్త నివాసం చేరిన అనుభూతి! పారవశ్యం

ఇప్పుడు అవసరంలేని పాత కోట శిథిలాల నుండి
సన్నని స్వరం! కొన ఊపిరిలో నున్న బంధు భావంతో
వెలుగు వార్త కన్న, చీకటి సమాచారమే ఎక్కువగా
బయట పడేను, అన్వేషణలో పరిశోధనలో

దాడులతో హింసలతో చేచిక్కిన అధికారం
కాపాడుకునేందుకు హింసయే శరణ్యమవుతూంది
ఏ దార్శనిక మయినా సమస్యల సంక్లిష్ట దశలో
ఇంటిముందు వెలుతురు గోళంలా కొంతమేరనే కనబడేది
తత్కాలంలో ప్రదేశ వాతావరణంలో సమస్యకు
తగిన పరిష్కారంకై యత్నం, ఒకటే మార్గం!

## 24. గులాబిని గాయంగా

తాపంలో మేఘం వర్షంతో ప్రియమయింది
పిడుగుతో శబ్దం! భయ పెడుతుంది
మనిషిలోను హ్లాదం భయం రెండూ
వివిధ మనో భూమికల శ్రేణులలో

దప్పిక తీర్చే నీరు
వరదలతో ముంచెత్త వచ్చు

శబ్దం లేని దెచట ? చేతన చిహ్నం
గుండె లయ మొదలు జలధి హోరు దాక
శ్రమ జీవన యంత్రం శబ్ద మయం
వ్యక్తి నుండి సమాజ చలనం దాక

కాలాని కతీత మయిన నాద సౌందర్యం
ఉత్సాహం ఉత్తేజం నింపే పవన మిత్రం
శబ్దం నిర్వహించే పాత్ర జీవితంలో
అనుభవ జగత్తును తిరిగి అంద జేస్తుంది

గదిలో మనిషి ఒకరే అయినా
తోడుగ శబ్దం ! పది మంది పెట్టు
కోపం సహనం రాగం త్యాగం
బ్రతుకు లోవి అన్నీ! శబ్ద ప్రపంచంలోను

ఎండ వాన చలి చీకటి వెన్నెల
ఏ కాలమయినా ఏ వేళ అయినా
కష్టం సౌఖ్యం రణం శాంతిలో
శబ్దానికి క్షతి లేదు. బహు స్వతంత్రం
మాటలో మానుష వశం
కవితలో కవి అధీనం

శ్రమ జీవన సంస్కృతిలో భాగమై
శబ్దం! ప్రేరణ కారణ మవుతూంది
గాయాన్ని గులాబిగా మార్చవచ్చు
గులాబిని గాయంగా చూపవచ్చు

# 25. భూమి తలం పై

ఈ రోజు విజయం ఎవరిది?
నాదీ నీదీ కొందరిదీ
నిన్నటి ఓటమి ఎవరిది?
నీది నాదీ అందరిదీ

ఓటమిలో సందర్భం హెచ్చరిక నిస్తుంది
విజయంలో అవకాశం సమలంకరిస్తుంది

వీధి కార్నర్ లో చెట్టు నీడన
ఆ రోజుకు సరిపోయే రాబడితో
ఓటమి గెలుపు మధ్య రేఖ పై
శ్రమ జీవన శకలం దృశ్యం!

ముఖాన వికసించిన కుసుమం కనిపిస్తే
వేళకు విజయ ద్వారం తెరచి నట్లే
అనుభవ సూచనలో మానసికంగా
దీని రూపం గంధం స్పందనలో తెలుస్తుంది

ఆపై ఏమయ్యేదీ తెలియక పోయినా
మనిషి పట్ల మనిషి నీతి ! కత్తి మొన అవకూడదు
తల ఎత్తుక నడవడం సంకల్పానికి వాహనం
అలసట లేకుండా పయనం సాగుతుంది దూరదూరం

ఇచట పొందలేని సుఖం శాంతి ఆనందం
“ఈ లోకం వీడి మరో లోకం లోననే” అని
భ్రమలో దిగులు ఎండిన నూయిలోకి నెడుతుంది
అసలు మనిషి ఉనికి! జిగీషలో మనో బలంతోనే

సమాజ వికాస చరిత్ర దశలలో
ఆదర్శానికి దార్శనికం ఏ విధమయినా
జీవన భాగ్యానికి మానవ సందర్భంలో
నరకం తలపించని జన, భాగ్యం తోనే

స్వర్గం గురించి ఊహకు అభిమతి నీయని
భూమి తలంపై జీవన దృశ్యంలోనే మానవం

# 26. తప్పని మానవం

ముందు వ్యక్తి ఆపై మనిషి ప్రాణి మూడు బ్రతుకులో
మానుష కవచంలో సంకల్ప బలంపై పెరిగేను
జీవన యానంలో మైలు రాళ్ళతో పాటు
ప్రశ్నలు ! ఒకటొకటీ, పోయినంత మేరన

పరచిన ఆకాశ మంత ఆదర్శంపై చూపుతో
భూమిపై సమాజ జీవన దృశ్యాలను చూస్తూ
ఇంటి నుండి బయటికి
బయటి నుండి ఇంటికి

రాజకీయ ఆర్థిక సాంఘిక నైతిక విజ్ఞాన సంపుటి
ఆయువు చక్రంపై ఏ రోజూ తిరుగుతుంది
పాత్రలు నటనలు మాటలు వేషాలు అవే!
పైకి కనిపించని నిజం! లోపలనే గుప్తంగా

మెలకువతో ఉదయం అయితే సరిపోదు!
పోవలసిన సరి అయిన దారి చేపట్టాలి
నడక ముందుకు సాగాలి, గమ్యం చేరాలి
మనిషిలో ఆర్తస్వరం సుడులు తిరుగుతూ
బయటి ప్రవర్తనపై ప్రభావం నెరపుతుంది
ప్రతి వస్తువు వెనకన కనిపించని మూల గుణం

కనపడని కాలం జలపాతంలో కనిపిస్తుంది
వివిధ భంగిమలలో నృత్యం చేస్తూ జారుతుంది
కనపడని పవన తంత్రీ నాద స్వరం వినిపిస్తుంది
ఎక్కడెక్కడివో మోసుకొనీ సంఘానికి చేరుస్తుంది

నినదిస్తే అశాంతి వలయం అంతం కాదు
విలపిస్తే దరిద్ర దశ అంతరించి పోదు
ఎదిరిస్తే మానవ నిజ రూపం బయట పడదు
సుత్తెతో మొత్తితే శిల ! సజీవ రూపం దాల్చదు

స్వేచ్ఛలో స్వతంత్రం! సుందర వాస్తవం
ఊహలో చర్య వెనక ! తప్పని మానవం

# 27. వెలుగులు కొత్తవి

కవిత! మనసుకు రక్షణ కవచం అవుతుంది
సూచనలతో మనసు నదుపులోకి తెస్తుంది
తనకు సహజమైన అడవిని వదలితే పులి
మనిషి భయానికి బోనులోకి చేరవలసిందే!

పక్షు లెగురుతాయి కొన్ని ఎంత దూరమయినా
గుంపులుగా చేరతాయి మరో చోటికి సంతోషంగా
ఒక రుతువులోనొ సందర్భంలోనొ! మార్పుకయి
సుఖ సంపద కయి కొత్త సీమలు చేరతాయి
తాము ఉన్న చోటునే అన్ని లభించాలని కొందరు
తమ ఆలోచన నెరవేరక పోవచ్చు! జీవితంలో

గుడిసె ఎంత యదార్థమో మేడ కూడ అంతే
ఎవరి స్థాయిలో వారు, తృప్తి రేఖపై
ఉష్ణ వేళ చల్లని రాగం వినిపించవచ్చు
శిశిర వేళ వెచ్చని రాగం పలికించ వచ్చు
ఆకలి తీర్చే హద్దులతో ఒకటి
భోగం కూర్చే హద్దులతో ఒకటి

చిన్నదొ పెద్దదొ ఇల్లు ఇల్లే మనిషికి
లేచింది మొదలు పడుకునే వరకు మనిషిలో
వివిధ స్థాయిల్లో మనసులకు రెండూ ప్రియమే
కలలో రెండూ తారుమారు కావచ్చు
గుడిసె నుండి మేడలోకి
మేడ నుండి గుడిసెలోకి

మనిషిలో ఆశ! నదియై జీవితం ప్రవహించాలని
కిందికి దూకితే! పడి చెరువయి నిలిచేను నిరాశలో

బుజాన వెన్నెల శాలువాతో రాత్రి
కవిత! వినిపించేందుకు సిద్ధంగా
మేల్కొన్న మనిషికి! ఆప్తంగా, మిత్ర గణంతో
పాతవి సీమలు చెరపేను! కొత్తవి వెలుగులు చూపేను

# 28. బ్రతుకులో మనిషిగా

రవి ఉదయించే దిశ అందరికీ తెలిసిందే
ఆ సమయం కూడ తెలిసిన వాస్తవ రూపమే
వెలుగు నడ్డు కునే దెవరు? కనబడకుండా
మబ్బు ముక్క కావచ్చు మంచు పటం కావచ్చు

మెల్లగ జరుగుతాయి దూరం తొలగుతాయి
చేతిలో ముఖం తుడుచుకునే టవల్‌లా
నడచి నడచి నడక ముగిసే దిశ కూడ తెలుసు!
మనిషి గురించి మాత్రం మనిషికి తెలియదు

తెలియక పోవడంలోనే ఉంది మనిషి విశేషం
ఇది బయట పడే యత్నాలెన్నో! బ్రతుకులో
ఎవరికి వారు గవేషణలో నిరీక్షణలో గడిపేరు
ఎపుడు ఎవరు వచ్చేదీ, ఏది జరిగేదీ తెలియదు

కలల్ని నమ్ముకొని బ్రతికే దెవరు?
విశాల మతికి జరగని దేదీ లేదు!
నా చుట్టూ మనుషులు! ఎవరి పనులలో వారు
ప్రాణులు! వస్తువులు ! దేని ప్రయోజనం దానిదే!

అన్నీ అమరినా ఆహారం వ్యవహారం ధనం బలం
ఇంకా ఆరాటం ఆవేదన! ఆశా ముఖం చాచి
కరగిపోయే కాలం గురించా?
తరగిపోయే విలువలు గురించా?

మనిషి గురించి మనిషి మరపు గురించా?
ఎవరు ఏది పొందేదీ తెలియని రహస్యం!

మొక్కకు మట్టితో సృజన బంధం
కవులకు కవితతో హృదయ బంధం
మట్టి నుండి పుట్టి మట్టిపై పెరిగి
మట్టి నాశ్రయించడ మొక పరిణామ పథం
ఆటకు పాటకు రాగానికి భోగానికి నిలయమై
పూర్ణతకై వేదనతో మనిషి బ్రతుకులో ! మనిషిగా

స్వేచ్ఛా కవిత్వం - 105

# భవితకు సంకేతం


మాదిరాజు రంగారావు





2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**NO. 105**

**SWECCHA KAVITHVAM**

Free - Verse

**BHAVITHAKU SANKETAHAM**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

***Presented to***
***my daughter***
***Mrs. M. Charitha,*** *Professor*
*California, USA*
***with blessings***
***on her Birthday***

# పీఠిక

ఆధునిక కవిత్వంలో వ్యక్తి జీవితం సమాజ స్థితి మానవహక్కుల వినియోగంతో కూడిన స్వరం వినిపిస్తుంది. మరీ ముఖ్యంగా నైతిక క్షేత్రంలో కర్తవ్యాన్ని భావింప చేస్తూంది. అటునుండి రాజకీయం ఇటు నుండి సాంస్కృతికం రెండిటి సమ్మేళనంతో వికాస చరిత్రకు దోహదం చేస్తూంది.

ఎటువంటి పరిస్థితులలోనైనా అవగాహనతో కవిత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తూంది. వస్తువు – విషయం – ప్రయోజనం – లక్ష్యం గురించి ఒక ప్రక్కన కళ – అభివ్యక్తి విధం – ప్రత్యేకతతో మరో ప్రక్కన పరిశీలన కందుతాయి. ఏవైనా సృజన ప్రతిభ చేతనే మన్ననలను పొందడం జరుగుతుంది.

ప్రజాస్వామ్యంలో సృజన స్వరాన్ని (creative voice) అణచడం కుదరని పని, భావ్యంకాదు. దీనికి స్వేచ్ఛా వాతావరణం అవసరం. అందరికీ తెలిసిన విషయమయినా సులభంగా మరచిపోవడం జరుగుతూంది. అధికార బలంతో నిరంకుశ ధోరణులకవకాశం లభిస్తుంది. నిరంతర చైతన్య శీలమైన సమాజంలో ప్రగతి దిశగా పయనించే ఆలోచన ముఖ్యమవుతుంది.

కవిలో సృజన రూపం సమాజంలో విషయ గ్రహణం (perception) చేత, (దీన్ని ప్రకటించే విధం వేరుకావచ్చు) విశాలత సిద్ధిస్తుంది. వైవిధ్యం గోచరిస్తుంది. ప్రస్తుత స్థితిలో అనివార్యమైంది.

"I may disapprove of what you say but - I will defend to the death, your right to say it" – వాల్టైర్.

ఈ కృతి "భవితకు సంకేతం" వార్తమాన స్థితిలో భవిష్యత్తు సూచిక! స్పందించే కవి హృదయం కంటికి కనిపించే దానితో కనిపించనిది దర్శిస్తుంది. అది రూపం కాలం వస్తువు స్థితి అనుభవమేదైనా కావచ్చు. ఇదొక ప్రపంచం. కనిపించే దానికి సమాంతరం.

**– మాదిరాజు రంగారావు**

# 1. శూన్యానికి అంకెలు

మట్టి అంట కుండ కాలికో చేతికో
ఎట్లా నడవాలో ఎట్టా చేయాలో కవికి తెలుస్తుంది
సుహృదులు కూడ ఈ స్పందన వరసలో భాగమే

అక్షర వాహన రమణీయంగా పయనించే
మనసుకు! మట్టియే కాదు అగ్నియైన సోకదు
ఇది! వికార స్పృహల కతీతమైన సృజన నవం

పులి వేటకు చేతిలో తుపాకి సిద్ధంగా
మనిషి వేటలో మనిషి ! వెనకనే పొంచి పొంచి
విపదకు సూది మొనచాలు పిడికిలి దెబ్బచాలు
రాయి చాలు! అరచేయి చాలు! హత్యకు

ప్రవాహంలో విద్యుత్తు లభిస్తుందని
నీళ్ళలోకి దిగేరు, అన్వేషణ జరిపేరు?
వసుధలో బంగారం దొరుకుతుందని
గుప్తంగా తవ్వకం మొదలుపెట్టేరు

గోడలపై నినాద పంక్తులు చదివి
మదిలో రెక్కలు విప్పిన విప్లవంతో
బ్రతుకులో ఉద్యమ రూపం వరించేరు
ప్రజను వీడి అడవిని చేరేరొకరొకరు

తను చేసిన తప్పుకు తానే
శిక్ష నెవరు వేసుకునేరు?
నేరం తరువాత నేరం జరుగుతూ
అలవాటయి మనస్తత్వ మవుతూంది
మట్టి మరక పైకి కనిపిస్తుంది స్ఫుటంగా
నీతి లేని విధం తెలుస్తుంది ఎక్స్‌రేతో
మౌనానికి నిశ్శబ్ద శబ్ద రూపం కవిత
శూన్యానికి విలువయిన అంకెలు చేర్చేను

# 2. ప్రేరణయై

అనుభవాన్ని పాటను స్వరపరచే
నైపుణి ఒక కవి హృదయానికే తెలుసు
అగ్నికి వెలుతురు ముఖ మిచ్చే
చతురత ఒక రవికే తెలుసు

ఏ బ్రతుకునకూ కవిత దూరం కాదు
అది వెనక్కి అడుగు వేయనంత వరకు

రోజు కొక సృజన రూపం
రోజు కొక విలయ చిహ్నం
రెండూ తప్పని సరిగా, ఎదురుగా
సమతకు నవతకు అవకాశంతో

గుడి గంటలు ఆర్తిని వినిపిస్తాయి
లోపలి బాధను బయటికి తెలుపుతూ
అభిలాషను అందించే శబ్ద తరంగం
గుడి లోనే కాదు, గుడి బయట కూడా

సునాదమొ ప్రబోధమొ! సూచనయో
మెలకువ లోను మనసును జాగ్రత పరచేను
మనిషి స్వరం వినిపిస్తుంది, వ్యక్తి రక్తితో
సమూహ శక్తిని కూడా తలపిస్తుంది ప్రభావంలో

అనుభవంలో వచ్చే కాల నిర్ణయంలో రుతువులు
దేని కది జీవితంలో ప్రభావ సంపదగా నిలిచేను
ఎవరో ఒకరయినా కవి నుండి కవితను వినేరనే
ఆ ఒకరు చివరకు కవిలో విమర్శక రూపం అయ్యేను

ఎదురుగ కదలిపోయే కెరటం చేతిలో చిక్కాలనీ
మనిషిలో కోరిక! ఎప్పటిదో సాధ్య కానిది!
సాధ్యం కాని దానికై నిరంతర ప్రయత్నం
వ్యర్థంగా అర్థం లేని స్థితిని! కలిగిస్తుంది

ఈ రోజు ఊహలతో క్రియలు మనిషిలో
భవితకు సంకేతంగా ప్రేరణయై నిలిచేను

# 3. వలయంలో భ్రమణం

దప్పిక వేస్తే దారిలో ఏ చెరువో చెలమో
ఏ బావియో! నదియో ఆ నీరు ప్రాణం నిలుపుతుంది
అనుభవ దృశ్యం వాస్తవ సుందరమవుతుంది
కనిపించీ కనిపించని జీవన సత్యం! తడుతుంది

లోనున్న భూకంపం పెను తుపాను స్థితులు
బయలు పడితే, బాధాకర దృశ్యం తప్ప! ఏముంది?
వ్యక్తిలో ముక్కలుగా అనుభవానికి వచ్చే కాలం
సుదీర్ఘ రూపంలో ఏడాదిగా పరిణమిస్తుంది

నేరం ఒప్పుకునే మనిషికి శిక్ష తప్పేనా?
మాటపై నమ్మకంతో దోష రహితుడయ్యేనా?
నేరం చేసి పారిపోతూ మధ్యలో
మరో దోషానికి తలపడేరు; ఎందరో!

నేరాలన్నిటిలో ఆత్మ హత్య సులభ మనిపిస్తుంది
హతుని తోపాటు ఇతరులనూ బాధించే అస్త్రమవుతుంది

శిలలు కవి హృదయంతో మాట్లాడతాయి
శిల్పాలుగ మారే ఆలోచనలో గడుపుతాయి
నదులు కదలి పోతూ పోతూ మాట్లాడతారు
గట్టుపై చెట్లతో, తీరాన మనుషులతో

కవికి బాగా తెలిసినవీ చేయగలవి! పనులు రెండు
ఒకటి పూవులా విప్పారడం సమయంతో పనిలేదు
ఒకటి నిప్పులా పైకెకి ఎయడం సమయోచితమై
పరంపరా రూపమొకటి పరివర్తన రూపమొకటి

అక్షర ప్రదర్శనంలో భద్రంగా పాత్రలు
ఇతి హాసంలో జీవిత ప్రకారాల్ని తెలిపేను
సమాజాని కాదర్శంగా వ్యక్తికి పథ ప్రదర్శకంగా
మనిషి భ్రమణం! తనదైన మౌలిక వలయంలోనే!

# 4. అనూహ్యంగా

వర్తమాన స్థితిలో మంచి చెడు మానవం దానవం
సమాజ భవితకు తీర్చేవి, వ్యక్తిని నిర్మించేవి

మనిషి జీవితం ఏండ్లు పైబడే కొద్దీ
తన చుట్టూ ఉన్న గోడ ఎత్తు పెంచబడేను
పై నుండి అవకాశంతో పక్షి ఎగిరి వస్తుంది
మనిషి పనిలో హద్దుల్ని తెలుపుతుంది

కవి ఆలోచన ఎగసి విశ్వం అంచులు తాకాలని
కవి నివాసం, ఈ భూమిపై సమాజం మాత్రమే
ప్రజల మధ్య బ్రతికినంత కాలం ఆశ్వాసంగా
ప్రతి పనిలో అర్థం మనిషి మనిషికొక విధంగా

శ్రమకు ప్రతిఫలం లభించడంలో విభేదాలు
నేరం మోసం దోషం చౌర్యం పేర్లతో
చీకటిలో దేని కోసం వేచి ఉంటామో
అది కనిపించే పొందే వీలు! దీప సహాయంతోనే

ప్రాథమిక సమస్యలన్ని ఒకటే ఎక్కడయినా
దీనిలో విభేదాల ప్రసక్తి లేదు, అవకాశం లేదు
ప్రేమ కరుణ ఉదారత మానవతల స్థితులతో
మనిషకి చిరునామా మనిషియే, ఏ వైపు నుండి అయినా

స్నేహ పరిమళ హృదయ మొకటే మనిషిలో విశిష్టం
జీవన గతిపై ప్రభావ సుందరతను చూపుతుంది

మంచి చెడు తీరాలతో జీవనధుని
పోయినంత చివరిదాక ఆసక్తి కరమైంది

గాలి కదలుతుంది ఏలాంటి స్థితిలోను
ఊపిరి పునర్నవం పొందుతుంది
చీకటి గడచి రాత్రి దాటి
ఉయం రాకతో, మనసు నిర్మలమవుతుంది

ఏ రోజు ఊహలతో చర్యలు మనిషిలో
బ్రతుకును మలుపులు తిప్పేను అనూహ్యంగా

# 5.

ప్రవాహాన్ని దాటే పడవ ప్రయాణికునిది కానక్కరలేదు
ఉప కథనం ఎవరి దయినా కావచ్చు
ఆ సమయంలో అది ఒక మిత్రం బంధువు.
వీచే గాలి ఒకరి కోసమని కదలదు
అందరికీ చెందింది, అందరి ప్రాణం నిలుపుతుంది
ఉదార చేతనతో ముందుకు వెళ్ళడమే పని

తన ఇంటి ముందు తాను బిక్షకు నిలవడం
తనకు తెలియని భాగ్య దశలు తెలియడమే
సౌమ్యం క్రౌర్యం ప్రేమ ద్వేషం ఉపకృతి దోషం
అన్నిటికీ నిలయం జీవితం! వివిధ స్వరాలతో

నీటిలో పడిన రాయి మునుగుతుంది
దృశ్యం! మనిషికి తత్వం ప్రబోధిస్తుంది
మంచు తేలుతుంది, కరగుతుంది
మనిషికి తన నిజ రూపం మెరుగు పరుస్తుంది

రుతువులు ప్రకృతిలో ఒకదాని వెనుక ఒకటి
జీవితాలపై ప్రభావాల్ని! జ్ఞప్తికి తెస్తాయి

పగలు సూర్య బింబంతో రాత్రి చంద్ర కళలతో
అలలు ఆడుకునేను, జలధిల్లో బంతులవలె

చీకటిలో ఆకాశం మైదానంలో చుక్కలు
ఆటలో ఆడే క్రీడాకారుల్లా ఉత్సాహ కళలతో
ప్రతివ్యక్తి తనలో హృదయం స్వచ్ఛంగా ఉందనే
పూవు ఎంత ఇష్టమైనదయినా కళ్ళముందు ఉండలేదు
కొన్ని రోజులలో రాలి పోవలసిందే
ఆ వచ్చే దానిపైన ఆశలు పెంచుకోవలసిందే
ఉండేది కొంత కాలమే అయినా..
మనిషి! తాను శాశ్వతమనకొనే విధంగా

## 6. మెరపు ఊహ

ఏ రోజు కారోజు సమాప్తిసూచన చీకటి చుక్కలో
ఆ రోజు కారోజు ఆరంభ బిందువు ప్రభాత రేఖతో

ఇది ఉదయ సమయం, జీవన సంరంభ మొదలు
తెరచిన వెలుగు దారులు! పథికులకై ఎదరు చూచేను
ఎక్కడా చీకటి భయంలేదు, శరణం అవసరం లేదు
అప్పటి దాక పొంచి ఉన్న భయం బావిలో దూకేస్తుంది

సంతోష బాష్ప కణాలతో దిశలు తడి తడిగా
ఆర్ద్రతతో మెరసే తేజస్సును పొందేను కవిత
పొద్దెక్కుతూనే గాలిలో ధూళి పొరలు పైకి లేస్తూ
బ్రతుకులో దుమ్ము పొర తప్పని దవుతూంది

కిరణంతో పాటు బయటికి సశబ్దంగా వచ్చి
నిశ్శబ్దంగా వెళ్ళి పోవడమే చేసే పని
లోన దూకే దుఃఖం మెరసే సంతోషం
శబ్దంలో ఒదుగుతూంది పలుకుతూంది అందుతూంది

వ్యక్తినుండి సమాజంలో వచ్చే మార్పుతోనే పని
అనుక్షణం మారే జీవన వికాస శక్తికి చిహ్నం
ఆనంద స్వరం వినాలని వేచి వేచి ఉంటే
విషాద స్వరం వినిపిస్తుంది, అనూహ్యంగా

ఇది ఎవరి చేతిలో లేనిది / ఆలోచనకతీతమైంది
ఎవరికయినా వినక తప్పనిది, చూడక తప్పనిదీ
తోడులోని మనిషియే మనిషికి ఆసరా! ఎప్పటికీ
సమయానికి ఒడ్డున బయలు దేరే వానలాగ

ఏ సమయం వ్యర్థం కాదు, గతమూ అంతే
అనుభవ సంపదయై వెనకనే రాసులుగా!
దూరం నుండి పాట స్వరం, దగ్గరలో మాట స్వరం
రెండూ మనిషిని శ్రమ జగతికి ప్రేరేపిస్తాయి

శిథిలమైన గుడిలో కొత్త ప్రతిమకై వెదకి వెదకి
తృప్తి లేక! తనదే ప్రతిష్ఠించే మెరుపు ఊహ మనసులో

# 7. చీకటి హృదయం

జననం మొదలు బయటి ప్రపంచం
అనుకున్నంత కొత్త కాదు, భయం లేదు
చుట్టు బంధు గణంతో ధైర్యం నింపుతుంది
సాదర ప్రేమతో ఎదకు హత్తు కుంటుంది

రాత్రుల వెన్నెల మెత్తదనంతో వర్తిస్తుంది
పగలు కుసుమ దళ స్పర్శతో అలరిస్తుంది
పరిసరాల సహభావంతో క్షణాలు గడుస్తాయి
కొత్త అనుభవం అడుగులు ముందుకు వేయిస్తుంది

కాలం గడుస్తున్న కొద్దీ వెనక్కి తిరిగే దాని కన్న
ఎక్కువ విలువలతో వ్యక్తిత్వం వికసిస్తుంది

క్షణాల్ని లెక్కపెట్టే తీరిక ఎవరికి ఉంది?
అవి వాహన చక్రాల్లా కదలి పోతూ ఉంటాయి
ఎంతటి బరువులయిన మబ్బుల్లా తేలిపోతాయి
ఎవరి పనులలో వారు మానవ శక్తి ప్రసారాలతో

రాత్రులు వెలిగే దీపాల ప్రతిరూపాల వలె మనసులు
మరొకరికి దారి చూపడమే తమ కర్తవ్యంగా
వాస్తవ గతిలో భూమిపై
అతీత మతితో నింగిపై
రెండిటికి మధ్య వాస్తవ ప్రపంచం
భిన్న భిన్న విశ్వాసాలతో జీవన నిలయం

భూమికి కొంచెం ఎడం ఎత్తులో
పయనం సాగాలని కోరిక మనిషిలో
ఇష్టమైన అర్థాన్ని ప్రియమైన ఆదర్శాన్ని గ్రహించేను
కవితలో ఆకర్షణ! పరిమిత రేఖలతో ఒదిగే

అస్తమయమయినా చల్లబడిన వాతావరణంలో
ఉల్లాసం కలిగించే ఉత్సాహం నింపే స్థితిలో
చీకటి నలుపే కాని ! హృదయం మెత్తనిదీ చల్లనిదీ
సహన శాంతి పథంలో సమయం కళాత్మకమవుతుంది

# 8. పరం కన్న భిన్నం

భిక్షువు ప్రతి ఇంటి ముందు ఆగేను ఏ భేదం లేదు
వీధులు తిరిగినా, పాత్ర! శూన్యముఖంతోనే
ఇంట్లో ఉన్నవారు ఆర్తి వినాలనీ బదులు పలకాలనీ
తన పాటలో సారం హంసలా గ్రహించాలనీ

సమాజ ప్రదర్శన వేది పై ప్రతి మనిషి పాత్ర
నిర్ణయింపబడీ విజయం గురించి కాలం వడపోస్తుంది
ప్రవాహాన్నో సరస్సునో తలపించే కవిత
దాహం తీర్చేది, హాయిని కూర్చేది, పూలను విప్పేను

రాత్రు లెంతో ఉపయోగించే వెలుగుల దీపం
ఉదయం నిరుపయోగంగా కనిపిస్తుంది
ఏ పని అయినా సమయం సందర్భంతో
ఔచిత్యం లోనే విజయం ప్రకాశిస్తుంది

బాష్ప బిందువులో జారుతుంది అనుభూతి చిత్రం
రంగులు ఎరగని తెల్లని జీవన రేఖలో నిజంలా
స్మృతి శాల నుండి శబ్ద నిలయానికి చేరే
అక్షర నవ శిల్పంతో కవిత! ఆలోచనా మనోజ్ఞం

సుఖం లేదనుకొని విలపించే హృదికి హ్లాదమిస్తుంది
మనిషికి ఆశా సుమ వనిలో తిప్పుతుంది
మౌనానికి అందమైన శబ్ద రూపం కవిత
నిరాశనుండి ఆశను మేల్కొల్పే భావనా తేజం

ఉదయం లేవగనే ఆ రోజు కోరికలన్నీ
ఎదురుగ వరసగా నిలపడతాయి, ఆశతో
ఏది విజయ శిఖర మధిరోహించేదీ
తెలియని వాస్తవం! సందేహ డోలపై ఊపుతుంది

వ్యక్తిలో అంతర్వీక్షణంలో అంతరంగ స్పృహ
అందని వెన్నిటినో మనసుకు అందిస్తుంది
ఇది భౌతికేతరం కాలాతీతం విశ్వమయం
నమ్మే పరం కన్న భిన్నం! మనోయుతం యశోమయం

# 9. సగం సగం

విభవానికి దారులు వెదుకుతుంది మనసు
విజయానికి తెలివిని విసరుతుంది బుద్ధి
పుట్టుకతో బయట జీవన గమనం మొదలవుతుంది
చేతిలో నాణెంలా క్షణం వెనుక క్షణం
మెరుస్తు ఎగురుతూ మ్రోగుతూ కదలుతుంది
లేంది బ్రతుకు దివాలా తీసిన బ్యాంకు బాబతు

ఎంత ఒకటి అయినా మనిషికి కనిపించేది
మరో వ్యక్తిలోని కొన్ని కోణాలు మాత్రమే
మిగతావి! మరెన్నో! జలధిలో చేపల్లా
చీకటిలో చెట్లలా, పగటి వేళ చుక్కల్లా
ఎపుడో కనిపిస్తే మరికొన్ని కనిపించవచ్చు
కవితలో ప్రతిబింబ ప్రతిఫలం అలరిస్తుంది

ఏదో ఒక రంగులో శరీరానికి
తొడిగిన దుస్తులతో మనిషి! ఇంపుగా
తిండి బట్ట ఉనికి పై కోరిక! జీవన సహజం
ఇవి పొందే యత్నంలో పోటి కలహం శత్రుత రణం

భూమితలంపై మట్టి అంతా ఒక విధం కాదు
సమాజంలో అందరూ మూసలో రూపాలు కారు
సాధారణ జీవన ప్రమాణ స్థితులలో మాత్రం
అందరి అవసరాలు ఆశలు ఒకటే ఒక స్థాయిలో

ఏ మార్పుకూ చివరి ఉదయమంటూలేదు
ఉదయాలెన్నో మార్పులన్ని; సమాజ చలనంలో
ఆయుధ వీరంతో రాజ్యమొకరి వశమయితే
నెత్తురు చుక్కల హారం ధరణికి సమకూర్చేరా?

రణమంటే వీరుల కెంత ముచ్చటో
సామాన్యుల కంత నిరాదరణ భావం
రణ మంటే సగం మనిషి మాయమవడం
మరో సగం వికార రూపం పొందడం

# 10. విజయ వాస్తవం

గమ్యానికి దారులెన్నో! చుట్టూ దిశ దిశలో
పోవలసిన స్థానం ఎన్నికలో పయనంతోనే ఫలితం
జన మనో మూల గుణ చర్యలతో సమాజం
శిల అల పుష్పం మేఘం! ప్రకృతిలో ప్రతీకలుగా

దించిన తలతో గగనం వంగినట్లయి
సంకుచితంలో ఆలోచన ముడుచుకోనీ
జీవన ఫలం అందని సమాజ భాగ్యంతో
వ్యక్తి వ్యక్తికి తోడు బదులు ఎదురుగా తీర్చబడీ

నిందిస్తూ ఏడుస్తూ చదికిల పడడం ఎప్పటి మాటో
ప్రజాస్వామ్య చేతనతో పురోగమనం ఈ నాటి మాట!
ముందుగనే శత్రువు వాతావరణం తలచే వారొకరు
అగ్ని వర్షం కురిసేనని జోస్యం చెప్పేవారొకరు

ఈ భూమిని వదలి సమాజాన్ని కాదని
వెళ్ళేదెక్కడికి ? పైనా? అక్కడ ఉండే దేవరు?
చెట్టుపై పుట్టపై గిరిపై నదిపై ఆదర్శం వేదికే కన్నా
మనిషిలో ప్రభావ రూపం! పై అభిలాష అవసరం

దిశ నుండి దిశకు విసర బడిన మనిషి తుదకు
సంపదతో ఆకర్షించే భూమితోనె బంధం నిలిచేను
నిరాశను ఈదడమో దాటడమో మనిషి కర్తవ్యం
అభిరుచితో పొందే సాధనమేదయినా ఒకటే!

ఏదీ ఒక విడతలో పూర్తికాదు అందదు తెలియదు
పోరాటం సహనం ఒకదాని తరువాత ఒకటి వికాస చరిత్రలో
అధికారం అలంకారం కాదు, కాకూడదు
జీవ శ్రేయో భాగ్యానికి అర్పణ కావడమే శరణ్యం

నిర్బంధం నుండి స్వేచ్ఛకు లక్ష్యంతో
నిరంకుశం నుండి ప్రజాస్వామ్యానికి దార్శనికంలో
దశదశలుగా చరిత్రలో ఉద్యమ శక్తులు
ఇప్పటికీ పూర్తిగ అందనిదీ విజయ వాస్తవం!

## 11. చరిత్ర అంచున నడుస్తూ

తెలియని స్థితిలో కొత్త ప్రపంచం లోకి
ప్రాణులన్ని ఒకటి కాదు
బ్రతుకులన్ని ఒకటి కాదు

సాధు క్రూర సహన హనవ భేదాలతో
మనుషులు భిన్న భిన్నం, అసంఖ్యాకం
తేజానికి శీరానికీ హ్లాదానికీ రాగానికీ ప్రతీకలుగా
పై నుండి రవిచంద్రులు! ఆదర్శ భావ బింబాలయి
కాలాన్ని పాలించేను, బ్రతుకుల్ని నడిపించేను

అరణ్యాలు తగ్గుతూ నివాసా లేర్పడుతూ
ఊరు నుండి నగరానికి బాటలతో
రక్షణలో కోటలు కోటలతో రాజ్యాలు
రాజ్యంతో పాలకులు పాలితులు! ప్రజలు
సంపద సంపాదనలో పీడకులు పీడితులు

చుక్కలో కోరిక
చంద్ర బింబంలా విస్తరించాలనీ
మొలకలో ఆశ
పెద్ద వృక్షంలా వృద్ధి చెందాలనీ
నిప్పులో వేదన
సూర్య బింబంలా వెలుగు పొందాలనీ
శిశువులో ఈహ
పొదుగుతో వికాస చరిత చూపాలనీ

చిన్నతనంలో ఆడు కొన్న బొమ్మలు
పాత పెట్టెలోనో అటకపైనో చేరేను
పెద్ద అయిన కొద్దీ! కలిసే మనుషులు
ఎవరి చేతిలో ఎవరు ఆడబడేది తెలియదు

ఎక్కడెక్కడివో? ఎప్పటిప్పటివో! దృశ్యాలు
ఒకచోట చేరిన ఆల్బం వలె! కవిత!

## 12. మనిషికి ఆధారం

దేశ మేదయినా జీవన రుచి ఏదయినా
ఏదో ఒక పండుగ అనివార్యంగా
భౌతిక మానస స్థాయిలో విరామ కళతో
ఉత్సాహం ఇచ్చే ఆనందం చూపే స్వేచ్ఛా సమయం

బాధ్యత పరిమితిలో శ్రమ ఎక్కువ లేనిది
జనుల మనః ప్రీతికి కాలం తల ఒగ్గేను

ఎండ అయిన వాన అయినా శిశిర మయినా
వాయిదా పడే వీలు లేంది, తప్పనిదీ
సంఘంలో సభ్యులు భాగ స్వామ్యంతో
ప్రజల ముఖంలో వసంత సుమం మెరుస్తుంది

"రోజూ పండుగ వాతావరణం! ఇలాగే"
అనుకునే సమయంలో హఠాత్తుగా అవరోధం!
ఎమర్జెన్సి కాల్! విషాద వార్త చుట్టబడీ
ఉత్సవ ముఖాన కత్తి గంటులా భయపెడుతూ

ఉదయం కిరణం చేయి అందించింది
రాత్రి శాంతి నిలయం చూపిస్తుంది
ముందుకనే దుఃఖ ఘటన కదలించేను
జరగనుంది ముందు తెలియడం మనిషి కతీతం!

క్షణాలు మండుతూ పోవడ మెవరికి ప్రియం?
వర్తమాన భస్మ వేది నెవరు కోరతారు

పండుగ మూలంగా మానసికంగా మార్పులో
సరికొత్త ప్రపంచాన్ని పొందే ఆరాటం!
ఏ రోజూ బ్రతుకులో మనో రూపం
ఖాళి సంచిగా నిష్క్రమించదు

ఏ ఆధారం లేని వస్తువు లేదు
అలకు గాలిలా శిలకు భూమి ఆధారం
కవితకు ప్రేరణ సమాజ జీవితం
మనిషికి! ఆధారం! మానవ సంపద!

# 13. సంతోష ఘడియ

నిదుర నుండి మేల్కొనడం విశేషమే కాదు
మెలకువను సార్ధకం చేయడం! మహనీయం
నిన్న ఆగిన పనిని అందుకోవడమే
ఈ నాటి మొదటి పని! ఆ పైనే కొత్తది

సంకల్పానికి క్రియా రూపం తోనే జీవితం
స్వర్గం నరకం యుగళం కల్పనలో నిలిచేవి

క్షణాలు జ్వలిస్తాయి, ఎపుడో క్వాచిత్కంగా
ఇవి ఎప్పటికీ అలలుగనే ప్రవాహ రూపంలో
మనిషిలో పచ్చని పైరు పై ఆలోచన నింపేను
మనుసులో భాగ్యం విలువలపై బాంధవ్యం నిలిపేను

ఏదో ఒక రోజు ! దీర్ఘమైన ఆకలి బ్రతుకులో
దరిద్ర రూపం చేతిలో బంగరు బొమ్మ జారుతుంది
కొత్త అనుభవంలో ! తోచని సందిగ్ధావస్థలో
ఉన్న పాత పెట్టెలో అడుగు చేరుతుంది గుప్తంగా

పగలు నెరవేరని ఆశలు
రాత్రులు చుక్కలయి చూపుల్ని అలంకరించేనా?
నిదురలో కన్న కలలు రాత్రి
ఉదయం విప్పారిన పూలలో ఆకర్షించేనా?

జీవనం తమయిన బ్రతుకులో
యాత్ర! హ్లాదమైన కష్టమైనా స్మృతిలో
ఎప్పటికీ సుమ వన శోభను చూపేను
ప్రాణం పోయాక! ఉహా మాత్రం లోనే!

కుంపటిలో నిప్పు కణాలను పూల గుత్తిగా
అనుకొని ముందుకు పొరాడే శిశువును
తల్లి ! నిలుపుతుంది, ఇది స్వేచ్ఛకు భంగం కాదు
ప్రమాదాన్ని తొలగించే హృదయ స్పందనం
తత్కాలంలో విషమ ఘటన! పక్కకు నెట్టబడుతుంది
చకితంగా సంతోష ఘడియ ముందుకు వస్తుంది

## 14. ప్రజాస్వామ్య ఫలితం

చుస్తూ చూస్తూ ఉండగనే పూలు రాలతాయి
దీనితో చెట్టుకు సమాప్తి దశ రాదు
పునరుద్భవ శక్తి బ్రతుకును కాపాడుతుంది
ఇది సహజం! జీవ శక్తికి తార్కాణం

ఇసుక నుండి ఇనుము దాక తవ్వి తీసి
చెట్టు నుండి పూవు ఫలం కలప దాక
ఉపయోగంలో ప్రతి వస్తువు వినియోగంతో
విపణి వీథి చేరవచ్చు వ్యాపారం వెలగవచ్చు

కాలం గడవదనే చింత లేదెవరికీ
విపణి వీథులలో తిరిగేను మనో రూపాలు!
అవసరాలు మనిషిని తీరిక లేకుండా చేస్తాయి
సువర్ణ కవచంతో కవిత ప్రవేశిస్తుంది

లాభం లేని వ్యవహారంలో ఎవరైనా గుడ్‌బై!
కవి అయినా వ్యాపార సరణిలోనే విహరణం

లోపల కుంపటి మండుతూ ఉన్నా
సెగల తీగెలు గాలిలో సాగుతూ ఉన్నా
ముఖాన చిరు నవ్వుల మొలకలతో
చీకటి పొదల వలె! జీవితాలు!

తనలో "శాంతి" పదం కోసం పరుగులు
ఎక్కడి కయినా! వార్తా ప్రకటన సూచనతో

తన సమస్యలకు జవాబులు తనలో
ఉన్నవి తెలిసీ, మరచీ, పరుగులు తీసేరు
బయట ఉన్న దీప స్తంభం చేరేరు
పట్ట పగలు రాత్రి సన్నివేశం తలపించేరు

ప్రతి ఒక్కరి జీవితం సుగమ సుందరంగా
చిర మానవ సంస్కృతి చిహ్నంగా వెలగాలనే
సుఖ సంపదతో నిరాశ జయింబడాలనే
కలల తంత్రం నుండి ముక్తమయిన ప్రజాస్వామ్య ఫలితంలో

# 15. అందరూ ఒకటే !

మనుషులు అందరూ ఒకటే కానీ
ఒకరి మనసు మరొకరికి రహస్య పేటి
అసలు కీలకం మర్మం ఇదే!
ఇక్కడే ఉంది జీవితం! స్వతంత్రం

మార్పు వస్తుంది, ఎక్కడనో విసరుతుంది
ఊరు మారవచ్చు, ఉనికి వేరవచ్చు
దేని కయిన సిద్ధంగా పరివర్తనలో
మనిషి మనసు! బ్రతుకు బాటలో!

మనిషిలో పరచిన ఎడారితో పాటు
శ్రద్ధగ తీర్చిన పూల తోట కూడా
ఏకాంతానికి అంగుళం బాటుతో కోరిక
ఆకాశం విప్పారే విశాలతను కోరుతుంది

మనసులో ఆశా బింబం! తానొక
రవి గనో శశి గనో రూపొందాలని
పరిమితులలో ఎన్ని రంగులలోనో
ఆకర్షణ! లాగుతుంది ఎంత దూరమయినా

ఆకలిలో అగ్ని ! తనను మండిస్తుంది
కోపంలో అగ్ని! మరొకరిని దహిస్తుంది
ఊహకు తేజో రూపాన్ని ఈయవచ్చు
జనతకు వెలుగు దీపాన్ని చూపవచ్చు

కలలకూ మబ్బుకూ మితంలేదు
ఎప్పటివో ! ఎప్పటికీ కొత్తగనే!
మనిషి జీవ శక్తితో మానవ చలనంతో
ఆట బొమ్మ కాదు, శిలా ప్రతిమ కాదు

ప్రేమ ఎన్ని రంగులలోనో హృదిలో
రాగ భావ రేఖలతో చిత్రాలుగా
నీలి రంగు ముఖంతోను బయట పడుతుంది
విషాద భయ ముద్రలతో అగ్ని మయమవుతుంది

# 16. అదృష్ట విశేషం

జ్ఞాపకాలకు ప్రయత్న మక్కర లేదు
వాటి అంతట అవే స్మృతిలో కదలుతాయి
ఆట వస్తువుల వలె మనో వేది నలంకరిస్తాయి
సందర్భమొ! విరామమొ! ముందుకు తెస్తుంది

రాజ సింహాసనం అదృశ్యం కావచ్చు
నిరంకుశ గుణ మట్లాగే ఉంటుంది
ఇంకా నిశిత చతుర జాలంతో
లౌకిక రాజకీయ తంత్రుల అల్లికతో

రాత్రి వస్తుంది చీకట ముఖంతో
రవి పారిపోయాడన్న నీలి వార్త ప్రబలుతుంది
విమర్శ వెడలుతుంది తీవ్ర వాయు గతితో
సృజన హృదయ లయ తప్పేనని ఆక్రోశం

ఇది ఇష్ట పడే వారూ ఉన్నారు
నిరాకరించే వారూ ఉన్నారు
కష్టమైన రోజున తమ బ్రతకులు
వ్యర్థమైన వనుకునే వారూ ఉన్నారు

నిదురలో హాయిగా గడచే రాత్రి
మెలకువతో చిరాకు పడడం సహజం
తన నీడ కనబడ లేదని మరో దిగులు
మాయమయిందని మదిలో ఆరాటం!

ఏ రోజూ కొత్త పూవు రావాలని చెట్టులో
ఇది సహజంగా జరిగే పరిణామంలో భాగం
స్వేచ్ఛను బంధించేరా? ఎందుకు? ఎక్కడ?
జైలులో, నేర కారణంగా భద్రంగా
బయట ప్రతీకార హాని జరిగేననీ
మరో విధంగా ఆలోచన కవకాశం ఎంతో
ఎంత పెద్ద దయినా జలధికి, దాహం తీర్చేయోగం లేదు
ఎంత చిన్నదయినా చెలమకు ఇది ఒక అదృష్ట విశేషం!

## 17. అమృత బిందువు జారుతూ

విశాల విశ్వ వేదికపై కవిత
మనిషిలో కనిపించని మనస్విని మనీషిని చూపుతుంది
ఖేదంలో ఆదుకొనేను కష్టంలో తోడుగ నిలిచేను
భయంలో ధైర్యాన్ని స్తబ్దతలో చేతన నిలిపేను

ఒకచోట నిప్పుల ధానికయై చలి పోగొడుతుంది
ఒకచోట పదును ఖడ్గమై రక్షణగా నిలుస్తుంది
అనుభవ జగత్తులో ఎన్నో! కవితా నిలయంలో అన్ని
ఎవరి శబ్ద లోకం వారిది అయినా నాద భాగ్యం అందరిదీ

నిశ్శబ్దంలో శబ్ద మయం కవిత
వ్యక్తికి కర్తవ్యం బోధిస్తుంది
సమాజానికి బాధ్యత తెలుపుతుంది
నిజంపై హృదయంతో పయనం సాగిస్తుంది

కాలం తేలికగా గడవడం నుండి
బ్రతుకులు స్వేచ్ఛగా నడవడం దాక
సార్థకమై ప్రయోజన గమ్యం చేరే
పురోగమనంతో కవిత! స్వతంత్ర రూపం

కవికి కవిత జీవితాన ప్రాణ సమం
విడుదలయిన రచన విశ్వమయమవుతుంది
తరాలు గడుస్తూ అక్షర ప్రపంచం ఎప్పటికీ
అభినవ రూపంతో ఆకర్షిస్తుంది! మనోజ్ఞంగా

నడచిన కొద్దీ పయనం! తరలుతూ
గడచిన కొద్దీ వాయువు సాగుతూ
మనిషిలోని సజీవ స్వరాన్ని గాలి
లో నుండి బయటికి ప్రకటిస్తుంది ! పదంలో

భూమికి దగ్గరగా అనుభవం
నింగికి చేరువగా కల్పనలు
రెండిటి సమ్మేళనంతో కవిత!
మధ్య మధ్య అమృత బిందువు జారుతూ

భయ భావం వదలిన అస్తిత అమరీకృతమవుతుంది
మాట ఆట కాదు ! బొమ్మ కాదు! హృది స్పందన రూపం

# 18. ఒక కిరణం చాలు

ఉదయాలన్నీ ఒకే విధం ప్రభావం చూపవు
వెలుతురులో మనుషులందరూ! ఒకే రీతిలో బ్రతకరు
"మనుషులందరూ ఒకటే" మాట వినబడుతుంది
ప్రతి కథలో దేవత లున్నా, మనుషుల జీవిత చిత్రాలే

హేతు గుణ వివేచనతో నడుస్తుంది ఆధునికం
నిఖిల మానవీయ చేతనతో, రూపం సిద్ధిస్తూంది
ఎప్పటివో కథలయినా గాథలయినా
ఇప్పటికీ సారంలో భేదం లేదు, అవసరమే

చిన్నప్పుడు దేవులపల్లి కృష్ణ శాస్త్రికి జబ్బు చేస్తే
అది నయమయ్యేందుకు ఊళ్ళు తిరిగే
తల్లితో ఒక జ్యోతిష్కుని మాటలు ఆశామయమై
"సముద్రంలో విసరి వేసినా బ్రతికి బయటపడతాడు"
అనుభవంలో నిజమైంది, యాదృచ్ఛికం కావచ్చు
శుభ్రమైన మాటలో భవిత పరిమళ పుష్పమై

నింగిలోకి విసరి వేస్తే!
విమానమై ఎగరవచ్చు
తనతో పలువురి పయనం సాగవచ్చు
జలధి లోకి విసరి వేస్తే
తనతో కొందరి పయనం సాగవచ్చు
ఏ దిశనో విసరి వేస్తే
మేఘమై తరలవచ్చు
కరుణ జలంతో తాపం తీరవచ్చు

అలవోకగా వెడలిన మాటలో
భాగ్యంతో భవిత! పరచబడీ
జీవన రుచి సుందర కవిత స్వనించేను

ఒక అలచాలు! జలధి రుచి తెలిసేందుకు
ఒక కిరణం చాలు! చీకటిలో కనిపించేందుకు

# 19. సర్వ స్వతంత్రం

మా ఊరు దగ్గరలో జలధి తటంలేదు నదిలేదు
ఇవి లేకుండానే నిశ్చింతగా ఏండ్లు గడిచాయి
ఊరుకు నాలుగు దిశలలో చెరువులు
ప్రాణాలను కాపాడే ఆశా బంధువులు

ఇంటి ముందు చెట్ల పై పక్షుల కలరవాలు
ఎవరు ఇష్ట పడక పోయినా వినిపిస్తాయి
కాస్త దూరంలో నుండి రైలు కూత, వీధిలో ప్రజల సందడి
ఏకాంతానికి చోటులేదు, సమాజ కృతిలో శబ్దాలే

వీటిలో కావలసినవి ఏరుకొనే వీలులేదు
మనుషుల మాటలు అవిచ్ఛిన్న సూత్రంలో పూవులవలె
దీపావళి రాత్రి వేళ జరిగే పండుగ
దీపం అవసరం రాత్రి లోనే
వెలిగే పాత్ర విశేషం! దీపం
పగలైనా చీకటి! మనిషి మనసులో
వెలుగుల చిత్రాలతో సంపన్న మయిన రాత్రి
తత్కాల ప్రదర్శన శాలా రూపం పొందేను

ఎదురుగ నీడల బొమ్మలు
వెలుగుల రాకకు గుర్తుగా

చీకటి కొండల బరువులతో దీప కళికలు
భూ చక్రం విష్ణు చక్రం మతాబులు కాకరవత్తులు
మరొకటి మరొకటి వర్తమాన సమాజ ప్రతీకలు
మనుషులలో ఎన్ని తెలుగు రూపాలో ? అన్ని కాంతిలో

మనిషి మనిషి కొక సమాధానం వేరు వేరుగా
ఎవరో చెప్పాలని ఎవరో దయ చూపాలని
చీకటి పోయేందుకు అర్థించే రోజులు కావు
ఎవరి కర్తవ్యంలో వారు, బాధ్యతతో ఆధునికం

కవిత సర్వ సతంత్ర ప్రభావ ప్రపంచం
తమ హక్కులు తెలిసిన క్రియారూపం జనత

## 20. త్యాగంతో రాగంతో

భళ్ళున తెల్ల వారుతుంది, మెరపులా భేదం
రయ్యిన పొద్దు ఎక్కుతుంది, విజయ రేఖలాగ
ఆకలి సెగలతో కవిత ఎదురుగా
దారిన చెట్టుకు పండిన ఫలం
చాచిన చేతిలో పడాలనీ, పాంథులు
ఇది పూలతో పని లేని సందర్భం
అయినా బాగ్ నింపు కొని సాగాలని
మనిషిలో కోరిక! కవితలో వ్రేలాడుతూ

చెట్టు కొమ్మలతో భద్రమైన గూడు నుండి
రెక్కలపై ఎగిరి వచ్చే పక్షిలా కవిత!
పక్షిని కాదని మనిషికి పూర్ణత లేదు బ్రతుకులో
ప్రకృతి సహజ బంధంతో, ఇది ఎన్నిటికో ప్రతీక

ఇదొక కొత్త జగం, తత్త్వ సుందరం
కవితలో సంశ్లిష్టం, కళాత్మకం

అమాయకం నుండి చతురతకు అస్పష్టంగా
ఉన్న పొరలు దాటి పై పొరలకు ప్రాధాన్యం

భూమి పైకి రాగానే లోకంలో అన్నీ ఇదివరకటివే
గమ్యాలవే లక్ష్యాలవే! నైతిక పద సూచికలవే
తరం నుండి తరానికి జీవన గతిలో పరివర్తనం
కొత్త అవసరాలతో కొత్త అనుభవాలతో సమాజం

భాగ స్వామ్యంకై బయట పోటీ మనుషులలో
విపణిలో, దేనికయిన మూల్యం చెల్లించాలిసిందే

దార్శనిక స్పృహ లేనిది గొప్ప కవిత కాలేదు
అనుభవ సాంద్రత తోనే మంచి కవిత అవుతుంది
ఏ పని అయినా చివరకు రాలేదు నాలుగు డబ్బులు
చేతి నుండి జేబులోకి జేబు నుండి విపణిలోకి

త్యాగంతో గగనంలో చుక్కలయి మెరసేను
రాగంతో వర్తనలో ఉదారత వెలిగేను

# 21. నవతలో భాగ్యం

సాధారణ స్థాయిలోను ప్రతి మనిషిలో
శక్తి వర్తనంలో పరివర్తన పార్శ్వాలు
అతీత బిందువును స్పృశింప చేస్తుంది
వాస్తవానుభవానికి కట్టు బడే ఉంటుంది

చండ తాపం ఆక్రమిస్తే
మనసు మేఘ శకల మయ్యే యత్నం చేస్తుంది
వర్ష ధారలు ఆవహిస్తే పై నుండి
మనసు అనల రేఖ గీసే యత్నం చేస్తుంది

శశిర శీతం విసరి కొడితే
మనసు రశ్మి పటల ముప చూస్తుంది
తనలో స్పృహ సృజన స్ఫూర్తి నింపితే
మనసు తోడు కోరుతుంది ప్రియ భావనతో

బంధుమిత్ర ఆప్త ప్రియ రూపాలయి క్షణాలు
రసభావ స్థితులెన్నో ! అనుభవ రూపాలన్ని

అగ్ని పాట వినిపిస్తుంది సేతువులో
వర్ష ధార ప్రసంగిస్తుంది ఎండలలో
శిశిర ముఖం వెలుగుతుంది మంచులో
వసంత స్పర్శ అన్నిటినీ మరపిస్తుంది

మనసును సంపన్మయం చేసే ఉబలాటంలో
పేద ముఖానికి పూల గుచ్ఛం అర్పిస్తుంది

నేడును నిన్నటితో పోల్చి
మంచి చెడు లెక్కలు తీసి
నిన్నటి మంచినీ నేటి చెడునూ
బేరీజు వేయడం పరిపాటి చరిత్రలో

మనసులో దీనికి భిన్నంగా మెకానిజమ్
సమాజ ప్రగతికి మనోజ్ఞ రూపం కోసం!
కవితలో శిశిరం వసంత హృదయం పొందుతుంది
నవతలో భాగ్యం వికాస శక్తిని చూపతుంది

# 22. ఉదయంతో సమానం

ఎవరి కోటను వారు నిర్మించుకునే పనిలో
పూర్వం బలాన్ని శక్తిని ప్రదర్శించేరు
ఎవరి వ్యాపారం వారు విస్తరణం పనిలో
ఇపుడు! మసక మసక తెలివిని కనబరచేరు

పక్షి గూడు కట్టుకుంటుంది చతురంగా
మనిషి ఇల్లు కట్టు కునేను ఉపాయంగా
ఇరువురిలో నివాసాభిలాష భద్రతలో
బ్రతుకు సుఖంగా సాగాలని ఆశా పథంలో

ఉదయం సంతోష పడే సమయం
చీకటి తొలగిందని హృదిలో ధైర్యం
ఎన్ని పనులకో ఉపక్రమింప చేస్తుంది
తోటలో పూలెన్ని రకాలో దృష్టికి వస్తాయి

వినడానికి వెలుగుతో పని లేదు
చూడ్డానికి వెలుగుతోనే పని
చీకటిలోనూ సంగీతం వినవచ్చు
వెలుతురు లోనే మనుషుల పరిచయ భాగ్యం

చెట్టు కొమ్మకు సుతారంగా వేలాడే
మామిడి పండు అందినా అందక పోయినా
అది ముందుగ దృష్టికి కనిపించాలి కదా
కొమ్మపై కోకిల స్వరం కవికి వినిపిస్తుంది

మంచు అయినా ధూళి అయినా తొలగాలిసినవే
ఇది ఉదయ కిరణంతో పవనంతోనే సాధ్యం!

ప్రతి పండుగ సంతోష మిచ్చే సందర్భం
పండుగ ఎరగని సమాజం లేదు, ఉండదు!

ఉదయం లేని రోజు ఊహ కందనిదీ
రక్షణయే రాజ్యం! మొదటి కర్తవ్యం
రహస్యతంత్రం లేని సుందర హృదయ వశం
దీనిలో సమాన మొక కవితయే! సృజనలో

# 23. అస్తితలో సమాజ శక్తి

ఏ కవికీ తాను తన ప్రపంచం వదలి
వేరొక వస్తువుగా తోచాలని మారాలని ఉండదు
మేఘమొ జలధియొ తరువో ప్రవాహమొ మరొకటో
పూవుగనో విత్తుగనో అగ్నిగనో ప్రతిమ గనో ఏదయినా

అక్షర జగత్తులో తన విభుతకు
భంగం కోరదు, స్థానం మారదు
గాలికి తెలియని భాష లేదు
కవితను దూరం పయనింప జేస్తుంది

వ్యర్థంగా తలచదు ఏదీ, భారమనీ వదలదు
అందరివీ అన్నిటనూ గ్రహిస్తుంది నార్మొహమోటంగా

శ్రీకృష్ణునకు పింఛం వేణువులా
శ్రీరామునికి ధనుస్సు బాణంలా
కవిని గుర్తు పట్టేది కవిత తోనే
మనుషులతో పరిచయాలు దీనితోనే

ఇది దాటరాని వాటిని దాటిస్తుంది
ఈత రాకపోయినా పడవలా వంతెనలా
నీరు తాకకుండా గట్టుకు చేరుస్తుంది
దీపంలా వస్తువు తత్త్వం చూపిస్తుంది

ఊరు లెన్ని మారినా వీధు లెన్ని తిరిగినా
ఎన్ని పనులు చేసినా అన్నీ మానవ సంబంధంతో
దివితో కన్న భువితో అనుక్షణం అనుబంధంతో
అస్తిత ఆధారంగా సమాజ శక్తిని పొందేను

శ్రీనాధుడయినా అభాగ్యులయినా
సంఘంలో ఉన్న స్థాయి భేదం లేకుండా
ఆస్వాద గుణం ఒకటే
ఆహ్లాద విధం ఒకటే
అంటక తప్పని మట్టి వదలి కవితలో
భూమితో సృజన బంధుత ఒకటే ! మెరసేను

# 24. గమ్యం చేర్చేనసే

దేని పైనొ ఒక దానిపై ఎవరి పైనొ ఒకరిపై
జీవన భ్రమణంలో నమ్మకం! కేంద్ర స్థానం వహిస్తుంది
ఇది శిథిల మవడమంటే చలనం ఆగడమే
ఇది లుప్త మవడమంటే చలనం లేనట్లే

శక్యం కాదను కున్నవి ఎన్నిటినో
సాధించిన ఘనత కూడ దీనిదే
ఎన్ని దూర దూరాలో నడిపించింది
చరిత్రలో కొత్త పుటలు చేర జేసింది

దీనితో ధ్వంసమయిన రాజ్యాలూ ఉన్నాయి
ఆపదలకు గురి అయిన ప్రజలూ ఉన్నారు

మతం రాజకీయం మరొకటి! వ్యక్తి నుండి
సమాజ భాగాల నల్లుకొన్న కోరిక తీగెకు
బంగరు పూలు పూయడం! ఒక విజయం
ఇది పరంపరగా సాగడమొక విచిత్రం

మానసిక క్షేత్రంలో అపూర్వమైన అనుభవం
అందల మెక్కిస్తుంది, దించుతుంది, కూడా
కొన్ని యాదృచ్ఛికాలు దీనికి పేరు తేవచ్చు
ఇది నెరవేరితే కాలాన్ని జయించినట్లే ననీ!

చివరకు జరిగేది జరుగుతుందనుకునే
నమ్మకం నుండి దారులెన్నో! ఏర్పడేను
ఎవరికీ తెలియని మర్మవేదొ! తనకు తెలినట్లు ఉంటుంది
మనిషి కేవలం శరీర మాత్రం కాదని ప్రబోధిస్తుంది

అనుభవానికి కొత్త వ్యాఖ్యను జోడిస్తుంది
విజయంలో కుసుమించిన చెట్టు నడచినట్లు ఉంటుంది

నమ్మకానికి చెరొక వైపు నుండి సూర్య చంద్రులు
తన చర్యను వీక్షిస్తున్నట్లు ఉంటుంది
చీకటి కొండల మధ్య నుండి వెలుగు దారిలా
గమ్యం చేర్చేనసే నమ్మకం! మనిషిలో బలంగా

# 25. ఫిఫ్టీ - ఫిఫ్టీ

నమ్మకం మరచిన అమూల్యాన్ని జ్ఞాపకం చేస్తుంది
కోరిక చివరన విప్పారగ బోయే పుష్పంతో మొదలవుతుంది
ఇది వ్యసనం కాదు దురభ్యాసం కానే కాదు
పలాయనం కాదు వాయిదా వేయడం కాదు

సంకల్పానికి బలమైన తొడుగు వర్ధకం
సాహసానికి పురికొల్పేను, ప్రగతికి అనుకూల పరచేను
అగ్ని గుండంలో సులభంగా అడుగులు వేయిస్తుంది
జలధిని చెంబులో బంధింప సిద్ధ పడుతుంది

గగనాన్ని చుట్టి బుజాన వహించాలని చూస్తుంది
నమ్మకానికిది అది అని లేదు అన్నిటికీ చెందింది

తన వెనక నున్న విశ్వాస బలంతో
మరో అడుగుతో తన పని వశమయ్యేననే
ధీమా! మనసు చెదర నీయదు
ఉడుం పట్టు దారి తప్ప నీయదు

ఇది గారడి కాదు, గాఢమైన నిబద్ధత తప్ప!
శక్తులు సమీకరించి మునుముందుకు కపోవడమే!
ఆటంకం ఉన్నచోట తన సిగ్నేచర్ తో
చొచ్చుకొని పోవడమే, తాను చేసే పని!
మరణ భయం లేదు, అయోమయం అసలు లేదు
అటో ఇటో! మలుపులలో దీని పాత్ర అమోఘం!

గోడకు తగిలించిన చిత్రాలలో ఒకటయి నిలవడమే
ఎత్తిన ఖడ్గం క్రింది నుండి దూసుక పోవడమే
ప్రేలే బాంబు పొగల సందుల నుండి దూకడమే
కలల్ని వెనకనే వదలి! వాస్తవాన్ని అందుకోవడమే

ఆకాశం తెలుపయినా ఎరుపయినా నీలమయినా
మంచు బిందువుల స్థానంలో బాష్ప కణాలు జారేను

పూర్వం నమ్మిన దైవం స్థానంలో ! ఇప్పుడు మనిషి!
అందుకే మనిషిపై నమ్మకానికి చాన్స్! ఫిఫ్టీ ఫిఫ్టీ!

# 26. సమస్యలెప్పటివే

సందేహం ఉన్న చోట ! ఏది ఏమయినా కావచ్చు
గోడపై నీడ నిలిచిన కత్తిలా తోచవచ్చు
అదే ఏ ఓడో, మృత్యు వాహనమో అనిపించవచ్చు
నమ్మకం లేని చోట అంతా తారుమారు కావచ్చు

వెదకితే లభించేవి కావు కలలు
వాటి అంతట అవే వస్తాయి వెళిపోతాయి
రమ్మని పిలిస్తే రావు, వద్దని పలికితే వెళిపోవు
వీటి రాక పోకల ఎన్నిక మనో రూపానిదే!

శిఖరారోహణ మంత సులభం కాదు
ఒంటరి తనంలో మునిగి తేలాలిసి ఉంటుంది
ఆకాశం అందబోయే మహనీయంలా ఉంటుంది
భూమి దూర మయినా ఇంకా ఆకర్షణ కలిగే ఉంది

నమ్మకం చెడి చూచేది సమర పథం
అనుమానం పెరిగి పొందేది కలహ పదం

ఇంతవరకు ప్రశ్నలెన్నిటికో పూర్తి జవాబులు లేవు
పేదరికం నుండి పీడన దాకా అన్నీ అట్లాగే ఉన్నాయి
అమానుషం నుండి బీభత్స ఘటనల వరకూ
శిలాతత్త్వం నుండి కంటక గుణాల వరకూ

వ్యక్తికి స్వేచ్ఛలో స్వతంత్ర రూపం ఇష్టం బ్రతుకులో
కవికి మాత్రం అశాంతి లోకం ప్రియం కాదు
దార్శనికా లెన్ని మారు మ్రోగినా సమస్యల మూలాలవే!
పరిష్కార సూచనలు సాక్షికాలు! అసంపూర్ణాలు
కొన్ని కొన్ని సందర్భాలకు తగినవి మాత్రమే!
ఆసనం చేరేముందు ! సాల భంజికల ప్రశ్నలు! తప్పవు

శిఖరం చేరే మధ్యలో తార సిల్లే
నిలిచిన శిలలను అనునయించ వలసి ఉంటుంది
గాలికి ఊగే  చెట్లను పలకరించవలసి ఉంటుంది
కిందికి దిగే నదులను అభినందించవలసి ఉంటుంది
కనబడని మనిషి హృదిని స్పృశించవలసి ఉంటుంది

# 27. అందరికీ ప్రతినిధి

ఆ వినబడే స్వరం ఎవరిది? కవిది
అది ? స్వేచ్ఛా లహరులపై పయనించే కవిత
పై పైకి చెలగే మంటలతో
అడుగున జల తల మూలంతో

మెలకువ ఒకటే సరిపోదు సమాజంలో
చేతనతో క్రియా రూప మవసరం
ఇది నిరంతరం జరిగే ప్రక్రియ
విరామ దశల కిచట స్థానం లేదు

శిలలపై శాసనాలు ప్రభుతను చూపినవి
అనుభవాన జీవితాలు అడవితనం వీడ లేదు
ముని మాపు పొదల నుండి మృగాల సంచారం
క్రూరత కటు విషమతలకు ఆకరమై

చుట్టు పరిసరాలు కళా వాతావరణంతో
ఇంకా స్వప్నంలో మనుషులు! మోడులవలె
చివురుల కై వేచి వేచి నిదురకు వాలేరు
ఇక సమస్య ఉండదని రాజ్యం ధీమా

విలయ గుణంతో కలహ పదం వీథికెక్కుతూంది
నిప్పంటిన మానవ సంస్కృతి దృశ్యం చూడక తప్పనిదీ

లోయలో జల సూత్రం వలె నైతికం ఉండీ లేనట్లుగా
ప్రతి రుతువు తన ముద్రను నిలుపుతుంది వసంతం తప్ప!
ఇది భౌతికంతో పాటు మనో మయం
మార్పులో మానసికం తోనే ఇది సాధ్యం!

మానవ వికాస ప్రకాశ రూపాలు గురించి
ప్రసంగాల సంపుటాలు! అద్దాల అల్మెరాలో
షోకేస్‌లో కళా సుందరతలతో మానవ రూపం
నేను నీవు అందరికీ ప్రపంచ ప్రతినిధియై

# 28. టర్నింగ్ పాయింట్

ఉదయ రేఖ కావచ్చు, నిశీథి పదం కావచ్చు
ఇటు నుండి అటు అటు నుండి ఇటు, దిశలు వేరు
టర్నింగ్ పాయింట్‌లో సాంధ్య కవిత! స్వేచ్ఛా పథంలో
పాతవి తో కొత్తవి నవ పరిచయ గంధంతో

తిరిగే కాల చక్ర భ్రమణం వేరు
కదలే జీవన దశ రూపం వేరు

హత్య వెనక ఆత్మహత్య వెనక వాస్తవ మూలం
మూట విప్పిన నిప్పుల్లా ధగ ధగ లాడుతుంది
ముందుగ గుర్తించలేని ప్రజలలో ఆశ్చర్యం
దిశలకు వేలాడుతూ బాధను తలపించేను

ఉపాయ మెరగని అపాయం హఠాత్తుగా
అత్యవసర సందర్భాన్ని ముందుకు తోస్తుంది

ఒత్తిడి తేలిక అయ్యే సానుభూతి వాక్యం
సాంధ్యవేళ కవితకు ఆలంబన మవుతూంది
బ్రతుకులో టర్నింగ్ పాయింట్ ఎపుడో విశేషమైంది
చూపుకు అడ్డంగా నీటి బరువుతో మేఘం! కదలుతుంది

ఇసుక ఎడారి ఎదురు కావచ్చు, బీడు పొలం తోట
ఏదయినా అన్నిటినీ వహిస్తుంది కవిత! సంతోషంగా
బ్రతుకు భూమిని వదలదు, గుడ్ బై చెప్పదు
ఇది కవితకు టర్నింగ్ పాయింట్ చోటు మారుతుంది

పూర్తి స్వేచ్ఛలో బాధ్యతకు ఎల్లలు లేవు
స్వయం నియతమైంది పయనం; కవితా రూపం

ఇది సాంధ్య కవిత! స్వేచ్ఛా సంకల్ప భవం
బిందువుతో మార్పుకు మలుపు తిరుగు తుంది
విజయం కై ఆరాటంతో పాటుగ ఆపై
కర్తవ్యం ! అగ్ని పరీక్షకు గురి చేస్తుంది

రోజూ సమయానికి దయ చేసే ఉదయం
ఎంత ప్రాచీనమో అంత ఆధునిక స్వరం
అంతా మంచే జరగాలని కవి ఆకాంక్ష
జరిగేదేదో ! ఏ బ్రతుకున కది మితం స్వతంత్రం

స్వేచ్ఛా కవిత్వం - **106 - A**

# అక్షరంలో స్వేచ్ఛ

మాదిరాజు రంగారావు



**2020**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**NO. 106 - A**

**SWECCHA KAVITHVAM**

Free - Verse

**AKSHARMALO SWECCHA**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

*Presented to*
*my  Son*
*Dr. M. Santhosh Kumar*
*with blessings*
*on hisBirthday*

# పీఠిక

ఇది తెలుగు కవిత్వంలో చిన్ని చిన్న కవితల కాలం. రకరకాల పేర్లతో విస్తృతిని తగ్గించడం, సంక్షిప్తతకు అవకాశం కలిగించడం, శబ్దానికి దీర్ఘ తరమైన ఆలోచనకు అనుభవ గుణానికి ప్రాధాన్యం, కవి ఉద్దేశం.

"అక్షరంలో స్వేచ్ఛ", ఈ కృతి స్వేచ్ఛా కవిత్వంలో ఒక్కొక్క కవిత ఇరవై – ఇరవై రెండు పంక్తులలో చిన్న కవితల సంకలనం. ముక్తక పద్ధతిలో లఘుకృతి క్రింద పేర్కొనే అవకాశం ఉంది. సృజనలో కాల్పనికం వర్ణనంతో భావ రూపాలేకాక, మన చుట్టూ అనుభవంలోని సామాజిక రాజకీయ తాత్త్విక భూమికలతో విషయ విస్తృతి దృష్టికి వస్తుంది. వివిధ క్షేత్రాలకు సంబంధించిన విషయాల మేళనంతో కళాకృతిని పొందడం సృజనకు కొత్తదనాన్ని ఇస్తూంది. వీటికి తోడు ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతతోనూ కలిసిన రూపం వినూతనను కలిగిస్తూంది.

ఇది వర్తమాన సమాజ ప్రతిఫలన కృతి. "స్వేచ్ఛా కవిత్వం" శీర్షిక క్రింది ఈ కృతి, ఆ పరంపరలో ప్రకటితమయింది. 106 వది. ఆధునిక కవిత్వానికి బలం చేకూరుస్తూంది. దార్శనికత వేరు, కళాకృతి వేరు. ఈ రెండిటి చేక్కని కలయిక చేత సృజనకు ఉత్తమత శ్రేష్ఠత ప్రత్యేకత ఏర్పడుతూంది. మరో కోణంలో సాహిత్య విమర్శకుల బాధ్యతను పెంచుతూంది. కవిత్వలో వస్తు పరిధుల్నీ విషయ ప్రసక్తినీ విశాల తరమొనరిస్తూంది. ఇదొక ప్రయత్నం. ఎప్పటి వలెనే భావరూపాలు ప్రతీకలు చైతన్య స్రవంతి మనస్తత్త్వ రేఖలతో సంపన్నమయింది సాహిత్య సహృదయులకు స్వాగతం.

ఈ కృతిలో చివరి రెండు కవితలు 1) కశ్మీర్ హృదయం 2) ఒంటరి అబల – వర్తమాన సంక్షుబ్ద సమాజంలోని స్థితి చిత్రణం కలవి. స్పందన గుణంతో దార్శనిక ఛాయలతో సంపన్నమైనాయి.

**– మాదిరాజు రంగారావు**

# సహాయానం

## 1. ఉద్యమ హృదయం

అక్షర స్వేచ్ఛలో ఉద్యమ హృదయం
నడుస్తూన్న చరిత్రలో కొత్త పుటను సృజించేను
వచ్చే ఉదయ రూపం మారుతుంది, కోణం వేరై
జీవన చలన దృశ్యంలో భాగమై నవ్యమై

భాష దేశం ప్రాంతం విశ్వాసం ఆదర్శం
కేంద్రంగా అభిమానం స్వేచ్ఛ స్వతంత్రం భావనలో
గాఢత తీవ్రత వేగంతో ఉద్యమమవుతుంది
దీనికి కాలావధి లేదు, ఎప్పుడైనా అవతరించవచ్చు
పరివర్తన శీలంతో ప్రగతి పథంలో
సమాజ చలనంలో భాగమవుతుంది చరిత్రలో

ప్రేమ శాంతి రెక్కలపై జనహిత లక్ష్యంతో
మనిషిలో చేతనను ఉన్ముఖం చేస్తుంది
నిరసన ధ్వనులతో దిశలు మారుమ్రోగవచ్చు
ఘర్షణ వర్తనలో సమయం గడవచ్చు
సాహస మతితో ప్రజముందుకు నడవచ్చు
పవనంలా అక్షర పంక్తులు స్వేచ్ఛగ సాగేను
స్వతంత్ర భావనతో బంధన నుండి
విమోచనం కోరేను, వికాస పథం పట్టేను

విద్య విజ్ఞానం అనుభవ సంపద కలిసిన
సుందర నేపథ్యం బ్రతుక్కి వరమవుతుంది

*

# 2.

ఫుట్ పాత్‌పై నడచే మనిషితో
రోడ్డుపై పరుగెత్తే వాహనం
గమ్యం ! జీవన సాధనలో భాగం
ఎప్పటికీ ఉండేదీ, బ్రతుకులు తీర్చేను

మాటలో పనిలో స్పందన గుణంతో
అక్షరం అగ్నిలా ఉత్తేజం నింపుతుంది
ఉద్యమ గతికి వేగం ఈయవచ్చు
మానుష శక్తిని సార్థం చేయవచ్చు

ఆరోహణలో సమాజ యాత్రకు ప్రేరేపిస్తుంది
చిన్న మాట నుండి మహా వాక్యం దాకా
అక్షరం ! మనిషి భావ ప్రపంచానికి బింబమవుతుంది
జీవన దిశలను ఆకాశంలా వహిస్తుంది

రవి కిరణం బంధన మెరగదు
బయటి ప్రపంచంలో హద్దులు చూపిస్తుంది
ప్రతి హృదిని ఆవహించే గుణంతో
భూమిని స్పృశించే ఆరాటంతో దిగుతూంది

లిపిలో అక్షరం ఉద్యమ వికాస సూచియై
నిశా దీపమై నిరంతరం మనిషి కుపకరిస్తుంది
నాల్కపై నర్తిస్తుంది శబ్ద మయమై సార్థకమై
సంస్కృతి సంపదలో భాగమై అభిమానం పెంచుతుంది

☼

# 3.

సేనలానో నీలి మబ్బులానో అగ్ని శిఖల వలెనో
ఉద్యమం కదలుతుంది ఒక్కొక్క సందర్భంలో

రెక్కలు విప్పిన దేశ దేశాల స్వాతంత్ర్యంతో
స్వేచ్ఛలో చరిత్రతో మానవ ప్రగతిని శాసిస్తుంది
అక్షరం సమాజ చరిత్రను ప్రతిఫలిస్తుంది
ఉద్యమంతో ఏకమై కార్యాన్వయం పొందుతుంది

పచ్చని పంటలా పరచుకొని బ్రతుకులో
అక్షరం ఏ సమస్యను గాలిలో వదలదు
వివేచనతో ఎదుర్కొని విజయంకై చరిస్తుంది
నిధిలా అక్షయంగా సంపదయై నిలుస్తుంది

అక్షరాల ఇటుకలతో రచనా నిర్మాణం
అభాగ్యులకు అనాధలకు ఆశ్రయమవుతుంది
ఇది మనిషి రక్షణ కవచమై
మనసుకు కోరని భద్రత నిస్తుంది
జ్ఞాన పదానికీ నాగరకానికీ మధ్య
పొడిగింపబడే వంతెనయై ఉపకరిస్తుంది

ఈ దేశం ఆదేశం ప్రజ మతం ప్రాంతం జీవన స్థితి
భేదం లేకుండా ఉద్యమం ప్రగతికి బంధువు
ఇది శాంతి చరణాలపై పయనించవచ్చు
ఇది అనల శిఖల రెక్కలపై చోటు పొందవచ్చు

*

# 4.

సామాజిక రాజకీయ ప్రస్థానంలో విజయంకై
సహజీవన గతిలోనో సంఘర్షణ దశలోనో సాగవచ్చు
మందగించిన కాలం తేజో రూపం పొందేను
జనహిత చింతన ప్రధానమై కదలిస్తుంది

చుట్టు చూపులో పూల సుందరతకు బదులు
మనుషుల వికాస ముఖాలు! ఎదురు పడేను
నిదుర నుండి మేల్కొన్న ఉదయ సమయం
స్వర్ణ మయమైన చేతన స్పర్శను తలపిస్తుంది

జన గణ భావనతో ఉద్యమ లక్ష్యం
ఆర్తిలో ఉపశమన స్పర్శ నిస్తుంది
గాలిలో శబ్దాన్ని ఉత్సాహ గీతంగా
వినిపిస్తుంది మనిషి మనిషికి అందిస్తుంది

ఉద్యమ చరిత్ర ఎచట నయినా ఉదాత్తమే
మానుష చర్యకు ఉజ్వల రూపం ఇచ్చేను

ఏ దేశ స్వాతంత్ర్యమయినా తెలంగాణ విమోచన మయినా
రాష్ట్రాల అవతరణ మయినా జీవన మత ప్రస్థానాలయినా
దేనికది సంస్కరణం ప్రదర్శిస్తుంది
స్వతంత్ర శక్తిని చాటుతుంది

ప్రతి పదంలో ఉద్యమం జాడలు వదలబడీ
జీవన రూపానికి పరివర్తన దశ నిస్తుంది
ఉత్సాహ లహరులపై ఉద్యమ ప్రస్థానం
ప్రజా స్వామ్య హృదయంతో సర్వజన ప్రయోజకం

*

# 5.

అక్షర గమనంలో స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలోనే సాధ్యం
సంస్కరణ పథంలోనో పరివర్తన వాదంలోనో
స్థానిక సమస్యల పరిష్కార సాధనలోనో
మనుషుల బహుళ క్రియా శీల వ్యక్తిత్వం చూపేను

మాటలు అక్షర నిలయంలో
చెట్టుపై పక్షుల వలె వసిస్తాయి
ప్రవాహం ఒడ్డున అలలు వలె
ఊహలు ! విరామంలో ఒదుగుతాయి

దినమంతా సమస్యల పజేళ్ళతో నిండింది
కవితలో! సముద్ర సంరంభాన్ని పొందుతుంది
సమాధానాలు దొరకనివి గతంలో చేరతాయి
విజయం సాధించినవి బ్రతుకును ఆదుకునేను

కలహమూ స్నేహమా తీర దృశ్యాలతో జీవితాలు
ఒక దాని కన్న ఒకటి మీరే ఉత్సాహంతో కాలం
భూమిలో విత్తునుండి మొక్క ఉద్గమించి
సుందర జీవన రూపాన్ని ప్రకటిస్తుంది

భూమిపై మట్టికి ఏ భేషజమూ ఉండదు
సృజన దృశ్యం వహిస్తుంది, విలయ రూపం భరిస్తుంది
ఎడారినీ మైదానాన్ని గిరినీ నదినీ రాయినీ చెట్టునూ
సమ న్యాయంతో అస్తితలకు రూపాల్ని ఇస్తుంది

⁂

# 6.

బరువులు తలచని బాధ్యతతో
తనలో నిధులను అందరికీ పంచుతుంది
బహు సుగమంగా గడచే కాలం
ఏది న్యాయం? ఏది ధర్మం! దగ్గర
జీవితంలో హఠాత్తుగా క్షణం ఆగుతుంది
మనిషిలో ఆలోచనకు వివేచన కవకాశంతో

సుఖంగా నడిపించేది బాధలో తిప్పుతుంది
ఎవరి చేతులో శుభమైనవిగా కనిపిస్తాయి

ఏ ఉదయం శుభమయింది?
అంటే? మనుషుల అనుభవంలో
సత్కృతులకు కారణమైన దుష్కృతులకు నిలయమైన
ప్రయోజన దృష్టితోనే లోకంలో

శిథిలాలలో అణగిన పూర్వ స్మృతుల్ని ఉద్యమం
భూమి నుండి ఖనిజాల్లా బయటికి తీస్తుంది
హృదయం వెనక నుండి పనిచేసే
నిశిత హేతుమతి ! కొత్త రూప మందించేను

కవి దృష్టిలో జగత్తు వాస్తవానుభవ మయం
మనిషి సమాజం వ్యక్తి విశ్వం నలు దిశలతో
ఆదర్శ శిఖరాలను స్పృశిస్తుంది
యధార్థ తలాల్ని చూపిస్తుంది

☼

# 7.

ఏడు రంగుల ఇంద్ర ధనస్సు రూపంలా
చూడని దృశ్యాన్ని చూపిస్తుంది అక్షరం

సముద్ర తీరాన అలలు తాకుతూ నడచే
అనుభవం ఉద్యమంలో మనిషి సాహస యానం
ఉన్న స్థానం నుండి ప్రపంచాన్ని స్పృశించాలని
వసంత లిప్తలలో గడపాలని మనిషిలో కోరిక!

కవిలో అక్షరంలో ప్రవహించే సృజన రూపం
సమాజ జీవితాన్ని సస్యమయం చేసేను
ప్రతి కవితలో ఎక్కడో ఒకచోట వెనక నుండి
కొత్త మనిషి జాడలు ఎవరికైన కనిపిస్తాయి

అక్షరం ఉద్యమాన్ని విశ్వమయం చేస్తుంది
సంఘంలో అనుభవ సంపదను భద్ర పరుస్తుంది

అక్షరంలో ఉద్యమ స్వేచ్ఛలో ప్రభావం
గాలి నీరు అగ్నిని తలపించవచ్చు
వసంత స్పర్శ కై తహ తహలాడుతుంది
మార్పుకు వేదికయై దారి చూపుతుంది
ఈ సమయంలో కాలం, కాలక్షేపం కాదు
ఇది మంచు బిందువుల ముత్యాల హారం కాదు
ఒక పనికై ఉత్తేజ పరచే
సూర్య రశ్మి! హృదయ మయం

*

# 8.

స్పందన కెవరూ దారి చూపనక్కరలేదు
చర్యకు ఎవరి ఆశ్రయంతో పనిలేదు
ఇది స్వతంత్రం! స్వవశం! సమాజ పరం
మనిషి ప్రతిభ ప్రసారానికి దారులు చూపుతుంది

నాగలి చాలులో బయట పడిన
పెట్టెలో అమూల్యం జీవన భాగ్యం
శిశువు కావచ్చు, జీవన భవితతో
సంపద కావచ్చు సమాజ యోజనతో,
అక్షరంలో ఎన్నిటికో ప్రతీకమై
కవితకు మనోజ్ఞమైన ఆకర్షణ నిస్తుంది

కాలం ఎవరి వశం కాదు
పిడికిలిలో నీరులా జారి పోతుంది
ఎప్పుడు ఎంత అవసరమో అంత
పొందుతూ జీవితాలు గడచేను

దీనికి నిప్పంటించి,
చిత్ర దృశ్యం ఆనందించే వారూ ఉన్నారు
ఎగర బోయే రెక్కల్ని
నరికే సాహస కార్యం! ఉద్యమానికి విఘాతం

ఆకాశానికి నిచ్చెన వేసే అభిలాష కన్నా
నేలపై సుగమమైన సుందర పథానికి
మానుష యత్న మవసరం! నిరంతరం
ఇది ఉద్యమ విజయానికి సంకేతం, అవసరం

*

# 9.

వ్యక్తి విలువలతో సంఘం సంస్కృతి తేజం పొందేను
కవులకు లోకం కవితామయం, జీవన రుచి పూర్ణం
మనుషుల తృప్తి రేఖలకు హద్దులు మారతాయి
సమాజ బంధంతో ఏర్పడే అస్తిత, వ్యక్తి నిష్ఠ మవుతుంది

కవితలో కొత్త ఉదయం కొత్త స్పందనతో
ఒకరొకరిలో వేరు రూపం ఏర్పడేను ఇష్టంగా
పర్వత శిఖరం నుండి జారే జలపాతం
విశాల హృదయంతో సరిస్తుంది భూమిపై మంచి ఫలితాలతో

ఉదయం సూర్యుని దిశ గురించి చర్చలతో పనిలేదు
తెలిసిన దయినా చూచే దాకా ఆరాటం సహజం
రవి కిరణం కంటికి మోదం, హృదికి హ్లాదం
చీకటి రాత్రులు ఆలోచనలో, స్వంత ప్రపంచం

తన జీవన నిర్మాణం కృషిలో అహరహం
శిఖరంపై చూపుతో మనిషి! మబ్బుల్ని మీరే యత్నంలో
తన ప్రణాళిక ననుసరించి ఏ బ్రతుకూ సాగదు
మధ్యలో అనుకోని మలుపులతో మార్పులతో మారుతుంది

చెవి పక్క నుండి దూసుక పోయే పిచుక
మనసులో కోరికలను రెపరెపలాడించేను
బయట నున్న ప్రతి వస్తువు! దూరమైనా దగ్గరయినా
జీవన గమనంలో తన కోస మన్నట్లే ! ఉంటుంది

*

## 10.

వివేక పాత్ర ప్రవేశంతో బాల్యం నుండి
బయట మనిషి ఆనవాలు కనబడగానే
జ్ఞాపక పటంపై ముద్రలు! ఒక టొకటీ
స్మృతి నిలయం చేరేను! ప్రభావం నెరపేను

జీవన పథంలో దారులు కొత్తవి చూపేను
అక్షర రూపంలో కవితకు ఆకరం దొరికేను

బయట మాట వినబడతూనే
ఊహల అల్లికతో భావ రూపం ఏర్పడేను
మబ్బు జాడ కనబడగానే
కరుణ హృదయం! స్పందన పొందేను

ఇంటి ముందు ఎదిగిన పచ్చని చెట్టు
ఆశా విజయానికి సంకేతంగా నిలిచేను

బయట కోలాహల జన గణ దృశ్యం
జీవన శక్తికి భౌతిక రూపం కూర్చేను

బంధు గణం పరిచయాలు మిత్ర బృందం
పయనంలో సమాజ వాహన రూపం అయ్యేను

అనుభవ చిత్రాలు ఊహల బొమ్మలు పనిలో యంత్రాలు
ఎన్నిటితోనో మనిషిలో కనిపించని మరో లోకం
ఈ అనుభవ ముద్రలు ! భద్ర పరచేను అక్షరం
కవితయై స్మృతి పథాన్ని వస్తుమయం చేసేను

*

# 11.

మాట అక్షరాల సంకలన రూపం, ప్రయోజనంతో
మనిషి కనులలో జలద శకలం కదలించవచ్చు
మనసులో పూలు విప్ప జేయవచ్చు
ఊహలో వెచ్చని స్పృహను సరింప జేయవచ్చు
మౌనం తెరచి మాటల బొమ్మలు వదలవచ్చు
ఏకాంతానికి సెలవు పలికి జనగణాన్ని వరించవచ్చు
చివురు పరిచయాలతో అనుబంధాలను పెంచి
పచ్చని సమూహ శోభ నవతరింపజేయవచ్చు

చిరంగా ఈ అనుభవ స్మృతి బీజం మనసులో
వివిధ స్థాయిల్లో ప్రభావాన్ని నెరపవచ్చు

ఎంత ఉదార హృదయమున్నా మనిషి
ప్రవాహ రూపం పొందలేదు
ఎంత మృదు స్వభావమున్నా! మనసు
పరిమళ సుమ శోభ పొందలేదు
ఎన్ని రంగుల కిరణ ప్రభావమున్నా
వ్యక్తిత్వం ఆదర్శానికి బహు దూరంలోనే

ఎంత ఎత్తు గుణ రాశి ప్రకటితమయినా
ఎక్కడో దోష రేఖతోనో మలిన మంటో జీవితం!
హద్దులు దాటిన స్వేచ్ఛా రూపం కవితలోనే
ఊహ నుండి మాటలో! అక్షర నవ యోగంతో

☀

## 12.

క్షణాల్ని పూవుల్లా వికసింపజేస్తూ పోతుంది
క్షణాల్ని ముత్యాల్లా దొరలిస్తూ పోతుంది
ఇలా ఎన్నిటినో తలపించే నవ చేతనలో
స్వేచ్ఛలో అక్షరం కవితయై అమూల్యమవుతూంది

స్నేహం వైరం సహనం కలహం హింస ప్రేమ
సృజన సమయం తప్పు! కవిలోనూ ప్రవర్తనలో
అహంకార శిఖరంతో ఎత్తిన తలతో కదలేను
తత్కాల ప్రయోజనోద్దేశంతో అర్థం మారుతుంది

పైన మేఘం కనిపిస్తే దాని నీడలో
అవనిపై దూరం నడవాలని పించవచ్చు
పైన సూర్యుడు ఉదయిస్తే కిరణ పథంలో
బ్రతుకులో బాగా వెలగాలని తోచవచ్చు

ఏదేని జరిగేది కొంత వరకే
కాలం ఒకే విధంగా ఉండని మాట నిజం
జీవన దశా చక్రం తిరిగే మాట కూడా వాస్తవం
క్షణాలు పరుగెత్తి స్తాయి ! ఎటుపోయేది మనిషి ఇచ్ఛతో

మనిషితో మనిషి నడవడం లోనే అనుభవ రమణీయం
దైన్యంలో హైన్యంలో భాగ్యంలో ఓటమిలో విజయంలో
వికాస చరిత్రతో విశాల భూమిపై మనిషి మనిషిలో
కొత్త జగం అవతరణం! నవ సమాజ రూపం చూపేను

*

## 13.

ప్రేమ పూర్ణ హృదయం పారి జాత పుష్పం
అనుభవంలో మేఘం దీని సంకేతం కాలం
కాని కాలంలోను ప్రతి మనసును
చకితంగా వసంత స్పృహకు గురి చేస్తుంది

ఏ వర్ణ మయినా కళాకృతిని పొందుతుంది
ఆ క్షణం సృష్టి మొదటి సంకల్పం తలపిస్తుంది
రవి రశ్మిలో ఉదయం దూరం నుండి శిల
అందంగా అమర్చిన పూల రాశిలా అనిపిస్తుంది

రాత్రి వేళలో పండు వెన్నెలలో చెట్టు
ప్రేమ మూర్తి, ఆప్త రూపం కనిపిస్తుంది

లౌకికం వ్యవహారం తాత్త్వికం విషయాలన్నీ
ప్రేమ చుట్టూ తిరిగే బొమ్మల వలె నయ్యేను
పెదవులపై మెరసే చిరునవ్వుతో మొదలై
ప్రతి మాట కవితో కళా మయ మయ్యేను

మనిషిలో పూర్ణత ఏదో ఒక పనిలో సమాప్తితోనే
ఏదో ఒక దశలో కనిపించదు, దీనికి చివర మాట లేదు

ప్రతి మనిషిలో వికాసం జరుగుతూ పోతుంది
ఎక్కడికక్కడ శిఖర భావంతో, ఇది నిరంతర ప్రక్రియ
శిఖర పంక్తికి మానవత, తరగని సంపద
జడం నుండి చేతన, సుమించేది దీనితోనే

☼

# 14.

తనకూ చెందని దేమున్నది! ఈ ప్రపంచంలో
అన్నీ తన అవసర వస్తువులే! సూక్ష్మ భావనలో
మనసు విశ్వమయమవుతుంది; మనుషులలో
తన అస్తిత విస్తృతిలో, తన ఉన్నతి యత్నంలో

మండే ఎండల్లో ప్రకృతి ప్రాణి మబ్బులకై ఎదురు చూచేను
ఆశా బంధంతో జిజీవిషలో బ్రతుకులు గడుస్తాయి
ఎంతటి కష్టంలోనూ ఆత్మహత్యలు జరగవు
స్థలం మారవచ్చు, అవసరాల పొదుపు జరగవచ్చు

అభిమానం అనల జ్వాల అయితే, ప్రమాదం
ఇది ప్రకాశ ప్రసారాలతోనే సార్థకం
సమయ సమయం! విభేదాలు ఘర్షణలు
గెలుపునో ఓటమినో చవి చూడక తప్పదు

బ్రతుకులో పయనంలో అనుభవ పరంపరలో
శిలా శ్రేణులు ప్రవాహ రేఖలు! తటస్థపడతాయి
బ్రతుకులో ప్రతీకలైన రెండిటినీ దాటుతూ
సాగేను మనిషి! మనవతా గుణం, తన స్వంతం

తన వ్యక్తిత్వం నుండి చేతనతో నిలుపుతుంది
మనిషిని చరిత్రలో వికాస రూపంగా మలుస్తుంది
ఇది యంత్రం కాదు, శ్రమ సాధన రూపం
సహన శాంతి ప్రేమ సమన్వయ సమర్పకం

☀

# 15.

పుట్టుకలో మనిషి సమాజంలో ఒకరయ్యేను
సమాజ పరమై వశమై గడుస్తూ అధికత కోరేను
వ్యక్తి – సమాజం రెండూ విడదీయరాని బంధంతో
మనిషి జీవితానికి రెండు చక్రాలుగ పనిచేసేను

విధ్వంసం వినాశనం – విలయం కోరరెవరూ?
అయినా అవి పై బడతాయి! సందు చేసుకోనీ
రాజ్యం ప్రజ పత్రికలు మనో రీతులు అన్నీ
మార్పుకు దారులు తీసేను, తీవ్ర నిశిత గతులలో

నిరంతరం మార్పులతో ఉండే సమాజ రూపం
వేగ మందు కోవడం దీని విశేషం!
జరుగుతూన్న స్థితి గతుల కిపుడు
అంతర్జాలం టవర్ సాక్షిగా నిలిచేను

ఎవరి ఇష్టం వారిది, ఎవరి వాదం వారిది
ఎవరి వార్తలు వారు, అన్నీ కలిసిన సంక్షోభంలో
అపుడుపుడు! వీక్షించే అంతరంగం స్పందిస్తుంది
కప్పబడిన నీలి మబ్బులతో, అదృశ్యమవుతుంది

స్వచ్ఛమైన గాలికీ శుభ్రమైన నీరుకూ తహతహతో
కలుషిత వాతావరణంలో జీవితాలు! మునిగి తేలుతూ
ధూళి క్రమ్మి వర్తమాన దృశ్యం సరిగా కనిపించడం లేదు
నీతి తప్పిన మానవం, పయనంలో గుర్తు పట్టరాకుండా ఉంది

*

## 16.

ఎపుడయినా ఎచటయినా అవసరంలో అందంగా
నప్పుతుంది ప్రేమ! శిశువు నుండి వృద్ధు వరకు
ఎపుడయినా ఎచటయినా సుఖదంగా అవశ్యంగా
చెల్లుతుంది శాంతి! ఉత్తమ పరిష్కార సాధనమయి

మెలకువలో మరచింది కలలో కనిపించవచ్చు
స్మృతులెన్నో తీర్చబడీ జ్ఞాపక నిలయం మనస్సు
జననం మరణం ఎవరి అనుమతితో జరిగేవి కావు
ఎక్కడికక్కడ ఆజ్ఞలు, నిబంధనలు, హద్దులు, గోడలు!

ఆకాశంలో నాటిన పూల మొక్కల వలె చుక్కలు
పూల అందంతో గంధంతో కళామయమై రాత్రులు!
భయం తొలగి హ్లాదంతో కాలం గడుస్తుంది
బ్రతుకు పట్ల అభిరుచి నమ్మకం పెంచుతుంది మనిషిలో

ప్రతి వ్యక్తికి బ్రతుకులో ఏదో ఒక బరువు మెడలో వేలాడుతూ
ఒకటి పోతే మరొకటి, ఉన్నదానిని పొందుతూ,
పేద మొదలు పలు పనులలో ఉన్న శ్రమ జీవులకు
ఇది చేతితో తీసేసేది కాదు నిరాశలో ఊగుతూ ఉంటుంది

ఏ రోజూ హింసకు దారి తీసే ప్రదర్శనలు వీధులలో
ఏ రోజూ అలజడిలో మునిగి తేలే కాలం! ఎదురుగా
మట్టిపై మొక్క నుండి యంత్రంతో పనిదాక
అసలు మనిషిని మరపించే ప్రతిమలు! మట్టి బొమ్మలు!

*

# 17.

ఏవేవో మాటలు ! పలు ధ్వనుల సందడిలో
ఏదైనా చక్కని స్వర తరంగం చెవి సోకాలనిపిస్తుంది
తత్కాలంలో మనసు! కోరికతో తళతళలాడుతుంది
మలిన రహితమయిన స్థితికి ఎదురు చూస్తుంది

బాణాల్లా ప్రశ్నలు దూయడం సులభం
పుష్పంలా జవాబుతో పూయడం కష్టం
సమస్య చక్రంపై భ్రమణం! ఆర్థిక యోజన పైనే
పరిష్కార సాధనలో బాధ్యత వ్యక్తితో సమాజానిదీ

ఆనందం వ్యక్తిగతం, సౌభాగ్యం సామాజికం
మనసుకు చెదలు పట్టకుండా, తుప్పు పట్టకుండా
నలువైపుల నుండి సూక్తులు! బోధలు! మధ్య మధ్య
సందేశాలు ! వికాస పరిణామ క్రమంలో భాగాలు

కణ కణ లాడే నిప్పుల కొలిమిలో
ఎర్రగ కాల్చి తీసి, దాగలిపై సుత్తె దెబ్బలతో
నాగలి కర్రుగానో బండి పట్టాగనో కత్తిగానో
పనికి వచ్చే సాధనం! తీర్చబడ వచ్చు ఇనుప ముక్క!

బ్రతుకులో కఠిన స్థితుల ఒత్తిడిలో మనిషి
మంచి చెడు చర్యలతో ఏ రూపమయిన ఎత్తవచ్చు
కవి సృజనలో సాధనంగా మారని దేదీ లేదు
అక్షరంలో చోటు పొందని వస్తువు లేదు స్వేచ్ఛలో

*

## 18.

కొత్త వెలుగు బాటకై సమాజంలో నిరీక్షణం
తిరుగుబాటు కొత్త కాదు, మహ దాశయ గతిలో
పాత భావ నిలయాల పునాదులు కదలవచ్చు
భరించ రాని స్తబ్ధతలో చైతన్యం దూసుక రావచ్చు

తల ఎత్తి ముందు నడవడమొకటే కాదు
ఎద ఉదార ధునియై వెంట సరించాలి కూడ
నైతిక ముద్రలతో వాస్తవ తలంపై బ్రతకాలి కూడ
అక్షరంలో స్వేచ్ఛ, విలువలతో వెలుగు బాట పట్టాలి

మారణ చర్యలతో ఇరువైపుల నుండి అనుకోని
క్లిష్టమైన స్థితుల నెదుర్కోవలసి రావచ్చు
అడ్డు గోడలు తొలగడం, పాత కంచెలు తొలగడం
అనివార్యం! దీనికి క్షోభ పడే అవసరం లేదు, సహజం

క్రింది స్థాయిలో ఎంతటి నిరుపేద అయినా
కనీస ప్రమాణంలో బ్రతుకులు! గడవాలి, సమాజంలో
కాల గమనంలో భయ పెట్టే నీడలు తొలగాలి
బయటి నుండి భయ చర్యల కవకాశం ఉండరాదు

ఒక సందర్భంలో భయ పెట్టిన నీడలు
మరో అవసరంలో విశ్రాంతికి నిలయం కావచ్చు
పచ్చని చెట్ల ఆకుల చల్లదనంతో గాలి
సుఖ స్పర్శలో మంచి కవితను వినిపించవచ్చు

*

# 19.

ఒంటరిగా ఉన్న మనిషి ఆపదలో ముందుకు దూకేను
వినిపించే శబ్దంలో ఆర్త స్వరం గుర్తించేను
ఆపరాని వేగంలో చర్యకు ఉపక్రమించేను
కరుణతో ఉదార వ్యక్తిత్వం, ధైర్య కవచ మందించేను

సాధారణ పౌరులతో వీధిలో ఉద్యమ పంక్తి
భయ గుహలను కాంతి మయం చేసేను
ఆలోచనతో పయనం, విజయ భావనతో అనుభవం
సమాజ రూపానికి జయాభిలాషతో సుందర కళనిస్తుంది

కష్టాల్ని లెక్క చేయని గుణం దృఢ తరమవుతుంది
కఠిన శిలల సందు నుండి పచ్చని మొక్క ఎదుగుతుంది
దాగే కన్నా బయట పడే తత్త్వంతో వెలుతురు
దుర్గతిలో మ్రగ్గే పీడనలో నలిగే వారిని చూపుతుంది

ప్రవాహంలో తరలే మనిషికి చేయి అందిస్తుంది! రక్షణలో
కష్టాల్ని అధిగమించే యుక్తితో, మనిషి చరిత్రను పాలించేను
బాధల గాధల బ్రతుకులలో దైవం ప్రవేశించడం సహజం
ఎన్ని యుగాలు గడచినా ఎన్ని తరాలు మారినా
అతీతం! స్థానం భద్రంగా, మనుషుల ఆలోచనలో
రాతి గోడల మధ్య నుండి స్వేచ్ఛ కోరే వ్యక్తిలో మరీ

సమాజ వనంలో పూల బదులు ముళ్ళ నెవరు కోరతారు?
ఆదర్శం రూపం మాత్రం మానవ యత్నంలో విజయంతోనే

☼

# 20. అక్షర సంకల్పం

లాభ నష్టాల పట్టికతో ఇది వ్యాపారం కాదు అక్షర వ్యవహారం
మధ్యలో అనూహ్యాలు ఆశ్చర్య ఘటనలు
బరువును వదలేసో తగ్గించుకొనో సాగే ప్రశ్న లేదు
గడచే కొద్దీ మరింత బాధ్యత పెరుగుతుంది

సుగమంగా బ్రతికే అభిలాష! ప్రాణికి సహజం
దేహం ప్రాణానికి నిలయం! మతి ప్రభతో మనిషి దీన్ని తీర్చేను
ఉద్యమ మెంత మహనీయమయినా ఘర్షణలో
చివరకు బ్రతుకులు శమన శాంతి కాంతినే కోరేను

ఒకరి మనసు నీరులేని చీకటి లోతు బావిలా
చేదే తాడు బొక్కెనతో ఎవరి పిపాసార్తి తీరదు
జీవ మున్న గడ్డి పోచ ఏ మూలనైన బ్రతుకుతుంది
రాళ్ళ సందు ! నేల పగులు! సమాధి స్థలం ఏ భేదం లేదు

చరిత్ర ఎవరినీ విస్మరించదు పేదనూ హీనుణ్ణీ దీనుణ్ణీ
ఎవరి చోటు వారికి భద్రంగా ఉంటుంది
పక్కనున్న వాణ్ణి మరచినా, సమాజం మిన్న కున్నా
సృజన స్వేచ్ఛలో అక్షరం అందరినీ ఆదరిస్తుంది

చీకటిలో తమ అడుగుల వెలుగు జాడలు నిలవాలనీ
మనిషిలో కోరిక! తమ జీవన కథలతో మనోజగం!
ఇతరులకు తెలియాలని తహతహ! లాడుతుంది
కవిత! అక్షర స్వేచ్ఛలో అన్నిటికి నిలయరూపం!

☀

# 21.

సృజలో ప్రతి మాట హృదిని స్పృశిస్తుంది
కోష్ణత ఆర్ద్రత గంధం ఆప్తతలను వహిస్తుంది
విత్తులో దాగిన తరువు గురించి చింతన జరగవచ్చు
ప్రకటిత మయ్యే చివురు పూవు ఫలం పైనే అభిలాష

చెట్టు త్యాగాన్ని భావింప చేసేను
మనిషి భోగాన్ని భావింప చేసేను
రెండూ చెరొక వైపు నుండి బ్రతుకులో
దార్శనికం అనుభవం పార్శ్వాలై నిలిచేను

జన వాహన ధ్వనుల సన్నివేశంలో
సుస్వర తరంగాలు స్పృశించాలని ఉంటుంది
బ్రతుకంటేనే అనుమానం సందేహం అనిశ్చయం
ముప్పిరిగొని, నిరీక్షణలో ఆకాశమయ రూపం

పరిమళ రూపంతో అలరించిన కుసుమం
కొన్ని రోజులలో వాడి రాలుతుందని తెలుసు!
అయినా ఆకర్షణ తగ్గదు, అలంకార ప్రియత వదలదు
చేతిలోని వర్తమాన భాగ్య సంపద నెవరు వదలుతారు!

మానవతకు యాంత్రికం కలిసిన ఆధునికంలో
క్షణాల్ని సుఖమయం చేసే ఆలోచనకే ప్రాధాన్యం!
లౌకిక వాస్తవమూ తాత్త్విక దర్శనమూ కలిసిన భావనలో
సంఘానికి నవ సంస్కృతి సిద్ధించడమే ! కవి సంకల్పం

*

# 22.

అద్దాల అల్మెరాలో హాలులో బయటి నుండి మనసు కదలేలా
విజ్ఞాన విశేష మహా రచనలు అందంగా అమర్చబడీ
భద్రంగా పుటలలో విషయం మనసుల కెక్కిన సాక్ష్యం అవసరం
పేర్లు అందరికీ తెలిసినవే! ప్రాచీనం మొదలు ఆధునికం దాకా

కాస్తో కూస్తో ఒంట బట్టిన వారు, ఉన్న పనులు ఒత్తిడిలో
ఇది తెలియని వారివలె తమ తమ వర్తనలు వదలేరు
శూన్యమైన క్షితిజంలా మనో నిలయం మౌనంగా
ఎప్పటికప్పుడు జ్ఞాన సంపద చేరుతుంది అల్మెరాలో

విశాలమైన ఆకాశం చుట్టూ దిశలలో చూపులతో
విశ్వమయ భావనతో మానవం! సుందర రూపంలో
అనుభవంలో మాత్రం చిన్న చెలమలా బహు సంకుచితం
పయనం ధ్వజస్తంభం చుట్టూ భ్రమణ మయం

తనకు ఎక్కడ లౌకిక ప్రయోజన ముంటే అక్కడికి చేరేరు
నైతిక దార్శనిక స్పృహ లేని వ్యవహార యుతం మేధతో
పన్నిన వ్యూహంలో అందంగా తీర్చిన స్థితి గతులు
అనుభవంలో గ్రీష్మంలో చిన్ని చెరువుల్లా బ్రతుకులు

పుస్తకాల అల్మెరాకు దీటయిన స్థాయిలో మరో అల్మెరా
జంతువుల మృగాలు వివిధ భంగిమల్లో అమర్చిన బొమ్మలు
మనిషి భౌతికంగా బ్రతుకు తెరువులో నిమగ్నమై
అల్మెరాలో వస్తువు ఎన్నిక వేరయ్యేను, చూచే దృష్టి ప్రాధాన్యం మారేను

✳

## 23.

మనిషి భౌతికంగా ఎప్పటి వలెనే పరంపరలో
బ్రతుకు తెరువు తెలివి పయనం సాగించేను

నాటకంలో ఒక పాత్ర అనివార్యంగా
మరో పాత్రతో అనుబంధం కళామయమై

బాగోగుల ముడుల అల్లికతో సమాజం
మనిషిపై మనిషి ప్రభావం! అనితరంగా
అవిదితంగా అనిశ్చితంగా ఆశ్చర్యంగా వ్యతిరేకంగా
బహు విధాలుగ పయనింపజేసేను సంక్షోభంలో

ఎడారిలో గాలి కెగసే ఇసుక విసరుతో
దారిన ధూళితో పొగలతో సెగలతో నిండిన
సంక్షుబ్ధ సమాజం! ఇపుడు మరీ విచిత్ర దశలో
నీతి న్యాయం గురించి అల్మైరాలో భద్రంగా

అందమయిన గెట్‌అప్‌తో ప్రదర్శన యోగ్యంగా
ఆకర్షణతో నిలిచే జన ప్రియ వాలకంతో
హృదయం నుండి రాగం మానసికం సామాజికం భౌతికం
పెదవులపై మాట! ఐకాంతికం భౌతికం పరిమితం

జాతుల సంగమంతో సంకలన రూపం సమాజం
భౌగోళిక నిర్దిష్టత హద్దులు అనుబంధంతో దేశం
అల్మైరాలో గ్రంథ రాశి! అభిమానానికి పట్టం కడుతుంది
మరో అల్మైరా దేశ సంస్కృతిలో భాగమై గర్వ శిఖరమవుతుంది

*

# 24.

ఆలోచనలో ఒకరు అనుభవంలో మరొకరు
చేసే పనిలో ఇంకొకరు చింతనలో వేరొకరు
వేరు వేరు పాత్రలలో ఎందరో ఒక మనిషిలో
సిద్ధమైన స్క్రిప్టు ననుసరించి జరగదు జీవితం

బయట ఎన్ని మోడల్సో, ఆదర్శాలుగ నిలిచినవి
వీటికి భిన్నమైన స్వతంత్రమైన రూపం పొందేను
జీవితేచ్ఛ ప్రసారం! మొదటి నుండి చివరి దాక
సాగుతూనే ఉంటుంది నిరంతరం! ఒక క్షణం ఆగదు

ఎవరి బ్రతుకులోను కాలం శూన్యమైన పటం కాదు
ఆశల బిందువుల నుండి రేఖలతో చిత్రమయం
పాత్ర పోషణలో తన వంతు బాధ్యత తప్పనిదీ
ఇది క్రమంగా సమాజ పరంపరలో భాగమయ్యేను

సృజన ప్రతిభచే తన కవితలో కవి అక్షర ప్రభువు!
స్వార్థంలో తన అస్తిత ముడుచుకోవడం దౌర్భాగ్యం
రచనా విరామ దశలో పలు వేషాలను ధరించేరు
రాజకీయ జాడలలోనో వ్యాపార శైలిలోనో గడిపేరు

నిన్నటి కోరిక! ఈ రోజు పాతబడినదవుతుంది
కొత్తది సిద్ధంగా, ఇది చరిత్రలో అక్షరమై నిలవాలని
స్వేచ్ఛలో సాగే కవి పయనం మూల్యాంకనం మాత్రం
అన్నిటికీ సాక్షియైన కాలంతోనే తుది నిర్ణయం

☼

# 25.

సమాజ ప్రక్రియలో కవిత! ఒక భాగం! ఏ కాలమైనా
హృదయాన్ని లాగే జీవన దృశ్యాలతో ప్రతిఫలిస్తుంది
రేకులు విరిసిన పద్మంలా సమాజ బంధాలెన్ని విధాలో
అందం గంధంతో ప్రయోజనం ప్రభావితం చేసేను

శిల్ప సంపదతో అక్షరం, మానుష స్పర్శతో అక్షరం
కిరణ పుంజంతో అక్షరం, రసధునితో అక్షరం
కవితకు ఆకృతినిస్తాయి భవితకు దారి చూపుతాయి
లేంది! రచన కుమ్మరి సారెపై కుండలా శూన్యాకృతి వహించేను

దీనుల కన్నులలో నిలిచిన కన్నీరును బయటికి చూపుతుంది
బాష్ప కణంలో మెరసే అనల స్పర్శను గుర్తిస్తుంది
మట్టి పొరలలో అణగి మొలకెత్తే అవకాశం దొరకని
నిరీక్షణలో గడిపే విత్తుకు సహాయకర మవుతుంది

గురజాడ ప్రగతి బాటతో భవితను పొడిగిస్తుంది
విశ్వనాథ సంస్కృతీ బింబంతో వెలుగుల నాదరిస్తుంది
అనుకున్నవి జరగక అనుకోనివి జరుగుతూ పోయేను
వర్తమాన కథలో సమాజం బీభత్స ముద్రలు వదలేను

మానవ వికాస శీల సుందరతలు చెదరి పోయి
మనిషిలో మృగతత్త్వం జంతుగుణం పైకి చిమ్ముతూంది
అమృత రాగం బదులు మరణ మృదంగం వినిపిస్తూంది
ఇది! కవితలో సమాజం దృశ్యం అప్రియమైన ఆధునికం!

*

## 26.

నిలిచేందుకు అడుగులు రెండు, ఉండేందుకు అడుగులు పది
చాలు ననుకునే తాత్విక భాషలో బ్రతుకు తీరు పొసగదు
వాస్తవానుభవంలో సర్వం సహా పై పెరిగే ఆశలతో
సముద్ర తటం వరకు నడకలో అడుగులు సాగేను

మాట లెన్ని రంగుల లోనో, చర్యలన్ని అనుభవాలలో
పైకి కనపడేవి వేరు, మనసుకు తోచేవి వేరు
ఒకటి బయట చూపులో మరొకటి వివిధ కళలో
పచ్చని ఆకులతో మోదం, ఎండిన ఆకులతో ఖేదం

యదార్థానికీ కళకూ మధ్య హద్దులు మారేను
పయనంలో ముందు అడ్డుగా అపుడపుడూ కాలం
ఆటంకంగా జలనిధి కావచ్చు మహా నది కావచ్చు
అరచేతిలో స్వర్గాన్ని దింపలేదు ఏ కవిత!

సాహిత్యం సంగీతం నాట్యంతో పాటుగ కవితకు
మౌలిక రూపం! సజీవమైన వాస్తవ సమాజం
బ్రతుకులో మాట పాట ఆటకు జన్మ స్థానమయి
వికాస సంస్కృతి రుచిలో అక్షరం మొక భద్ర నిలయం

సంప్రదాయ పథం విప్లవ వాదం మిలనంతో సమాజం
వివిధ స్థితులలో సానుకూల అననుకూల మిశ్రమ సంకేతాలతో
హెచ్చు తగ్గుదలతో పౌరుల్ని క్రాస్ రోడ్పై నిలిపేను
నైతికత నిబద్ధత జనమతం తోనే విజయం అంచులు తాకేది

*

# 27.

శీలానికీ దోషానికీ మధ్య ఎడం చెరగి పోతూంది
కాలక్షేపంలో విపరీత కృత్యాలతో ఉత్సాహోత్సవం
ఆటవిక సమాజ స్మృతులు పైకి చిమ్ముతూంది
ఉపయోగపడే ఆధునిక సాధనాలు వ్యధామయమవుతున్నాయి

అలలు ఎగసి దూకుతూ స్వేచ్ఛలో నిరంతరం
చెలియలి కట్టని ఛేదించే యత్నం! యుగాలుగా
గతమయినా వర్తమాన మయినా మానుష ధర్మం ఒకటే
మానవతా రాగ మొకటే! స్పందనలో ప్రేమ కరుణ ఒకటే

విధాన రీతులు మారవచ్చు, గమ్యం వేరు కావచ్చు
చెట్ల కొమ్మలు కత్తిరించి అలంకార శోభ చూపవచ్చు
కొండ శిఖలు తొలగించి సమతను పాటించలేరు
కాలం చెల్లిన పీఠాలు ఆశ్రయాల నుండి తొలగాలిసిందే

స్వపక్షంపై పూల రేకులు చల్ల బడుతూ
పర పక్షంపై నిప్పు రవ్వలు విసర బడుతూ
తనకు స్వేచ్ఛతో ఇతరులకు బంధనలు
జన మత పాలనలో! ఈనాటి రాజకీయం

ఒకరి స్వేచ్ఛ మరొకరికి భయావహం కాకూడదు
ఒకరి హక్కు మరొకరికి బాధమయం అవకూడదు
ప్రశ్నించే అవకాశం ప్రజా స్వామ్యంలో అవసర వాస్తవం
సమస్య పరిష్కారం బిగిసి, పోరాటం బాట పట్ట వచ్చు

*

# 28.

ఎంతటి విశాల మతి అయినా తన తోటకు
చుట్టు ముళ్ళ కంచె వేయక తప్పదు
ఎంతటి స్వేచ్ఛా వాది అయినా తన ఇంటికి
లోన బయట గోడలు నిలపక తప్పదు

మౌనంగా వచ్చే రాత్రి, నిశ్శబ్దంగా వెళ్ళి పోతుంది
సందడిగా గడచిన పగలు, విరాగంగా కదలిపోతుంది
ఇవి జీవిత గమనంలో సంకేతాలుగ నిలిచేను
కష్టం సుఖం కలిసిన జీవన కళలతోనే మానవం

ప్రేమలో కరుణలో గుండె తడితో కవి
కవితలో అపూర్వ వ్యక్తిత్వం మొలిపించేను
గుండె కఠిన మయితే శిల్ప కళను హత్తేను
గుండె మృదువు అయితే, కుసుమ యశసు నింపేను

సమాజానికి మనిషి జవాబుదారి అనుబంధాలతో
పరివర్తన ప్రక్రియ పరిణామ దశలలో భాగం
ఎప్పటికప్పుడు చెట్టు నుండి పండులా చేతిలో జారదు
మట్టి పాతదే, ఉభయ సంధ్యలు పాతవి! సమాజ దృశ్యం కొత్తది

కులం మతం దేశం భేదం ఎరగదు మానవం
ఇది జీవితాన్ని పాలించే ప్రధాన శక్తులలో ఒకటి
మలుపులతో జీవన గమనం గ్రాఫ్ మార్చేను
విలువల సంస్కృతితోనే, మనోజగం సౌందర్యం విభవం

*

# 29. కశ్మీర్ హృదయం

భరత భూమి తలకు చుట్టిన పూలదండ
సంతూర్ తీగెలపై స్వర ధునుల కళామయం
సుమ గంధంతో ఫల రుచులతో హ్లాదకరం
హిమ శిఖరాలతో లోయలతో కాలి బాటలతో
ఆధునికతకు ఎడంగా విశ్వాసాలకు దగ్గరగా
అపుడపుడూ ఉగ్రవాద బీభత్స చర్యలతో

ఎచటలో ఏ మూలనుండో ప్రేలిన బుల్లెట్ దూసి
నిప్పు రవ్వ లెగసి పరిసరాల్ని భయభ్రాంతం చేసేను
హఠాత్తుగా మారణ దృశ్యం! ఎదుట అవతరించేను
అంతలో శాంతం! యాత్రా జీవన సుగమతతో
ముసుగులో వేళ్ళపై లెక్క పెట్ట దగిన సంఖ్యలో
రహస్య చారులు ప్రజలను ఆవర్తంలో తిప్పేరు

ఎప్పటినుండో పాలకులకు వినతులు ఎప్పటివో
గాలిలో తిరిగి తిరిగి రాసులుగా మారేను
హిమ గిరులకు తోడుగా! మానుష వ్యధ చిహ్నంగా
ఎప్పటికీ ఎవరి నుండి జవాబు లేదు, అభయంలేదు
శాంతి వార్త మాత్రం! తరు గిరులపై నదుల అలలపై
దయ చేస్తుంది! జన జీవన భాగ్యాన్ని సూచిస్తుంది

అదృశ్య సంచారంలో ఒకరిద్దరు సూత్రధారులు
విషాద ఘటనలకు వ్యూహ రచనలో శిక్షితులు నిపుణులు
అలజడిని సృజించే ఏకైక జీవిత లక్ష్యంతో
జీవన దర్పణ నిలయంపై రాళ్ళు విసిరి గాయపరచేరు
రోజులు క్యాలెండర్‌లో తేదీల మెట్లపై సుతారంగా
బ్రతుకులు! ఒయారంగా ఈ ప్రాంతం సంస్కృతి గతిలో

తరం తరువాత తరం కొత్త స్వరం కోరుతుంది
జనత ఉత్సుకతతో నిరీక్షణలో గడపేను

# 30.

హిమ జల కళతో యాత్రికులకు స్వాగతమిచ్చేను
ప్రకృతి మధ్య అవే బ్రతుకులు! వికాస మెరగని బొమ్మల వలె
తరాలుగా అదే నకాషి పని నగిషీ కళ సంపదతో
యాత్రికుల సేవలో అల్లిక వృత్తిలో వీడని పేదరికం బంధుతతో
పూలతో పండ్లతో వసంత స్పర్శతో ఎప్పటికీ తళతళలాడేను
జీవన భాగ్య దశలో గడపే జనత మధ్య తూటాలు దూసేను

అపుడపుడు హఠాత్తుగా ఊడి పడిన కర్ఫ్యూ నీడలో
విసరిన అగ్ని కణాలు గుప్త విరోధాన్ని ప్రకటించేను
ప్రకృతి వరకు పరిమితమై సంతోషం గంతులేస్తుంది
పొగలతో సెగలతో ఆపదలో ఉన్న స్థితిని సూచించేను
సామాన్యుల బ్రతుకులో దీని ప్రభావం! శూన్యాన్ని చుదుతూంది
ఆకాశం దిగినట్లు ! వీధులలో నిర్మానుష్యం పహారా బలగాలు

ప్రకృతిలో ఏరులు వాగులు చెరువులు చెలమలు
దూకే అగ్ని శిఖల బారి నుండి ప్రజలను కాపాడేను
ఈ వేళలో మనిషి నుండి మనిషి ఆశించే వరమొకటే
సానుభూతి వాక్యం కన్న, సుగమ జీవితానికి స్వాగతం
ఉదయం బయటికి కదలిన మనిషి రాత్రికి ఇల్లు చేరే
నమ్మకం వమ్ము కాకూడదనే, ధైర్యం రాణించాలనే!

కొత్త రోజు కొత్త పుటతో జీవన లిపి అక్షర జగత్తులో
సుందరమైన కవిత! వినాలని వినిపించాలని కోరిక!
అహంకార విస్ఫోటంలో విద్వేషం చిమ్ముతూ
ఈ స్వర్గ ఖండాన్ని నిశ్శబ్ద సమాధిగ మార్చేరా?
కొందరిలో ఇంకా ఈ కల పని చేస్తూనే ఉంది
వాస్తవాను భవంలో జీవన భాగ్యానికి నడుం బిగించే దెవరు?

ఒక సందర్భంలో హేతువు పని చేయదు, ఉన్న స్థితిలో
ఒక సందర్భంలో హేతువు తప్పని సరి అవుతుంది

# 31.

విరిసిన ఇంద్ర ధనుసు బదులు క్షితిజంలో నిండుగా
తెలుపు పసుపు బూది ఎరుపు కలయిక అనల తోరణం
దరిద్ర రేఖ నుండి బ్రతుకును బాధా దృశ్యానికి చేరుస్తోంది
కటు స్వనం బదులు కలస్వరం వెడలేనా? వినిపంచేనా?
పైకి శాంతి ముద్రలో ఈ సమయం! గంభీరంగా
లోన అల్లిక నగిషీ కళలతో కాశ్మీర్ సంస్కృతి!

మానవ చరిత్రలో ప్రతి పోరాటంలో రణంలో
ముక్కలయి చెదరిపోయేది ! సామాన్యుల భాగ్యరేఖలే
ఉగ్రవాద మయినా వాద విధాలయినా ఉద్యమాలయినా
ప్రజల పట్ల అసహనం శత్రుత హింస అనుచితం హేయం
రేపు ఇచట పాట! నిరాటంకంగా సుఖకరమవుతుందనే
రేపు ఇచట పూలు! నిస్సంకోచంగా కనువిందు చేస్తాయనే

అపుడపుడు భటుల బూట్ల లయ శబ్దం తప్ప
జన సమూహాల సందడి వీధులలో కరువైపోతూంది
చీకటిలో వెన్నెల వలె కష్టంలో హ్లాద స్పర్శ అవసరం
చీకటి వల నుండి వెలుతురు హరిణం బయటపడేననే
లల్లాదేవి జీవన సార వాగ్విభవం మూగవోయిందా?
వివిధ మత వాదాల ఉదాత్త చిత్రం! ధూళి సోకిందా?

గాయాలు మారినా స్మృతులను ఎప్పటికీ బయటికి తీసే
ఘటనలు పునరావృతం కాకూడదనే! అందరి అభిమతం
ఎదపై స్నేహ హస్తం నిలిపే ఉదురులపై కోరిక
ఏదో ఒక దిశ నుండి పెద్ద ఆప్త వాక్య మందేనని ఆశ!
ఏదో మతానికీ వాదానికీ కట్టుపడి ఉండవచ్చు కానీ
అది మేలు చేసే పనిలో మానవతను మరవకూడదు

హేతువుతో వివేకం కలిసి, తెలియని తీరాలను
చూపుతాయి, సమస్యకు పరిష్కారం చూపుతుంది

# 32.

ఉదార చరిత విశ్వమయం క్రియాత్మకం
మానవ ధర్మానికి పీఠం మనిషిలో ప్రేమ

అలజడిలో గూడు ఛిన్నమై దగ్ధమై
మరో గూడు కోసం పక్షులు! ఎగురుతూ
మానవ – జీవిత దృశ్యానికి సమాంతరంగా
ఇపుడు వేడి వాతావరణంలో ఈ చల్లని ప్రదేశం

మనిషిలో ఎడారి స్మృతులను మేల్కొల్పవచ్చు
ఇపుడు జనావాసం భయారణ్యాన్ని తలపిస్తూంది
బ్రతుకులో ఏ క్షణమూ గీసిన అగ్గిపుల్ల కాదు
సిగరెట్ వెలిగించి బయటికి విసరేసేది కాదు
పూర్వాపర సంబంధంతో బ్రతుకుల నేలుతుంది
కర్తవ్య నిష్ఠలో పాలనం యజ్ఞ సమం, అగ్నిమయం

లల్లాదేవి సర్వవాద కలన వ్యక్తిత్వం
కశ్మీర్ జీవన వికాసాన్ని పెంచింది
సహజ జీవన సౌభాగ్యం, విరోధ పథం పడుతూంది
ఇపుడు కుంచితమై, కళ తప్పి కనిపించేనా?

ఉత్తమ కార్యాచరణలో సమిధను తలపిస్తుంది
మనుషుల చర్యల చేత భద్రత కోల్పోవచ్చు, విలయం తేవచ్చు

మానుష స్పృహతో సమాజ బంధంతో గడవడం
కఠిన వాస్తవమయినా, ప్రయత్నం మయితే వికాసంలో భాగం

విషమ భావనలతో విపరీత చర్యలతో కశ్మీర్‌ను
ప్రమాద స్థాయి నుండి కాపాడే బాధ్యత! పాలనా చణులది
స్వచ్ఛమైన నీతిని అవలంబించే మనోబలం మనిషికి ముఖ్యం
ఘర్షణతో పనిలేదు ఉద్యమంతో పనిలేదు! పూచే స్నేహంతోనే

సుదీర్ఘ పోరాటాల సంకలనం ఈ చరిత్రతో సంబంధం
జనతకు ఇష్టం అవసరం! సమాజ వికాస దశలలో

# 33. ఒంటరిగా అబల

కాస్త నిర్మానుష్య మయితే చాలు! ఎక్కడయినా వీధిలో
ఇష్టపడే నగరం దరి దాపులలో జన పదంలో
పొంచి ఉన్న మృగావేశ నిశిత తీవ్ర మతులు
స్వేచ్ఛ పేరుతో మానవ హక్కుల పేరుతో బ్రతకాలనీ !
వీరి ఇనుప బలంతో కరడు కట్టిన అమానుషం
అబలను ఆయుధంగా మారే స్థితి కల్పిస్తుంది

అడవిలో హరిణం కై పొంచి వెనక నుండి
దూక బోయే పులుల అవతరాలెత్తేరు! క్రూర చరితులు
క్షణం కితం ఉన్న సజీవమైన సుందర రూపం
మరు క్షణం మట్టిలో బూదిలో కలవడం దారుణం
చట్టం తన పని తాను చేసుక పోయే వాదం
స్వార్థానికి చక్కగ ఉపయోగ పడుతుంది

ఎంత స్పష్టమయినా ఈ వ్యవహారం కొలిక్కి రావడానికి
జీవిత కాలం సరిపోక పోవచ్చు! వైకుంఠపాళి న్యాయ విధంలో!
పాలనలో పటుత లేని విభుతలేని దుస్థితిలో
అమలు లోని ప్రజాస్వామ్యం నిరర్ధక మని పించవచ్చు
వివిధ కళంకాలతో చిత్రశాలను తలపిస్తూ
కల్పనలో మరబొమ్మల ప్రదర్శనగా మారుతుంది

సంఘంలో శిక్షకు అర్హమైన చర్యల దిశలో
స్వేచ్ఛకు హక్కులకు కళ్ళెం అవసరమని పిస్తుంది
వీధిలో ఒంటరి నారి కనిపించగనే వెనక నుండి
ఊహించని తొడుగులలో చాచిన చీకటి హస్తం
అనుమానానికి తావులేని రహస్య ప్రకారాలతో
ఇది వివృతమయ్యే అరాజక స్వేచ్ఛకు సంకేతం!

అబల బయటికి వస్తే అనుమానం సందేహం ఆపద
పొంచి ఉండే దుస్థితి రాకూడదు సమాజ సంస్కృతిలో

# 34.

సమాజ వేదిక పై చౌక బారు నటనతో
సినిమాలో టెలివిజన్‌లో దృశ్యాలకు నకలుగా
మృగ తత్త్వం పాశాలను విసరతూ ఉన్మద చర్యలు!
వెన్నాడే విషమ ఘటనలతో విపరీతాలు!

గగనం నివ్వెర పోయేను, భూమి తల దించుకునేను
గాలి పరుగు తీసేను, మనిషి శిలయై నిలబడేను

నీతి సూక్తుల్ని ఇంట్లో చిలక్కొయ్యకు తగిలించి
అద్దాల అల్మెరాలో మహా గ్రంథాల్ని భద్రపరచి
నాలుగు దారుల కూడలిలో విగ్రహాలకు ఆదర్శాన్ని అప్పచెప్పి
తనలో వివేకాన్ని మందపు పొరల క్రింద అణచి
అహంకార సంపదకు మురుస్తూ గర్వంగా దుశ్చర్యలలో
శూన్య హృదయంతో నిండు ధైర్యంతో కార్య ధారులయ్యేరు

అవసరానికి పనికి వస్తాయని కొన్ని నీతి సూక్తులు
బ్యాగ్‌లో వేసుకొని వ్యవహార జగత్తులోకి దిగేరు
భయం లేని వాతావరణంలో దేనికయినా తెగించేరు
అరాజకం ఏలికలో మహిళలో భయం! చీకటి శాసనంలో
క్షుద్రమయిన గమ్యానికి మెట్ల వరస అవుతూంది ప్రజాస్వామ్యం!
స్వేచ్ఛకు అవకాశం కుంచితమై వంచితమై ఇరుకున పడుతూంది

వర్తనలో నీతి మాలిన విషమ ఘడియలలో యాసిడ్ దాడులు!
జనం నుండి కోప శిఖలు దిశలకు పాకేను
ఇది ప్రాంతానికీ మతానికీ వాదానికీ మితం కాదు
జ్వాలా సమ భావనతో అబల నలంకరించే దుస్థితికి ఆగ్రహం!
కళ పేరిట సినిమాలో టి.వి.లో బాహాటంగా ఆశ్లీల దృశ్యాలు
మనిషి వీడరాని విలువల పతనంలో గ్రాఫ్‌ను పంచేను

అనుభవ రమణీయమైన దార్శనిక ప్రభావం
మానవాన్ని నిలుపుతుంది జన సంస్కారం పెంచుతుంది

# 35.

ఇది మరవరాని యదార్థం, నిందనీయమైన ఘోరం
బలాత్కార నేరానికి పాల్పడిన వ్యక్తులనే కాదు
ప్రోత్సాహక శక్తుల్ని సయితం ఏరి పారవేయవలసిందే!
సంకల్ప దీక్షతో కఠిన మైన ప్రణాళిక ముఖ్యం
పగలు రాత్రి భేదం లేకుండా దుశ్చర్యల పరంపరలో
పీడనకు హింస తోడయి! పలు విధాల అకృత్యాలు

కొందరి దుశ్చర్యల కారణంగా నిప్పు రవ్వలెగసి
సమాజ సంస్కృతి ముఖం మసి చిత్రం బారుతూంది
సదుపయోగంలో స్వేచ్ఛకు ఏ నిబంధన అక్కరలేదు
దురుపయోగంలో ఎవరికయిన తిరుగులేని బంధన మవసరం
రోజు రోజుకీ సమస్య జటిలమై విస్తృత మవుతూనే ఉంది
ఊరట మాటలతో ప్రదర్శనలు జరుగుతూనే ఉన్నాయి

వ్యక్తి బాధ్యతకు సమంగా సమాజ కర్తవ్యం
వేగమందుకునే నిర్ణయ సాధన మొకటే శరణ్యం
సమాజ స్థాయిలో స్నేహ సంస్కృతి ఒకటే! ఆర్ద్రమయం
దుశ్చింతకు దూరంగా నేరాలకు అడ్డు కట్టగా
నిరంతరం క్షాళన ప్రక్రియలో ఉంటేనే
విజయ గాథతో జన హిత భాగ్య రేఖ సిద్ధించేను

ఇపుడున్న సంక్షోభంలో అభయ చేతన చిగురించడమవసరం
మర్యాదామయమైన భద్ర భావ స్థితి ఏర్పడడం ముఖ్యం
ఎప్పటికీ భయ భావనతో బ్రతుకులు గడపడం దౌర్భాగ్యం
తనతో పాటుగ నడచే వారిపై అనుమానం లేకపోయినా
మనసులు స్తిమితంగా నిలవడ మొక సౌభాగ్యం
మనిషిలో పరిమళ సుమం వికసించడ మొక సంస్కారం

స్పందన ఎరగని హృదయం, కరుణ చూపలేదు
వాస్తవ రుచులతో బ్రతుకులు సన్నిహితమవుతాయి

# 36.

ఒకరిని బాధించే హింసించే హక్కు లేదెవరికీ
దీనికి బాధ్యత శాసన పాలన న్యాయ వ్యవస్థలదే
ఘోరాల్ని ఆపలేని ప్రభావం! ఎన్నిటిపైనో పడుతూంది
విషాద ఛాయలతో వెలుతురు కళ తప్పుతూంది
హేయ స్థితిలో అబలను చూచి చీకటి సిగ్గు పడుతూంది
దిశలు ముఖాలు దించుకొని వాలి పోయేను

చూపులలో పూలకు బదులుగ మనిషి నుండి
అనుకోకుండా కంటకాలు చూపడం దారుణం
మనిషిలో మానవం గుర్తు పట్టరాని విధంగా
మట్టి పూసు కొని వేషం మారడం విచిత్రం
మనిషి స్థాయిలో ఆదర్శం అగ్నికి ఆహుతి అవుతూంది
దీనిని ఆర్పే శామన యంత్రాంగం లేకపోవడం విపరీతం

మహిళలపై హింస హత్యలు సాధారణం కావడం
పతనమయ్యే సమాజ స్థాయికి నిదర్శనం
వ్యక్తి నుండి సమాజానికి నైతిక ప్రసారంతో
దార్శనిక విజయంతో సంస్కృతీ శిఖరారోహణం! తప్పదు
ప్రజాస్వామ్య యంత్రాంగం, షోకేస్‌కు మితమవుతూంది
గణాంకాల పట్టికలో మునిగి తేలుతూంది

క్షమార్హతలేని నేరానికి ఉరి శిక్షయే తగింది
ప్రగతికి మూల బలం నైతికంతో విలువల సమాజం
మంచి చెడు బ్రతుకులో తప్పని వని
మెడపై కత్తిలా చీకటిని సహించేరా?
సుఖమూ కష్టం అనుభవంలో ఉందేవని
నిరాశల సుడులలో భ్రమిస్తూ ఉందేరా?
ఇపుడు కవి కలం! కన్నీటిలో మునిగి తేలుతూంది
మండే అక్షరాలతో కవిత! తేజో మయమవుతూంది

స్వేచ్ఛా కవిత్వం - 106 - B

# సమాజ యానం

## చిన్న కవితలు

మాదిరాజు రంగారావు



2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**NO. 106 - B**

**SWECCHA KAVITHVAM**

Free - Verse

**SAMAAJA YAANAM**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

# అనుబంధం

ఇది దివా నిశలు పలికే అభినవ స్వరం
దిశలు చెవులు రిక్క పొడుచు కొనీ
మనిషిలో ఉదార సంస్కృతి పెంచే కళతో
భవితకు భద్రమయిన కవిత ! వెడల వచ్చు

ఇది శిశిర భావ మతికి వసంత స్పర్శ
ఈ సమాజ యానం నిజ పథాన దృశ్యమయం
దీనికే నియతి లేదు, సమయ నిర్ణయం లేదు
మరో మనిషికై పరివేదనలో మనిషి !

శబ్దం అర్థం భావం దార్శనికం మానవం
కవిత! పంచ ప్రాణాల మానస చేతనతో
కళాకృతి పొందుతుంది, సృజన భవంలో
స్వీయ ప్రతిభ కవితను ప్రవహింపగ చేస్తుంది

ధనం కీర్తి పదవిపై మాయని కోరికతో
నాలుగు వైపులలో గమ్యానికి దారులతో
సాగే కాలంతో, పొందే మార్పులతో
చెల్లే వాస్తవ క్షణాలతో, యానంలో సమాజం

ప్రజా స్వామ్య హృదయ వశం జీవన గతిలో
కాలంతో నడచేను, మనిషి యశో విజయం

ఇది స్వేచ్ఛా కవితకు లక్షణ వికాస గీతిక
మానవ భూమికలో ఆధునికాశయ సూచిక

– మాదిరాజు రంగారావు

# పీఠిక

ఇది సమాజ యానం. చిన్న కవితల సంకలనం. వ్యక్తి జీవన గమనంలో ఎదురయ్యే వివిధ సందర్భాలలో సృజనకు ప్రేరేపించే స్థితుల వర్ణనంతో, ఆలోచనల ప్రసారంతో వెలువడింది. దేనికది విడివిడిగా ముక్తక రూపాన్ని కలిగింది. అయినప్పటికీ మొత్తం మీద సమాజంలో ప్రయాణ సందర్భంలో కనిపించే దృశ్యాలు స్థితి గతులతో ఏక సూత్రాన్ని పొందింది. ఇదొక పద్ధతి.

మనిషిలో ఎటువంటి పరిస్థితుల లోనూ నిరాశను తొలగించి, ఆశా రూపాన్ని బలపరచే లక్షణం కలిగింది. దిగులునూ, బాధనూ, వేదననూ కష్టాల్ని అధిగమించి జీవితాన్ని అర్థవంతంగా ప్రయోజన పరంగా మలచుకొనే సూచనలతో ఆకర్షిస్తుంది. అనుభవంలో సుగమ సుందరతలకు ప్రాధాన్యమిస్తూంది.

ఇపుడు సమాజంలో కనిపించే అవినీతి హింస విలువల్ని మరచిన స్థితి గుణాత్మకతను వదలేసిన విషాధ ధోరణిలో సాగే బ్రతుకుల ప్రభావాల్ని దృష్టికి తెస్తుంది. వీటిని సవరించుకొని సుస్థితికి చేరే హృదయ భాషను వినిపిస్తుంది. మౌనానికీ పట్టని మనస్తత్వానికీ సెలవు పలుకుతుంది. ఉత్తమమైన విలువలతో కూడిన గుణాత్మకతను ఉత్సాహ పరుస్తుంది. వ్యక్తిని ఉత్తేజ పరుస్తుంది.

ఇది ప్రస్తుతం ఉన్న నెగిటివ్ కోణాలపై దృష్టి ప్రసరిస్తూనే రావలసిన పాజిటివ్ కోణాలపై శ్రద్ధను కనబరుస్తుంది. దీనికి మానసిక స్థితిలో మార్పు అవసరం. ఆయా సన్నివేశాల్లో విశాల మతి చేత ఉదార గుణం చేత సిద్ధించే దార్శనికతకు చెందిన తాత్త్విక స్పృహ స్పష్టంగా కనిపిస్తుంది. ఓటమిలోను విజయకాంక్షతో సత్వరం సాగవలసిన మనో విధాన్ని భావింప చేస్తూంది.

ఈ చిన్న కవితలు నిర్వహణంలో తమదైన 1) సంక్షిప్తత 2) భావ సాంద్రత 3) అర్థ ప్రసారం 4) ప్రయోజన పరతతో సమాజంలో మనిషి యానాన్ని చిత్రిస్తూంది. ఇది భావ రూపాలు ప్రతీకలు మానవ మనస్తత్వ రేఖలు దార్శనికతతో కళాత్మకతను పొందింది. చిన్నవి అయినా విమర్శలో వివేచన కవకాశం ఇస్తూంది.

**– మాదిరాజు రంగారావు**

# సమాజ యానం

## 1.

ఎగిరే గాలి పటం కనబడితే చాలు
మనసుకు నింగిని తాకాలని ఉబలాటం
భూమికి తనతో కిరణం బంధుత నెరపాలని
తన సంపద బయటపడీ, అందరు చూడాలని

గగనంలో ఇంద్ర ధనుసు భూమికి దిగిరావాలని
చినుకులు తోడుగ మేఘం సందేశం పలకాలని
విషయంతో విషయం సంబంధం తప్పనిదీ
మనుషులతో మనుషుల సంచరణం అనివార్యం

దేని కదే సున్నకు సున్న కాదు
దేని కదే హళ్ళికి హళ్ళి కాదు
పరస్పరం విలువల వినియోగంతో
తమ బ్రతుకులు సమన్యాయం పొందాలని

కెరట మదే ! గత మవుతుంది క్షణంలో
కదలి అదే ! వర్తమాన మవుతుంది
రిజర్వులో ఉన్న భవిత ముందుకు వస్తుంది
కాలం ఒకటే ! వివిధ దశల సంకలన రూపం

కవిత ఎప్పటికీ ఆశా స్పందన విభవం
హృదయం మాట్లాడుతుంది విశ్వమయం అందరితో

## 2

ఇది సమాజ గీతం కాలాని కతీతం
భయం వదలి హృదయం ధైర్య కళ పొందేను

ఉషస్సు ఆగమనమెంత ప్రియ మయినా
ఎవరి బ్రతుకు తీరులో వారు నిమగ్నమై
ముళ్ళు లేని గులాబి కొమ్మ కాన రాదు
పూలు లేని గులాబి కొమ్మ ఉండ వచ్చు

సూర్యుడదే! మనిషి రూప మదే
మార్పు ఎక్కడుంది? ఎవరిలోన ?
చేతన స్పృహతో ప్రతి మనసులో
మానుష కర్మతో ప్రతి బ్రతుకులో

కవిలో వ్యక్తి సమాచారం కన్నా
కృతిలో ఎదిగిన అస్తిత మహనీయం
ఎవరి కిష్ట మయినా కాక పోయినా
ఉన్న ముఖం చూపు తుంది దర్పణం

పగిలిన అద్దంలో ప్రతి ముక్కలో
కనిపించే దొకటే ! తన వాలకం
శృంఖల తొలగిన చేతుల నుండి పక్షిలా
ప్రతి ఎదలో వాలేను కవిత స్వేచ్ఛగా

# 3

రాత్రి కలలు మంటలలో ఉదయం దృశ్యం
బూది ఎగిరి వాస్తవాన్ని హవణించేను
కవితలో నైతిక నేపథ్యం తెలియక పోవచ్చు
కృతిలో అక్షర తేజం కనబడితే చాలు

సంఘంలో దాహం ఆకలి ఎడారి అగ్ని
ప్రతీక లయి కవితకు సాంద్రత సిద్ధించేను
కవుల మాటలో వెలుగు బాటలో దశ దిశలో
గుండెలో పూచే లిప్తలతో సమాజ యానం

తెలుపు నలుపు స్నేహం వైరంపై సమాజ భావనతో
కవిత! హృదయ స్పందన భవం! యంత్రమయం కాదు
మండే అగ్ని వెనుక ఆర్పే జలమవసరం
యుద్ధం శాంతి మధ్య జీవన రుచి వాస్తవం

కాలం కవితకు సింహాసన రూపంలో
స్పందమాన హృదికి చిర సాధన మవుతూంది
పరివర్తన దిశలకు మార్గం చూపేను
అలరించే వాద్య విశేషం కావచ్చు

ప్రేమ కరుణ మానవత మదిలో రిజర్వులో
తన కోసం దాచుకున్న మూలధనం బాబతు

## 4.

సంస్కృతి శిఖరానికి తగిలిన గాయాలు
అభిమాన గుణానికి తగిలిన యట్లే
శోకంలో జారే బాష్ప బిందువులో
కదలే చీకటి రేఖలు కనబడవచ్చు

మోదంలో రాలే బాష్ప బిందువులో
నడచే కిరణం అడుగులు కనబడవచ్చు
మనిషికి సాటి చెట్టు కాదు, నది అవదు
మనిషికి మనిషే! తనకు సాటి తన ప్రతిభతో

పయనంలో వాహన మందక తొలగిన మనుషులు
బయట చెట్ల నీడలలో ఆవాసం పొందేరు
మరు నాటికి అంతా సరి అవుతుందని ఆశ
ఆ మరునాడు ఏ రోజును వరించేది తెలియదు

బయట సంరంభం, లోన సంవేదన
అలలు కదలవచ్చు నిశ్శబ్దంగా శాంతంగా
అవే! సశబ్దంగా ఎగర వచ్చు ఉత్సాహంగా
అన్నిటికీ చోటుతో మనిషి మనో నిలయం

కవిత అంతిమంగా జిజీవిషకు సుందర వ్యాఖ్యానం
ఇది ఆశా బంధువు! అక్షర రూపంలో అమరం

## 5

దార్శనికంలో దిశలన్నిటికీ సమ ప్రాధాన్యం
హేతువుతో వడపోసిన వివేక సారం
కవితలో తొలగించే దేదీ ఉండదు
అన్నీ అవయవ భాగాలే! అవయవిలో

గగన మెత్తు యశో రూపంలో కవులు
కాళ్ళ కింద భూమిపై విషమ తలంపై
బాట సమతలం కావచ్చు, ఎచటనో
ప్రగతిలో సమాజ వికాస మంతే!

ప్రమాణ పత్ర మయినా తనలో స్ఫూర్తి అయినా
ప్రజాస్వామ్య  హృదయానికి దూరం కాకూడదు

మబ్బులో చిక్కుకొనీ నైతిక బింబం
ప్రశ్నిస్తే అసహనం ప్రబలుతూంది
తేడాతో జైలు తలుపు తెరవబడీ
నిర్బంధం తప్పనిసరి అవుతూంది

కవి జీవిత చిత్రం కన్న తన కవితలో
మూలాల పైన ఆలోచన అవసరం
చేతనతో పొందే వికాస విజయాలు
ఆదర్శంలో భిన్న భిన్న భాగాలు

## 6

అనుకోని ఘటనలో అశ్రు కణం నుండి
బాధకు చెందిన నీలి రేఖ జారుతుంది
ఆర్తికి చెందిన అనల కీల సాగుతుంది
ఈ స్థితిలో అవసరం కరుణ ప్రేమ తోనే

నేడు వక్ర రేఖతో కనిపించే చంద్రుడు
మరో రోజు పూర్ణ బింబంలా మారవచ్చు
గాయాలతో అలంకృత మయిన చరిత్ర
మనిషికి పరోక్షంగా ప్రేరణ ఇచ్చేను

కవి మనస్సు స్ఫటిక సదృశం
ఏ రంగును నిరాకరించదు
తనలో రవి బింబంపై చూపు పడేనా?
గుర్తిస్తే భయ సమస్య ఎపుడో తీరేది

గుడి గంటల హెచ్చరికలు వినిపిస్తూనే ఉన్నాయి
వేళకు గాలులు తమ సూచన లిస్తూనే ఉన్నాయి

కాలం గడచేను ప్రచార ప్రసారాలతో
సమాజ యానంలో సంక్షుబ్ధ స్థితులలో
లోక యాత్రలో బ్రతుకులు జలయానంలా
లోన ఆంతరంగంలో గగన విమానంలా

# 7

చోటు లేక పగలంతా తిరిగి శాంతి
రాత్రికి చీకటి పంచన నిదురించేను
ధర్మాసనాలు పొగలతో సెగలతో అనిశ్చయంలో
ఎవరికి అందని ఎత్తున నిలచేను, పలికేను

రవి శశి చుక్కలు తమ వశమై పోవాలని
తమ చేతులెత్తి ఎగసి అందుకోవాలని
ఎప్పటి నుండో కోరిక లల్లుకొనీ
పరిశోధన ఫలితంగా గగనం చేరేరా?

కాలం నిలవదు బ్రతుకులు ఆగవు
చివరి దాక దేని పనిలో అది కదలుతూ
పొగలు కమ్మినా మబ్బు ముసరినా
మంచు అడ్డమయినా ఉష ఆగదు

గాలి వీచి దూరం విసరాలని
ఎండ తాకి తప్తం చేయాలని
సీతు దూసి కుంచిత పరచాలని
వాన విసరి ముద్దగ మార్చాలని

ప్రతి రుతువు ప్రభావ శక్తి మనిషి మనిషిపై
ప్రకృతి నెదుర్కొనే జీవ శక్తి మనుషుల స్వంతం

# 8

"కాలం మింగు తుంది" అనే మాట ఎప్పటిదో
గతం పైన అర్ధవంతమయిన భావ రూపం
ప్రవాహ రూపంగా ఊహించే వారూ ఉన్నారు
వికాస దృశ్యపటంగా తలచే వారూ ఉన్నారు

కవికీ కాలానికీ కవితకూ భావ జగతిలో
బంధం మరచేది కాదు, వీడేది కాదు, చిరమైంది
కనిపించని కాలంలో కనిపించే అణు ఘటిత శిలలతో
చలన రహితంగా నిలిచిన గిరులు! వృద్ధుల వలె

జలధి ఉండనే ఉంది! చలన శక్తికి ప్రతీకగా
సాధారణ దృష్టికి వస్తు సహజ పరిణామాలు
సమాజ సందర్భంలో ప్రతి వ్యక్తికి ప్రవేశం
పొందే పాత్రల తోనే దృశ్యానికి విలువలు

మనిషి ముందు పరచిన విశాల వస్తు ప్రపంచం
ఎన్నిక తోనే పాత్రల అస్తితలకు ప్రయోజనం

లోపలి నిజం తెలియడమొక క్లిష్టమైన పజిల్
ఖాళీల భర్తీలతో బ్రతుకు తీరు మారుతుంది
ఇది మానస భూమికలో వ్యక్తి ఎత్తు పెంచుతుంది
శ్రమ శక్తులలో ఉత్సాహ లహరి నింపుతుంది

## 9

అరవడం మొరగడం జంతు స్వభావం
కూయడం పలకడం పక్షి స్వభావం
బుసలు కొట్టడం భుజగ స్వభావం
భయద గర్జనం సింహ స్వభావం

అన్నిటిచే అలంకృతుమయి బ్రతుకులో శిష్టంగా
మాట పాట ఆట మానవ లక్షణం కళా మయం
అన్నిటికీ శక్తి మేర చోటు దొరకేను కవితలో
నిరాదరణ నిరాకరణ నిరంకుశ ఫలితం తెలిసిందే

నీతి నియమ నిబంధనల ఆదర్శం గోడకు పటం వలె
కను లెత్తి చూచి మరవడమొక అలవాటవుతూంది
వ్యక్తి చుట్టు తిరిగే హక్కులు రక్షణ రాజ్యాంగం
సమాజ బంధంతో ఉత్సవ కళ పొందేను ప్రజాశక్తి

అనుకోకుండా మనిషి చూపులో వక్రత
మార్గం మారవచ్చు గమ్యం తప్పవచ్చు
ప్రశ్నకు వీలు లేని, వ్యవస్థను కోరేరా?
వ్యక్తి యాత్ర ప్రధానమైన, చరిత్ర కావాలా?

కవి కోరే దయితే వ్యక్తి నుండి సమష్టికి
సమాజ విజయం నుండి ప్రపంచ లక్ష్యం లోకి

# 10

చిన్ని చిన్ని నిప్పు బంతు లెగురుతూ ఆర్తి
గాలిని చీల్చు కొనీ ముందుకు దూసి దూకుతూంది

భౌతికంలో ఎదురుగ పేదరికం తారసపడుతూంది
మానసంలో చేతన నిరసన ఘర్షణలో చిక్కుకొనీ
చల్లని రాత్రి వెన్నెలలోను హ్లాదం బదులుగ
నిశిత శబ్దం! మనసును వేడిగ స్పృశిస్తూంది

దీన్ని గురించి శామన కామన మెవరిలో?
దార్శినిక స్థాయిలో కవితలో పాలనలో ఉదారతలో
ముక్కలుగా చేసి దేని కది పరిశీలనలో
ఏ వస్తువు ఏ పనికి నప్పేదీ తెలియదు

భౌతికం మానసం పూర్తిగ వేరు కావు
పగలు వెలుగు నిశి వెన్నెల రోజులాంటివి
దౌర్భాగ్యం నిర్వేదం పూర్తిగ తొలగకపోయినా
ప్రేమ గుణం ఆశను నిటాలుగా నిలుపుతుంది

నాలో సమాజ ప్రకాశ రూపం ఎప్పటికీ
మనుషులు చీకటి / నగలు ధరించి కనబడేరు
ఎవరో వెలిగించే దీపం కాదు మానవం
అది స్వీయ రశ్మి రూపం! అస్మితతో అభేదం

## 11

పూవు చూచినా ఫలం కనబడినా మొదటి సారిగా
కోరికల తోటలో పూర్వ పరిచయ మున్నట్లే ఉంటుంది
చెట్టు చూచినా కొండ చూచినా మొదటి సారిగా
పూర్వ నివాసంలా స్నేహ సుందరత చూపుతాయి

ప్రకృతిలో భాగమయిన మానవ రూపానికి
రెండిటి మూలం ఒకటే, అనిపిస్తుంది లోన

కళ్ళలో తడి కరుణ లోనే కాదు
ప్రేమ లోనూ హృదిని కదలిస్తుంది
ఇది జీవితంలో రుచులను పెంచేను
మనసులో దోషాన్ని శుభ్రం చేసేను

వీటికి ఏకాంతంతో మౌనంతో పనిలేదు
సమాజ సందర్భం లోనే కవితకు వికాసం
పైపై నిర్మాణం ప్రజలకు మానసికాశ్రయమై
కష్టంలో ఎప్పటికీ ఆదుకొనే చరిత్రతో మానవం

తీరు తీరు బ్రతుకులతో వేరు వేరు ఊహలతో
ఇది సంగమ స్థానం సహభావన సహకారంతో
ఇనుప చేతులతో స్వర్ణ కవచంతో లోన మనిషి
సమాజ శ్రేయో గుణ విభవానికి సంసిద్ధంగా

# 12

విరిసిన నవ్వు పూవు మాయమై ముఖం
సాధారణ వాలకానికి చేరుతుంది అంతలో
ముఖంలో మెరసే కోప కణం అతిథి అవుతుంది
సామాన్యానికి కొంత సమయం తీసుకుంటుంది

అతిథి పాత్ర వదలి లోన మనిషిగ మారవచ్చు
కాలి నడకలో మధ్యన వెహికల్ దొరినట్లుగా
మేఘంతో పాటు ఇంద్ర ధనుస్సు కదలదు
ఎంత ఇష్టమయినా దేని స్థానం దానిదే

మనిషికి మాత్రం స్థిర సూత్రం వర్తించదు
తనలో కోర్కెను బట్టి ఏదయినా కావచ్చు
రోజు బాగా లేదని ఎదురుగ టేబిల్ పై
కాలెండర్ పేజీ తొలగిస్తే సరిపోయేనా?

శబ్దా లవేను ఉన్నవే, అర్థాలు వేరు కొత్తగా
బ్రతుకు లెన్ని విధాలో! కవితలన్ని తీరులు!

కవితలో చెప్పేది ఎంతో మిగిలే ఉంటుంది
కవులలో దాగేవి ఎన్నో ! బయటకు రానివి
రెండు రెక్కలపై సమాజ యానం
కవికి మహా ప్రియం, బాధ్యత కూడా

స్వేచ్ఛా కవిత్వం - 107

# స్వేచ్ఛలో బంధనం

మాదిరాజు రంగారావు



2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**NO. 107**

**SWECCHA KAVITHVAM**

Free - Verse

**SWECCHALO BANDHANAM**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

Price Rs. 20/- (Twenty Rupees)

*Presented to*
*my daughter*
*Devulapalli Haritha,*
*M.A. Lit*
*Detroit USA*
*with blessings*
*on her Birthday*
*2-1-2020*

# పీఠిక

"స్వేచ్ఛలో బంధనం" ఈ కృతి పేరులో రెండు పదాలు స్వేచ్ఛ – బంధనం విరుద్ధమైన భావ రూపాలు. ఈనాటి పరిస్థితులకు సందర్భోచితంగా ఉంది. ఈ రెండిటి మేళనం జీవితం. ఇదే విచిత్రం. మానవ జీవితంలో నియతం నియమం కట్టుబాటు బంధనం నిర్బంధం ఇట్లా అనేక విధాలుగా అర్థ చ్ఛాయలతో ఆవహించిన రూపాన్ని చూడవచ్చు. ఇది ఎంత విస్తృతమైందో జీవితాల్ని ఎట్లా మలుపులు తిప్పుతుందో దృష్టికి వస్తుంది. మొత్తం మీద వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం కలిగింది. కేంద్ర స్థానాన్ని సూచిస్తూంది. స్వేచ్ఛను దురుపయోగం చేసే ఘటనలెన్నో దృష్టికి వస్తాయి.

ఈ బంధనం వర్తమాన జీవితంలో ఎదురయ్యే అనేకమైన సమస్యలతో సంబంధం కలిగిందీ. కొన్ని 'స' కారత్మాకంగానూ కొన్ని 'న' కారాత్మకంగానూ ఉన్నాయి. భావన అనుభూతి వాస్తవికత దార్శనికతతో సంపన్నమవుతూన్న స్వేచ్ఛా కవిత్వంలో ఈ విషయం ప్రమేయం అనివార్యం. సహభావన సహవర్తనం సహగమనం సహలక్ష్యంతో సమాజంలో సమరసతను harmony కోరుతుంది. కవిత్వంలో దీని ప్రతిఫలనం సహజమే కాదు అవసరం కూడా.

కొన్ని పరిమితుల్లో ఈ కాలంలో ప్రజల ఆకాంక్షలననుసరించి సమాజానికి మేలు చేసే విషయంలో ప్రజాస్వామ్య భావన, తనలో మార్పిబీజాన్ని అంతర్భవింప చేసుకొని వర్తిస్తూంది. భారతదేశంలోనే కాక అంతర్జాతీయంగానూ ఈ మార్పును గమనించవచ్చు. ప్రజాస్వామ్య సామ్యవాదాల పేరుతో వ్యాప్తిలో ఉంది.

స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్యం కేంద్రంగా సామ్యవాద ఛాయలతో దార్శనికత ప్రధానమైన పాత్రను నిర్వహిస్తూంది. తెలంగాణాయే కాక ప్రపంచంలో ప్రస్తుతం నెలకొన్న వైవిధ్యంతో కూడిన కవిత్వ వాతావరణం ప్రగతి ముఖంగా దీనికి మంచి అవకాశంగా ఉంది. ఇక్కడి కవులలో తమ వ్యక్తిత్వ వికాసాల పట్ల అభిలాష పెరిగింది. జీవితాల్లో క్రియాశీలత పదునెక్కింది. ఇది సహజమైన అనివార్య పరిణామం. చారిత్రక వాస్తవం. ఇపుడు ప్రజాస్వామ్య సామ్యవాద భావనవైపు ఎక్కువగా ప్రజలు మొగ్గు చూపడం కనిపిస్తుంది. 1) సమాజానికీ సాహిత్యానికీ 2) కవి సృజనకూ అస్తితకూ 3) స్వేచ్ఛకూ వికాసానికీ సంబంధం అంతో ఇంతో అనివార్యమయింది. స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు సామాజిక రాజకీయ ఆర్థిక నైతిక మనస్తత్వ తాత్విక కోణాల్లో విషయ దర్శనాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఇది దీని ప్రత్యేకత.

ఇక కళాత్మకంగా ఈ కృతి భావ రూపాలు ప్రతీకలు మనస్తత్వ ప్రకాశనంతో ప్రగతి శీలమైన ఆధునికతకు ప్రజాస్వామ్య దార్శనికతకు ప్రాధాన్యం కలిగింది. కొత్త ఆలోచనలో విషయ సమాకలనం (mix) విమర్శకుల విశ్లేషణ కందుతుంది. ఇది కవిత్వానికి దర్శన రూపంలో విస్తృతినీ ఉన్నతినీ ఉదాత్తతనూ గభీరతను కలిగింపజేస్తుందనడంలో సందేహం లేదు.

**– మాదిరాజు రంగారావు**

## 1. కవితను వినిపించి

ముందు చూపు లేని ప్రముఖ సంస్కరణ మొక సాహసం
ప్రయోజన విషయంలో జడీభూత స్థితిని చేరుతుంది
తీవ్ర శిఖల కప్పు జెప్పి ఆర్థిక సమస్యను
తళ తళలకు ధగధగలకు పై నేతలు మురిసేరు

సగం కాలి సగం బూది అయిన దృశ్యంలో
లాభాల వేటలో ఛిన్నమైన వాణిజ్యం!
వీచే గాలి కంటికి కనిపించదు, స్పృశిస్తుంది
వాతావరణంపై అనితర ప్రభావం నెరపుతుంది

మబ్బును తరలిస్తుంది మనసులో అలలను కదలిస్తుంది
మనిషిలో ఆలోచన మారుస్తుంది, మార్పు తెలుపుతుంది
మానవ జీవన సరళిపైన సరే సరి!
కవిత కూడ అదే వరసలో కొత్తదనం పొందుతుంది

గాలికి దారు లెన్ని దిశలలోనో
కవితకు ద్వారాలన్ని కోణాలలో
అనుభవ సుందర మైన విశేషం
కవిత సోకని మనసు లేదు
గాలి కదలని స్థలం లేదు

ఈ కాలంలో కవితకు పత్రిక ఒక వరం
కీర్తి కాములు ఆర్జన పరులు కార్యార్థులు
అవకాశ శాలలో మట్టి బొమ్మలుగా తిరిగేను
పలు రంగులలో కవులు! చెలామణిని కోరుతూ
మాటకు పరపతికి సంఘంలో కవి లేబుల్
వ్యవహార జగత్తులో లౌకిక మర్యాదలకూ

కవితను వినిపిస్తూనే ఎవరి వ్యవహారంలో వారు
వ్యాపార మనో రూపాలతో మాటకారులు
అసలు సమస్యను వీధిలో ఏ దీప స్తంభానికో
రాత్రి వెలిగే దీపానికో అప్పజెప్పి! మాయమయ్యేరు

# 2. జీవన సందర్భంలో

స్థానిక సమస్యలపై అవగాహనలేని ప్రపంచీకరణం
స్వయం ఆర్జిత బలం తగ్గి దేశానికి గురి బండ అయ్యేను
కనిపించని బంధనతో పయనం మందగించేను
వర్తమానం చెదరి భవిత దారి తప్పు జేసేను

ఆధారం అదృశ్యమై జీవన స్థిరత కవకాశ మెక్కడిది?
ఎంతటి విరాగికైనా మానసిక స్తిమితం తప్పనిసరి
కావలసినవి ప్రణాళికలో అంకెల నుండి జారి పడవు
వివిధ స్థాయిలలో వినిమయ పరంపరలోనే జనహితం

ప్రచార పర్వంలో కవులు నేతలు కార్యార్థులు స్వార్థపరులు
పత్రికల ప్రపంచంలో పరిభ్రమించేరు, మహదవకాశంగా
ప్రకటనల మాదిరిగా కవిత ఇపుడు వ్యాపార జగత్తులో
ప్రతిభ కన్న కీర్తి లతలపై మోజులో పోటీ పడుతూంది

జననం నుండి సమాప్తి వరకు చిన్న పెద్ద బ్రతుకులలో
పొందే అనుభవ సందర్భాలు! మానవ గుణ వర్తనలో భాగాలే
వ్యక్తుల్ని సంఘాన్ని నడిపించాలని వర్తమానంలో పత్రికలు
పీఠం ఎక్కించేందుకూ కిందికి దించేందుకూ ఎందరో తయారుగా
పూజ జల్లు కురియవచ్చు, అనల కణం రాలవచ్చు
నిర్మాణ భాషతో విధ్వంస భాష కూడ వినబడవచ్చు

కవితలో శబ్దం సమాజ పాత్రనే వహిస్తుంది
జలధిలో అలలవలె చలనంలో చేతనతో
ఉన్నత శిఖరాల నుండి భూమిపై ఉదాత్త ప్రవాహం కవిత
మూస పోత శిల్పం కాదు! ఇది సజీవ కళా సాధనం

బయట పడని రహస్య బీజా లొకటొకటీ
విత్తబడీ భావనలో సుమ ఫల సంపద నందించేను
డబ్బు బలం యుక్తి ఇరువైపుల పదునుతో
ఉపయోగించే తెలువులు జీవన సందర్భంలో వాస్తవం!

# 3. ఆవాహనతో

మొలక నుండి పరిచయంలో స్నేహం తీగెయై
పూలతో పరిమళ సుందరమైన యశో రూపం
మనిషిలో ఉత్తమ జీవన స్థాయిని సంకేతిస్తుంది
కాల భేదం లేకుండా వ్యక్తి అస్తిత నిలుపుతుంది

పగలు చేతనతో మెలకువలో ఆశలతో
రాత్రి జాగరూకతతో నిదురలో నిశ్శబ్దంగా
కవితలో అనుభూతి వజ్రాలుగ మారేను
లోనుండి అనుకోని తాత్వికత బయటికి వచ్చేను.

కొండపై నుండి దూకి పరుగెత్తే ప్రవాహంలా
మనిషిలో ఉషస్సు ఉత్సాహంతో ఉరకలు వేసేను
తెలిసీ తెలియని దోషానికి మనసులో భయం
లేక పోదు కాని, క్రియా కలాపం దీనిని మరపిస్తుంది

రాత్రి వేళ జలధిలో పయనించే పడవలాగా
పగటి వేళ మాత్రం నింగిలో విమానంలా
దిశలను చుట్టిన చూపు భూమిని బంధించినట్లు
మనిషిని స్వేచ్ఛా మపనం ముందుకు నడిపిస్తుంది

నినాదాల మధ్య ప్రబోధాల వెనక నుండి
ఆర్త ధ్వని చక్రం సుడిగాలిని తలపిస్తుంది
నడచే శిల్పంలా మౌనంగా కనిపించినా
లోలోన స్పందన శబ్దాకృతి పొందుతుంది

అనల మయమయిన కాలానికి తేజంలో
సమిధ అనీ పుష్పమనీ భేదం ఉండదు
విలువలు తెలిసేందుకు వివేచన మవసరం
దార్శనిక దృష్టితోనే పరిష్కార పథం దొరుకుతుంది

వెలుతురు సమస్యకు సమాధానం కాదు
నిజం తెలిసేందుకు సాధనం మాత్రమే
కిరణం అలంకారం కావచ్చు ప్రయోజనం నెరపొచ్చు
సూర్యుని ఆవాహనతోనే వ్యక్తి అంతరంగ ప్రకాశం

# 4. కొత్త స్వరం

సౌందర్యం దృష్టికి వైయక్తికం అలంకారం
ప్రయోజనం తీరుతో సామాజికం మానవీయం
వ్యక్తిలో పరిహరింపరాని రాజకీయం
వివిధ వర్ణ చిత్రాకృతులను పొందుతుంది

నిర్మాణం దారి వేరు విధ్వంసం దారివేరు
పరిణామ దశలలో రెండూ అనివార్యాలు
రాజకీయ చతురతల కందనిదీ దార్శనికం
రాజనీతి విభవానికి విజయ వేది అవుతుంది

ఎన్నికలలో సమూహాలకు చేసే వాగ్దానాలు
దాహం వేసే సమయంలో మృగతృష్ణలో నీరులా
కరుణ పదంతో నిండిన ఎడారి చేరి
దాహం తీరే అమృత క్షణంకై నిరీక్షణం

కవిత ఇస్తుంది! ప్రీతిని కీర్తిని అంతరంగ స్ఫూర్తిని
వ్యక్తికి అస్మితతో కోణంలో గమ్యంతో
హక్కుల పోరాటంలో విజయానికి చేరువగా
ప్రజాస్వామ్య స్వేచ్ఛలో అవగాహన హృదయంతో

బయటి రూపానికి నీడ! రేఖా మాత్రమైంది
ధైర్యం ఇచ్చే మిత్రం! వస్తువు ఉనికికి సూచిక!
దీని వెనక పెద్ద పులి పొంచి ఉండవచ్చు
భుజగం చుట్టుకొని పరుండవచ్చు

జీవన వాస్తవాన్ని నిజం చేసే ఘటన
మనిషిని ప్రమాద క్షణంలోకి నెట్టవచ్చు

అనుకోని అనుభవంతో దృశ్యం మారుతుంది
అతీత విషయాన్ని స్పృశిస్తుంది ఆలోచన
మౌనంలో అంతరంగం గగనంలాగా
తిరిగే వెలుతురు బొమ్మలు! సూక్తుల నందించవచ్చు

కొత్త మనిషి కనబడాలని కొత్త మాట వినబడాలని
కొత్త తరం ప్రవేశించి సమాజ స్వరం కొత్తగా ఉండాలని

# 5. గుండెపై తప్పనిదీ

ఒత్తిడి విధాన గుణంతో బహుళ జాతి కంపెనీలు
చతురతలో నిష్ణాతులు ఆర్జనలో అఖండులు
అలల వలె సాగే స్వదేశ వాణిజ్య దృశ్యం
తలపెట్టిన గట్లు వద్ద ముక్కలుగా చెదరేను

శోధనలో బయట పడని నిజాలు దాగిన రహస్యాలు
కవి మనసులో చూపట్టేను, కవితలో బింబించేను
మనిషి చుట్టు వస్తువు లెన్ని ఎంత ఉన్నా
సామాన్యుల కందని దూరంలో మురిపించేను
విలువల చెల్లింపులలో కృత్రిమ పద్ధతి
ఒక జేబు నిండితే తక్కినవి ఖాళీ అయ్యేను

తనలో తనపై నమ్మక మొక పెద్ద అండ
సహచరుల సహకారం! ముందుకు నడిపించే సూత్రం
రాత్రి చీకటి బదులుగా వెన్నెల బదిలీ జరగదు
వ్యక్తి కోరిక ననుసరించి సమాజ వర్తనం సాగదు

బాధ్యతల్ని మరచి కర్తవ్యం విసరి వైచి
హాయిగా ఉండే బ్రతుకులు బాగనిపించవచ్చు
స్వార్థ పంజరంలో బంది అయిన మనో రూపం
తలచనిది లేదు కోరనిది ఉండదు షార్ట్‌కట్‌లో

మరో క్షణంలో జరిగేదేవరికీ తెలియదు
ఇది అందరికీ తెలిసిన సామాన్య విషయం
అయినా ఉన్న స్థితిని బట్టి సంసిద్ధం కావడం
జీవన భావనలో మనిషికి సహజం, తప్పనిదీ

ప్రతి వ్యక్తి జీవిత కథకు మూల ద్రవ్యం!
వ్యక్తి – సమాజం, వాస్తవం – ఆదర్శం సమన్వయ రూపం
రాజనీతి వాణిజ్యం, నిజ సంస్కృతి, ప్రగతి దృష్టి
నాలుగు దిశల మధ్య ! జీవితాలు ఎక్కడయినా
ప్రస్థానంలో ఆరోహణ దశలెన్ని గడచినా
గుండెపై నిప్పుల కుంపటి విభాతం తప్పదు

# 6. అంతరంగం సాక్షిగా

రాత్రి చుక్కల సమావేశంతో గగనం
విశాల వేదికపై కవుల గోష్ఠిని తలపిస్తుంది
చెట్టు ఎప్పటిదో! చిన్న నాటిది ఎదుగుతూ
పూలు ఇప్పటివీ! ఫల సంతతి ఇప్పటిదీ ! కోరిక పాతది

అవసరాలలో ప్రాధాన్యాలేర్పడుతూ
విత్తునుండి నీడ వరకు తరం నుండి తరం!

గాలి వీస్తే చాలు, చెట్టు కొమ్మల కదలికలా
తమ వైపు చూడని వారికి కూడా
కవులకు తను కవితలు వినిపించాలని
విశ్వమయ హృదయంతో కోరిక పలుకుతుంది

గగనంలో విమాన యానం ఎంతో కొంత దూరమే
ఆపై భూమి పైకి రావలసిందే
ఊరు ఇల్లు చేరవలసిందే
స్వాగతం లభించదు కాని ఆప్యాయత దొరుకుతుంది

అక్షర నిలయానికి చేరిన శ్రోతకు
కవుల కన్న కవిత పైనే! ఔత్సుక్యం
కష్టాల కడలి దాటి ఆటంక శిలలు దాటి
కలల నుండి మెలకవుకు పయనంలో కవిత!

గమ్యం తెలిస్తే చాలు ! ఆ బాట పట్టి పోవడమే
బంధు ప్రేమతో తీసుక వెళుతుంది
మధ్యలో కనబడే మనిషిలో ధైర్యం!
    ఆశకు రెక్కలు విప్పగ జేస్తుంది

మౌనంలో విగ్రహ సదృశం కాలేదు ఏ కవీ!
జీవ కణ సమాకలనంతో చేతన
లోపల మనిషిని! అంతరంగ సాక్షిగా
నిలబడెతుంది! అనుభూతి మయం చేస్తుంది

# 7. మౌనంలో ప్రేరణం

వీధుల కూడలిలోనో కార్నర్‌లోనో విగ్రహాలు
ఆదర్శ రూపాలతో వర్తమాన క్షణాల్ని వెలిగించేను
ఉదయ సాయం సంధ్యలలో మనిషి మనిషికీ
తన జీవిత రూపానికి నేపథ్య సూచన అవుతుంది

వివిధ స్థాయిలలో సృజనలో ప్రతీకాత్మకతను
పొందుతుంది రచనకు గభీరత నిస్తుంది కాలం
ఓటమిలో నిందకు ప్రతి పక్ష పాత్రలో ఒకరు
విజయంలో ప్రశంసకు సర్వ సిద్ధంగా ఒకరు
చెరొక వైపు నుండి చర్యకు నిండుదనం కలిగేను
సగటు మనిషి ఆలోచన! తన జీవన స్థితి గురించి

ఇపుడయితే ప్రతిరోజూ ! ఏదో ఒక చోట
వార్తలలో భంగపడిన స్త్రీల జీవితాలు
నిప్పంటిన నిర్మాణ శిథిల దృశ్యాలు
ప్రేమలు విరిసే కన్న, కోప శిఖలు చిమ్మేను

మంచి భవితకై ఆవేదన! అందరిలో సహజం
అది ఏ విధం అన్న ప్రశ్న! మూసిన గేటులా
ఉన్న దరిద్ర మందరికీ పంచ బడవచ్చు
ఎందరిదో సంపద ఒకరిది కావచ్చు

మంచిని పంచే విగ్రహ రూపాలు
అగ్ని శిఖలు చూపవచ్చు, దారుణ సమయంలో
నిలిపిన ఆయుధాలు కావచ్చు, ఆగ్రహ సందర్భంలో
శాంతికి ఎడంలో విషమ పరిస్థితులలో సమాజం

మనిషితో మొదలయిన సమాజంలో అశాంతి
మనిషితోనే ముగింపు జరగడం అవసరం

ఎవరు? ఎంతవరకు? ఏ విలువలు ఆశించేరు?
డబ్బుకా? పదవులకా? దేనికి? క్రాస్‌లో ఆలోచన
విగ్రహాలు ఎన్నిటికో సాక్షీభూతంగా ఉన్నవి
మౌనంలోనూ ఆదర్శ ప్రసార రేఖలతో ప్రేరణ శక్తులు!

# 8. అదృష్టం కార్డు

నిజం రూపం కనిపించని సందర్భాలెన్నో
లౌకికమైన పొరల అడుగున అణిగి ఉంటుంది
చుట్టు ఎటు చూచిన వ్యవహార సమాజ చలనం
మానవ జీవిత కథలన్నీ నిజానికి దూరమైనవే

ఉదయ కిరణానికి చోటు దొరకని చింత లేదు
నిజ రూపానికి వీలులేని సందర్భం లేదు, ఉండదు
అభిలాష లేనిచోట; అదృశ్యంగానే ఉంటుంది
సంకల్పం ఉన్నచోట, ప్రత్యక్షంగానే చూడొచ్చు

అవసరాలు తీరాలని సౌకర్యం పెరగాలని
బ్రతుకులు వికసించాలని, కోరిక సహజం
ఇవి బహు సామాన్యాలే అయినా
ఇవి పొందడమంత సామాన్యం కాదు
వాదం పెరగవచ్చు, ఆదర్శం మారవచ్చు
విషమమైన రాగం అంతలో వినిపించవచ్చు!
లయ తప్పిన కాలం సంక్షోభం చూపవచ్చు
కటువయిన స్వర చక్రంలో శబ్దం భ్రమించవచ్చు
ఇంపైన స్వరంతో సమయం ఎప్పటికీ గడవదు
ఆశకు మనోబలంలా, వర్తనకు నైతికం ముఖ్యం
అల్లరి ఈలలు కావచ్చు, ఊళలు కావచ్చు
అన్నిటినీ భరిస్తూ గడపడమే జీవితం
పరిష్కార చర్యలకు ఆదర్శంలోనే అవకాశం
తాత్విక స్పర్శ లేనిది ప్రగతికి ఉన్నతి లేదు

కనులు మూస్తే కలలకు స్వైర విహారం కారాదు
నియతి సహన ప్రగతి లేని స్వయం శక్తి శూన్యమే

కోర్కెల వలెనే కలలకు మితం లేదు
పంజరంలో చిలకవలె
తలుపు తెరవగనే బయటికి నడచి
వరసలోని అదృష్టం కార్డు తీసి లోనికి వెళ్ళేరు

# 9. చూపే ఫలితం

దారిన కొత్త వ్యక్తి పరిచయం ఆశకు పూచిన పూవులా
స్నేహ కమలం రేకులు విప్పారతాయి, చకితంగా
అనురాగం త్యాగం విశాలత ఉదారత నాలుగు దిశల
స్తంభాలపైన జీవన నిర్మాణం, ఒక అసామాన్యం

జననం నుండి చివరిదాక శిఖరాలతో ఆయువు
నిరంతరం కృషిలో ఎవరి శిఖరం వారికి ప్రియం
లోకానికి హితకరమయితేనే ఉనికి చరితార్థం
ఇది మానవ చేతనలో ఉన్నత పరిణతి సంకేతం

మనోజ్ఞంతో కిరణం పరీమళంతో పవనం
మానసికంగా రెండూ సంస్కృతి పార్శ్వాలు!

విత్తులో భద్రంగా దాగిన సృజనపై ఆలోచన
విత్తు పడక ముందు నుండే భావికి ప్రణాళికలు!
రాబోయే భాగ్యాన్ని అంచనాలతో శ్రమిస్తూ
ప్రకృతి సమాజాలతో అనుబంధం పెరిగేను

ఏది? ఎవరు? ఎందుకు? దేనికి? వరస ప్రశ్నలతో
జవాబుకై మనుషులు! సమాజంలో అన్వేషణ పాత్రలలో
విత్తు పడిన నాటి నుండి ఏది చిరం కాదని తెలిసీ
అభిమానం తరగదు ప్రేమ పోదు ఎంత కాలమయినా

ఒకదాని వెనుక మరొకటి అవిచ్ఛిన్నంగా ప్రియంగా
సమాజ పరిణామంలో వికాస చిహ్నాలై! అలరించేను
మౌనంలో బాధ్యత విశ్రాంతిలో, అమాయకమనే వీలులేదు
మానసిక సూక్ష్మతల్ని గ్రహించడం కవుల బాధ్యత

సందేశ మెంత దూరమయినా తీసుక వెళ్ళే గాలిలా
ఎందరికి పంచినా తరగని సంపదతో కవిత!
పాత బడని నవతతో, కోల్పోని బంధుతతో
విత్తును తలపించదు, ఫలితాలను చూపిస్తుంది

## 10. 'నేనే' భావన

ఎంతటి అనాసక్తులయినా కార్యాచరణంలో
అవరోధ విరోధ విభేదాలతో జీవితాలు
వక్రత లేర్పడీ దారులు మారేను గమ్యం తప్పేను
ఇది ఒకరి బదులు మరొకరు చేపట్టేది కాదు

నేరంతో ఉరి కంబం ఎదురయ్యే దుస్థితి బహు దౌర్భాగ్యం
కసితో మసి పట్టిందే దోషం క్షంతవ్యం కాదు
బుట్టలో పూలను స్వీకరించి నవ్వు ముఖంతో
పళ్ళెరంలో నిప్పులు బహూకరించడం అనైతికం

ఏ రోజూ కొత్త దనంపై మాయని అభిలాషతో
ఇది సాకారం పొందేందు కెన్ని మెట్లు దాటాలో?
ఇది వశమయ్యేందుకెన్ని మెట్లు దిగాలో?
ప్రతి దశలో విలువలతో రాజీ పడుతూ భేదిస్తూ

రాతలో కనిపించే అక్షరాలు ఒక అందం
సంగీతంలో వర్తించే స్వర క్రమం ఒక అందం
పెదవులపై కదలే మాట తీరు ఒక అందం
కవితలో నయితే దీని అస్తిత ఒక ప్రత్యేకం

ఒకరి కవితను మరొకరు మెచ్చే కవి సమూహంలా
రాత్రి వేళ వేదికపై పైన మెరసేను చుక్కలు
నేలపై నగరంలో వెలిగే బల్బుల వరసలు
కవిత అక్షర యుతం, జగత్తూ అక్షరమయం

తన ముఖానికి చోటుకై ఆరాట పడేరు కవులు
మబ్బు అడ్డు రావచ్చు గాలి ఎత్తుక పోవచ్చు
బ్రతుకు కాగితం పడవకాదు
కవి పేపర్ టైగర్ కాదు

"నేను" భావన అనుభవ గతిని నిర్ణయిస్తుంది
ఇది అగ్ని శాఖలతో ఎదిగితే మహా ప్రమాదం
ఇది మేఘ రూపమయితే మహా ప్రమోదం
దాహం తీరుతుంది పంట చేతికొస్తుంది తృప్తిగా

# 11. యశశ్చిత్రాల సందడి

పగలు వాస్తవాల్ని రుచి చూచిన అనుభవ కథలో
రాత్రి మృదుల కల్పనల్ని కోరుతుంది మనసు విరామంలో
ప్రతి వ్యక్తిలో అంతో ఇంతో దార్శనిక స్పృహ తప్పదు
అది స్పష్టంగా బయటికి వచ్చే అవకాశం రావాలి

శంకరులు బుద్ధుడు మార్క్స్ గాంధీ దార్శనిక మూర్తులు
అప్పటికి పూర్తిగాని సమాజ శూన్యాలను నింపచూచిన వారే
మానవ ప్రస్థానంలో తమ వంతు పూర్తి చేసిన వారే
మనిషిలో సద్భావనా జగతిని నిర్మించిన వారే
గిరి శిఖరం నుండి నీతి ఒక సమయం జారుతుంది
మనస్సు ! పైకి మళ్ళీ చేరే ప్రసక్తి లేనేలేదు

నిప్పు రాలే కనుల నుండి
బాష్ప జల కణాలు జారవచ్చు
కావలసిన వివేకం నేపథ్యంలో
మనుషులలో మహనీయ మిదే

రాత్రితో పోరాడే దెవరు? ఎంతవరకు?
నిప్పుకణం జ్వలించవచ్చు! దీపం వెలిగించవచ్చు
కావలసిన పోవలసిన గమ్య స్థానాన్ని
మనిషి శక్తి చాలని క్షేత్రాన్ని గుర్తించవచ్చు

తలుపు తెరచి ఉన్నంత మాత్రాన
ఎవరికయినా  ఎపుడయినా ప్రవేశం లభించదు
రావలసిన కావలసిన వారికి మాత్రమే
ఇది తెలిసి కూడ! మరవడం జరుగుతుంది

తానేదీ తీసుకొని రాలేదనీ
తానేదీ తీసుకొని పోలేననీ
తెలియని దెవరికి? ఇచట వదలేది మాత్రం
తన యశశ్చిత్రాల జ్ఞాపకాల సందడి!

# 12. అనుకోని కళా రూపం

నైతిక విజయానికి ప్రభాత రూప మిస్తుంది కవిత
ఇది సమాజ గమనానికి స్వేచ్ఛా పథం చూపుతుంది
యత్నంతో భౌతిక మానస తలాలపైన
వర్ణ రహిత భావ సమూహాన్ని సాధించే వీలుంది

ఉదయం అస్తమయం ప్రకృతిలో సహజ పరిణామాలు
వినోదం విజ్ఞానం కళలతో మనిషి ఒదగ వలసిందే
శ్రమ జీవన శ్రేణులతో వివిధ వృత్తి భేదాలతో
వర్గ రహిత సమాజాన్ని సాధించే వీలుందా?

కవి ఆలోచనలో నిరంతర చలన శీల జనచేతన
కళాత్మక హృదయానికి ఆశయ లక్ష్యాలను పెంచుతుంది
ఎవరిదో మరొకరి స్వరం వెనుక నుండి వినిపిస్తుంది
అది తన కిష్టమైంది కావచ్చు! తన బ్రతుకులోది కావచ్చు

జాన పదం నుండి నగర జీవనం వరకు వ్యక్తి చేతన
మానవ సంస్కృతిలో భాగమైంది, విలువలు కాపాడేదీ
ఇది వినిపించుకోని పనులలో ఉండే వారు కొందరు
ఇవి వినబడినా ఏమీ పట్టనట్లు వ్యవహరించేవారు కొందరు
ఇది విని ఉత్సాహ స్థాయి పెరిగి ఉద్యమించేవారు కొందరు
స్పందనతో మనీషిగ వర్తించే వారు కొందరు

ఎంతలోతు వెళ్ళ గలిగితే అంత
ఎంత ఎత్తు చేర గలిగితే అంత
ఊహ చేత క్రియల చేత శక్తి కొలది
తేజంతో కవిత! దీని కొక ఫార్ములా లేదు

భౌతిక మానస తాత్త్విక సంబంధం
వివిధ స్థాయి భేదాలతో మనసులో
ప్రత్యక్ష పరోక్ష ప్రభావ ప్రసారాలతో
పరిచయ మాత్రంతో సమాజ భావన మెదలేను

కొంతసేపు అలరించే ఇంద్ర ధనుస్సు మనోజ్ఞ రూపం
ఎప్పటికీ బ్రతుకులో మరవని కళా రూపం దించి పోతుంది

## 13. బాధ్యత వెనక

విత్తు నుండి మొదటి దశ నవ సుందరంగా
శైశవంలో అభినవ ముఖంతో మరో తరం
పొలమొ చేనో బీడో ఎడారో అయ్యే బ్రతుకులు
ఉన్నవారు లేనివారు కోరే తొలి అవసరా లొకటే

మైదానం లోయలు పల్లం మెట్ట మరు స్థలాలతో
మనుషుల జీవితాలు ! భూమిపై సంచార నివాసాలు
కర్షకులు కార్మికులు వ్యాపారులు పాలకులు పాలితులు
వివిధ వృత్తుల వారు! సామాన్యులు! సమాజ దృశ్యంలో

కఠిన పరీక్షలు దాటుతూ, విశ్వనరుని అస్తిత కాపాడేరు
ఆశాబలంతో తమ విశేషతలతో భద్రంగా బ్రతికేరు
కవితలో జన హృదయం స్పష్టంగా వినిపిస్తుంది
పురా భావ పరంపరలో స్వేచ్ఛకు బంధనం తలపిస్తుంది!

మారు మూలల నుండి మానవతా స్పర్శ కోరుతుంది
ఇది తెలియని వారు లేరు అయినా కదలికతో పాషాణం
తొలగాలని! నరునికి పట్టాభిషేకం జరగాలని!
ఆక్రందనలో అలజడులకు శాంతి కవచంతొడగాలని

సహన లహరులపై ఊపిరి కదలాలని
ఎదురుచూచే ఆశలు మొగ్గలు వేయాలని
జడత నుండి చేతనకు మారే యోగం అవసరం
గుహ బంధం నుండి స్వేచ్ఛా ప్రకాశానికి పయనం ముఖ్యం

ఇంటి ముందు నిలుచుంటే వీధిలో ఎన్ని ముఖాలో
ఒకటి పలకరిస్తుంది, ఒకటి మిన్నక కదలి పోతుంది
మనసులో ఎన్ని భావ సమీకరణాలో పలు రంగులలో
రాత్రి కన్న కలలు దోసిలిలో పూవుల్లా జారేను

ఒంటరి కన్నా, సూత్రానికి పొదిగిన పుష్పంలా
సంఘంలో కనిపించడమే! స్వేచ్ఛలో సూక్ష్మ బంధనం
దోసిలి నుండి పూవులవలె క్షణాలు జారితేనే
ఏదో బరువు తీరిన బాధ్యత వెనుక నుండి స్వేచ్ఛ

# 14. స్వార్థ ప్రభావం

జ్ఞాపకాలు వస్తాయి తేలికగా అందని మబ్బులవలె
గతమంతా తిప్పుతాయి! మూల నుండి మూలకు
వర్తమాన ప్రబోధంతో, భవితను సూచించవచ్చు
ఇది పిల్లల ఆటలో అరటి పండు లాంటిది

హ్లాదం వేదన ఆర్జన త్యాగం అంతటా ఒకటే
అందరిలో హృదయం మాట్లాడే భాష ఒకటే
దారిన పరచిన రెడ్ కార్పెట్‌పై జారి పడిన
గులాబి పూవులా ఆ క్షణం అందానికి వశమవుతుంది

కాలాన్ని దాటే వంతెన అనుకున్నా ఈ ఐహికం
పయనంలో చూడక తప్పని కమనీయ దృశ్యాలెన్నో!
నేలపై పడిన పూవు కొమ్మను చేరేనా?
కాలి కింది నలిగి క్షోభకు గురి చేసేనా?

ముళ్ళ మధ్య నుండి కోసి అలంకరించుకునేరు
నేలపై దైన్యంగా పడి ఉన్నదానిపై జాలి పడేరా?

మనిషి గుండె గులాబితో మనిషి మాట మల్లెతో
బ్రతుకు పారిజాతంతో విలువలు చెల్లాలని కోరేరు
కవితలో వివిధ కుసుమ సంచయాన్ని కోరేరు
నవతతో హ్లాద కిరణ ప్రసారాన్ని కోరేరు

ఎప్పటికీ నాణెంలా చెల్లే కాలం! క్షణంలో మనిషికై
గులాబి పూవును ఆర్థిక వ్యూహంలో తిప్పుతుంది

బహిరంతర భావ సమన్వయంతో అమూల్యమై
గతం భవిత మధ్య ప్రస్తుతం పుష్పవనం కోరేరు
ఎంత గడచినా వర్తమానం ఎప్పటికీ మనిషి వశంలో
ఒకరి తరువాత ఒకరు పరంపరలనందుకునేరు

పయనంలో మనిషిని వేగిర పరస్తుంది కాలం
గమ్యానికి వ్యాపక క్షేత్రం చూపుతుంది స్వార్థం

# 15. నిరీక్షణం

చూపుడు వేలుకు సూటిగా వెలిగే రవి బింబం
హృదయ మావహిస్తుంది, ముందుకు నడిపిస్తుంది
ముఖానికి దగ్గరవుతూన్నట్లుగా శశిబింబం
జారుతూ మనసు నాకర్షిస్తుంది హ్లాదంగా

చీకటిని వెన్నెలగా మార్చే చంద్రుడు మాత్రం
నీలి మచ్చతో దోషాకరుడుగానే మిగిలేను
వ్యక్తుల స్మృతి పేటిలో దోషాలెన్నో! చేరతాయి
అపుడపుడు విరామంలో బయటకు వస్తాయి

మనసులు స్వచ్ఛంగా మారే అవకాశం దొరకుతుంది
ఈ సమయంలో బ్లాక్‌ను వైట్‌గా మార్చే యత్నం జరగవచ్చు
యథా స్థితికి రావడం అదే విధం కావడం దౌర్భాగ్యం

గతాన్ని తలచుకుంటే రేపటి సంగతి అట్లా ఉంచి
ఈ రోజు శుభ్రంగా గడిస్తే చాలనిపిస్తుంది
దారిలో శిథిలాలపై నడవాలసి రాకూడదు
మార్గం అవరోధాలతో ఆటంకం కాకూడదు

సమాజంపై నమ్మకం వమ్ము కాకూడదు
ఆశాలక్ష్యం దూరమై గమ్యం చెదరరాదు

ఉదాసీన ముఖాలతో దిశలు! నిశ్చేష్టంగా
జ్వాలా హస్తాలతో సమయం ఎట్టెదురుగా
తటస్థ వైఖరితో చూస్తూ కవి ఉండలేదు
విషమంలో జన హిత చర్యలకే ప్రాధాన్యం

కాహళి అయినా వేణువు అయినా
వీణ అయినా వయొలిన్ అయినా సాధనం
పందిరి అయినా మందిరమయినా వేదిక
వినిపించే నాదంలో స్వర సౌందర్యం ఒకటే

తప్పెట అయినా మృదంగ మయినా
వినిపించే లయ విన్యాసాలొకటే

దీపక్‌తో పాటు మేఘ మల్హారకూ స్థానం ఉంది
ఎన్ని హంగులున్నా! మానవ స్వరంకై నిరీక్షణం

## 16. కలహా శబ్దం

ఆందోళన తక్కువ ఉద్యమం నాస్తి రణం శూన్యం
వరద లేదు బీభత్సం లేదు, ప్రస్తుతానికి ఒకే అయినా
హింసలు హత్యలు యథాతథం, ఇదీ రోజు గ్రాఫ్!
కవిత ఎక్కడి నుండి ఊడి పడుతుంది; అంటే

ఏదయినా ఘర్షణలో గాయాలనుండి
బాధల నుండి వేదన నుండి హింస నుండి
జీవిత చలనంలో ఎప్పటికీ ఉండే సమస్యలెన్నో
నిప్పుతో పనిలేని ఒక కలహా దహన కాండ చాలు

కవిత దూకుతుంది ఎగిరి వస్తుంది హఠాత్తుగా
బావిలో ఊటలా మబ్బు నుండి మెరపులా పిడుగులా
అరణి నుండి అగ్నిలా నిశి వెలిగే దీపంలా
భౌతిక మానస స్థాయిలలో ఎటుచూచినా అవకాశాలెన్నో

వేణువు నుండి నాదంలా తీగెలపై స్వర లహరిలా
మనసు నావహిస్తుంది, కలం కొనపై వాలుతుంది కవిత!
సిరాలో ఈదుతుంది, అక్షర ధామం చేరుతుంది
ఆవేశంతో ఎగిరివచ్చి ఆపదలో పలుకుతుంది ఆత్మీయంగా

కుసుమంలా జారే కవితలో సహనం పాలు ఎక్కువ
మండే కొలిమిని తలపించే కవితలో ఉద్రేకం పాలు ఎక్కువ
హృదిని స్పృశించే ఆర్ద్ర కవితలో వికాసం పాలు ఎక్కువ
పరచిన విశ్వమయతలో అవకాశం పాలు ఎక్కువ

కవిత మూలమెక్కడిదో? తెలిసేది కవికి మాత్రమే
దీని అడ్రసు ఎక్కడనో? తెలిసేది విమర్శకులకే

చినుకులతో మోడు తలపై చివురు పాగాలా
మెలకువలో బ్రతుకులు చూపే సృజన కళలా
మౌన భాషలో ఉల్లోల జలధి తత్త్వంలా
కలహా ప్రియులకు రణ శబ్దం ధ్వనిస్తుంది

# 17. పిల్లలు - పెద్దలు

మనసుకు తగిలిన గాయాన్ని మరచేది,
ఓదార్పులో ప్రియమయిన మాటయే
నేరాన్ని ఎవరు నేర్ప నవసరం లేదు
దొరకిన అవకాశం అవసరానికి దారి చూపుతుంది

నేరం అబద్ధం దోషం వీటి గూడు ఒకటే
ఎవరూ నేర్పనవసరంలేని అనుభవ విద్యలు!
ఎవరి ఊహ ఎవరి చర్య ఎవరి పని వారి ఇష్టం
అందరివీ ఒకే నమూనాలో ఉండాలనుకోవడం భ్రమ!

ఒప్పులు తప్పులు అనుభవాల రూపాలు
పశ్చాత్తాప సమీక్షలు! జ్ఞాపకంలో

స్వాగతానికి వీడ్కోలు ప్రకృతి స్వరం సిద్ధంగా
ఇరు సంధ్యలలో సముచిత దృశ్యం! ఏర్పడుతుంది
వేళకు చీకటి వస్తుంది! నిలుస్తుంది నిర్భయంగా
మనిషికి మిత్రమో శత్రువో తెలిసేది పనిని బట్టియే

బాణంలా దూసుకపోయే మాటలో
గగన హృదయం ధ్వనిస్తుంది!
పుష్పంలా మెల్లగా జారే మాటలో
రసధుని చలనం స్వనిస్తుంది

ఆలోచనలో ఏదో ఒక కుసుమం పూయాలనీ
చీకటిలో ఒక చిరు దీపమయిన వెలగాలనీ
కోరికలుంటే సరిపోదు సత్ప్రయత్నమవసరం
అనల కణం చిమ్మడం! పిడుగు జారడం విపరీతం

మనుషుల బ్రతుకులు ఎక్కువగా విపరీతాలతోనే
గాలిపటంలా దీని సూత్రమెవరి చేతిలోను లేదు
చిన్న పిల్లల ముఖాలలో కవితను చదివినట్లు
పెద్ద వారి వాలకంలో విమర్శను పొందవచ్చు

# 18. శూన్యానికి బలం విరామం

తన గుణ సంచయంలో శిఖర కృతిని వదలేసి
ఇతరుల దోష కణ పంక్తులపై దృష్టి సరించేను
ప్రచార పర్వంలో పత్రిక ముఖ్య పాత్ర వహిస్తూంది
విలువలు కోల్పోయినా ప్రబోధంలో పీఠాలుగా

బంధన లేని స్వేచ్ఛలో ప్రజాస్వామ్య పథంలో
ఏదో బంధనలో ఉన్నట్లుగ వర్ణించడమొక అలవాటు

అందరూ అనుకునేట్లుగా అనలం
విలయ గీతమే వినిపించదు
ప్రతి సందర్భంలో ఏదో ఒక రాగంతో
సృజన గీతమూ వినిపిస్తుంది

సృజన గుణం తప్పనిదీ విషయమేదయినా
తెలిసో తెలియకనో విలయగుణం పట్ల కూడా
పథకంలో ఉపయోగ పాత్ర వహించేరు
బీభత్స కాండలో మరో సృజన సూచన జరగవచ్చు

సంఘంలో మనిషి ఉన్నది కలల పాత్రలో కాదు
వాస్తవ జగత్తులో నయితే పూర్తి బాధ్యత తనదే
ఎన్ని చెప్పినా, మానవ సంస్కృతి నిలబడింది
ఇన్నిటి మధ్య అభిమానంతో గుణ జాలంతోనే!
ఇది సుఖకర విమాన యాన సమం కాదు
గమ్యం చేరినా ఇంకా ఆపై తెలియనిదెంతో!
కొత్త దృష్టి  కోరుతుంది కొత్త ప్రపంచం!
ఏ ఇజం అయినా అది ఎంత యదార్థమయినా
ఇంత కన్న ఆకాశం బరువు మేలనిపిస్తుంది

తీరని ఆశల అల్లికతోనే వీడలేని జీవితం
లేంది? మనిషి చేతికి పని పూర్తిగ ఎక్కడుంది?
శూన్యానికి సుందర విరామ బలం తప్పు!
ఆలోచన కాకృతి ఇవ్వడంలోనే ఉంది విశేషం

## 19. గెలుపు గుర్తు

గుండెపై మండే కుంపటి జీవితంలో
పచ్చదనం మొలకెత్తాలని, చల్లదనం పొందాలనీ
చివురులతో బ్రతుకులు పూలు పండ్లు చూపాలనీ
ఆశా మూలం ప్రతి కవిలో ప్రేమ మయం

పదపదం కలిసి భావనలో సమాజ చింతనం
ఇది కళాత్మకమయ్యేందుకెంత ప్రతిభ కావాలో
వాదాలను పరిగణిస్తూ చర్చల్ని మన్నిస్తూ
తనదైన అస్తితతో హృదయ వేది చేరుతుంది

జీవకళ ఒలికే శిల్పం మౌనంగా ఉంటుంది
కవితకు కావలసిన హంగును తలపిస్తుంది
రసధుని ప్రవహిస్తూ జీవ శక్తిని స్వనిస్తుంది
కవితను చుట్టూ మిత్రుల వలె నిలబెట్టేవెన్నో?

ఉన్నతిలో కొత్త స్వరంకై గగన మెదురు చూస్తుంది
నేల బారు తీగెలా అక్కడో పూవు ఇక్కడో పూవుతో
కవితకు! మహాతరు గుణ మెక్కడిది? అస్తిత ఎక్కడిది?
గాలికి తెలుస్తుంది దీని బలం అందం ప్రయోజనం

మంచి భవితకై ఎవరి నుండి వాగ్దానాలతో పనిలేదు
హృదయ భాష వినబడుతుంది ప్రజలకు ప్రతి పనిలో!
భయపెట్టే శిలలను బాధించే ముళ్ళను దాటుతూ
ఏది ఏమయినా దొరకిన దారిన ప్రవహిస్తూ పోవడమే!

నిలయం నుండి రణానికి పోవడమంటే
సరదాగా నదిలో ఈతకు వెళ్ళి నట్లు కాదు

నెత్తురు చుక్క అయినా అంటితే కాని
కవిత! సార్థకం కాదని కొందరు!
నవత! వివిధ స్వరాల సంగమంతో
అందరికీ తెరచిన ప్రవేశ ద్వారంతో
ఎవరికి వారు తమదే "గెలుపు" అనుకునేరు
ఇంతకూ అభినందన లెవరికి? గెలుపు గుర్తు ఎవరిది?

# 20. అనుకోని సందర్భం

నగరం కూడలిలో ఎరుపు దీపం వెలిగేను
ఏ ఒకరి వాహనంపై చూపు వేయదు
తిరుగు బాటు గమ్యాన్ని మార్చేందుకా?
మెరుగు దారి కొత్తది చూపేందుకా?

ప్రతి వస్తువుతో కవి పయనంలో మాట్లాడేను
సమాజ విభాగాల ప్రతినిధులు! ఎందరో
సమాజంలో మనోరూపం! సమాధిలో వలె ఉండలేదు
ఇది నిరంతరం చేతనతో మనిషికి ప్రేరణ అవుతుంది

మరణ భయంతో సుధ సేవించిన వారూ ఉన్నారు
భయం వదలి విష పానం చేసిన వారూ ఉన్నారు
ఇంకా ఇంకా జీవించాలని మనిషిలో కోరిక సహజం!
దీర్ఘాయువులోనూ జరలో పరిమితి ఒక విధంగా వరమే!

మనిషిలో ఒక ప్రపంచం! ప్రపంచంలో మనిషి
చుట్టూ ప్రభావాల మేళనంతో వాస్తవ జీవితం
కాలి నడక వాహనం ఏదయినా ఇష్టంగా ఎంచుకొనే
మనిషి! సమాజంలో ఏకాకి కాదు ఏకాంతం దొరకదు

సముద్రం అలలపై అడుగులు వేస్తూ పోవాలని
గాలిలో తిన్నగా ఈదుతూ గమ్యం చేరాలని
తలపై రెపరెపలాడే అంకిత పతాక చేతిలో
చూపులో లక్ష్యంతో ఆత్మలో ఆదర్శంతోనే పని!

అవసరాలెన్ని విధాలో పాత్రలన్ని విధాలుగా ఉన్నా
కవుల మూల రూపం మాత్రం! సమాజ బంధుతయే
మార్కెట్‌లో ప్రతిభ వ్యాపార కళను పొందినపుడు
నిజ బంధుత వీడే సమయం కూడా రావచ్చు

జనతకు ఆరధ్య జగత్తు ! కవి దార్శనికం తోనే
విషమ స్థితులలో ప్రజాస్వామ్య ముఖం కనిపించేనా
వ్యక్తిలో నవ వికాస రూపం గంధం ప్రసరించేనా?
రంగుల బొమ్మల శాలకు పరిమిత మయ్యేనా?

## 21. ఆశకు ఆకృతినిచ్చి

అడ్డు ఉన్న పెను శిల తొలగిన గిరి శిఖరం నుండి
కిందికి దిగే ప్రవాహంలా స్వేచ్ఛలో జన జీవితం
తన శక్తిని ప్రకటిస్తుంది, భూమిని పండిస్తుంది
రాళ్ళను పలకరిస్తుది, పొదలను స్పృశిస్తూ పోతుంది

మార్పులో నవత పునరవలోకనానికి తోడ్పడుతుంది
పునర్భవ భావన పునరంకితానికి సహకరిస్తుంది
సరికొత్త చివురు ఫలం చేతి కందజేస్తుంది
మరోతరం! పాత నుండి కొత్తకు విలువలు మారేను

పాత వస్తువు గతంలో చేరి సంస్కృతిలో భద్రంగా
కొత్త వస్తువు వర్తమానంలో స్వాగతం పొందేను
రాశితో గుణం పట్ల అభిరుచితో
విలువల పట్ల లోపల మానసికాభిలాషతో

చరిత్ర అమరికలో గొప్ప పాత్ర నిర్వహించే
అస్తిత వ్యక్తులలో సంకల్పం నుండి శ్రమ చేతన తోనే
సంఘంలో పక్కన నడచే మనిషికి భయపడే
మనిషి! పైన గ్రహ తలంపై నడకకు సిద్ధమయ్యేను

కాలాన్ని పరుగెత్తించే తన అడుగు జాడలతో
విశ్వనరుడు! అల్పమైన మనసుతో చరిత్రను మార్చలేదు
గాలి పటం మేఘం పాత్ర వహించలేదు
పావురాయి వదలిన బాణం పాత్ర పొందలేదు

మనిషిని వస్తువుగా భౌతిక రూపం మాత్రంగా
నేర చరిత దుస్తులలో చూడడమొక నీతి దోషం

శూన్యంలో ఈదుతూ వస్తాయి కలలు
శూన్యాన్ని మిగిల్చి తమ దారిన పోతాయి
శూన్యాన్ని పూర్ణం చేసి సమాజ వాస్తవం
ఆశకు ఆకారం దిద్ది వెళ్ళి పోతుంది

## 22. ఎన్నుకునే స్వేచ్ఛ

ఎక్కడయినా నివాసాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛ
పుట్టుకతో మనిషికి లభించే ప్రకృతి వరం

స్వార్థంలో మనుషులు ఎక్కడి కక్కడ ముక్కలుగా
నిరోధాలు నిషేధాలు హద్దులు నిబంధనలతో
జీవితాన్ని సంకుచితం చేసి బంధనలో అణచేరు
నిరాతంక స్వేచ్ఛా పథం నవ యానాని కవసరం

సంచార జీవులు నిర్వాసితులు బహిష్కృతులు
శోచనీయ స్థితిలో జీవితాలు ఊగుతూ గడపేరు
మానవతా పూర్ణమైన హ్లాద చంద్ర బింబం
ఎపుడు బడితే అపుడు కనిపించదు బ్రతుకులో

ఏదో పేరుతో కత్తిరించిన స్వేచ్ఛలో
నిరంకుశ ఛాయలే నయమనిపిస్తాయి
కత్తుల బోనులోకి తోసే దయా రహితం
మనుషుల్ని నిప్పులపై నడిపించడం దారుణం

ఏ రోజూ రాలిన కుసుమం స్థానంలో మరొకటి
మరునాడు కనిపిస్తేనే అందం ప్రయోజనం!
జననం మరణం రెండూ ఇరువైపుల నుండి
సంధ్యల వలె అనుభవ సందర్భాలకు ప్రతీకలు

కవితలో ప్రాంతానికి వృత్తికి వర్ణానికి వర్గానికి
చెందిన వస్తువు లిపుడు పెద్ద పీట పొందేను
మనిషిలో ప్రకాశ రూప మొకటే! సృజనలో దిగుతుంది
కృతిని సజీవంగా ఉంచే జీవ రస మొకటే!

కవితలో కవి నుండి సహృదయుల వరకు అందరిలో
ఆదరణ భావం ఒకటే! ప్రభావాలు వేరు కావచ్చు
చూపులు పరచి వేచి ఉంటే మబ్బులు వచ్చేనా?
కలం చేత బూని కూచుంటే కవిత ప్రవేశించేనా?

# 23. అనుమతి పథంలో

రాత్రి వేళ చుక్కలు ఎంతటి దైన్య స్థితిలోనూ
ధైర్య ప్రకాశాన్ని నిలుపుతాయి మనుషులలో
నెత్తురు చారనో చుక్కనో ఆఖరికి వ్యాఖ్యనో
హత్తుకొన్న కవితయే సార్థకమని ఉదగ్ర కవులు

అక్షర పంక్తిలో తెల్లని శాంతి పావురం ఎగిరితేనే
కవితకు విజయ మనుకునే ఉదయ హృదయ కవులు
రంగులెన్నైనా వహిస్తుంది తెల్ల కాగితం
కవిత చేరుతుంది పలు రంగులలో ధైర్యంగా
ఇవి నిజాల్ని కప్పేసేవే కాక
నిర్భయంగా తెలుపును మార్చేసేవీ

జేబులో మరవని అగ్గి పెట్టె ఉన్నది
ప్రతి పక్షాల రాజకీయ నిలయాలకు
శత్రుతతో దహనం చేసేందుకు కాదు
జేబులో మనీ పర్సు తప్పక ఉన్నది
అవసరానికి ఆదుకొనే సన్మిత్ర సమం
డబ్బు ముఖం చూచి శత్రు పాత్ర వహించేనా?

విశ్వమయం మానవ జీవితం, వెనుకనుండి
సంకుచితమై లఘుతను పొందడం అభాగ్యం

పేరు ఊరు మతం వర్ణం దేశం
సుదీర్ఘమైన కాలంపై అవసరాలలో అనుకోకుండా
పరిణామ విభేదాలతో దశలలో సార్థంగా
జీవన చక్రం అరలపై పరిభ్రమించేరు ఎందరో

చిరునామా ఫోటో గుర్తింపులు సాక్ష్యాలు
చూపకుండా ఇపుడు అడుగులు సీమలు దాటవు
వేల సంవత్సరాలు గడచిన పూర్వ పరంపరారూపం
ఇపుడు! అనుమానం సందేహం పరీక్షల పథంలో

# 24. కోరదగింది

సమస్య పట్ల చుట్టూ ఉన్న పౌర గణాలు
మౌన శిల్ప ముఖాలతో గడిపేస్తే ఎట్లా?
సమస్య తీరేదెట్లా? ముందుకు సాగే దెట్లా.
అభిప్రాయ ప్రకటనం ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు
ప్రజా స్వామ్య స్వేచ్ఛలో ఇది మౌలిక భాగం
ఇది నీతి నియత మయితే మంచిది

సమస్య అంటేనే ముడి పడిన క్లిష్ట విషయం
పరిష్కార మంటే పూర్తిగ విరిసిన సుగంధ పుష్పం
మతిలో కదలికతో మాట బయటికి వస్తుంది
ప్రభావ ప్రసారంతో మార్పును సంకేతిస్తుంది

తొలి ఊపిరి తోనే జీవన రూపం
మనుషులతో అనుబంధం పరచిన దారులలో
నిజ జీవన పుస్తకంలో తొలి పుట మొదలు
మలి పేజీలలో పాత్రలవే! స్థలమూ కాలం సందర్భం వేరు

మానవ విజయానికి కొలమానం విలువల అస్తితయే
కనిపించని భవితకు ఊహలలో సాకారత నిస్తుంది
సమస్య నెదుర్కొనే దొక మానుష యత్నం తోనే
వాస్తవ నేపథ్యంలో దార్శనిక ప్రకాశంతో జీవన రుచితో

గాలికి చెట్టు కొమ్మల వలె సమస్యలు కదలుతాయి
మార్పులు విభేదాలు వాదాలు మొదలవుతాయి
చర్యలతో ఘర్షణకు మలుపు తిరుగుతుంది
ఎవరిపైనో కోపంలో తాపంతో ఉద్రేకంలో

ఏ మూలకో పరుగిడితే ఎచటో మాయమయితే
స్వాగత వచనంతో ఎవరూ రప్పించరు! చూడరు
మనో బలంతో పయనం! ఒక అద్భుత సందర్భం
ఇదొకటే! శరణ్యం వరేణ్యం మానవ చరిత్రలో

## 25. బాధ్యత అందరిదీ

స్వేచ్ఛ సుదీర్ఘం గాలిలా దశదిశలను స్పృశిస్తుంది
విశ్వం చుదుతుంది మనిషి మనసు నావహిస్తుంది
ప్రకృతి నుండి మనిషి నుండి స్వేచ్ఛకు ఆటంకాలెన్నో
కొండలు! భవనాలు! అందరికీ తెలిసిన వాస్తవం

అందరికీ తెలిసీ తెలియనిది మానవ మతి విభవం
స్వేచ్ఛ అవసరంలేని ప్రాణిలేదు, ఇది ప్రాణ సమం
గొప్ప విషయాలెన్నో పూర్తిగ అర్థం కాని రహస్య బీజాలతో
అందులో రాజ్యాంగం ఒకటి! షోకేష్‌లో సగౌరవంగా

బ్రతుకులో బంధనలెన్నో! వదలని నీడల వలె ఎప్పటివో
అందులో ఒకటి ప్రజాస్వామ్య ముఖం చాటున నిరంకుశం
ప్రజాస్వామ్యం డ్రెస్‌లో పార్టీల స్వంత ఎజెండా!
పాలక ప్రతి పక్షాల రగడ! సామాన్యులపై పిడుగులు

అక్షర పేటిలో రాజ్యాంగం భద్రంగా ఎంతో అవసరంగా
అపుడపుడు జ్ఞాపకంగా బయట పడుతుంది వెలుగుతో
జన హిత సంస్కృతికి అక్షర బింబం రాజ్యాంగం
ఆదర్శ జగత్తును అందించే నిజ సాధనం

ఒకరి ప్రశ్న మరొకరిని బంధనకు గురి చేయొచ్చు
ఒకరి అభిమతం మరొకరి అహం దెబ్బతీయొచ్చు
ఏ దేశమయినా అంతటా శాసన సభలలో జరిగేది ఇదే
మనిషిలో బలహీనతలకు వ్యవస్థ అపహాస్యం పొందుతూంది

పార్టీల మధ్య విభేదాలు! శత్రు స్థాయికి చేరేను
నిర్మాణ పథంలో ఆలోచన మోడును తలపించేను
ఉన్నకాలంలో బ్రతుకులు బాగా తెలిసినప్పటికీ
మనుషులకే పట్టనపుడు భవనమేమి చెబుతుంది

ఆలయ మయినా ధర్మ పీఠమయినా రాజ్యాంగమయినా
ప్రభుత్వాల బలం ఆకర్షణలకు లోను కావలసిందే

చుట్టు చిమ్మే మంటలను భరించలేక
విలువలు అపుడపుడు కనిపించవు, వినిపించవు
రాజ్యాంగంపై గౌరవాన్ని కాపాడే బాధ్యత
అటు పాలకులది ఇటు పౌరులది అవగాహన హృదయంతో

# 26. మనోవిధం అవసరాలు

స్వేచ్ఛ కంటికి కనిపించదు, ప్రభావ రూపం తెలుస్తుంది
బంధనాన్ని చూడవచ్చు లోపలి యోజన కనిపించదు
రెండూ కనిపించీ కనిపించని తతంగంలో మనస్సు
ఎంత దూరమయినా మనిషిని తీసుక వెళతాయి

చరిత్రలో రూపొందే వివిధ దశల సూత్ర మిదే
బయట పడేవి కొన్ని, బయట పడనివి కొన్ని

ఈ భూమి ఎప్పటిదో? బహు పురాతనమయింది
అయితేనేమి? మొలక కొత్తది పూవు పంట కొత్తది
కొత్త తరం ఆలోచన ఇప్పటిది! అనుభవ రుచి వేరు
ఎవరి జీవితం వారిది, స్వేచ్ఛలో రూపొందే ఆధునికం

ఏ రోజు కా రోజు కొత్తగా
ఏ తడవ కదే కొత్త ! కవితలో
అక్షర జగత్తుకు పాత లేదు
స్వేచ్ఛకు సమాప్తి మజిలీ లేదు

స్వేచ్ఛలోను బంధనలో పలు సందర్భాలలో
తెలిసినవి తప్పనివి అణచివేతలో ఉన్నవి ఎన్నో
కిటికి తెరిస్తే కనిపించే దృశ్యంలో
మనుషులెవరు కనిపించక పోవచ్చు

కవి తన అస్తితతో శూన్యం నింపేను
కవితలో సమాజ రూపం ప్రతిఫలించేను

ఆకాశం వంగి ఉండవచ్చు చేతి కందబోతూ
మనిషిలో రావలసిన విపులతను చూపేను
వెలుతురు ! చీకటి! ఏదయినా కనిపించవచ్చు
మనిషికి కావలసింది, సూచనగా లభించవచ్చు

స్వేచ్ఛలో భౌతిక బంధనల్ని తొలగ చేయొచ్చు
మనిషిలో మనోవిధంతో బంధన అవసరాలెన్నో!

# 27. రాజనీతి బంధనం

రాజ్యాంగంలో స్వేచ్ఛా క్షేత్రంలో బంధనం
రాజకీయమయితే ఎత్తుగడలో నిరంకుశం
ప్రతీకార చర్యలలో ప్రగతి నిరోధకం
చరిత్రలో జరిగిన వెన్నో! జరుగుతూన్న వెన్నో!

ఒక రోజు తెల్లవారే సరికి వెలుతురులో
కొమ్మకు ఆశా రూపం! సరికొత్త పూవులో స్వేచ్ఛ
ఒక స్థితిలో ప్రేమమయం రాగబంధంతో స్వేచ్ఛ
అనుకూలం ప్రతికూలంలో బంధనలెన్ని విధాలో?

స్వేచ్ఛగ ముందుకు ప్రవహించే జీవితాలు
రాజనీతి ప్రయోగంలో మంచు కొండలు కావచ్చు
ఇది కాలం విసరే జాలం! బంధన రూపం
ఏ మానుష ప్రజ్ఞ దీని నాపగలదు?మార్చగలదు

వెలుగుదారి చూపే స్వేచ్ఛా కిరణం
వాస్తవాను భవంలో అనల కీల కావచ్చు
ఇది మళ్ళీ సరించేది కాలంలో మార్పులో
బంధనం మోచనం సమాజ పరిణామంలో భాగాలు

నిఖిల మానవ శ్రేయం వదలిన నేతలు
సమూహాల చింతనతో మంటల్ని ఆర్పుకుంటూ
ప్రజాస్వామ్య హృదయ స్పందనల్ని మరచేరు
వికార దృశ్యాలతో వీధులలో సంక్షోభం!

ఎక్కడికక్కడ చరిత్రలో బంధన మోచన పరంపరలు
మితిమీరిన బంధనం విపరీతాలకు దారి తీసేను
జనతలో అస్తిమితం, పాలనలో కలరవం
ఇది కాలం అనల చక్రంపై తిరిగే సన్నివేశం

ఈజీ చైర్‌లో ఆలోచన లెంత మెరసినా
క్షామం తీరే మబ్బులపైనే గౌరవ ప్రాధాన్యాలు
ఎన్ని తంత్రాలతో కాలాన్ని ఆట పట్టించినా
మానవ వనిలో కోరేది, ప్రేమ పుష్ప సుగంధమే

# 28. అంకిత హృదయంతో

స్వేచ్ఛలో బంధనం మనిషికి తెలియకనే జరగవచ్చు
కవితలో కళలో నిజ గుణ బంధన మొక ఆకర్షణ
స్వేచ్ఛలో భయం! చుట్టలు చుట్టుకొని భుజగంలా
తాడును తలపిస్తుంది, కాని పయనానికి అడ్డులేదు

స్వేచ్ఛలో కృషి! భూమిని తవ్వి నీరును పైకి రప్పిస్తుంది
రాజకీయంలో బంధనం మనిషిని హద్దులలో పెడుతుంది
మదిలో విమోచనకు తిరుగు బాటు నేర్పవచ్చు
బంధనలో బాధ్యత తప్పినా, అభిమానం దెబ్బతింటుంది

సంకుచితమైన జీవితాలు ఎండిన తోటలా
బ్రతుకులో కాలం ఎడారి పరచి పోతుంది

స్వేచ్ఛలో ఎగిరే శ్రమ కేతనం! బంధనంలో
అవసరమైన బాధ్యతను జ్ఞాపకం చేస్తుంది
బంధనలో కొమ్మకు వేలాడే పూవుకు
వీడాలని ఉండదు, ఉండి పోవాలనే ఉంటుంది

స్వేచ్ఛలో సరికొత్త పూవు ముఖం వికసించేను
బంధనలో ఎప్పటికీ మనిషి ముఖం! శిలా ఫలకం
బంధనలో పరిమితిలో క్రియాచరణ రూపం
స్వేచ్ఛలో మనిషి స్వరం! గగనం నినదించాలని

ఏదో ఒక పేరు నివాసం నిబంధనలు హద్దులు
దేశం మతం కుల వర్గంతో బంధన ప్రకారాలు
మధ్య మధ్య విశ్వ మయ ప్రబోధాల సత్కాల క్షేపం
ఇది భౌతిక వ్యవహారంలో, మనిషి మనసు స్వేచ్ఛలో

ఎవరి ఆజ్ఞ నిబంధనలతో పనియే లేదు అసలు
మనిషి మనసు స్వేచ్ఛగా నిజం వైపు అవకాశంతో
పీడనతో బంధనం! సహించరాని, క్షమించరాని దారుణం
ప్రజాస్వామ్య దార్శనికత కంకిత హృదయంతోనే మోచనం

స్వేచ్ఛా కవిత్వం - 108

# కాక్‌టేల్

మాదిరాజు రంగారావు




2020

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**NO. 108**

**SWECCHA KAVITHVAM**

Free - Verse

**COCKTAIL**

by

Prof. Maadiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Y.P. 2020

Price Rs. 20/- (Twenty Rupees)

*Presented to*
*my daughter*
*Prof. M. Charitha*
*California, USA*
*on her Birthday*
*with blessings*

## పీఠిక

# ఆంతర్యం

ఇది అనుకోని దీర్ఘ కవిత. "కాక్‌టేల్" ఉత్సవ కళతో 1) ప్రతీకాత్మకమైంది. జీవిత వాస్తవాన్ని ప్రతిఫలిస్తుంది. సూక్ష్మస్థాయిని పొందింది. 2) జీవితానికి అవసరమైన విధంగా కవితలో వ్యక్తి అస్తితకు కారణమైన రసభావ దర్శనాన్ని స్పృశిస్తుంది. మొత్తం మీద 3) చైతన్య స్రవంతి (Stream of consciousness) స్పర్శ ఉంది. మనస్తత్వ ప్రకాశనాన్ని భావింప చేస్తూంది. స్థూలంగా ఇదీ! సామాజిక తత్పరతతో దీని ఆలోచనా మార్గం. మనిషిలో ఆశా కోణాల్ని స్థాపిస్తూంది. సాంద్రమయిన భావనా రూపం.

"కాక్‌టేల్" వాతావరణం ఉత్సాహపూర్ణమైంది. ఉల్లాసమయమయింది. జీవన వాస్తవికతలో ఆశా రూపాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది కొంతమంది ఆహూతులయిన అతిథులకు ప్రవేశం కలిగిన సమావేశం. ఇది ప్రధానంగా Social gathering with good intenions and pleasant atmosphere. స్థూలంగా సామాజికానుబంధంతో పాటు స్నేహ సుందరమయిన స్థితి కలిగింది. ఇదొక విధంగా సంతోషకరమైన సందర్భంగా పేర్కోవచ్చు. దైనందినమైన అనుభవాలలో చిక్కుల్ని కష్టాల్ని బాధల్ని మరచి ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండడం కనిపిస్తుంది. ఉత్సవ కళను పొందుతుంది. ఇదీ విశేషం.

పలురకాల పానీయాల (Spirits) ఫల రసాల మిశ్రమం (Hybrid mixture) పాత్ర వహిస్తుంది. రస రూపాల్ని భావింప చేస్తుంది. కవిత్వ విషయంలో రస రామణీయకతను సూచిస్తూంది. ఈ సుందర వాతావరణం మానసికమైన హ్లాదానికి కారణమవుతూంది. ఒక విధంగా మనసును క్షాళనం చేసి శుభ్రపరుస్తుంది. పునర్నవానికి సిద్ధం చేస్తుంది.

ఈ కృతిపై దృష్టితో చూస్తే పలు విషయాలు (substances) ముందుకు వస్తాయి. అంశాలు (factors) గోచరిస్తాయి.

ఇవి రచనలో నిర్మాణ (structural) రూపానికి బాగా ఉపకరిస్తాయి. దీనికొక పరిమితి లేదు. నియతి లేదు. స్వేచ్ఛా శీలమైంది. స్వేచ్ఛా కవిత్వానికి బాగా నప్పింది. వస్తువులో వివిధ భావరూపాలు Passing పద్ధతిలో ప్రవాహకతను పొందాయి. జీవితంలో ఎదురయ్యే సామాజిక రాజకీయ నైతిక తాత్విక మనస్తత్వ కళాకోణాల్లో నిబద్ధమైంది. రచనలో వీటి ప్రాధాన్యం సహృదయులకు కారణ సహితంగా విశ్లేషణకందుతుంది.

ఇందులో విశాల ప్రాతిపదికపై నిర్మాణ రూపం విశ్వమయమయింది. జీవన వాస్తవికతను ప్రతిఫలిస్తూంది. సమాజ రుచిని చూపిస్తుంది. ఇదీ దీని ఆంతర్యం.

**– మాదిరాజు రంగారావు**

# 1. కాక్‌టేల్

ఇది సమాజ చలన భావ లహరి సంగమం
పలు దిశల నుండి వివిధ విషయ గుణ సంకలనం
ఒక సందర్భంలో విరామ వేళ కవిత అందుతుంది
"కాక్‌టేల్" రూపంలో మిశ్రమ గుణ సంకేతం

సంతోష స్పర్శతో శూన్యం నిండుతుంది విశేషంగా
మతం రాజకీయ లౌకిక ప్రభావాలకు దూరంగా
ఆ సమయం మనసును హ్లాద ప్రపంచంలో తిప్పుతుంది
ఏ దయినా సాధ్యం కవి కల్పన లోనే కవితలో
శిలలు అలలగ చూపవచ్చు
అలలు శిలలుగ తోచవచ్చు

జీవన శ్రమ జలధిని దాటి అనాయాసంగా
ఆవలి గట్టుకు చేరే నావలా ఈ సమయం
మనసున అద్దంలో ప్రతిఫలనం విశ్వమయం
ఇది కాక్‌టేల్, అనుభవాల స్క్రీన్ పై ఉత్సాహ దృశ్యం

వివిధ విషయ సమీకరణ కోలాహలంతో
పలు వాస్తవాల ప్రభావాల సంరంభంతో
బహు వస్తువుల కోణాల సమాకలనంతో
భావ సార రస మేళన భేదాలతో

అనుభవ సంపదలో ఎవరి స్థాయి వారిది
ప్రయోగ ఫలితంలో ఎవరి ప్రజ్ఞ వారిది
పౌరులందరికీ రాజ్యాంగంలో హక్కు లొకటే
ఆయోజన క్రమంలో ఎవరి హద్దులు వారివి

ఇంటికి పునాదులు తవ్విన శ్రామికులే
శిథిలాలను తొలగించే పనిలోనూ
మనుషుల జీవితాల నిండుదనం సమాజ బంధంతోనే
జీవన చేతన సంగ్రహ రూపం "కాక్‌టేల్" సంధ్య

## 2.

"నేను" కేంద్రం నుండి మొదలయిన స్వకీయం
వలయాలను దాటుతూ సమాజ చక్రంలో రోజూ
అనుభవాల పరంపరలతో దేశం ప్రపంచ మవుతుంది
భూమి దివం మధ్య ప్రాణి మనిషితో చుట్టూ సంశ్లిష్టమైన సంఘం

రాజకీయ తాండవ ఘట్టనలో
ఎపుడెవరు? పై కెగసేదీ తెలియదు
ఎవరెపుడు పైకి లేవ లేక కిందనే
మట్టిలో అణగి పోయేదీ తెలియదు

నేడు ఉన్న పార్టీ రేపు ఏమయ్యేదీ తెలియదు
పాలనలో ఉన్న పార్టీ రేపు ఏమయినా కావచ్చు
మబ్బులా పై కెగసిన ఆలోచన క్రియలో
జల బిందువు! రాలవచ్చు రాలకపోవచ్చు

నదులు! పైరు పంట గురించి మాట్లాడతాయి
గిరులు ! మబ్బు లను గురించి మాట్లాడతాయి
రవి తేజానికి మలిన మంటక పోయినా
అనుకోకుండా మబ్బులు అడ్డం రావచ్చు!

తనతో పాటుగ ఇతరుల గురించి కూడా
వస్తూ పోయే దారులలో మనుషులతో
"నేను" "నీవు"తో వికాస చరిత్రలో "మనం"
ఎన్ని 'మనం' విభాగాల తోనొ! సమాజం!

ఎన్ని దిశలు ఎంత సేపు ఎదురు చూచినా!
సూర్యుని ఆగమనం మాత్రం తూరుపు దిశ నుండే
మనిషి మాత్రమే తన ఇచ్ఛతో రోజులు గడచేను
అనుకూలం కాని పరిసర వాతావరణాన్ని
అనుకూలంగా మార్చేను మతి ప్రతిభతో

# 3.

వ్యతిరేకంలో పార్టీల నిరసనం అభిశంసనం
పాలన పగ్గాలెవరి చేతులలో ఉన్నా
ఎవరి ప్రాధాన్యం వారిది ఆదర్శ విధానంలో
నైతికతకు భంగం వాటిల్లినపుడె ప్రమాదం

ఎవరికి స్వర్గసమం ఎవరికి నరక సమం అంటే
అటు నుండి ఇటూ, ఇటు నుండి అటూ తడవ తడవకు
మార్పిడిలో! అయిదేండ్ల కొక మారు ఊపిరితో
ఎన్నికలలో అభ్యర్థులు ఒకరు అగ్ని కీల ఒకరు వాన చినుకు

ప్రపంచం ప్రపంచమే! ఊరు కాదు సత్రం కాదు
వైశాల్యం వైవిధ్యంతో పోటీలో వివిధ జీవన కథలతో
పయనంలో అందరి లక్ష్యం తమ గమ్యం చేరడం
ఎవరేమి అన్నా! సమాజ పరిణామ దశలు అనివార్యంగా

డైరీలో ఒక రోజున సంధ్యా సమావేశానికి ప్రత్యేకం
కవితా రస పిపాసార్తులకు, కాక్‌టేల్ సమాజరూపం
స్వర్గ ఖండం చిన్నది ఊడి పడినట్లు ఉంటుంది
సుఖ భావన పొందే దశకయి మానుష యత్నం!

ఆ ఏడు వరకే గోడపై కాలెండర్ నిలిచే యోగం
పంచాంగం పాతది సంప్రదింపులకు పనికి రావచ్చు
అదీ భద్రపరచేవారుంటేనే, అభిరుచితో శ్రద్ధగా
ఇపుడయితే కంప్యూటర్! ఆ పనినీ తప్పిస్తూంది
మెత్తని టచ్‌తో ఎక్కడెక్కడిదో అపూర్వ సమాచారం
వచ్చి వాలుతుంది ఎదురుగా, చిలుకనో! పావురాన్నో వదలినట్లు

'కాక్‌టేల్' ఏ పార్టీదీ అథారిటీదీ కాదు, రహస్యం లేదు
వీథిలో జరిగే సంభాషణ చెవికి సోకవచ్చు
ఏ మూల నుండో ఆర్త ధ్వని! దూసుకొని పోవచ్చు
అప్పటి అవకాశంతో ఆలోచన కిర్మీర శోభ పొందేను

# 4.

ఏ రోజే కాదు ప్రతి ఘడియకూ రంగులు మారే
రాజకీయం! తెలుపు వైపో నలుపు వైపో ! తెలియదు
మిగతావి చుట్టూ తిరుగుతూ ! తమ ఇష్ట ప్రకారంగా
గోడపై చిన్న పిల్లలు వేసిన రంగుల దృశ్య సమాజం

ఇది మానవ సంఘం అయితేనేం, విషమ సమయంలో
మృగాల జంతువుల కొరతకు డోకా లేనట్లే ఉంది
శంకించే పని లేని వర్తమానం వికృత దశలో
రివర్స్ సంస్కృతిని కోరేరా? పర్‌వర్స్ దశకు చేరేరా?
దృశ్యం పరిశీలిస్తే రెండూ సాధ్యంగానే ఉంది
ఆధునిక యుగ స్వరం ముక్కలయి అతుకులతో వినిపిస్తుంది

అభివ్యక్తి సుందరతలో ప్రకృతి నాశ్రయించడం
కవులకు పరిపాటి! భావనలో నిబిడత చేకూరేను
అంతరంగ మొకటి కనబడకుండా ఉందని తెలిసీ
మనసులో మాలిన్యం మాటలతో పోయేది కాదు

ఏ విధం ఏ  స్థాయి అయినా తన పాపం మూటను
ఏ హిమగిరి పైనో! ఏ నదిలోనో! చెట్టుపైనో విసరేస్తే
మానసిక మాలిన్యం క్షోభమాయమయ్యేనా?
ఎన్ని రాత్రులు! ఎంత వెన్నెలో విడుదల చేసే
చంద్రునిపై నీలి మచ్చ పూర్తిగా తొలగేనా?
జీవితమూ అంతే! నీలి గీతల చిత్రం! ప్రమాదం

ఉదయ సంధ్యను నమ్మినట్లు
సాయం సంధ్యను నమ్మలేరు
అతీతాన్ని తలచినట్లు వాస్తవాన్ని గుర్తించేరా
వరం లభించినట్లు కరుణ జలం సరించేనా?

ప్రభుతతో మతం సమాజ బంధంతో జనశక్తి
నైతిక చేతనతో లఘు జీవన రూపం "కాక్‌టేల్" సందర్భం

## 5.

చెట్టు మూలం కనిపించీ పూర్తిగ బయట పడదు
దీని పైనే విశేష దృష్టి అభిలాష! అన్వేషణం
ఇవి సామాన్యుల జీవితాలు పట్టని అమూల్యాలు
మనిషిలో తన బలం తెలివి పట్ల అపార విశ్వాసంతో

పైకి కనిపించే పూవు ఫలం గురించి
మనిషిలో అనుభవ కమనీయం ముఖ్యం
కట్టు కథలు పాతుకున్న చరిత్ర నుండి
వాస్తవ రేఖపైకి చేరుతుంది, అనివార్య వాస్తవం

భావనలో వైరంలో భుజగం పులి సింహం
సృగాల ప్రవేశం లేని ఏ రణ తంత్రం నడిచింది
నెత్తురు వరదను దాటే సాహస బలం తగ్గి
శాంతి వనంలో పూల మధ్య చేరిన వారెందరో?

కన్నీరుతో చీకటిని తరించే వారెవరు?
తన వైపు లాగుతుంది లోపల దింపేస్తుంది
యుద్ధానంతరం జరిగేది ఇదే! సమాజంలో
జ్ఞాపకాలు ఆగని మంచికి తోడ్పడవచ్చు
గతంలో జరిగిన చెడును మరవ జేయొచ్చు
మనసులో పశ్చాత్తాపంతో కొత్త స్వర్గం మొదలు

జ్ఞాపకాల ఆనవాళ్ళు ఒంటరితనం పోగొడతాయి
మనసును సమూహ దృశ్యంలో నడిపిస్తాయి

మాట నుండి మాట విత్తు నుండి విత్తులా ఎదిగి
పచ్చని భావనతో గాయాన్ని చల్ల బరచేను
ఇది దేనితో సంబంధం లేని మనోగుణ బంధం
కొత్త తరం ఆశలలో స్వర్ణ భవిత పొంచి పొంచి

కదలి పోయే దృశ్యం నుండి తరలే మానవ రూపం
వచ్చే మరో దృశ్యంలో కనబడేను అభినవంగా

# 6.

వ్యక్తిలో చీకటి ముఖం వికృతిని వల్లిస్తుంది
మనసులో వెలుతురు దృష్టి ప్రకృతిని వదిస్తుంది
బ్రతుకులో అవసరాలకు రెండూ పని బడేవే
ఎవరికి కావలసింది! వారు ఎన్నుకొనేరు

రోడ్‌పై ఒకరు పట్టాలపై ఒకరు గగనంలో ఒకరు
సమయం సందర్భంతో ప్రకృతి వికృతి ప్రవేశం!
బల ప్రళయంతో మారిన దేశ పటాలెన్నో
ప్రభుతతో మారిన జీవన మత రూపాలెన్నో

రాజ్యాన్ని పొందేందుకు ఆయుధా లెన్ని విధాలో
అన్నీ సమాజ పరిణామంలో పాత్ర వహించినవీ
రణం పట్ల దూకినట్లు ముందుకు
శాంతి పట్ల మనిషి ఆలోచన సాగదు

ప్రభుతలో అహంకార బీజం పెరిగి తరువై
సమాజ ప్రగతికుపకరిస్తుందనే కానీ
క్రియలో ఇది భ్రమయే అంతా ఉన్నది ఉన్నట్లే
వాగ్దానం ఊత పదమై మూడో కాలు అవుతుంది

కాలక్షేపంలో కట్టు కథల నీడలలో బ్రతుకులు
క్షణాలు దూది పింజల్లా శతాబ్దాలు గడచేను
తమతో మనిషి చూపును పరుగెత్తిస్తాయి
చరిత్రలో వికాస కారణ హృదయులెచటనో
కొద్ది మంది చేతిలో దేశ భవిత పదిలంగా
వెలుగులతో జీవితం! ప్రకృతికి దగ్గరగా వికృతికి దూరంగా

కలహ రాగ వశమై! శాసన సభలు మ్రోగేను
మాటిమాటికీ తెగే తీగలతో వాద్య విశేషంలా
పాలనా వశమై రాజకీయ కచేరి! సాగుతుంది
మధ్య మధ్య వస్తూపోయే నేతల హంగామా! తమ కళలతో

# 7.

మొదలు నుండి చివరి దాక ఆకాశంలో విస్తరించి
ఏ బరువు నయిన మోసేందుకు సిద్ధంగా! కవిలో కవిత
వీడని సమాజ బాధ్యత వరమై స్పందన వశమై
రాబోయే కాలానికి విలువైన ఖజానా అవుతుంది

కొండలు స్తిమితంగా భౌతికాన్ని తలపించేను
నదులు ముందుకు కదులుతూ మానసాన్ని కదలించేను
నిశ్శబ్దానికి చోటు లేని రాజకీయం సశబ్దంగా
ఎప్పటికీ ఏదో ఒక రాగాలాపన వినిపిస్తుంది

పరిసరాలు ! మనుషుల నిజ రూపం జ్ఞాపకం చేస్తాయి
ఇంకా బయటికి రాని విలువైన పాత్ర వేచి ఉంటుంది
అద్దంలో కనబడేది తన ముఖమే అయినా
తాను గర్తు పట్టడానికి కాస్త సమయం పడుతూంది

శాసన సభ బయట జ్వాలా పంక్తులు
ఉగ్రవాద విధ్వంస చరణ సూక్తులతో
పేరు ఒకరి దయినా కలిసేది ఎందరో ఇందులో
రోజు కూలికి వచ్చినట్లు నేరగాళ్ళు అల్లరి మూకలు
ఇదీ! ప్రజాస్వామ్యంలో ఆచరణ రాజకీయం
ఇది ఇప్పటి కథ! గురి తప్పి కళ తరిగి పార్టీలు

పూర్వ స్మృతులు దీపాలయి క్షణమైనా
చీకటిలో పోవలసిన దారి చూపవచ్చు
నిప్పు రవ్వలై చిమ్మి! పరిసర దృశ్యంపై
శౌర్యాన్ని చూపించవచ్చు, ఉత్సాహపరచవచ్చు

మారే రంగుల దృశ్యాలతో జీవితా లొకటొకటి
నిశ్చయానికి రాలేని సంక్షుబ్ధ స్థితిలో సమాజం
కన్నీటి బిందువులో చీకటి! చిన్ని పడవలా
బాధితుల్ని దుఃఖితుల్ని అవతలి గట్టుకు చేర్చేనా?

## 8.

ఎండిన బ్రతుకుల్ని చివురులతో నింపే కరుణలా
పచ్చని సమయాల్ని సుమ ఫలాలతో చూపే ప్రేమలా
కవితలో, జీవశక్తి ప్రసారంతో సమాజం
రణం శాంతి చెరొక వైపున ఆకర్షణ నిలిపేను

భద్రతకు ఉత్సేకం శాంతికి వికాసం తప్పనిసరి అయినవి
ఎంతటి మహనీయుడయినా సమాజ శక్తితోనే విజయం
కృషితో కీలకమైన పాత్రలో మనుషులు
మారే దృశ్యంలో భాగమై, పయనించేరు

ఎవరూ తమ నిలయంకై వెదకే అవసరంలేరు
నడచే కొద్దీ వేసే అడుగులతో భూమి వశమవుతుంది
సరసిలో రవి బింబం ప్రతి ఫలనం
మనిషికి తన నిజరూపాన్ని జ్ఞాపకం చేస్తుంది

"నేను" నుండి వ్యక్తులు సమాజ చరిత్ర లోకి
వాస్తవాన్ని సుందర రేఖా చిత్రమయం చేస్తూ
ప్రవాహ మెంత వేగ వంతమయినా
ప్రతిఫలించే ఏ వస్తువు కొట్టుకపోదు

పోగు తీసి ఇదే! వస్త్రమనుకోమనే ఆలోచన
మనిషిలో అడ్డుదారిని సుగమం చేసినట్లే
పలు రంగులచే కప్పబడిన "నిజం"

మనిషి కొక రంగు ఇష్టం
తంత్రులు పలుకుతాయి ఏ స్వరమయినా
వెలుతురు చూపుతుంది ఏ వస్తువు నయినా

వెలుతురు లేకపోవడమే చీకటి
మనిషి మనసు ఎప్పటికీ వెలుతురుతోనే
ఆలోచన అన్వేషణ వివేచనలో! మాత్రం
తెలుపు నలుపు దాటి వివిధ వర్ణ సమీకరణాలతోన

# 9.

ఒకరొకరిలో ఒక్కొక కోరిక విత్తయి ఎదుగుతూ
పచ్చని చెట్టయి ఎదురుగ నిలిచిపోవాలనీ
పడవయి కదలి ప్రవాహాలను దాటించాలనీ
మరో మనిషిలో దాగిన నిజాన్ని చూపాలనీ

రహస్తంత్రులపై ఇంతవరకు వినిపించని సంక్షుబ్ధం
ఈ సమయం వినిపిస్తుంది స్వరంలో కరుణతో
పైకి కనిపించని బరువు మనసుపై
ఆకాశం ముక్క ఊడి జారినట్లుగా
ఎదురుగ కనిపించే బరువు! బ్రతుకులో
భ్రమణంలో భూగోళం అనుభూతమవుతుంది

ఎన్నికలో విజయంతో భుజాలపై బాధ్యతను
ఇంట్లో హేంగర్‌కు తగిలించి బయట పడేరు
ఆలోచనలో లౌకిక తంత్రంతో రాజకీయ మతులు
తిరిగే రంగుల రాట్నం వలె పదవులపై ఆశతో

మ్రోడుల్ని చివురింపజేసే వసంత హృదయులు
బండల్ని శిల్పాలుగ తీర్చే కారుణికోత్తములు
అక్షర పంజరంలో జలదాన్ని నిలిపి పంపేరు కవులు
జనతలో కదలే అలల జలధిని చూచేవారు

శక్తి ఉన్న సంకల్పానికి సాధ్యం కానిదేముంది?
నిరాశలో దిగులుతో శూన్యం! మాత్రమే
ఆత్మ హత్య హింస బీభత్సం మాత్రమేనా?
కవితలో తటస్థ ప్రదర్శనంలో అమాయకం చేరదు

ట్రాఫిక్‌తో సందులేని రోడ్‌ను దాటే కష్టం లేకుండా
పనులన్నీ తనవైపే ఉంటే బాగనిపించవచ్చు
భయభావంతో పలికే మాట సహజమైనా
భద్రత గురించి చింతనకూ కటు వాస్తవానికీ మధ్య పోటీ

## 10.

కోష్ణ బాష్ప కణం జారిన మట్టి నుండి
అనల తరువుకు బీజం లభించేనా?
విసరిన బీభత్సమెంత వాస్తవమైనా
నిలిపిన ప్రతిమలో ఆదర్శమెంత ఆకర్షణో!

మార్పును కోరేవి రెండు భిన్నమైన ముఖాలు
కాలక్షేపానికి కాదు వైరుధ్యాలకు సంకేతం
సంఘంలో అవసరాలన్నిటికీ సరిపోయే
దార్శనికత ఎక్కడుంది? కాలంపై మార్పులతోనే

కల్పతరువైనా గడ్డి పోచైనా కవిలో స్పందన శీలం
కవితకు ప్రవేశ ద్వారం తలుపులు తెరుస్తుంది
రోజు జ్ఞాపకాల్ని వదలి వెళ్ళిపోతుంది
అవి మెట్లుగా కీర్తి శిఖరాలను పొందాలని ఉబలాటం

మాట ఉపయోగంలోనో అలంకారంగానో
పనికొస్తే అలరిస్తేనే సృజనకు భాగ్యం
ఉత్సాహం కల్లోలం చెరొక వైపు నుండి
కవితలో జీవన పార్శ్వాలను పూరిస్తాయి

ఆయుధం ప్రేలి ప్రేలి విసుగెత్తి విరామంలో
శాంతికి తహతహలాడుతుంది. ప్రేమను పంచాలని
గతాన్ని మరచి ప్రస్తుతాన్ని వరిస్తుంది.
ఈ స్థితిలో మౌనం పూర్ణాంగీకారమే

సృజనలో పైకి కనిపించని కర్త అహంకారం
కవికి ప్రత్యేకతనిస్తుంది
కవితను భిన్నంగా నిలుపుతుంది ప్రత్యేకంగా
మందలో ఒకరు కాదు, మందిలో జిరాక్స్ కాదు

పయనంలో ప్రకృతితో బ్రతుకులో సమాజంతో
మనః ప్రపంచ దర్శనం హ్లాదకరమయిన బాధ్యత

## 11.

జీవ భావ సూత్ర మొకటే అయినా
మనిషి మనిషికీ నిర్వహణ పాత్రలు భిన్నం
బాధ్యతలో ప్రేయం, కర్తవ్యంలో శ్రేయం
కాలానికి అదనంగా విశేష రూపం కావచ్చు

మనసులో అణగిన కోర్కెకు సాకారం
బయట పడే సుందర సంతోష సమయం
ఇది కాక్‌టేల్ దృశ్యం చూపే సమాజ నేపథ్యం
ఇది వ్యక్తిలో కళాత్మకంగా బయటపడే అవకాశం

కళలు కవిత పక్కకు తొలగి పోతే
విపరీతాల విచిత్రాల ఊసెవరికి కావాలి?
ముందుగ స్పందించే సంవేదన రూపం కవిత!
భావ సాంద్రమయిన సంవేదన నిండిన విజయం

వెచ్చని కన్నీరు వెనుక నున్న
గాయం కనిపిస్తుంది! మనో నయనానికి
చల్లని కన్నీరు తోడు ఉన్న
పుష్పం! కనిపిస్తుంది! హృదయ నేత్రానికి

నిజం బయటి కొచ్చి నిలిచే స్థలం లేదు
మబ్బు నుండి మెరపులా మాయమయిపోతుంది

నిజం ఆగదు నదిలో అతి వేగంగా తరలిపోతుంది
నిజం నిలవచ్చు అలల పై పూవులా వెళ్ళిపోతుంది
కనబడింది చూస్తూ మనిషి నిలిచి పోవలసిందే

ఇది మనసుకు అందే దాక! కాక్‌టేల్ లాంటి సంగమమే
దాగిన నిజాన్ని పైకి మొగ్గలా కనిపింపచేస్తుంది
కవిలో వేచి ఉంటుంది కవితలో వికసిస్తుంది
జలధిలో మునగనిదీ నిప్పుకు కాలనిదీ హృదివశమైందీ

## 12.

నిరాశకు గుడ్ బై చెబుతుందీ క్షణం వాస్తవం
అనలంతో రగిలే మనసుకు మంచు కవచ మందిస్తుంది
ఇచట తాపం శోకం కనిపించవు వినిపించవు
ఎక్కడివైనా భద్రంగా గాలి జనతకు చేరవేస్తుంది

ఒక దిశలో దూరం వెళ్ళాక మలుపులో
ఎక్కడయినా కాక్‌టేల్ ఎదురు పడవచ్చు
ఇది కేవలం మనుషుల ఉల్లాస ఘడియ కవకాశం
కవి మనో నిలయంలో ప్రతిఫలిస్తుంది.
దొరికిన చోటుతో మానసికావసరాలకు తగిందీ
గతం కొస నందుకొని వర్తమానంలో పయనంతో

పులిలా దూకబోయే ఆలోచనకు
సమయం బోనులా సిద్ధంగా ఉంటుంది
ఒంటరి తనంలో పెరిగే శూన్యాన్ని
ఎక్కడికక్కడ కత్తిరించి విలువలతో నింపుతుంది

దిగులులో ఆత్మ హత్యలకు ఆలోచన రాదు
రగులుతూ హింసకు పీడన కవకాశం దొరకదు
నీరు లేని బావిలా ఉన్న మనసును
కరుణ జలంతో నింపుతుంది ప్రేమతో

కన్నీరు ఒకటే కావచ్చు బాధలు వేరు వేరు
పరితాప మొకటే కావచ్చు, కారణాలు భిన్న భిన్నం

మనిషి నుండి పొందే విషాదాలకు తావులేదు
ఆలోచనలో విభాతాలకు అవకాశాలెన్నో
బ్రతుకులో జీవన విధులు ఎన్ని తీరులలోనో
ఒకచోట కలిసిన ప్రతినిధుల రూపం కాక్‌టేల్
ప్రయోగాలకు వినాశనాలకు చోటులేదు
ఆరోహణలో సోపాన క్రమమొకటే తృప్తికి గ్రీన్‌లైట్

# 13.

ఇది అందిరికీ ఆశ్రయం, మార్గ దర్శకం
ఎవరో కొందరి కవకాశంతో ప్రజాస్వామ్యానికి దూరం కాదు
అనుచితం అనైతికం అరాచకం విసరిన నిప్పుల వలె
భావ స్వేచ్ఛ కంతరాయమై నిరంకుశంలో మొదటిమెట్లుగా

అసలు దారి తెలియని వారు కొందరు
ఎటైనా పోయే దారి కనబడని వారు కొందరు
కొందరికి పరిమితమై కొందరికి తలుపులు తెరవబడీ
పాలకులెవరైనా అవే సమస్యలు దృక్పథాలు వేరువేరు

ఉన్మద చర్యలతో ప్రజాస్వామ్య ముఖం నల్లబడుతూంది
నేరం జరగని, ఉరి స్తంభం ఎరగని సంఘాన్ని చూడాలనిపిస్తుంది

మనుషుల ఐక్యం కన్నా విభజన రేఖలతో
ఆలోచన! నిశితంగా తీవ్రంగా సాగుతూంది

నిర్మాణంలో కన్నా విధ్వంసంపై అభిలాష
మనిషిని వికృతికి దగ్గర చేస్తూంది
బ్రతుకును ప్రకృతికి దూరం చేస్తూంది
ఎవరికి వారు తమ గెలుపుకు ప్రాధాన్యంతో రాజనీతి తీర్చేరు

ఉన్న కంచెను తొలగిస్తే మరొకటి దాని స్థానంలో
ఉన్న గోడను కూలిస్తే మరొకటి దాని స్థానంలో
అంతరంగ ప్రకాశాన్ని ప్రతిఫలించే రాజ్యాంగం
అందరికీ ఆమోద కరం మర్యాదామయమైంది

పూర్వ గాథలయినా నేటి కథలు అయినా
మనిషి లొంగి పోయేది ధనం ముందు సుఖంకై
సంఘంలో వివిధ భావ సమన్వయ వేదిక ప్రజాస్వామ్యం
సూర్యకిరణ స్పర్శతో విశ్వప్రేమ స్పృహతో సాగడమే లక్ష్యం

## 14.

స్వేచ్ఛలో మానవ ప్రగతికి మితం లేదు,
ఆకాశంలా పరచబడీ ఇంకా ఇంకా విశాలతకై
జలధి వలె గభీరమై ఇంకా ఎంతో లోతులతో
వ్యక్తి నుండి సమూహాల దేశాల అంతరాలతో

ఒక విశేష ఘటన మొదటి రోజు జన్మదినం
ఈ దేశ స్వాతంత్ర్య మయినా రాజ్యమయినా ఏదైనా మహనీయం
శ్వాసలో గాలిలా మనిషిలో మానవత
బ్రతకడానికి కావలసిన పాత్ర కయి వెదకుతూ

కల్లోల సముద్రం సంక్షోభ సమాజం రెండూ
ప్రకృతిలో ఒకటి చరిత్రలో ఒకటి మనిషి ఎదుర్కోవలసినవీ
దాహార్తుల ముందు వడ గండ్ల వాన విసరుతుంది
కేరింతలతో పిల్లల సంతోషానికి పట్టం కట్టేను

ఎవరికి కనిపించినా కనిపించక పోయినా
ఎవరి చూపు పడినా పడకపోయినా
కవిలో జీవన కథలే, అక్షర తంత్రీ స్వనంతో
సృజన చేతనతో ఒకటొకటి బయటికి వస్తాయి

పక్కన ఒక మనిషి తోడు అనురాగ హృదయంతో
లోయలు దాటాలిసిన సమయాన వంతెన వలె
అనుమానం ఊయెలపై ఊగే మనసుకు
స్తిమితమైన స్థితి కవకాశం! సాగుతుంది పయనం

కాగడా అయినా వెలిగే బల్బు అయినా ప్రయోజన మొకటే
ఇవి మానవ చరిత్రలో ఆరోహణ దశలకు ప్రతీకలు

ఆశామయమీ జగత్తు! లోయల వలె నిరాశలు
ఆశ లేంది! అడుగు ముందుకు సాగదు, కదలదు
భూమిపై మబ్బుపై మనిషిపై నీతిపై ఆశ
సుందర వాస్తవ సమయానికి చేతనత నిస్తుంది

# 15.

మహా నిలయం దర్వాజ కిటికీ తలుపులు
ఎక్కడి వక్కడ మూయ బడీ
భయానికో భద్రతకో అలవాటుకో కానీ
కారణ మేదయినా ఇది స్వేచ్ఛకు అవరోధం

ఎవరూ స్వాగత ముఖం చూపక పోయినా
బయటి నుండి లోపలికెళ్ళే అలికిడి ఎవరిదో!
నిరంకుశాన్ని ఛేదిస్తూ సూక్ష్మంగా కదలుతుంది
ప్రజాస్వామ్య భావనా పథంలో స్వేచ్ఛామయమై

లోపలి కవకాశా లెందుకు నిలిపేసిందీ
ఏదో కొంత తెలిసీ తెలియని చిదంబర రహస్యం
ఎండకా ? చలికా ? వాన జల్లుకా ! మరొకటా?
నియంతృత్వ నీతిలో ఒత్తిడి పెంచే వర్తనదా?

పలు రంగుల బొమ్మల వలె ప్రజా ప్రతినిధులు
బాధ్యతల్ని మరొకరి బుజాలపై విసరీ
వీరు చీకటి కలవాటయిన వారు కావచ్చు
వీరు వెలుగుకు జంకే మనోమయులు కావచ్చు

దేనికోసమయినా సమస్య జటిల మయ్యే విధమే
తెలియనిది తెలుసుకోవడం వివేకవంతుల పని
కనిపించని ఆకృతి ఊపిరి దారిన లోనికి
ప్రవేశించడ మొక ప్రభావ గుణ విజయం

తాను లేంది అంతా శూన్య భావ సూచనతో
కాల ముఖంపై ఇరువైపుల ఓటమి గెలుపు టాగ్‌లూ
లోపలి కెళ్ళే యత్నంలో ఎవరిదా? ప్రభావం
నిశ్శబ్ద పరివర్తనకు హేతువైన సంకల్పానిది!

ఈ పయనం ఆగదు, తరం నుండి తరం అందుకునేది
ఎవరి ప్రభావరూపం? ఎవరికి కనిపించని పరివర్తన పవనానిది!

## 16.

మౌనంగా ఉన్న గగనం, నాలుగు దిశల నుండి
శబ్దాలను స్వీకరిస్తుంది, అదొక నిఘంటువు అవుతుంది

ఉదయం ఒక రోజుతో ఆగేది కాదు
అలాగే సమాజమూ తుది వాక్యం ఎరగదు
కవిచే భద్రంగా అక్షరంలో అమరంగా
అంతరంగం లోన సూర్యునిలా! ప్రకాశ రూపంతో

ఏదో జరగాలని జరుగుతూ ఉన్నది చాలదనీ
జనత సుఖం పై ఆశతోనే ఎందరో విభేదాలతో
ఇది సమాజ బంధుతతోనే సాధ్యం! వ్యక్తులలో
భూకంపం! పెనుతుఫాను ఎప్పుడో ఎక్కడో కాని రావు

ఆ వచ్చేదేదో! జలధిలోనో ఎడారిలోనో వస్తే బాగనీ
మనిషికి ముప్పు తప్పేననీ! కోరిక సహజం
కిరీటం సర్దుకొనే వీలు లేక పోవచ్చు
సింహాసనం భద్ర పరచుకొనే సమయం ఉండకపోవచ్చు

తన తలపై పూలజల్లు! కురియాలనీ
మరో మనిషి తలపై పిడుగు పడితే పడనీ
ఈ కోరిక అంతరాంతరంలో తిష్ఠవేసి
ఎప్పటికీ జ్ఞాపకంగా ఉంటుంది మనిషిలో

భుమిని ఆర్ద్ర పరచే వర్షం రావలసిందే
చినుకు చినుకులో జనహిత సంభాషణ ధ్వనిస్తూ

దాహార్తిలో జలసేచనం అందరికీ సమంగా
ఏ భేద భావం ఉండదు, ప్రమోదమైనా ప్రమాదమయినా

జరిగిన సంఘటనల నేపథ్యంలో రహస్యం
కవికి నేతకు ఇరువురికే తెలుసు
నేత మాత్రం తెలియని అమాయకత చూపేను
తెలిసిన దానిని కవి ధైర్యంగా ప్రదర్శించేను

## 17.

ఆధిపత్య భావనతో అధికారం మొదలవుతుంది
తాపంలో కోపంతో సంఘంలో ఇమడలేక
తమ నిలయం అడవిదారి పట్టడం జరుగుతూంది,
విరాగంలోనో ఉగ్రవాద చర్యలతోనో

శిశు దశ నుండి భూమిపై అడుగులతో
శరీరానికి దుస్తులు! అనివార్యమవుతాయి
మనసుకు ఆలోచన కవచంలా ఆవరిస్తుంది
భౌతికం మానసం ఇరు స్థాయిల్లో దుస్తులు తప్పవు

చంద్రుని గుండెకు హత్తుకోవాలని ఒకరు
ఇది సాధ్యం కావచ్చు, ఎపుడయినా ప్రస్థానంలో
సూర్యుని చేతి వేళ్ళతో స్పృశించాలని ఉండొచ్చు
ఇది సాధ్యం కానిది! ప్రకాశ రూపం ఆదుకొంటుంది

చీకటి అయినా మంచు తెర అయినా
ఎదురుగా ఉన్నది తొలగితేనే ! పయనం సాధ్యం

ఎవరి కోరిక వారికి పరిమితమై పోతుంది
ఎవరి యత్నం వారిది మానుష పరిమితులలో
ఏదీ ఆగదు, అన్నీ తరం నుండి తరానికి
సృష్టిలో ఉండే మనిషి! అధికతను నిలుపుతుంది

గ్రామం విస్తరణం పట్టణం
పట్టణ వికాసం నగరం
వీటి మధ్య పోటీ ప్రసక్తి లేదు
అవసరాలలో ఒక దాని కొకటి పోషకం

ఎన్ని అవరోధా లెదురయినా, భవిత రాక మానదు
అనుకులాలెన్ని తోడయినా వర్తమానం పోక ఆగదు
ఎపుడో వచ్చే విపదను తలచి ఇపుడు భయ చిత్రం అవసరం లేదు
అశాంతి జాలంలో చిక్కిన సమాజం! సంక్షోభంలో సతమతమవుతూ

## 18.

ఉత్సవ మంటే సమాజంలో సామూహికం
మనసు తోటలో విప్పారిన గులాబీని పొందడం
తీరిక లేని మనుషులతో పూలు మాట లాడడం
ప్రేమకు ఎల్లలు లేవని తెలియ జేయడం

ఎవరికి వారు ప్రత్యేక మనుకునేరు ఒంటరిలో
బయటికి వస్తే గానీ తెలియదు సమాజంలో భాగమనీ
ఇల్లు దాటితే గాని తెలియదు,
మనసుకు ఏ హద్దులు లేవనీ

గ్రామీకరణం నుండి ప్రపంచీకరణం వరకు
సమాజ రూపానికి జీవన రేఖ ఒకటే
వైవిధ్యాలలోను మానవతా సూత్రమొకటే
ఎంత దూరమయినా ఎప్పుడైనా వెళ్ళేది పరిమళ పవనమే

మాట నుండి ఇతిహాసం వరకు
అణువు నుండి విరాట్ రూపం వరకు
కవి మనోలోకంలో స్థానం అన్నిటికీ
సమాజ ప్రగతికి కవిత! అక్షర ప్రతినిధి

సరిగా విప్పారని మనో నయన దృష్టిలో
దారిలో విషమ తలం అసమానత లెన్నో
మసకేసిన పయనంలో పరుగెత్తే వాహనం
దారి తప్పి లోయలో, ప్రమాద దృశ్యం, హఠాత్తుగా

తనకు తాను దారి తప్పడం ఒక ఎత్తు
మరో కారణం  కావడం ఇంకొక ఎత్తు

నిన్నలా నేడు ఉండదు, నేడులా రేపు ఉండదు
ఏ రోజు సరికొత్తను కోరుతుంది జీవితం
వెనక నుండి గతాన్ని భద్రపరస్తూ అభిలాషతో
ముందుకు పోవడ మొకటే! మనిషికి తన కర్తవ్యం

## 19.

సమాజ ఘోష ముందు సాగర ఘోష వినబడేనా?
కవుల మనోభేదాల తోనే సాధ్యాసాధ్యాలు
ఒంటరి తనంలో ఒకటి ప్రేయం కావచ్చు
సామాజికంగా అదే శ్రేయం కావచ్చు

రాగం వీరం ఉదారత మానవత ఎవరి మితం వారిదే
స్వానుభవంలో ఎవరి వ్యక్తిత్వం వారిదే, ఎప్పటికీ
కల్పనలో అవతరించిన ప్రపంచీకరణం ఆశగా
స్థానిక క్షేత్రాలను వశం చేసుకొనే పనితో ప్రమాదం!

ఏ మనిషి లోతు మరో మనిషికి తెలిసేది కాదు
ఎంత వెళ్ళినా ఇంకా ఎంతో మిగులుతుంది జలధిలా
ప్రతి కథలో కేంద్ర బిందువు "స్త్రీ"
రేఖలతో రూపం! మాత్రం పురుష కారం

అశ్రు కణం రంగు అందరిదీ ఒకటే
అది తెలుపు! మరో రంగులో వెడలదు
ఒకరికి వార్నింగ్ ఒకరికి వార్త
ఒకరికి ఆయుధ సూచన ! ఒకరికి తొడిగిన మొగ్గ

వీరంలో ఒక సమయం గాయాల దండ
అంతకు ముందున్న పూల దండను మరపించేను

వర్షం కురవాలని ఉంటుంది మనసులో
పిడుగు పడే నని భయమూ తప్పదు
మెరసే మెరపు, విరిసే ఇంద్ర ధనుసు
హ్లాదంలో కవితకు ప్రేరణ లవుతాయి

ఏదీ దేనికీ ఎవరు ఎవరికీ ప్రత్యామ్నాయం కాదు
ఎవరి అస్తిత రేఖలు వారివి, ఆకృతి తమ స్వంతం
జ్ఞాపకాలు మిగులుతాయి, కాలాంతరంలో
పొందే యశోరూపం! కాలం ఇచ్చే బ్లాంక్ చెక్

## 20.

ఈ నియమిత సమయంలో ఆహ్వానితులు
ఆనంద పథంలో గడిపేరు, హ్లాద మయంగా
జ్ఞానం విజ్ఞానం కష్టం నష్టం కోరిక వేదన
ప్రేమ మానవం అన్నీ దేని స్థానంలో అది నిశ్చలంగా

మనిషిలో విశ్వాసం కొలత కందని గగనం
మనసుకు సంకల్ప బలాన్ని ఇచ్చేది ఇదే
ఎప్పటివైనా కులం మతం ప్రాంతం దేశం అనివార్యాలయి
సమాజ సమైక్యానికి మానవ మర్యాదకు క్షతిలోనూ
మౌనంగా వెళ్ళిపోయేరా? ఏ గుహలోకి? ఎక్కడికి?
సమన్యాయం హక్కులకై పోరాటం జరిపేరా?
ఏ పౌరుడు ఊరు బయట నిలిచే రాయి కాదు
ఎవరి బ్రతుకు గడ్డ కట్టిన మంచు శిల కాదు

జీవ కణాల కలితమైన మానవ రూపం
సంస్పందన కవకాశం దక్కవలసిందే
ఎవరు ఎచట ఉండే నిర్ణయమూ ఆ వ్యక్తిదే
నిలయం దేశం విశ్వం పాత్రలు మాత్రం భిన్నం

మట్టి ఒకటే అంతటా! అన్నిటికీ ఆధారం అవనిపై
మనిషి మాత్రం పరిసర ప్రభావాల గాథలలో పాత్రయై

ఎగరలేని పక్షిలా ముడుచుకొనీ
లేవ లేదు నీడ పరుగెత్త లేదు
నీడకు భయపడ నవసరమే లేదు
ఆయుధాన్ని వాడ నక్కరయే లేదు

పావురాయి సందేశం తీసుక వస్తుంది
హద్దు దాటి ఎగిరేనని పేల్చి వేసేరా?
"పైన వెలిగే సూర్యుని వెలుగులు అందరివీ"
"కాక్‌టేల్" పార్టీలో ఆహ్వానితుల మనసులోని మాట

## మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

### A) స్వేచ్ఛా కవిత్వం

**❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002**

**i. స్వేచ్ఛా నవం :** 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపితం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నెల్

**❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012**

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

**❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015**

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

**❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018**

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

**❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019**

**ఇది జీవితం :** 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

**❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020**

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

**❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022**

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

**❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023**

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

**❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023**

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

**❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024**

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

**❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025**

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబన్ధం

**B) పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

## సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

# BRIEF SKETCH



Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 555563